

# రాంభట్ల కృష్ణమూర్తి

## శత జయంతి విశేష సంచిక

# బడి చదువు లేని బహుముఖ ప్రజ్ఞాశాలి

# రాంభట్ల చేతిరాతలో గురజాడ





# అక్షర నీరాజనం

విశ్వ విద్యాలయాల నాలుగు గోడల మధ్య ఉండే తెలుగు అధ్యాపకుల, సాహిత్యాన్ని అంగడి సరుకుగా మార్చి నాలుగురాళ్లు సంపాదించుకోవడానికి అలవాటు పడి సాహితీ రంగంలో చెలామణి అవుతున్న వారి విషయం తెలియదు కాని సచేతనమైన సాహిత్యంతో సంబంధం ఉన్న వారందరికీ రాంభట్ల కృష్ణమూర్తి పేరు పరిచయమే. 2020 మార్చి 24 నాటికి రాంభట్ల శతజయంతి పూర్తి అయింది. 2001 డిసెంబర్ ఏడున మరణించిన రాంభట్ల నా బోటి సాహితీ విద్యార్థులకు బాగా పరిచయం. 1943లో తెనాలిలో ఆవిర్భవించి 1955 దాకా అభ్యుదయ రచయితల సంఘం తెలుగు సాహితీ లోకంలో ప్రభంజనంలా సాగింది. ఆ తరవాత సంఘంగా అభ్యుదయ రచయితల సంఘ కార్యకలాపు మందగించి ఉండొచ్చు. కానీ అభ్యుదయ రచనలు వస్తూనే ఉన్నాయి. 1970లో అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణ ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ ప్రయత్నాలు 1972 నాటికి ఓ కొలిక్కి వచ్చాయి. ఈ కృషిలో అభ్యుదయ రచయితల సంఘానికి రాంభట్ల కృష్ణమూర్తి చుక్కానిలా వ్యవహరించారు. గజ్జెల మల్లారెడ్డితో కలిసి రాష్ట్రమంతటా (మునుపటి ఆంధ్రప్రదేశ్) చుట్టి వచ్చి అభ్యుదయ రచయితల సంఘానికి పదిలమైన పునాది వేయడంలో రాంభట్ల పాత్ర అపురూపమైంది. ప్రగతిశీల సాహిత్యోద్యమ పునాది నిర్మాణంలో ఒక్కొక్క రాయి పేర్చినవాడాయన. రాంభట్ల శత జయంతి రెండు తెలుగు రాష్ట్రాలలోనూ నిర్వహించడానికి తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ప్రతిపాదిస్తే ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఈ ఉత్సవాలకు అండగా ఉండడం తన బాధ్యతగా భావించింది. 2020 ఫిబ్రవరి 22న విశాఖపట్నంలో శతజయంతి ఉత్సవాలు ప్రారంభమైనాయి. కరోనా మహమ్మారి విశ్వరూపం చూపకపోతే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని అనేక జిల్లాల్లో రాంభట్ల శతజయంతి సమావేశాలు జరిగేవి. 2020 మార్చిలో హైదరాబాద్‌లో శతజయంతి సమాపనోత్సవాలు భారీస్థాయిలో నిర్వహించాలనుకున్నాం. అదీ కుదరలేదు.

అందుబాటులో లేని రాంభట్ల ముద్రిత రచనలను పునర్ముద్రించాలని అనుకున్నాం. జనకథ, వేదభూమి, వేల్పుల కథ, ఆయన ఆత్మకథ "సొంతకథ" పునర్ముద్రించాలనుకున్నాం. అందులో భాగంగా జనకథ, వేద భూమి ముద్రణ పూర్తి అయింది. జనకథను మొదట విశాలాంధ్ర ప్రచురించింది. ఇప్పుడు నవచేతన పబ్లిషింగ్ హౌజ్ పునర్ముద్రించింది. విజయవాడ మిత్రబృందం సహాయంతో వేదభూమి వెలువరించాం. అభ్యుదయ సాహిత్య ప్రచురణలో అద్వితీయమైన పాత్ర పోషిస్తున్న గుంటూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం వేల్పుల కథ పునర్ముద్రించింది. సొంత కథ, శశవిషాణం పునర్ముద్రణతో పాటు, అముద్రిత రచనలు సేకరించి ప్రచురించాల్సి ఉంది.


ఈనాడు జర్నలిజం స్కూలుకు రాంభట్ల మొదటి ప్రధానాచార్యుడు. ఆ మొదటి బ్యాచ్ జర్నలిజం విద్యార్థుల చేత వ్యాసాలు రాయించాలనుకున్నాం. అందరినీ సంప్రదించడం సాధ్యం కాలేదు. అందుబాటులోకి వచ్చిన వారు రాశారు. సాహిత్య రంగంలో రాంభట్ల సహచరులు, శిష్యులు అక్షర నీరాజనం అర్పించారు. ఇవన్నీ ఈ సంచికలో కనిపిస్తాయి. శతజయంతి సమాపనోత్సవం, గ్రంథాల పునర్ముద్రణ అనివార్య కారణాల వల్ల ఆలస్యమైంది. ఈలోగా ఆనాటి జాతీయ స్ఫూర్తి ప్రధాన సంపాదకులు డి.వి.వి.ఎస్. వర్మ సంస్మరణ సంచిక కోసం సిద్ధం చేసిన వ్యాసాలతో జాతీయ స్ఫూర్తి డిజిటల్ సంచిక తీసుకొచ్చారు ఇప్పుడు "దారి దీపం" సంపాదకవర్గం ఈ విశేష సంచికను మరింత సమగ్రం చేసి ప్రచురిస్తున్నది. అభ్యుదయ రచయితల సంఘానికి అంతకన్నా సంతోషకరమైంది ఏముంటుంది. "దారి దీపం" సంపాదకులు డి.వి.వి.ఎస్.వర్మకు, సంపాదకవర్గానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పడం అభ్యుదయ రచయితల సంఘం ధర్మం. ❑

- ఆర్వీ రామారావ్

*గౌరవ సంపాదకులు,*

*రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి విశేష సంచిక*

మా మాట



# రాంభట్ల కొత్తచూపు

శ్రీ రాంభట్ల శత జయంతి సంచికను ఎలాగైనా తీసుకురావాలన్నది మిత్రులు ఆర్వీ రామారావు సంకల్పం. ఈ సంచిక కోసం ప్రముఖుల వ్యాసాలను సేకరించారు. 2020లో కొవిడ్ కారణంగా అచ్చు ప్రతి వెలువడలేదు. ఆ వ్యాసాలతో జాతీయస్ఫూర్తి ప్రత్యేక సంచిక ఆన్‌లైన్ ఎడిషన్ తేగలిగాం. కాని ఆర్వీ రామారావు పట్టు విడవని విక్రమార్కునిలాగా ముద్రణ సంచిక కోసం తపన పడుతూనే వున్నారు. అందుకు దారిదీపం సంపాదకవర్గం సహకారాన్ని కోరారు. ఈ ప్రత్యేక సంచికలో భాగస్వాములను చేసినందుకు ఆర్వీ రామారావు గారికి కృతజ్ఞతలు. గతంలో సేకరించిన వ్యాసాలకు తోడుగా రాంభట్ల స్వీయ రచనలు, కార్టూన్లు, ఫొటోలు సేకరించి ఈ సంచికలో పొందుపర్చాం. ఆర్వీ రామారావు గారితో కలిసి మా శక్తి మేరకు రాంభట్ల బహుముఖ ప్రజ్ఞను రేఖా చిత్రంగా అందించే ప్రయత్నం చేశాం.

రాంభట్ల కృష్ణమూర్తి గారు దారి దీపం సంపాదకవర్గ సభ్యులకు సుపరిచితులు. ఇందులో కొందరు ప్రత్యక్షంగా అరసం కార్యకలాపాలలో వారికి సహచరులుగా వున్నారు. రాంభట్ల చదివింది నాలుగో తరగతి వరకే. అదీ ఉర్దూ పాఠశాలలో. అంటే ఆయన తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, భాషలతోపాటు చివరకు ఉర్దూను కూడా స్వయంగా నేర్చుకున్నారు. ఈ భాషా సాహిత్యాల మీద పట్టు సంపాదించారు. ఒక్క వాక్యంలో రాంభట్లని ఆవిష్కరించలేం. "స్వయం నిర్మిత మేధో సౌధం" అన్నా "నడిచే విజ్ఞాన సర్వస్వం" అన్నా "డిగ్రీలు లేని పాండిత్యం" అన్నా ఏదో ఒక లోటు కనిపిస్తూనే ఉంటుంది. రాంభట్ల ఒక సాహిత్యకారుడు. ఒక చరిత్ర పరిశోధకుడు. ఒక తత్వ శాస్త్ర విశ్లేషకుడు. అరసం ఉద్యమ నేత. ఒక కార్టూనిస్టు. ఒక చిత్రకారుడు. కార్టూన్ గేయాలు, ప్రజా ఉద్యమపాటల కర్త. ఒక అనువాదకుడు. ఒక జర్నలిస్టు. జర్నలిజం స్కూలుకు ప్రిన్సిపాల్. ఒక ఉపాధ్యాయుడు. ఇలా ఎన్నో అవతారాలలో ఆయన దర్శనమిస్తాడు. నిజానికి రాంభట్ల బహురూపి. ఈ ప్రయత్నాలన్నింటా మార్క్సిస్టు పరిశీలన, విశ్లేషణ ఉంటుంది.

రాంభట్ల గొప్ప స్నేహ శీలి. వయోభేదం లేని గురువు. అందువల్లే రాంభట్లకు ఆత్మీయుల బృందంతోపాటు ఉద్యమ సహచరులు, సాహితీ మిత్రులు, జర్నలిస్టు శిష్యగణం – అందరూ ఈ సంచికలో దర్శనమిస్తారు. రాంభట్లను శ్లాఘించే వారే కాదు విమర్శించే వారూ వున్నారు. ఎందుకంటే ఆయన పరిశీలనలో, పరిశోధనలో కొత్త చూపు వుంటుంది. కొత్త ప్రతిపాదనలు వుంటాయి. వాటి మీద భిన్నాభిప్రాయాలు వుండడం సహజం. ఆయన గతంలోకి దూరిపోతారు. మార్పుకు దోహదం చేసే కొత్త మెరుపులను పట్టుకుంటారు. జాతి చరిత్ర మూలాల కోసం దేశ సరిహద్దులు దాటి సంచరిస్తారు. మతం, తత్వం కలగలిసిన సంస్కృతిలో ఏదో ఒక కోణానికి పరిమితమై మిగిలిన దానినంతటినీ తోసి పారేసే పద్ధతి ఆయనది కాదు.

ప్రస్తుతం దేశంలో మతోన్మాద శక్తులు గతాన్ని, మతాన్ని చరిత్రనీ తమ స్వంతం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. ఈ వారసత్వాన్నంతటినీ మతోన్మాదుల పరం కాకుండా చేయాలి. అందుకోసం గతాన్ని లోతుగా మధించేవారు. కావాలి. మన సంస్కృతిని ముందుకు నడిపించిన వాటిన ఏ ముసుగులో వున్నా గుర్తించి వెలికితీసేవారు కావాలి. అవిచ్ఛిన్నంగా సాగిన సంస్కృతీ ప్రవాహానికి ఆధారాలు చెప్పేవారు కావాలి. గతాన్ని మతోన్మాదుల అడ్డా కాకుండా అందరూ దానిని స్వంతం చేసుకునే సమన్వయాన్ని సాధించాలి. ఇలాంటి ప్రయత్నమే రాంభట్ల చేశారు. ఇందులో కొన్ని తప్పటడుగులు వుండి వుండవచ్చును. కాని నిస్సందేహంగా ఇలాంటి పరిశోధనకు కొత్త దారి చూపిన పథ నిర్దేశకునిగా రాంభట్ల చిరకాలం జీవించి వుంటారు. ఈ విశేష సంచిక ఆయన రచనలను, పరిశోధనలను ఆకళింపు చేసుకోవడానికి దోహదం చేస్తుందని ఆశిస్తున్నాం. ఈ సంచిక వెలుగు చూడడానికి వివిధ రూపాలలో సహకరించిన మిత్రులకు, రచయితలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

**డీవీవీఎస్ వర్మ,**
**మరియు దారి దీపం సంపాదకవర్గం**

# రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి సంచిక విషయ సూచిక


## 1.జీవిత విశేషాలు

అ) రాంభట్ల కృష్ణమూర్తి జీవిత విశేషాలు 6
ఆ) మా నాన్నారు - అరుణ 7
ఇ) మరువలేని ఆ క్షణాలు - సరిపెల్లి దత్తాత్రేయశర్మ 8
ఈ) తొలి తెలుగు రాజకీయ కార్టూనిస్ట్ - సుంకర చలపతిరావు 10
ఉ) రాంభట్ల కార్టూన్లు 11

## 2. స్వీయ రచనలు

అ) అసతోమా సద్గమయ 14
ఆ) వేదాలెన్ని - మూడా, నాలుగా ? 16
ఇ) సాంఖ్య దర్శనం 19
ఈ) మన చరిత్ర జన్మస్థలం మన దేశంలో లేదు 22
ఉ) చిత్రకళలు 25
ఊ) గిరీశం - శకారుడూ 31
ఋ) నవల - తాత్త్విక సంఘర్షణ 34
ౠ) మార్క్సిస్టు సాహిత్య విమర్శ 37
ఎ) కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 41
ఏ) లాల్ సలాం! - ఐ) అదే అదే పతాక 42
ఒ) భిషక్కు.. - ఓ) నృత్తం 43
ఔ) రాంభట్ల స్వీయ రచనల చిత్రాలు 44

## 3.ఆత్మీయుల జ్ఞాపకాలు

అ) నేనెరిగిన కృష్ణమూర్తి - సురవరం సుధాకరరెడ్డి 45
ఆ) చర్చించటం వ్యసనం - యేటుకూరి ప్రసాద్ 46
ఇ) డిగ్రీలు లేని పాండిత్యం - ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి 49
ఈ) మహా మేధావి రాంభట్ల - అంపశయ్య నవీన్ 50

## 4.సహచర స్మరణ

అ) ఆలోచనా యంత్రం - ఆర్వీ రామారావు 52
ఆ) ప్రజల కోసం పాండిత్యం - చందు సుబ్బారావు 55
ఇ) విజ్ఞాన ఖని -కేశవ్ గోపాల్ 57
ఈ) రాంభట్ల జ్ఞాపకాలు - అదృష్టదీపక్ 59
ఉ) విజ్ఞాన సర్వస్వం - ఆచార్య ఎస్వీ సత్యనారాయణ 61
ఊ) రాంభట్ల-అరసం - పెనుగొండ లక్ష్మీనారాయణ 63
ఎ) స్వయం నిర్మిత మేధో సౌధం- మందలపర్తి కిషోర్ 65
ఏ) అరసంలో రాంభట్ల.. 68

## 5.మిత్రవాక్యం

అ) పురామానవ చరిత్రకు సూత్రకర్త - కల్లూరి భాస్కరం 69
ఆ) మనసున్న మహా మేధావి - ఎం.వి.ఆర్.శాస్త్రి 72
ఇ) తెలుగు వారి టాలెమీ - వాడ్రేవు చినవీరభద్రుడు 75
ఈ) రామభటులు - డాక్టర్ శంకరనారాయణ 77
ఉ) బడిలో చదవని బహుగ్రంథకర్త - సాహితీ సంపద .. 79

## 6. ఆచార్యునికి నీరాజనాలు

అ) దటీజ్ రాంభట్ల ! -పి.వి.ఆర్. గోపీనాథ్ 82
ఆ) ఏ చట్రంలో ఇమడని వ్యక్తిత్వం -డా.గోవిందరాజు చక్రధర్ 83
ఇ) నడిచే జర్నలిజం స్కూలు - మంగు రాజగోపాల్ 86
ఈ) విజ్ఞానపు గని - ఎ.విశ్వేశ్వర్‌రెడ్డి 88
ఉ) రాంభట్ల గారే నాకు స్ఫూర్తి - నిడమర్తి రాజశేఖర్ 89
ఊ) ఒక బెల్జియం అద్దం - తాడి ప్రకాష్ 91
ఋ) తీర్చి దిద్దిన గురువు -ఎస్.బాల్‌రెడ్డి 94
ౠ) జ్ఞాన సాగరం -చింతపట్ల సుదర్శన్ 96

## 7. నివాళి

అ) **Remembering the humble guru who treated every disciple as his friend**
K Amarnath 97

ఆ) **A Centenary Tribute to Rambhatla Krishnamurthy: Literally, a 'walking' encyclopaedia!**
Mandalaparthy Kishore 98


# రాంభట్ల కృష్ణమూర్తి

శత జయంతి విశేష సంచిక

**బడి చదువు లేని బహుముఖ ప్రజ్ఞాశాలి**


పేజీలు 100

వెల రూ.100

సంచిక కోసం : డా॥ బి.రమేష్ చంద్రబాబు : ఫోన్ 93971 14495

ఉచిత **Pdf** కాపీ కోసం : **DVVSVARMA.COM**

విశాలాంధ్ర, నవచేతన, ప్రజాశక్తి, నవ తెలంగాణ పుస్తకాల షాపులలో కూడా లభించును.

ఈ సంచిక సంపాదక వర్గం

ఆర్వీ రామారావు - గౌరవ సంపాదకులు

డీవీవీఎస్ వర్మ - సంపాదకులు

కొప్పర్తి వెంకటరమణమూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

ప్రతులు : 1000, ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ 4 - పబ్లిషర్ : బి.రమేష్ చంద్రబాబు, తెనుకు



# రాంభట్ల కృష్ణమూర్తి జీవిత విశేషాలు

- జననం 1920 మార్చి 24
- పుట్టింది తూర్పు గోదావరి జిల్లా అమలాపురం తాలూకా అనాతవరం గ్రామంలో..
- పాఠశాల చదువు నాలుగో తరగతితోనే ముగిసింది.
- భార్య : సుభద్ర, కుమార్తె : అరుణ, కుమారుడు : ఆర్మెన్
- స్వయంకృషితో ఇంగ్లీషు, సంస్కృతం, ఉర్దూ, తెలుగు భాషలను నేర్చుకున్నారు. అనేక గ్రంథాలను అధ్యయనం చేశారు. వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాల మీద ఆధునిక సాహిత్యం మీద పట్టు సంపాదించుకున్నారు.
- 1943లో హైదరాబాద్‌లోని శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా అయ్యారు.
- 1943-48 వరకు అడవి బాపిరాజు గారి సంపాదకత్వంలో వెలువడిన మీజాన్ పత్రికలో పనిచేశారు.
- 1946లో తొలి జర్నలిస్టుల (ప్రూఫ్ రీడర్ల జీతాల పెంపుదల) కోసం 18 రోజులపాటు సమ్మెను నిర్వహించి విజయం సాధించారు.
- 1948 నుంచి మద్రాసు, విజయవాడలలో వివిధ పత్రికలలో పనిచేశారు.
- 1952లో విశాలాంధ్రలో సబ్ ఎడిటర్‌గా చేరారు. విశాలాంధ్రలో కార్టూన్లు, కార్టూన్ కవితలకు శ్రీకారం చుట్టారు.
- 1973లో గుంటూరులో జరిగిన అ.ర.సం రాష్ట్ర మహాసభలలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.
- హైదరాబాద్ 1977లో జరిగిన సభలో తిరిగి ఎన్నికయ్యారు.
- ఈనాడు జర్నలిజం స్కూల్‌కు చాలా కాలం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. అనేక మంది నేటి ప్రముఖ జర్నలిస్టులను తీర్చిదిద్దారు.
- స్వీయ రచనలు జన కథ, వేదభూమి, వేల్పుల కథ, పారుటాకులు, శశ విషానం, సొంతకథ మొదలైనవి. అనేక కలం పేర్లతో చాలా రచనలు చేశారు. కృష్ణ, అగ్ని మిత్ర, కవి రాక్షస వగైరా..
- కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పాటను అదే బాణీలో పాడడానికి తగిన విధంగా అనువాదం చేశారు.
- ముఖ్దూం గేయాలను కొన్నింటిని అనువదించారు.
- 1986లో పులుపుల వెంకట శివయ్య సాహితీ పురస్కారంతో సహా అనే పురస్కారాలను పొందారు
- 2001 డిసెంబరు 7వ తేదీన హైదరాబాద్‌లో మరణించారు.

# మా నాన్నారు

## జీవిత విశేషాలు

- అరుణ

ముందుగా మీ అందరికీ ధన్యవాదాలు. నాన్న గారిని ఇన్ని ఏళ్ల తర్వాత గురువుగా గౌరవించి శత జయంతి ఉత్సవాలు జరుపుతున్నారు. అందుకే భర్తృహరి విద్వాన్ సర్వత్రా పూజ్యతే అన్నారని అనుకుంటున్నాను. మా ఇల్లు ఒక సరస్వతీ నిలయం. ప్రతి రోజూ ఎవరో ఒకరు వచ్చేవారు. నాన్నగారి దగ్గర పాఠాలు చెప్పించుకోవడానికి లేదా ఏదైనా చర్చించుకోవడానికి. చర్చనీయాంశాలు రాజకీయాలు, సాహిత్యం ఏవైనా కావచ్చు. బూదరాజు రాధాకృష్ణ గారు, మల్లారెడ్డి గారు, తిరుమల రామచంద్రాచారి గారు మొదలైన వాళ్లు ఎవరైనా వస్తే వాళ్లకు మంచి నీళ్లు ఇచ్చి కూచోబెట్టడం, ఆ తర్వాత వాళ్లు మాట్లాడుకుంటుంటే టీ పెట్టి ఇవ్వడం నా పని. వాళ్లకు టీ ఇచ్చి కిటికీలో కూర్చుని వాళ్ల కబుర్లు వినేదాన్ని. నాకు తెలవకుండా ఎంత నేర్చుకున్నానో నాకు తెలవదు.

నాన్న గారు కమ్యూనిస్టుగా నిలబడి ఉండవచ్చు. కానీ భగవద్గీత చదివి దాన్ని ఆచరించి చూపించారు. ఆడంబరాలు లేవు. నేర్చుకున్నది చీమంత, నేర్చుకోవాల్సింది బ్రహ్మాండమంత అనేవారు. నాకు గుర్తుండి చాలా కాలం తెల్లపైజామా, లాల్చీ వేసుకునేవారు. మనిషి ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవారు. ఒక్కసారి కూడా కోపం రావడం గానీ, మమ్మల్ని కోపం చెయ్యడం అన్నది అస్సలు లేదు. కోపం చేతకానితనానికి చిహ్నం అనేవారు. అలాగని నేను అల్లరి చేయకుండా, నాన్న గారితో వాదించకుండా ఉండే దాన్ని కాదు. చాలా ఓపికగా నేను చేసింది ఎందుకు తప్పో విడమర్చి చెప్పేవారు. అప్పుడు కాదు కదా ఇప్పటికీ నాన్న గారికి నచ్చని పనిచేయను. ఒకవేళ నేను బండగా వాదిస్తే 'మూర్ఖాయ నమః' అని దండం పెట్టేవారు. మాకు నాన్నగారంటే భయం, భక్తి లేదు. మా నాన్న గారంటే ఎనలేని గౌరవం మాత్రమే. నాన్నగారు ప్రేమమూర్తి అంటే అతిశయోక్తి కాదు. ఇంటికి ఎవరు వచ్చినా ప్రేమగా పలకరించే వారు. బంధుప్రీతి ఎక్కువ. అందరిని అక్కా అని సంబోధించే వారు. ప్రతి స్త్రీకి, చిన్నా పెద్దా అందరికీ ఒక గౌరవస్థానం, మర్యాద ఇచ్చేవారు.

> **నాన్న గారు కమ్యూనిస్టుగా నిలబడి ఉండవచ్చు. కానీ భగవద్గీత చదివి దాన్ని ఆచరించి చూపించారు. ఆడంబరాలు లేవు. నేర్చుకున్నది చీమంత, నేర్చుకోవాల్సింది బ్రహ్మాండ మంత అనే వారు.**

నాకు ప్రతి క్లాసులోనూ నాన్న గారు పాఠాలు చెప్పేవారు. నేను వ్యాసాలు రాసి ఇస్తే అవి చదివి తప్పులు దిద్ది ఎలా రాయాలో చెప్పేవారు. ఎంతో కాలం నా చేత చూచి రాత రాయించే వారు. కోడి కెక్కరించినట్టు రాస్తే మీ టీచర్ ఎలా చదువుతారు? నువ్వు ఒకత్తెవే కాదు కదా క్లాసులో. చాలా మంది ఉన్నారు. ఎం.ఏ.లో నా చేత చూచి రాత రాయించారు. క్రమశిక్షణ అన్నది నాన్న గారికి చాలా ముఖ్యం. నాకు బీఎడ్‌లో కూడా పిల్లలకి చదువు ఎలా చెప్పాలి ? పిల్లలలో చురుకుతనం ఎలా గ్రహించాలి ? పిల్లలు అల్లరి చేస్తున్నారు అంటే తప్పు నాది ? వాళ్లని ఆకట్టుకోలేక పోయానని చెప్పేవారు. అంటే నా పాఠం చెప్పే పద్ధతి మార్చుకోవాలి అని చాలా కిటుకులు చెప్పేవారు. పాఠాలు చెప్పడానికి ఎన్నో బొమ్మలు గీసి ఇచ్చేవారు.

పండుగలు వస్తే చాలా హడావుడిగా ఉండేది. వరలక్ష్మీ వ్రతం, వినాయకచవితి చాలా ముఖ్యంగా ఉండేది. కొబ్బరికాయకి పసుపు కలిపిన గోధుమ పిండి పెట్టి దానిలో కన్ను, ముక్కు, నోరు మలిచే వారు. నిండుగా బుగ్గలు వచ్చేలా చేసేవారు. తరవాత కళ్లకి కాటుక పెట్టి, బొట్టు దిద్ది పెదాలకు రంగు వేసి నేను తయారు చేస్తే అమ్మ చీరకట్టి, పూలజడ వేసి అమ్మవారిని తయారుచేసేది. మేము పూజ చేస్తుంటే కూర్చుని వినేవారు. ఉచ్చారణలో లోపం లేకుండా చదివించేవారు. అలాగే వినాయకచవితి. పాలవెల్లికి కలువ పూలు, తామర పూలు కట్టించేవారు. పాలవెల్లి వెల్లకిలా పడకుండా ఏ పళ్లు ఎక్కడ కట్టాలని చూపించేవారు. తుమ్మికూర పులుసు నాన్న గారికి చాలా ఇష్టం. వినాయకచవితికి తప్పకుండా ఉండాలి.

నన్ను బజారుకు తీసుకుని వెళ్లి ఏ పళ్లు ఎలా ఎన్నుకోవాలో చూపించేవారు. నేను పిల్లలను తీసుకుని వస్తే పనస పొట్టు కూర చేయించి పెట్టేవారు. పనసపొట్టు కూర వీళ్లు తినకపోతే కూర్మా కూరలా చేయించి పెట్టేవారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతైనా చాలదు. నాన్నగారు వేసిన పునాది వల్లే ఈనాడు నేను నిటారుగా నిలబడగలుగుతున్నాను. నాన్న గారికి కూతురుగా పుట్టడం నా అదృష్టం. ఇలా అంటే నాన్న గారు గిరీశంను కోట్ చేస్తారు, నాతో మాట్లాడడం ఒక ఎడ్యుకేషన్ అని. ❑

# మరువలేని ఆ క్షణాలు

## జీవిత విశేషాలు

- సరిపెల్లి దత్తాత్రేయశర్మ

నా మేన బావ రాంభట్ల కృష్ణమూర్తి గారి గురించి ఏమైనా రాయమని ఆర్.వి.రామారావు అడిగితే ఏమి వ్రాయగల వాడినని, పైగా కదిలే గ్రంథాలయం గురించి వ్రాయడమ్ సాహసోపేతమే అవుతుంది. రాంభట్ల నాకు మేనబావే కాదు, నా పిన మామ గారు, నా కుమార్తె మామగారు కూడా. అందుకే వారితోగల నా ఆప్యాయత గురించి, అనుబంధం గురించి వ్రాయాలనిపించింది. రాంభట్ల నన్ను ముద్దుగా నాయుడు అని పిలిచేవారు. ఎప్పుడైనా నేను నాలుగైదు రోజులు కనిపించకపోతే పొద్దున్నే లేచి ఇంటికి వచ్చేసేవారు. మా ఆవిడతో నాయుడు లేచడా అని అడిగి హైమక్కా వేడితే నీరు ఇస్తావా అని అడిగే వారు. వేడకుండానే ఇస్తాను కక్కగారు అని టీ కప్పు అందించేది. టీ తాగిన వెంటనే వెళ్లిపోయే వారు. కొంచెం సేపు కూర్చుని వెళ్లండి కక్క గారు అన్నా కూడా వినకుండా వెళ్లిపోయేవారు. మా ఆవిడ “చూశావా నువ్వు కనిపించకపోతే కక్క గారు తానే వచ్చేస్తారు అని చెప్పలేదా” అని నన్ను కోప్పడేది. అదీ మా అనుబంధం. ఇంటికి వెళితే గంటల తరబడి వారు చెప్పింది వినడమే. ఆయనను మాట్లాడించడానికి ఏదో చిన్న విషయం చెప్తే చాలు గంటల తరబడి శ్రోతకు విసుగు కలిగించకుండా మాట్లాడగలిగే మనిషి. నేను, నా భార్యే కాదు. నా పిల్లలు ముగ్గురు కూడా ఆ దంపతుల ఆదరాభిమానాలు పూర్తిగా పొందిన వాళ్లే. చిన్నక్క ఇచ్చే టీ తాగుతూ బావ చెప్పే విషయాలు ఆకళింపు చేసుకుంటూ అలా ఉండిపోయేవాణ్ని. తర్వాత మా ఆవిడ పెట్టేవి తినొచ్చులే అనుకుంటూ. చిన్నక్క మరణశయ్య మీద కూడా ఆనంద్, సూరజ్ అంటూనే ప్రాణాలు విడిచిందంటే మా కుటుంబం మీద ఆవిడకున్న ఆదరాభిమానాలు తలశక్యం కాదు. ఇక మా బావ తన రచనల రాత ప్రతి నాకిచ్చి చదవమనే వారు. ఆ విధంగా నేను వారి రచనలకు ప్రథమ పాఠకుడిని. ఆ రచనల మీద ప్రతిస్పందించే తాహతు, సత్తా నాకు లేవు. అనుమానాలు వ్యక్తం చేస్తే దాని మీద ఆయన ఉపన్యాసమే వినేవాడిని. అంత విపులంగా నా అనుమానాలు తీర్చే వారు. “నాతో మాట్లాడడమే ఓ ఎడ్యుకేషన్” అని కన్యాశుల్కంలో గురజాడ వారు గిరీశంతో అనిపించినట్టు నాకైతే నా మేనబావతో మాట్లాడటమే విజ్ఞానం సంపాదించుకున్నట్లు. ఆ మహా మనీషి తెలుగులో ఆది రాజకీయ వ్యంగ్య చిత్రకారుడు. కదిలే గ్రంథాలయం. తుది శ్వాస విడిచినప్పుడు నేనక్కడే పక్కనే ఉన్న వాడిని. ఆ క్షణాలు మరువలేనివి. ❑




రాంభట్లకు గుంటూరులో పులుపుల వెంకట శివయ్య సాహితీ పురస్కారం

**జ్ఞాపికలు - జ్ఞాపకాలు**

## జ్ఞాపికలు - జ్ఞాపకాలు




అరసం మిత్రులు : కూర్చున్న వారు : రాంభట్ల, తిరునగరి, డాక్టర్ పరుచూరి రాజారామ్. నిల్చున్నవారు ఎడమ నుంచి : పెనుగొండ లక్ష్మీనారాయణ, కారసాని రామకృష్ణారెడ్డి, జి.జయరాజు, జి.జగన్‌మోహన్‌రావు, పొనుగోటి కృష్ణారెడ్డి, ఎన్వీ ప్రసాద్, వల్లూరు శివప్రసాద్, శశికాంత్ శాతకర్ణి, మట్టా కృష్ణమూర్తి, గని, శివారెడ్డి.



కార్టూన్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న రాంభట్ల, మోహన్



ఎంవీఆర్ శాస్త్రి కుటుంబ వేడుకల్లో రాంభట్ల



డీవీవీఎస్ వర్మ, మనోరమ వివాహ కార్యక్రమాన్ని నిర్వహించిన రాంభట్ల కృష్ణమూర్తి. మాట్లాడుతున్న డాక్టర్ తిలక్

# తొలి తెలుగు రాజకీయ కార్టూనిస్ట్

## జీవిత విశేషాలు



- సుంకర చలపతిరావు

తొలి రాజకీయ కార్టూన్ కవిగా ప్రజా రచయితగా, జర్నలిస్టుగా, కమ్యూనిస్టువాదిగా 20వ శతాబ్దంలో ప్రత్యేక గుర్తింపు పొందిన కవి, పండితుడు రాంభట్ల కృష్ణమూర్తి, పాఠశాలలో చదివింది 4వ తరగతే, కానీ వందలాది గ్రంథాలు పాఠశాల బయట పుక్కిటపట్టారు. సంస్కృతాంధ్ర, ఆంగ్ల, ఉర్దూ భాషలలో నిష్ణాతులుగా ఎదిగారు. ఆయన మెదడు ఒక అపూర్వ జ్ఞాపకాల విజ్ఞాన సర్వస్వమని, కదిలే గ్రంథాలయంగా ఆయనను అభివర్ణించేవారు. ప్రముఖ చిత్రకారుడు, సాహితీవేత్త అడివి బాపిరాజు వద్ద రాంభట్ల చిత్రలేఖనం మెలకువలు నేర్చుకోవ టానికి వెళితే ఆయన రాంభట్లను జర్నలిజంలోకి దించారు. 1945-48 సంవత్సరాలలో “మీజాన్” పత్రికలో సహాయ సంపాదకులుగా పనిచేశారు. అదే సమయంలో దేశంలో మొదటిసారిగా ప్రూఫ్ రీడర్స్ హక్కుల గురించి జరిగిన 18 రోజుల సమ్మె ఫలితంగా ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. తరువాత “విశాలాంధ్ర”లో చేరారు. ఆ సమయంలో ఆంధ్ర రాజకీయాలను, రాజకీయ నాయకులను ఎద్దేవా చేస్తూ కృష్ణమూర్తి కార్టూన్లు వేస్తే, ఆ వ్యంగ్య వైభవాన్ని కవితలా “శశవిషాణం” చూపేవారు.

ఎరుపు రంగు చూసే బెదిరిపోయే అమాయకున్ని ఉద్దేశించి - “చిలక ముక్కెరుపు, చిట్టీత పండెరుపు, అరుణోదయం ఎరుపు” అని ఎద్దేవా చేసేవారు. ఆ కార్టూన్లను పాఠకులు ఆసక్తిగా చూసేవారు. ఆ కార్టూన్ కవితలను ఆత్రంగా చదువుకొనేవారు. పాడుకొని నవ్వుకొనేవారు. జోక్స్‌గా వాడుకొనేవారు. అవి ఆనాడు అంతగా ప్రజాదరణ పొందాయి. ఆ కార్టూన్లు, కవితలు రాంభట్లవని చాలామందికి తెలియదు. తరువాత అవి “శశవిషాణం” గీతాలుగా గ్రంథ రూపంలో వచ్చాయి. ఆ కాలంలో “వాసు” ఆంధ్ర దినపత్రికలో అసంఖ్యాకంగా రాజకీయ వ్యంగ్య చిత్రాలు వేసేవారు. రాంభట్ల, వాసుల కార్టూన్లు పోటీపడి పాఠకుల మీద దాడిచేసేవి. రాజకీయంగా వీరిద్దరివీ భిన్నధృవాలు కావడం ఇందుకు కారణం. కొంత కాలం తరువాత రాంభట్ల “విశాలాంధ్ర” నుంచి కూడా రాజీనామా ఇచ్చి కలం అమ్ముకొని బ్రతకబోనని శపథం చేసి మరి బయటికి వచ్చారు. ఆ తరువాత ఎన్నో అవకాశాలు వచ్చినా అంగీకరించలేదు. తన మనోభావాలు వదులుకోలేదు. రాజకీయాలు మార్చుకోలేదు. తన శక్తి సామర్థ్యాలు, అనుభవాన్ని కమ్యూనిస్టు పార్టీ రాజకీయ పాఠశాలలకు, ఇండో- సోవియట్ కార్యదర్శి పదవికి పరిమితమయ్యారు.

“ఈనాడు” ఆరంభమయ్యాక అందులో చేరి ఆ పత్రిక శిక్షణ కళాశాలకు ప్రిన్సిపల్‌గా, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. మహాకవి గురజాడ “కన్యాశుల్కం”లోని మధురవాణి పాత్ర అంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఆ పాత్ర పేరును, వ్యాసాల్లోను సంపాదకీయాల్లో ఎక్కువ ప్రస్తావించేవారు. సాహిత్య ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొని ఎన్నో అభ్యుదయ రచనలు చేశారు. జన కథ, పారుటాకులు, వేల్పుల కథ, వేదభూమి ఆయన రచనల్లో మచ్చుతునకలు. పిడకల వేట, గరికపరకలు, మథనం శీర్షికలతో పలు పత్రికల్లో ఆయన ఎన్నో వ్యాసాలు రాశారు. ప్రముఖ ఉర్దూ కవి ముఖ్దూం కవితల్లో కొన్నింటిని తెలుగులోకి అనువదించారు. సమకాలీన చరిత్రలో ముఖ్య ఘట్టాలకు ఆయన రచనలు అద్దం పట్టేవిగా ఉండేవి. ఆయన రాసిన “సొంత కథ” కొంత వివాదాస్పదమైంది.


తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం సమీప కుగ్రామం అనాతవరం అగ్రహారంలో 1920 మార్చి 24న జన్మించిన రాంభట్ల 2002 డిశంబరు 7న హైదరాబాద్‌లో కన్ను మూశారు. ❑

కన్యాపహరణం !




ప్రకాశం పంతులు గారు ప్రజా - సోషలిస్టు పార్టీకి ‘సలాం’ కొట్టి కాంగ్రెస్ పార్టీలో తిరిగి ప్రవేశించారు. - వార్త

## వరదపీడితుల ప్రాణసంకటం - ఆచార్యులవారి చెలగాటం



వరదబాధితులకు విమానాలలో ఆహారం అందించడానికి తొలుత నిర్ణయించి,
అలాగ ఆహారం కొనిపోయే మూడవ విమానాన్ని వెనకకు మళ్ళించారు.—వార్త



నీ కేమీ భయంలేదు అవన్నీ సాధువులు! కంట్రోళ్ల రద్దుచేసి కృశజీవులను
దొంగ వర్తకుల దయాదాక్షిణ్యాలకు వదలిన రాజాజీ అభయం

## కప్పవేస్తం ఎలుకవేస్తం - కళ్లజోడుంల గద్దవేస్తం!




బోరుకప్పగారు మూషికరాజుతో
జట్టు కడుదునంచు ఒట్టుపెట్టి
కాళ్ళు కాళ్ళు కలిపి గంగలో దూకెరా
విశ్వదాభిరామ వినురవేమ

## కొండె తెగిన మొండి తేలు




కొండెపోయినట్టి మొండితేలు నిజాము – పాపమింక జాలి చూపుడంచు
రెండుకొండెలున్న మంత్రిగబ్బంటోంది – విశ్వదాభిరామ వినురవేమ



# ఆగస్టు 15

వచ్చావమ్మా ఆగస్టు పదిహేనూ!
రావమ్మా, ఖేదాల, గాయాలరాణీ!
అయిదు వత్సరాలు గండం గడువగా
అత్యాచారాల, అన్యాయాల ఘోరదురంతాల
పాదాల అడుగున పడి ప్రజలు నలుగగా
ఎవరి మొహాననూ, కాంతిరేఖ లేకపోగా
ఎవరు మెచ్చారని, వచ్చావమ్మా
ఒకే ఒక మంత్రులు తప్ప!

పశువులవంటి మనుష్యులను
పీనుగులచేసి పొడుచుకు తింటున్నది
రాబందుల, కామందుల, భూకామందుల
ముసల ముసల అనే శాసనాలను
మరామతుస్తున్నది మంత్రాంగ తంత్రాంగ -
యంత్రం!


మాసిన చిరిగిన గుడ్డపీలికల
వదలేక కాబూలీ అప్పులపోటుల
నడివీధిని పడింది గరీబుల బ్రతుకు
పాములబుట్ట దుకాణాల చెంత
పగల్నే, పేదవానిపై పడగలు విప్పి
బుసకొడుతున్నది అధిక ధరలు!
ఆకలితో రోగాలతో, దైన్యంతో, దారిద్ర్యంతో
ఒక్క కబళం అన్నంకోసం
వీధిబడి మూడు తరాలవాళ్లు
మూలుగుతూ, మూర్ఛిల్లుతున్నారు!
మాడిపోతున్న, వాడిపోతున్న, పడిపోతున్న
జనుల

ఎముకలు, వెన్నుముకలు
చేసి, చెరకుగడలుగ, విరచి
గానుగాడుతున్నారు పరిపాలకులు!
మోసే బోయీలంటూ వుంటే,
పల్లకీ దిగమంటున్నారు ప్రభువులు
లేకుంటే, ఎందుకు ఈ ఆయుధాల తొడుగులు
ఏమిటి ఆ తొందర అడుగుల చప్పుడు!
భయం లేదు లేస్తున్నది జనం
తరుముకు వస్తున్నది తరంగం,
ఇది సత్యం, ప్రభువుల పల్లకీ
దిగడమే తథ్యం!

— అవసరాల

# అసతోమా సద్గమయ

## స్వీయ రచనలు



- రాంభట్ల కృష్ణమూర్తి

ఏది సత్యం ఏదసత్యం ఓ మహాత్మా ఓ మహర్షీ ! అన్నాడు శ్రీశ్రీ. ఆయన ప్రశ్నించిన మహాత్ముడెవరో తెలీదు. అడిగిన మహర్షియెవరో అంతకన్నా తెలీదు. ఆ మహాత్ములు మహర్షులు మత ప్రవక్తలు అయివుంటే నాటి శ్రీశ్రీ మూడ్ ఎలాంటిదో అసలే తెలీదు. మతానికి మూలం పురాణాలు పురాణాల నుంచి పుట్టిన విశ్వాసం. సదసద్వివేచికిత్స తాత్విక సమస్య. తత్వాలు జ్ఞాన సాధనాలు. జ్ఞానానికి విశ్వాసానికీ చుక్కెదురు. తత్వశాస్త్రాల చరిత్ర చూస్తే అవి పురాణాలకు మతాలకు విరోధం నుంచే పుట్టాయన్న సత్యం గోచరిస్తుంది.

మతం తత్వశాస్త్రం పుట్టినవి పుట్టినట్టుగానే లేవు. అవి నిత్యం సంఘర్షిస్తూనే వస్తున్నాయి. ఈ సంఘర్షణ వల్ల అటు తాత్విక భావాలు ఇటు మత భావాలు కూడా మారుతూ వస్తున్నాయి. ఇవి ఇలా వుండగా విజ్ఞాన శాస్త్రాలు పుట్టి పెరుగుతున్నాయి. విజ్ఞాన శాస్త్రాలు నిరూపిస్తున్నది ప్రత్యక్ష సత్యం. విశ్వాసానికి ప్రత్యక్షం విరోధి. అందువల్ల మతం తన ఆయుధాన్ని విజ్ఞాన శాస్త్రం మీదికి మళ్లించింది. తత్వశాస్త్రాలు విజ్ఞాన శాస్త్రాలతో జట్టు కట్టాయి. ఆ దశలో మతం తత్వశాస్త్రాల సాయాన్ని పొందడానికి యత్నిస్తోంది. తాత్విక చర్చల్లో కనిపించే డయలెక్టిక్సుకు కొత్త వ్యాఖ్యానాలు చేయడం మొదలు పెడుతుంది. సత్ అంటే సత్యం. దానికి విరుద్ధపదం అసత్. అసత్యం. సత్యాన్ని బౌద్ధులు నిత్యం అన్నారు. ఈ బౌద్ధ పదం పాళీ భాష ద్వారా వచ్చి మనకు 'నిజం' అయింది. నిత్యానికి వ్యతిరేక పదం అనిత్యం. కాని తెలగు నిజానికి వ్యతిరేక పదం అబద్ధం - ఇంగ్లీషు ట్రూత్‌కు ఏంటానిం ఫాల్సు అయినట్లు. అబద్ధం అంటే బద్ధం కానిది. దేనికీ కట్టుపడనిది అని అర్థం. ఇది తర్కం. హేతువాదం పెరిగిన తరువాత పుట్టిన మాట అయివుంటుంది. అలాగే నిజం అన్న మాటకు సంస్కృతంలో వేరే అర్థం వుంది.

భారతదేశాన తత్వశాస్త్రాలు ఉపనిషత్కాలంలో పుట్టాయి. తత్వశాస్త్రాలతోపాటే డయలెక్టిక్సు కూడా పుట్టాయి. భారతీయ డయలెక్టిక్సుకు గుండెకాయ నెగెటివ్ వ్యతిరేక పదం. అందువల్లనే "అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ" అన్నసూక్తి పుట్టింది. అసత్యం నుంచి సత్యానికి కొని పొమ్మని నిత్యం కోరుకుంటూ వుంటారు జ్ఞానులు.

డయలెక్టిక్సును అనుసరించి సత్యం దిగంతరేఖ లాంటిది. దాన్ని అందుకోవడం కోసం ఎంత పురోగమించినా దృక్కుకూ దృశ్యానికీ అంతే దూరం వుంటుంది. అందువల్ల సత్యాన్వేషణ నిరంతరం సాగుతూనే వుంటుంది. ప్రతి సత్యమూ సాపేక్షమే కాని పరమ సత్యం వుండదు. ఇది జ్ఞాన పద్ధతి. తాత్విక పద్ధతి. విశ్వాసం ఇందుకు భిన్నం. అది మతపద్ధతి. ఆ మతాలు చెప్పిందే పరమసత్యం. నేటి మతాలన్నీ "పరమ సత్యాలు" మత ప్రవక్తలు చరమ గురువులు. చరమ గురువు పరమ సత్యం. ఇది మత సిద్ధాంతం. దీని సమర్ధన కోసం సత్యాన్ని వ్యావహారిక సత్యం అనీ పరమ సత్యం అని విభజించారు మతవాదులు. ఈ వాదాన్ని సమర్థించుకొనడానికి తత్వశాస్త్రాలనూ విజ్ఞాన శాస్త్రాల నూతోడు తెచ్చుకుంటూ వుంటారు. ఎదిగీ ఎదగని శాస్త్రాలు అందుకు తోడ్పతూ వుంటాయి కూడా. ఋగ్వేదం పదో మండలంలోని ఒక సూక్తం ఇందుకు చక్కని ఉదాహరణ. ఆ సూక్తమిది.

"నాసదాసీన్నో సదాసీత్తదానీం నాసీద్రజోనోవ్యోమా పరోయత్"

ఇందులో మొదటి వాక్యమే ఆ సూక్తానికి పేరుగా పెట్టారు. ఇది పూర్వ మర్యాద. "అప్పుడు సత్తు లేదు. అసత్తు లేదు. అలాగే భూమి లేదు. ఆకాశం లేదు" అని ఆ సూక్తానికి అర్థం. సత్తు అసత్తు తాత్విక పరిభాష, భూమ్యాకాశాలు ఆనాటికి లేవన్నది మతభావన. ఈ మత భావన అచ్చం ఇలాగే అసుర వేదంలో కూడా కనిపిస్తుంది. అసలది ఏడు వేల ఏళ్లనాటి సుమేరు కావ్యం. క్రీస్తు పూర్వం మూడో సహస్రాబ్ది చివరన దాన్ని అసుర భాషలోకి అనువదించారు. దానికి బాబిలోనియన్ జెనిసిస్ అని పేరు పెట్టారు పండితులు. దాని తొలి వాక్యమే పుస్తకం పేరు అయింది చూడండి.

ఎనూమాఎలిష్ లానబూ షమూము.
షప్లిష్ అమ్మతుం షుమా లాజక్రా.

అప్పుడు పైన అంతరిక్షానికి పేరు లేదు. కింద భూమికింకా పేరు పెట్టలేదు. ఇదీ ఆ అసుర వేద వాక్యానికి అర్థం. అసుర భాషలో ఈ గ్రంథం పుట్టిన వెయ్యేళ్లకు బైబిలు పాత నిబంధన రచన ఆరంభం అయిందంటున్నారు పండితులు. ఆనాటి ప్రపంచపటాన్ని గిడియన్ బైబిలు డూట్రోనమీ చివరన చూడవచ్చును. బల్ల పరుపుగా భూమి పైన గుబ్బ గొడుగులా ఆకాశం. సూర్య చంద్ర గ్రహ తారకాదులు భూ ప్రదక్షిణం చేస్తూ వుంటాయి. ఈ భావన ఎంత కాలం వరకు సత్యంగా చలామణి అయింది ? ఇప్పటికి పదహారు వందల ఏళ్ల కిందట అంటే నాలుగో

శతాబ్దంలో "సౌరకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించినం దుకు ఆర్యభట్టును దేశ బహిష్కృతుని చేశారు. అది సత్యం అని తెలిసినా బహు జనాభిప్రాయానికి జడిసి వరాహమిహిర బ్రహ్మ గుప్తులు క్షీర సాగర మథన పురాణం మరుగున దాగొన వలసి వచ్చింది. పశ్చిమాన కోపర్నికస్, గెలీలియోలు శిక్షలను అనుభవించవలసి వచ్చింది. ఇప్పటి మన పెద్దలు శాస్త్రీయ సత్యాలను కాదని రుజువు చేయలేక అవి లౌకిక సత్యాలు 'పారమార్థిక' సత్యం వేరు అని సత్యానికి విశేషణాలు తగిలించి తప్పించుకుంటున్నారు.

సత్యాన్ని తాత్వికంగా విశ్లేషించడానికి ముందు ఆ శాస్త్రాల స్వరూప స్వభావలను గురించి తెలుసుకొనవలసి వుంటుంది. ప్రతి సమగ్ర తత్వశాస్త్రంలోనూ రెండు భాగాలుంటాయి. ఒక దాన్ని శారీరక మీమాంస (ఆంటోలజీ) అంటారు. రెండోదాన్ని జ్ఞాన మీమాంస(ఎపిస్టమాలజీ) అంటారు. సత్యం అన్నది జ్ఞాన మీమాంసా భాగానికి సంబంధించిన సమస్య. శారీరక మీమాంస భౌతిక విశ్వ అస్తిత్వాన్ని (బీయింగ్) చర్చిస్తుంది. జ్ఞాన మీమాంస మనిషి చైతన్యాన్ని (కాన్షస్‌నెస్) చర్చిస్తుంది.

మనిషి పుట్టిన నాటి నుంచీ ఇవి రెండూ వున్నాయి. ఈ రెండింటికీ గల సంబంధం ఏమిటి అన్న ప్రశ్న నుంచి తత్వ శాస్త్రాలు పుట్టాయి. ఈ ప్రశ్ననే తత్వశాస్త్ర మౌలిక ప్రశ్న(బేసిక్ క్వశ్చన్ ఆఫ్ ఫిలాసఫీ) అంటారు పండితులు. రెండూ వున్న మాట నిజమే కాని అందులో అగ్రిమం యేది ? అనగ్రిమం యేది ? నేయి యేది? అనుయాయియేది? ఏది ప్రైయిమరీ ? ఏది సెకండరీ? అస్తిత్వం అగ్రిమం అన్నవి భౌతిక వాదాలవుతాయి. చైతన్యం కాన్షస్‌నెస్ అగ్రిమం అన్నవి భావవాదాలు అవుతాయి. రెండూ సమానమే అన్నవి ద్వయితవాదాలు అవుతాయి. ద్వయితాన్నే ఇంగ్లీషులో డ్యూయెలిజం అంటారు. మతాలకు తత్వ శాస్త్రాలకు చుక్కెదురు అయినా మత సిద్ధాంతాలను తాత్వికంగా విశ్లేషించి చూస్తే ప్రతి మతమూ ద్వయితమే అవుతుంది. మిగతా తత్వాలు ఏకతలు, మోనిజాలు.

భావవాదాన్ని వస్తునిష్ఠం(ఆబ్జెక్టివు) ఆత్మనిష్ఠం (సబ్జెక్టివు) అని రెండుగా వర్గీకరించారు శాస్త్రవేత్తలు. భౌతికవాదంలో ఈ వర్గీకరణ ఇపుడు కానరాదు. కాని ఆది(శైశవ) దశలో వున్నప్పుడు వుండేదనడానికి ఆస్కారం వుంది. హైలోజోయిజం, హెడోనిజాలను ఇలా వర్గీకరించవచ్చునని కొందరంటారు. ఆత్మ నిష్టాన్ని శాక్త తాత్వికులు "అహంత" అన్నారు. వస్తునిష్ఠాన్ని 'పరాహంత' అన్నారు. ఈ మాటల్లో 'డయలెక్టిక్కు' బీజరూపంలో కనిపిస్తాయి. ఈ కొలమానంతో చూస్తే ప్లేటో, హెగెల్ ఇద్దరూ పరాహంత భావవాదులు. శంకరుడు అహంతభావవాది. పరాహంత భావవాదులు కొసకు దేవుని దగ్గరకు చేరుతారని పశ్చిమ పండితులంటారు. ఆ తత్వవేత్తలు అలా చేరారో లేదో తెలీదు కాని మత వాదులు దైవ సమర్థన కోసం ఆ తత్వాలను వాడుకుంటున్నారన్న మాట నిజం. మన దేశాన జైన బౌద్ధాలు అహంత భావవాదాలే. ఐనా బౌద్ధులు దైవవాదాన్ని ఖండించడం కోసం తమ తత్వాన్ని విస్తారంగా వాడారు.

> **తర్కశాస్త్ర వ్యాఖ్యాత అయిన ఉదయనుడు దేవుడిని వ్యాజనింద చేస్తూ ఇలా అంటాడు. "ఐశ్వర్య మదమత్తోసి మామనజ్ఞాయ వర్తసే – ఉపస్థి తేషు బౌద్ధేషు మదధీనా తవస్థితిః" ఐశ్వర్యంతో మదమెక్కి నన్ను లెక్క చేయడం లేదు కాని బౌద్ధులు ఎదురైనప్పుడు మాత్రం నీ బతుకు నా చేతులో వుంది" అని మాత్రం మరిచిపోకని హెచ్చరిస్తాడు.**

అహంత భావవాదులు కొసకు సోలిస్సిస్టులవుతారని కొందరంటారు. సోలిస్సిజం అంటే నేనున్నాను కనక జగత్తు వుంది. నేను లేకపోతే జగత్తే లేదన్న తత్వం. ఇది పశ్చిమాన వుంది కాని మన దేశాన లేదు. భౌతిక వాదాభిమానులు భావవాద తత్వాలను తుండూ తుపాకితోసహా (లాక్ స్టాక్ అండ్ బేరల్) తిరస్కరిస్తూ వుంటారు. చదివిన తరవాత అలా తిరస్కరిస్తే తప్పులేదు. భావవాద తాత్వికుల మానవ మనస్తత్వాన్నీ (సైకాలజీ) రస సిద్ధాంతాన్ని (ఎస్తటిక్సు) అత్యున్నత స్థాయికి పెంచారు. ఆ సత్యాన్ని భౌతిక వాదాభిమానులు గ్రహించడం లేదు. భావవాదులు వీటినే కాదు డయలెక్టిక్సును పెంపొందిస్తూ వచ్చారు. ద్వంద్వాలు వాటి సంఘర్షణను అనేక కోణాల నుంచి చర్చిస్తూ వచ్చారు.

ఏకతను ద్వంద్వాలుగా విడగొట్టి ఆ ద్వంద్వాల సంఘర్షణ ద్వారా, ఆ ఏకతను అర్థం చేసుకొనడమే డయలెక్టిక్సు సారాంశం అంటారు పెద్దలు. ద్వంద్వాలలో అన్వంశం(పాజిటివు) ప్రత్యంశం(నెగిటివు) రెండూ వుంటాయి. అన్వంశం సామాన్యులకు కూడా అర్థం అవుతుంది. ప్రత్యంశావగాహన అంత సులభం కాదు. అందుకని తాత్వికులు ప్రత్యంశానికి ప్రాధాన్యం ఇస్తారు. ప్రత్యక్షం అంటే ఇంద్రియాల ద్వారా వచ్చిన జ్ఞానం. పరోక్షం అంటే అనుమానం లేదా తార్కిక జ్ఞానం. జ్ఞాన మీమాంసలోని ఈ రెండు దశలూ సామాన్యులకు తెలుసును. శంకరుడు ప్రతిపాదించిన తత్వానికి "అపరోక్ష జ్ఞానం" అని పేరుపెట్టాడు. ఆ మరో నెగెటివ్ ద్వారా తన తత్వాన్ని ప్రతిష్ఠించాడు. ద్వంద్వాలను మథించిన శంకరుడు తన తత్వానికి పేరు పెట్టడంలో కూడా ఇదే పద్ధతిని అనుసరించాడు.


ద్వంద్వాలున్న మాట నిజం. కాని వాటిలో ఒక్కదాన్నే స్వీకరించి రెండోదాన్ని లేకుండా చేయడం అసాధ్యం. ప్రతి ఏకత లోనూ ఆ ద్వంద్వాలు వున్నాయి. కనక తన ఏకతా సిద్ధాంతానికి అంటే మోనిజానికి అద్వైతం అని పేరు పెట్టుకున్నాడు. ఈ అద్వయిత పదాన్నే మనం డయలెక్టిక్సుకు వాడుకొనవచ్చును.

**(మిగతా 18వ పేజీలో)**


# వేదాలెన్ని - మూడా, నాలుగా ?

## స్వీయ రచనలు

- రాంభట్ల కృష్ణమూర్తి



వేదాలెన్ని ? మూడా నాలుగా? ఇప్పుడీ ప్రశ్న విడ్డూరం అనిపిస్తుంది. గుంట ఓనమాలు దిద్దుకునే కుర్రవాళ్ల దగ్గర్నుంచి గొప్ప కవుల వరకూ అందరికీ వేదాలు నాలుగని తెలుసును. అయినప్పుడు ఇలాంటి ప్రశ్న వేయడం విడ్డూరం కాదా? “నాలుగు మోములన్ నిగమనాదములుప్పతిలన్ ప్రచండ వాతూలహతిన్ జనించు రొద తోడి గుహావళి నొప్పు మేరువున్ బోలుదు తమ్మిచూలి” అన్న ఆంధ్ర కవితా పితామహుని పద్యం తెలీదా ? తెలుసును. అందరూ నాలుగు వేదాలంటారు. అంటున్నారు. ఆ సంగతీ తెలుసును. కానీ పండితులూ, ఆచార్యులు వేదాలు మూడే అంటారు మరి. పండిత వాక్యం ప్రమాణమా ? పామరవాదం ప్రమాణమా? శంకరాచార్యుడు “త్రయీ వేద్యం హృద్య త్రిపుర హరమాద్యం ప్రణయనం” అన్నారు. కౌటిల్యుడు ‘అన్వీక్షకీ త్రయీ వార్తా’ అన్నాడు. దీని ప్రకారం వేదాలు మూడేనని తెలుస్తుంది. బుద్ధుడు కూడా మూడు వేదాలు నేర్చినట్లు “తైవిజ్జసుత్త” అంటే త్రయీ విజ్ఞ సూత్రం చెబుతోంది. ఆ సూత్రాన్ని బట్టి బుద్ధునికీ “తైవిజ్ఞ” అన్న బిరుదం కూడా ఉన్నట్లు తెలుస్తోంది మరి.




బాగుంది అసలు వేదాలనే ఒప్పుకొనని బుద్ధుడు వేదాల మీద ప్రమాణమా? శ్రీమద్రామానుజాచార్యుల వారు “ప్రచ్ఛన్న బౌద్ధుడు” అని నిరసించిన శంకరాచార్యులు ప్రమాణమా? రాజు అయినవాడు అన్వీక్షకి అంటే సాంఖ్యం హేతువాదంలో కాయతం నేర్చుకోవాలని చెప్పిన కౌటిల్యుడు ప్రమాణమా? అని పండితులు ఎదురుదాడికి దిగితే ఏం చేయాలి? చిత్తం చిత్తం. వేదాలు నాలుగేనండి అని ఓ దండం పెట్టి తప్పుకొనవచ్చును. అంత మాత్రాన మూడు, నాలుగు యుద్ధం ముగిసినట్లు కాదు. మూడు, నాలుగు యుద్ధానికి మూలం అయిన నారాయణ సూక్తం ఋగ్వేదం పదో మండలంలో వుంది. ఆ మండలం ఆధునికం అని పండితులంటారు. అంటారే కాని ఎంత ఆధునికమో చెప్పరు. నారాయణ సూక్తానికే పురుష సూక్తం అని మరో పేరు. ఈ సూక్తంలోనే నాలుగు వర్ణాల ప్రస్తావన కూడా వుంది. ప్రస్తావన అయితే వుంది కాని అక్కడ “వర్ణం” అన్న మాటను వాడలేదు. అసలు వర్ణం అన్నమాట ఆ సూక్తంలోనే లేదు. అయినా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర ప్రస్తావన వుంది కనక కులాలను వేదం చెప్పిందని ఒప్పుకుందాం. నాలుగు కులాలను సమర్థించడం కోసం నాలుగు వేదాలను తయారు చేశారనుకుందాం. అలాగే మూడు పురుషార్థాలను పెంచి నాలుగు చేశారనుకుందాం. ఎన్ని చేసినా మూడు గుణాలను నాలుగు చేయలేకపోయారు.

వర్ణాలకు గుణ కర్మలను మూలం చేసినా మూడును మాత్రం నాలుగు చేయలేకపోయారు. ఈ పురుష సూక్తాన్ని ఒక విధంగా “వేదిక్ జనెసిస్” అంటే వేద సృష్టి గాథ అనవచ్చును. ఈ సూక్తంలోని వర్ణ వ్యవస్థను గురించిన చర్చ ఇప్పుడు మనకు అప్రస్తుతం. అసూక్తం ఇచ్చిన వేదాల పేర్లను పరిశీలిద్దాం.

**తస్మాద్యజ్ఞాత్సర్వహుత**
**ఋచస్సామాని జజ్ఞిరే**
**ఛందాంసి జజ్ఞిరే**
**తస్మాద్యజుత్తస్మాదజాతయ**

యజ్ఞంలో పుట్టిన పశువులు వాయవ్యాలు ఆరణ్యాలు గ్రామ్యాలు అన్నీ హుతం అయిన తరువాత “రుక్కులు సామాలు పుట్టాయి. వాటి నుంచి ఛందస్సులు పుట్టాయి. వాటి నుంచి యజుస్సు పుట్టింది. ఈ మంత్రంలో ఉన్న రుక్కులు

సామలు, ఛందస్సు యజుస్సు అని లెక్కిస్తే నాలుగు అవుతాయి. రుక్కుల నుంచి రుగ్వేదం, సామల నుంచి సామవేదం, యజుస్సు నుంచి యజుర్వేదం లెక్క సరిపోతుంది కాని, ఛందస్సుల నుంచి ఏం పుట్టింది? ఛందోవేదం అనేది లేదే? రుగ్వేదానికే ఛందస్సు అని మరో పేరు. అయినప్పుడు లెక్క మళ్ళీ మొదటికి వస్తుంది. ధర్మశాస్త్ర కర్తలు మీమాంసా పండితులు సామవేదాన్ని ఒక ప్రత్యేక వేదమనీ ఒప్పుకోరు. అందులో "వేదం" అంటే తెలుసుకొనదగ్గ కొత్తదేమీ లేదు. సామవేదంలో మొత్తం రెండు వేల ఎనిమిది వందల పధ్నాలుగు మంత్రాలున్నాయి. అందులో డెబ్బయి ఆరు తప్ప తక్కినవన్నీ రుగ్వేద పద్యాలే. ఆ డెబ్బయి ఆరూ కూడా ఇప్పుడు దొరకని రుగ్వేద శాఖలోవి కావచ్చును. రుగ్వేద పద్యాలకే స్వరకల్పన చేసిన సంగీతం సామవేదం. సంగీతం ఎక్కువయితే సాహిత్యం మిగలదు. గురువు లఘువు చేసి కుదియించి లఘువు గురువు చేసి లాగి లాగి తెగలాగవలసి వుంటుంది సంగీతంలో. అంచేతనే కాబోలు సామగానం చేసేటప్పుడు కుక్కలు మొరుగుతున్నప్పుడు వేదాధ్యయనం చేయరాదు అని మనువూ యాజ్ఞవల్కుడూ శాసించారు. మీమాంసా సూత్ర వ్యాఖ్యాత కుమారిలభట్టు ఒక అడుగు ముందుకు వేసి గాడిదల ఓండ్రింపు కూడా ఆ శాసనానికి జోడించాడు.

అయితేనేమి గీతాచార్యుడు మాత్రం సామవేదానికి అత్యున్నత స్థానం కల్పిస్తూ "వేదానాం సామవేదోహం" అన్నాడు. గాన యోగ్యమైన ఛందస్సుల పేరే ఆయా సామాలకు వస్తుంది. గాయత్రీ సామం, త్రైష్టుభసామం బృహత్సామం ఇలాగ. యజుర్వేదంలో సగం వచన కవిత. సగం ఛందస్సు. గద్య పద్యాత్మకమైన అవే దాన్ని మనం సాహిత్య పరిభాషలో చంపూ వేదం అని పిలుచుకొనవచ్చును.

బ్రహ్మవేదం, క్షత్రివేదం, భైషజ్యవేదం, అంగిరోవేదం, అధర్వాంగిర వేదం, భృగ్వంగిర వేదం అన్నవి అధర్వణ వేదానికి మారు పేర్లు. ఇతర వేదాలకు లేని ప్రత్యేకత అధర్వణ వేదానికున్నది. దీనికి ఉపవేదాలు కూడా వున్నాయి. అవి సర్పవేదం, పిశాచవేదం, అసురవేదం, ఇతిహాసవేదం, పురాణ వేదం. ఇందులో చివరి రెండూ తప్ప తక్కిన ఉపవేదాలు కాన రావడం లేదు అంటున్నారు పెద్దలు.

ఛందస్సు అనే పేరును రుగ్వేదానికి పర్యాయపదంగా వాడుతున్నారు. చందస్సు, రుక్కు, మంత్రం అంటే పద్యం అని అర్థం. రుగ్వేదం అంతా పద్య మయం. అందులో పది వేల నాలుగు వందల పధ్నాలుగు మంత్రాలు ఉన్నాయి. ఆథర్వణ వేదం కూడా రుగ్వేదం లాగే ఛందస్సు అధర్వణ వేదంలో మొత్తం ఆరు వేల మంత్రాలు ఉన్నాయి. రుగ్వేదానికి రుక్కు, ఛందస్సు అన్న రెండు పేర్లు మాత్రమే వున్నాయి. కాని అధర్వణానికి చాలా పేర్లు ఉన్నాయి.

బ్రహ్మవేదం, క్షత్రివేదం, భైషజ్యవేదం, అంగిరోవేదం, అధర్వాంగిర వేదం, భృగ్వంగిర వేదం అన్నవి అధర్వణ వేదానికి మారు పేర్లు. ఇతర వేదాలకు లేని ప్రత్యేకత అధర్వణ వేదానికున్నది. దీనికి ఉపవేదాలు కూడా వున్నాయి. అవి సర్పవేదం, పిశాచవేదం, అసురవేదం, ఇతిహాసవేదం, పురాణ వేదం. ఇందులో చివరి రెండూ తప్ప తక్కిన ఉపవేదాలు కాన రావడం లేదు అంటున్నారు పెద్దలు. అధర్వణవేదంలో మంత్ర తంత్రాలున్నాయని వైద్య శాస్త్రం వుందనీ కొందరి నమ్మకం. వారి నమ్మకానికాధారం ఏదయినా మానవేతి హాసానికి మాత్రం ఈ వేదం చక్కగా ఉపయోగపడుతుంది. ఇందులో వున్న మందులు ఔషధుల ప్రస్తావన రుగ్వేదంలో కూడా వుంది. రుగ్వేదం నుంచి ఆయుర్వేదం పుట్టిందని, అధర్వణ వేదం నుంచి అర్థవేదం పుట్టిందనీ పండితులంటారు. వేదాలను గురించి భారతీయ చరిత్రను గురించీ మాట్లాడేటప్పుడు కొన్ని పదాలకు స్పష్టమైన నిర్వచనాలు ఇచ్చుకొనడం మంచిదని నా అభిప్రాయం. ఆర్య ద్రావిడ అన్నవి భాషావాచకాలే కాని జాతి వాచకాలు కావు. సంస్కృతంతో సహా ఇండో యూరోపియన్ భాషలన్నింటికీ ఆర్య భాషలని పేరు. ద్రావిడ కూడా భాషావాచకమే. అది తమిళానికి సంస్కృతీకరణం. ఆర్య అసుర అన్న మాటలు జీవన విధాన సూచికలే కాని జాతివాచకాలు భాషా వాచకాలు కావు. రుగ్వేదంలోని సరమాపణి సంవాద సూక్తానికి రుషి "పణయోసురా" అని వుంది. అంటే అసురుడైన పణి ఆసూక్త ద్రష్ట అని అర్థం. అదే రుగ్వేదంలో వైరూపుని కొడుకులైన అష్టదంష్ట్రుడు సభః ప్రభేదనుడు అన్న రుషులు సూక్తద్రష్టలుగా కనిపిస్తారు. వీరి పేర్లను బట్టి చూస్తే వీరు అసురులని స్పష్టం అవుతుంది. అధర్వణ వేదానికి అసురవేదం అన్న ఉపవేదం కూడా వుందని తెలుసుకున్నాం కదా.

ఆ ఉపవేదం సంగతేమో కాని అధర్వ ఛందస్సుల్లో ఆర్షీ ఛందస్సులతోపాటు ఆసురీ ఛందస్సులు కూడా వున్నాయి. అసురీ చందస్సుల్లో ఏకపదా గాయత్రి, ఏకపదాత్రిష్టుప్ ఏకపదా ఉష్ణిక్ మంత్రాలు కనిపిస్తాయి. ద్వితీయ కాండం తృతీయ ప్రపాఠంలో యీ ఛందస్సులున్నాయి.

పురుష సూక్త మంత్రంలోని "ఋచస్సామాని జజ్ఞిరే" అన్న వాక్యానికి గానయోగ్యమైన రుక్కులు అని అర్థం తీసుకుంటే మూడు నాలుగు సమస్య ముడి విడిపోతుంది. ఆ తర్వాత "ఛందాంపజజ్ఞిరే" అన్న వాక్యాని ఛందస్సులు అని అర్థం తీసుకొంటే రుగధర్వాలు రెండూ ఏకఛందోరూపాన

మిగులుతాయి. అప్పుడు త్రయీ అన్న మాట వేదాలకు వర్తిస్తుంది. పూర్వపండితుల ఆబోరు దక్కుతుంది. ఋగ్వేద మంత్ర ద్రష్టల్లోని భృగు, అంగిర, వశిష్ట, విశ్వామిత్రాదులు అథర్వణంలో కూడా కనిపిస్తారు. ఋగ్వేదంలో ఎక్కువ మన్నన పొందిన ఛందస్సులన్నీ అథర్వణంలో కూడా కనిపిస్తాయి.

ఋగ్వేదం మధుచ్ఛందుని గాయత్రితో మొదలవుతుంది. మధుచ్ఛందుడన్నది బిరుదు నామంలా కనిపిస్తుంది. వేదంలో గాయత్రీ ఛందస్సు తెలుగునకందం లాంటిది. దాని నడపడం చాల కష్టం. కందం చెప్పిన వాడే కవి. పందిని కొట్టినవాడే కవి అని మనకో సామెత వుంది. అలాగే వేదకాలాన "గాయత్రి" చెప్పిన వాడే కవి అన్న సామెత వుండి వుంటుంది.

**అగ్నిమీళే పురోహితం యజ్ఞస్యదేవ మృత్విజం**
**హోతారం రత్నధాతమమ్.**

ఇదీ తొలి ఋక్కు, గాయత్రి పాదానికి ఎనిమిది అక్షరాలు. మూడు పాదాలు. మరో పాదం కలిపితే అది అనుష్టుప్ అవుతుంది. వేద ఛందస్సుకు అక్షర నియమమే కాని గురు లఘు నియమాలు లేవు. ఒక ప్రత్యేక బాణీలో చదవడానికి అనువుగా ఉదాత్తీ అనుదాత్త స్వరిత ప్లుతాలనే సంజ్ఞలున్నాయి. ఈ సంజ్ఞల సాయంతో ఏడు మాత్రలను సాధించవచ్చును. అలాంటి అవసరం లేకుండానే గాయత్రి చేత కదం తొక్కించాడు మధుచ్ఛందుడు.

**స్వాదిష్టయా మదిష్టయా – పవస్వసోమధారయా**
**ఇంద్రాయ పాతవేసుతః**

ఇది సోమ మండలంలోని తొలి ఋక్కు ఈ నడకను గమనించండి. గ్రీకుల్లో "డిత్తీరాంబ్"లని ఆహ్లాద గీతాలున్నాయి. ఆ మాటకు అర్థం ఏమిటో ఎవరికీ తెలియదు. కాని మంచి నీళ్లు తాగితే డిత్తీరాంబ్ పలుకుతుందా? అన్న సామెత మాత్రం ఒకటి మిగిలింది. అలాంటిదే సోమం పడితేనే కాని సామం పలకదు అన్న సామెత వుండేదేమో. అలాంటి సామెత ఉండి వుంటే మధుచ్ఛందుని సోమ మండల గాయత్రీ ఛందస్సుకు యీ గుర్రం నడక ఎందుకు వచ్చిందో అర్థం అవుతుంది. ఇప్పుడింక ఆసురీ ఛందస్సుల నడకలను, అసురులను తమ మ్లేచ్ఛభాషలో రాసుకున్న ఛందస్సుల నడకలను పరిశీలించి చూద్దాం. అథర్వణ వేదంలోని ఆసురీ గాయత్రీ ఛందస్సుకు పాదానికి పదిహేను అక్షరాలు. ఆర్షీ ఛందస్సుల్లాగే ఆసురీ ఛందస్సులకు కూడా స్వరాలుంటాయి.

**అగ్నేవైశ్వానర విశ్వైర్మా దేవైః పాహిస్వాహా**
**విశ్వంభర విశ్వేన మాభవసా పాహిస్వాహా**

ఇది ఏకపదా ఆసురీ గాయత్రీ ఛందస్సు. గాయత్రి అంటే పాటకు అనువుగా వుండే ఛందస్సు అని అర్థం. వేదాలకే కాదు ఏ మత గ్రంథానికి చెందిన కవితకయినా కొన్ని స్వరాలూ బాణీ వుంటాయి. అంచేత అవి సంథ చెప్పించుకొనడం ద్వారా మాత్రమే సాధ్యం. క్రీస్తు పూర్వం ద్వితీయ సహస్రాబ్దినాటిదయిన "ఎనుమాఎలిష్" అన్న అసురవేద ఛందస్సు మ్లేచ్ఛ భాష.

**ఎనుమా ఎలిష్ ఆనబూ షీమూము**
**షప్లిష్ అమ్మతుం షుమా లాజక్రా**

అప్పుడు పైన అంతరిక్షానికి పేరు లేదు. కింద భూమిని పేరున పిలువలేదు. ఇదీ ఈ అసుర మంత్రానికి అర్థం. ఇదే అర్థాన్ని యిచ్చే మంత్రం మన ఋగ్వేదంలో కూడా కనిపిస్తుంది.

**నాసదాసీన్నో సదాసీత్త దానీం నాసీద్రజోనో**
**వ్యోమాపరోయత్**

దీన్ని నాసదీయ సూక్తం అంటారు. తొలిమంత్రం తొలి వాక్యమే అసుర వేదానికి పేరు. సూత్రంలోని తొలి వాక్యమే ఆ సూక్తానికి పేరు రెండింటికీ పోలిక కనిపిస్తూంది కదూ? సత్తు లేదు. అసత్తు లేదు. భూమి లేదు. ఆకాశం లేదు అని ఆ మంత్రానికి అర్థం. తర్వాత వాక్యంలో "కిమావరీవః" అని మొదలవుతుంది. అసురవేదంలో అంతటినీ "అప్పు" ఆవరించి వుందని వివరిస్తుంది. అంతేకాదు సుమేరు పురోహితుడైన "బరు" బిరుదు గల "బరురాంగీరసుడు" అటు ఋగ్వేదంలోనూ యిటు అథర్వణంలోనూ కనిపిస్తారు. ఈ ఉదాహరణలను బట్టి చూస్తే ఋగథర్వణాలు ఒకటే ఛందస్సు తరవాతి కాలంలో ఎవడో ఒక వ్యాసుడు రెండుగా చేసి అథర్వణ వేదాన్ని సృష్టించి నట్లు కనిపిస్తుంది. ఇందుక్కారణం యేమిటి? కారణం లేనిదే ఏ కార్యమూ జరగదు. వేదాలకు పుట్టిల్లేది? అన్న ప్రశ్నకు సమాధానం వెతుక్కుంటూ పోతే ఆ కారణం కొంత వరకు తెలియవచ్చునని అనుకుంటున్నాను. ❑


# అసతో మా సద్గమయ

**(15వ పేజీ తరువాయి)**

డయలెక్టిక్కును మన భాషలో అంతకన్నా మిన్నగా చెప్పడం సాధ్యం కాదు. అయినప్పుడు శంకరాద్వైతం డయలెక్టికల్ ఐడియలిజం అవుతుంది. డయలెక్టికల్ మెటీరియలిజాన్ని భౌతికా ద్వైతం అని పిలవడం సమంజసంగా వుంటుంది. ఇదే అద్వైత విధానంలో చెప్పిన ఉనిషత్ సూక్తి "అసతో మా సద్గమయ" అన్నది. ఆ సూక్తిలో తొలుత వాడినది నెగిటివ్ పదం. దానిని బట్టి చరమ సత్యం పరమ సత్యం అన్న దేదీ వుండదనీ సత్యాలన్నీ సాపేక్షలు మాత్రమేననీ విదితం అవుతుంది. అంచాత అసతో మా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ. ❑ **(మిసిమి సౌజన్యంతో)**

# సాంఖ్య దర్శనం

## స్వీయ రచనలు



- రాంభట్ల కృష్ణమూర్తి

తత్వశాస్త్రాలు మత వ్యతిరేకత నుంచి పుట్టాయంటారు మార్క్సిస్టు పండితులు. గ్రీకు తత్వశాస్త్ర చరిత్రను సమీక్షిస్తూ వారు చేసిన నిర్ణయం ఇది. ఆ రోజుల్లో పురాణాలే మతంగా ఉండేవి. గ్రీకుల పురాణం హెసియడు. రోమన్ల పురాణం ఓవిడు. జర్మన్ ఉత్తర యూరోపీయుల పురాణం వెడ్డా. క్రైస్తవ మత వ్యాప్తికి ముందు ఆయా ప్రాంతాల్లో ఈ పురాణ మతాలే ఉండేవంటున్నారు. మన మతానికి కూడా పురాణాలే ఆధారం. మతాన్ని ఉత్తరాది వారు ధర్మం అంటారు.

**ధర్మశాస్త్రం చరిత్ర రాసిన మహామహోపాధ్యాయ కాణే ధర్మమూలాలు ఆరు అని వివరించాడు. అవి : పురాణాలు, పూర్వ మీమాంస, అర్థ శాస్త్రం, ధర్మ శాస్త్రాలు, వేదాలు, వేదాంగాలు. ఈ పట్టిక ప్రకారం ధర్మం అంటే మతం అని అర్థం చెప్పుకుంటూ దానికి మూలం పురాణాలని తేలుతుంది. రెండో స్థానంలో వున్న పూర్వ మీమాంస తత్వశాస్త్రం.**

ఈ తత్వశాస్త్రం మత మూలాల్లో ఒకటి అయితే మార్క్సిస్టు పండితుల నిర్ధారణ మన దేశానికి వర్తించద నిపిస్తుంది. ఉత్తరాది వారు మతాన్ని ధర్మం, సంప్రదాయం అని పిలిచినా మనం మాత్రం మతం అనే అంటున్నాం. ధర్మం అన్న మాటకు ఎన్ని అర్థాలు ఉన్నాయో మతం అన్న మాటకూ అనేక అర్థాలు ఉన్నాయి. పూర్వం మన దేశాన తత్వశాస్త్రాలనే మతంగా వర్ణించేవారు. మీమాంసకులు, వేదాంతులు, కణాదులు, సాంఖ్యులు, నైయాయికులు, హేతువాదులు, భూతవాదులు, యోగులు - ఇలాగ తత్వశాస్త్రాలనే మతాలుగా పరిగణించి మాట్లాడుతూ ఉండేవారు. శంకరుడు శైవ, వైష్ణవ, శాక్త, సౌర, గాణాపత్య, కాపాలిక మతాలను సంస్కరించాడు. కనక ఆయనకు షణ్మత స్థాపనాచార్య అన్న బిరుదం వచ్చిందంటారు. ఇలా సంస్కరించిన వాటికి నిర్దిష్ట తత్వశాస్త్రాలు లేవు. కొన్నింటికి క్లిష్టమైన ఉపాసన తంత్రాలు మతభేదాలు ఉన్నాయి. శంకరుడు సంస్కరించిన ఆరు మతాలను పక్షపాతం లేకుండా పూజిస్తారు శంకర అనుయాయులైన స్మార్త బ్రాహ్మణులు. వారి పూజను పంచాయతనం అంటారు. శైవ, వైష్ణవ, శౌక్త, సౌర, గాణా పత్యాలు అయిదింటికీ గుర్తులుగా అయిదు చిన్న రాళ్లు. వీటిని పంచాయతనం అంటారు. ఈ రాళ్లను ఒక లోహ సంపుటంలో ఉంచి పూజ చేస్తారు. ఆ లోహ సంపుటం కపాలం. కనక శంకరుడు సంస్కరించిన ఆరు మతాల మీదా, తమకు సమ దృష్టి వుందని నిరూపించుకుంటారు. తమిళులు కపాలానికి బదులు కౌమారం అంటారు. అయితే సంస్కరించతగ్గ రీతిగా అది ఏనాడూ లేదు. మనదేశాన ఏది మతమో ఏది తత్వశాస్త్రమో ఏర్పరచడానికి వీలు లేకుండా 'తైదలు ఆవాల్లా' కలిసిపోయాయి. అందువల్ల మతాలు తత్వశాస్త్రాల సంఖ్య ఇక్కడ వందల్లో కనిపిస్తుంది. ఇక్కడి తత్వశాస్త్రాలను వర్గీకరించాలంటే అందుకు ఇక్కడ పుట్టిన కొలమానాలు పనిచేయవు. వాటివల్ల గందరగోళం ఇంకా ఎక్కువ అనడం తప్ప ఫలితం మాత్రం వుండదు. అందువల్ల పశ్చిమ దేశాల కొలమానాన్ని అనుసరించి తత్వ శాస్త్ర మౌలిక ప్రశ్న వేసుకోవాలి. ఆ ప్రశ్నకు జవాబు చెప్పుకుని దాని ప్రకారం ఆ తత్వాన్ని పరిశీలించాలి. అప్పుడే విషయం తేటపడుతుంది.

అస్తిత్వానికీ చైతన్యానికీ గల సంబంధం ఏమిటి? ఇదీ తత్వశాస్త్ర మౌలిక ప్రశ్న. అస్తిత్వం అంటే పదార్థం. చైతన్యం అంటే జ్ఞానం. ఈ రెండూ వున్నాయి. కనిపిస్తూనే వున్నాయి. ఇందులో ఏది ఆదిలో వుంది? ఏది తరవాత వచ్చింది? ఏది అగ్రిమం ? ఏది అనగ్రిమం ? ఏది నేయం ? ఏది అనుయా యం ? ఈ ప్రశ్న వేసుకుంటే వచ్చే జవాబును బట్టి ఆ తత్వం భౌతికవాదమా భావవాదమా అన్న సంగతి తేలుతుంది. భౌతిక భావవాదాలు తాత్వికాలు. ఈశ్వర నిరీశ్వర వాదాలు మత పరమైనవి. మన తత్వ శాస్త్రాలన్నింటిలోకీ సాంఖ్యం ఒక్కటే జగత్కారణం ప్రకృతి అని చెప్పింది. అందువల్ల ఈ తత్వం మీద ఆధునికులకు మక్కువ కలిగింది. అయితేనేమి తత్వాలలో సాంఖ్యం అన్న పేరు తప్ప మరేమీ మిగల్లేదు. ఈ తత్వానికి సాంఖ్యం అన్న పేరు ఎందుకు వచ్చిందో తెలీదు. ఈ తత్వకర్త కపిలుడని పెద్దలంటారు. అతడెక్కడివాడో ఎప్పటి వాడో తెలీదు. అతడి మీద రకరకాల కథలు పురాణాల్లో వున్నాయి. ఆసురి, పంచశిఖ, వోఢు, సనక సనందనులు కూడా సాంఖ్య నిర్మాతలుగా కనిపిస్తారు. ఇందులో సనక సనందనుల మీద కపిలునికన్నా ఎక్కువ కథలున్నాయి. సాంఖ్యం అతి ప్రాచీనం అని అంతా ఒప్పుకుంటారు. ఎంత ప్రాచీనం అంటే బుద్ధుని కన్నా ప్రాచీనం అంటారు. చరక సంహిత, మనుస్మృతి, మహా భారతం, అనేక పురాణాల్లో సాంఖ్య తత్వ ప్రస్తావనలు భావాలు కనిపిస్తాయి. సాంఖ్యతత్వం మీద ఈశ్వరకృష్ణుని సాంఖ్య

కారికలు, కపిలుని పేర సాంఖ్య సూత్రాలు ఇప్పుడు దొరుకుతున్నాయి. ఈశ్వర కృష్ణుడు క్రీస్తుశకం అయిదు వందల దరిదాపులవాడు. సూత్రకర్త కపిలుడు క్రీస్తు శకం పధ్నాలుగు వందల ప్రాంతంవాడు. ఈశ్వరకృష్ణుని కారికలు 72 అనుష్టుప్ శ్లోకాలు. సాంఖ్యతత్వాన్ని మహాభారతం సనాతన తత్వం అంది. సాంఖ్యం మీద పాశ్చాత్య పండితులు చాలా ఆసక్తి చూపారు.

**ఆది నుంచీ దేవుని తిరస్కరించిన తత్వం సాంఖ్యం ఒక్కటే. దేవుని తిరస్కరించింది కనక దానికి నిరీశ్వర సాంఖ్యం అన్న పేరు వచ్చింది. ఈ సాంఖ్య పద్ధతిని పుణికిపుచ్చుకుని దాని నెత్తిన దేవుని ఎక్కించింది యోగం. ఆ విధంగా అది కూడా తత్వ శాస్త్ర హోదాను సంతరించుకుంది. ఒక్క దేవుని ఉనికి తప్ప సాంఖ్యంతో మరేలాంటి తాత్విక భేదమూ లేనందువల్ల యోగాన్ని సేశ్వర సాంఖ్యం అని కూడా అంటారు యోగ సూత్రకర్త పతంజలి.**

పతంజలి వ్యాకరణ మహా భాష్యకర్తగా ప్రసిద్ధుడు. అతడూ యోగసూత్ర కర్తా ఒకడేనని భారతీయ పండితుల నమ్మకం. జగత్తు మూలకారణం ప్రకృతి. ప్రకృతినే ప్రధానం అన్నారు. తాత్వికంగా సాంఖ్యం ప్రధానవాదం. జగత్కారణం ప్రధానం అంటే పదార్థం అని నిరూపించడం కోసం సాంఖ్యులు అనుసరించిన పద్ధతి సత్కార్యవాదం. దీన్నే పరిణామవాదం అంటారు. తరవాతి కాలం వారు కార్యకారణ పద్ధతి అనీ హేతువాదం అనీ అన్నారు. జగత్తంతా పదార్థమయంగా కనిపిస్తున్నది. అంచాత ఈ జగత్కారణం కూడా పదార్థమే అయి తీరాలి. అంచాత ఆత్మకు పర్యాయపదమయిన బ్రహ్మవాదాన్ని సాంఖ్యం తిరస్కరించింది. పరిణామవాదం నిరూపణకు ఈశ్వర కృష్ణుడు వ్యవసాయం నుంచి, పంటల నుంచి అనేక ఉదాహరణలు ఇచ్చాడు. ఇతర తత్వశాస్త్రాల ఉదాహరణలు 'ఘట, పటాల'ను దాటిపోలేదు. ఘటమంటే కుండ. పటం అంటే బట్ట.

సాంఖ్యకారికాకారుడు మాత్రమే వ్యవసాయం పంటలను ఉదాహరించాడు కనక ఈ తత్వం తొలి వ్యవసాయ సమాజంలో పుట్టి ఉండవచ్చుననిపిస్తోంది. మానవ జాతి చరిత్రలో బర్బర మహాదశ ద్వితీయాంతరంలోనే వ్యవసాయం, పశుపాలనా మొదలయ్యాయి. ఆర్యులు ఆదిలో పశుపాలన మొదలు పెట్టారు. ఇక్కడ ఆర్యులన్న మాటను భాషావాచకంగా మాత్రమే వాడుతున్నాను. అలాగే సెమెటిక్ భాషలు మాట్లాడే వారిని భాషా వాచకంగా మ్లేచ్ఛులంటున్నాను. ఆర్యులు ఆవులు, ఎడ్లను పెంచితే మ్లేచ్ఛులు గొర్రెలు, మేకలను పెంచారు. వారికి వ్యవసాయం పశుగ్రాసం వరకే తెలుసును. ఆర్య మ్లేచ్ఛా భాషా కూటాలకు చెందని సుమేరులు, మ్లేచ్ఛులైన ఈజిప్టు వారూ చరిత్రలో తొలి వ్యవసాయకులుగా ప్రసిద్ధి చెందారు. మెసపొటేమియాలో మ్లేచ్ఛ భాషలు మాట్లాడే అగదులు, అసురులు కూడా సుమేరుల వ్యవసాయ నాగరికతనే అనుసరించారు. భారతదేశాన సింధు నాగరికతనే నిర్మించిన వారు సుమేరు అసురులు అన్న ఒక వాదం ఉంది. బహుశా వారి నుంచే సాంఖ్య తత్వం మన దేశానికి వచ్చి వుంటుంది.

ఈశ్వర కృష్ణుని మతానుసారం ప్రకృతి ఆదిలో అవ్యక్తంగా వుండేది. అవ్యక్తం నుంచి మహత్తు పుట్టింది. మహత్తు అంటేనే బుద్ధి అని ఒక వాదం. మహత్తు నుంచి బుద్ధి పుట్టిందని మరో వాదం. బుద్ధి నుంచి అహంకారం, అహంకారం నుంచి మనస్సు పుట్టాయి. మనస్సు నుంచి అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, అయిదు తన్మాత్రలు, అయిదు మహాభూతాలు పరిణామక్రమంలో వచ్చాయి. అహంకారానికి మనస్సుకన్నా ఉన్నతస్థానం కల్పించడం కొందరు ఆధునికులకు నచ్చలేదు. అహంకారం అంటే "ఈగో" ఇప్పుడు అనేక అపవాదాలకు లోనయింది. అహంకారం అన్నది వేదాంతుల తురుపు ముక్క. అహమే బ్రహ్మ. బ్రహ్మే అహం. వేదాంతులది చేతనకారణ వాదం. అంకే బ్రహ్మ కారణవాదం. బ్రహ్మ అంటే అహం అని తెలుసుకున్నాం కదా? ఈ వాదం ఈశ్వరకృష్ణుని మనసున హత్తుకున్నట్లుంది. అంచాత బ్రహ్మరూపి అయిన అహంకారాన్ని మనస్సుకన్నా పైకెక్కించి వుంటాడు. మహత్తు నుంచి బుద్ధి పుట్టిందనుకుంటే బుద్ధి, అహంకారం, మనస్సు మూడే అవుతాయి. వీటితో మొత్తం తత్వాల సంఖ్య ఇరవై మూడే అవుతుంది. అంచాత మహత్తును ఒక జ్ఞాన రూపంగా గ్రహించవలసి వస్తుంది.

సాంఖ్యం చతుర్వింశత్తత్వాత్మికం– "మనో బుద్ధి చిత్తాహంకారత్వక్చక్షు శ్రోత్రజిహ్వా ఘ్రాణ వాక్పాణి పాద పాయూపస్థ శబ్ద స్పర్శ రూప రస గంధాకాశవాయ్వగ్ని సలిల భూమ్యాంతే శుద్ధ తత్త్వేశ్చ' అని సూత్రరూపాన వుంది. బహుశా ఇది సాంఖ్య సూత్రాల లెక్క అయి వుండవచ్చునని ఆది నాలుగు తత్వాలూ పురుష రూపం అంటే జ్ఞాన దశలు అయివుంటాయని కొందరు పండితులన్నారు. పందొమ్మిదో శతాబ్దం నాటి విజ్ఞాన శాస్త్రాన్ననుసరించి సాంఖ్యకారికలన్నింటికీ శాస్త్రీయార్థాన్ని చెప్పడానికి కొంత మంది పండితులు యత్నించారు.

**వేదాంతానికి ఆధారం బ్రహ్మసూత్రాలు. వీటి మీద శంకర, రామానుజ, మధ్వాచార్యులు ముగ్గురూ భాష్యాలు రాశారు. శైవ మత ప్రచారకులు కూడా ఒక భాష్యం రాశారు. వీటన్నింటిలోకి శంకరభాష్యానికే ఎక్కువ ప్రచారం వుంది. చేతన కారణ వాదమయిన బ్రహ్మను ఆయన వాడినంత విరళంగా మిగతా వారు వాడలేకపోయారు. బ్రహ్మసూత్రాలు ప్రధానంగా రెండు తత్వాలను తీవ్రంగా ఖండించాయి. ఒకటి**

**పూర్వ మీమాంస. రెండు సాంఖ్యం. సాంఖ్యతత్వాన్ని ఖండించడం కోసం బ్రహ్మ సూత్రాల్లో అరవై సూత్రాలను వాడవలసి వచ్చింది.**

పూర్వమీ మాంసాతత్వం వేదాలకు అతి సన్నిహితమైనది. కాగా అది నిరీశ్వరవాదంలో ఉగ్రవాది. మామూలు ఉగ్రవాది కాదు. చండ ఉగ్రవాది. అయినా అంత చండంగానూ వేదాలను సమర్థిస్తుంది. సాంఖ్యం కూడా నిరీశ్వర వాది. అంతేకాదు అచేతన కారణ వాది కూడా. అందువల్ల శంకరుడు సాంఖ్యాన్ని 'ప్రధానమల్లుని'గా భావించాడు. ప్రధాన మల్లుడిని చిత్తు చేస్తే చిల్లర మల్లులంతా సలాం కొట్టి పలాయనం చిత్తగిస్తారు. దీన్ని పండితులు "ప్రధాన మల్ల న్యాయం" అంటారు. బ్రహ్మవాదాన్ని సమర్థించుకునే వారంతా ముందు సాంఖ్యాన్ని తిరస్కరించాలి. అందుకు వారి నిత్యస్మరణం ఇది :

**"మనో బుద్ధ్యహంకార చిత్తాని నాహం**
**న చ శ్రోత్ర జిహ్వే నచా ఘ్రాణ నేత్రే**
**నచవ్యోమ భూమి ర్నతేజో నవాయూ**
**చిదానంద రూపశ్శివోహం శివోహం"**

ఇలా సాంఖ్యంలో ఏ తత్వాన్నీ కాను కాను అని నిత్యం స్మరించుకుంటే తప్ప ఆ సాంఖ్యం బ్రహ్మవాదుల్ని మింగేస్తుందని వేదాంతుల భయం అయి వుంటుంది. సాంఖ్యంలో ఆధునికులను తికమక పెట్టే అంశం మరొకటుంది. అది "ప్రకృతి ఏకం పురుషో బహవః" అన్న సూత్రం. వేదాంతులు ప్రకృతిని మాయ అన్నారు. పురుషుడు ఒకడే కాని మాయ అనంతరూపాల్లో వుంటుంది. అలాంటిది సాంఖ్యం పురుషో బహవః అనడం పండితుల తికమకకు కారణం అయింది.

ఈశ్వరవాదులు జగత్ సృష్టికర్త దేవుడు అని ఘోషిస్తూ వుంటే సాంఖ్యం పురుషుడు ఉదాసీనుడంటుంది. ప్రకృతి క్రియాశీలం అంటుంది. క్రీస్తుపూర్వం అయిదారు సహస్రాబ్దాల నాడు సుమేరుతత్వంలో 'అంకి' అన్న మాటుంది. సుమేరు భాషలో 'అం' అంటే ఆకాశం. 'కి' అంటే భూమి. అంకి అంటే భూమ్యాకాశాలు. వేదం ఇదే తత్వాన్ని 'ద్యావాపృథివీ' అంది. వేదోక్త వివాహాల్లో వరుడు 'ద్యౌరహం పృథివీస్త్వం' అని వధువుతో అంటాడు. అంటే నేను ఆకాశాన్ని నీవు భూమివి అని అర్థం. 'బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురు అన్నదమ్ములంటూ ఈ భూదేవి, ఆకాశం వారికి తల్లిదండ్రులంటా" అంటుంది తత్వం.

యాగంటి లక్మయ్య గారు ఈ తత్వకర్త. భూమిని "మాతర్" అంటారు రోమన్లు. ఆ పదమే ఇంగ్లీషులో "మేటర్" అయింది. ఆ మాటను నేటికీ పదార్థానికి వాడుతూనే వున్నారు. అసలు సాంఖ్య తత్వకర్త కపిలమహర్షి కాదని "కపిలా" అనే స్త్రీ అని అనుమానం వెలిబుచ్చాడు ప్రముఖ తత్వశాస్త్ర పండితుడు దేవీప్రసాద ఛటోపాధ్యాయ. కపిల భర్త పేరు ఆసురి. వారి కుమారుడు పంచశిఖుడు. ఇతడు సాంఖ్యంలో షష్టిక తంత్రం అన్న గ్రంథం రాశాడంటాడాయన. సాంఖ్యం అన్న మాట సంఖ్య అంకె అన్నమాట నుంచి వచ్చింది.

దశాంశమానం భారతీయులు కనిపెట్టారంటారు. సుమేరులది షష్ట్యంశమానం దాన్ని ఇంగ్లీషులో SEXAGESIMAL SYSTEM అంటారు. ఇప్పటికీ కాలగమనంలో ప్రపంచం అంతటా ఈ మానం వాడుకలో వుంది. సాంఖ్యంలోని ఇరవై నాలుగు తత్వాలను అరవై తత్వాలకు విస్తరించి షష్టిక తంత్రం రాశాడని దేవీ ప్రసాద్ అంటాడు. అయినప్పుడు కపిలా అన్న స్త్రీ సాంఖ్య దర్శన కర్త అనీ ఆమె భర్త పేరు ఆసురి అని దేవీప్రసాద చటోపాధ్యాయ చేసి ఊహ సమంజసమే అనిపిస్తుంది. సాంఖ్యం మీద ఎందరో పండితులు చేయి చేసుకున్నారు. దాంతో సాంఖ్యం వేదాంతంగా మారి నామావశిష్టం అయింది.


సాంఖ్యంలో ఆయా తత్వాలు ముఖ్యంగా వేదాంతం జొరపడ్డమే కాదు-సాంఖ్యాన్ని ఏదో విధంగా భారతీయ తత్వాలన్నీ ముక్కలు ముక్కలు చేసి పంచుకున్నాయా అనిపిస్తుంది. ఈ దేశాన శాస్త్ర తంత్రాలకు ఆధారం సాంఖ్యం. జానపద తత్వాలకు ఆధారం సాంఖ్యం. లోకాయతం పేర కనిపించే అనేక తత్వాలకు ఆధారం సాంఖ్యం. ఇంత విస్తారంగా వ్యాపించిన సాంఖ్యాన్ని నామరూపాల్లేకుండా చేయడం సాధ్యం కాదు. అంచాత దాన్ని కూడా ఆస్తిక దర్శనాల్లో ఒకటిగా చేర్చు కుని దాన్ని మైత్రీ పూర్వకంగా చిత్రవధ చేశారా అనిపిస్తుంది. ఈ వధ నేటికీ సాగుతూనే వుంది.

ఒక చిన్ననాటి సంగతి వివరిస్తారు. అది విశాఖ జిల్లాలో ఒక కుగ్రామం. అప్పటి నా వయసు ఏకాంకం అంటే సింగిల్ డిజిట్‌లో ఉండేది. ఒకేసారి ఎర్రగొల్ల భాగవతులు వచ్చారు. వారు 'గొల్లకలాపం' చెప్పారు. సాంఖ్యంలోని ఇరవై నాలుగు తత్వాలనూ వివరిస్తూ పిండోత్పత్తి క్రమాన్ని చెప్పారు. 'బ్రాహ్మణులైతే ప్రణుతిచేసెదను బ్రహ్మవిలాసము తెలుపరయా' అన్న మకుటంతో పాడారు. విదూషకుడు పురాణ గాథల నెత్తుకుని విష్ణుమూర్తి అంటే కృష్ణమూర్తి కదా అన్నాడు. అక్కడి నుంచి భాగవతంలోకి దిగి వ్రేపల్లె కృష్ణుడి అల్లరి, ఆగడాలు వివరించి కల్పాంతానికి దారితీశాడు. సముద్ర మధ్యాన మర్రి ఆకు మీద యోగ నిద్ర, అతని నాభిలో నుంచి తామర పూవు, ఆ పూవులో నుంచి బ్రహ్మ పుట్టుకని వివరించి బ్రాహ్మణుల బ్రహ్మ విలాసాలు వర్ణించాడు. విష్ణుమూర్తి అంటే కృష్ణమూర్తి గొల్ల. ఆ గొల్ల బొడ్డున పుట్టిన బ్రహ్మ గొల్ల. ఆ గొల్ల పుట్టించిన మనుషులంతా గొల్ల ఈ జగమంతా ఒకటే కులం అని చెప్పాడు. ఆ ఎర్ర గొల్ల కలాపం ఇప్పుడు శంకర వేదాంతంగా మారింది. బ్రహ్మ విలాసం మహా వాక్యాలు అద్వైత తాత్విక అభివర్గాల వివరణలుగా మారింది. నేను చిన్నప్పుడు విన్న సాంఖ్య కలాపం ఏ కొండ కోనల్లోనైనా వున్నదేదేమో తెలీదు. ❑


# మన చరిత్ర జన్మస్థలం మన దేశంలో లేదు

**స్వీయ రచనలు**

- రాంభట్ల కృష్ణమూర్తి



పూర్వం మనవాళ్ళు విద్యాభ్యాసానికి కాశీ వెళ్ళేవారు. అక్కడ వేద వేదాంగాలు అభ్యసించి వచ్చేవారు. ఇప్పుడు 'మన వాళ్ళు' విద్యాభ్యాసానికి మాస్కో వెళుతున్నారు. అక్కడ మార్క్సిజం, మార్క్సిజాంగాలు అభ్యసించి వస్తున్నారు. నేను కూడా మాస్కో యాత్ర చేశాను. అక్కడ మార్క్సిజం ఎంత వరకు అభ్యసించానన్నది వేరే విషయం. అది పదహారేళ్ళ కిందటి మాట. చిన్నప్పుడు ఈ దేశంలోనే నాకు వేదాంతం మీద అభిరుచి ఏర్పడింది. అది మాస్కోలో మరింత చిక్కబడింది. ఇప్పటికి ఆ జిడ్డు ఒదల్లేదు. జిడ్డునే సంస్కృతంలో స్నేహం అంటారు. అక్కడి తత్వశాస్త్ర ఆచార్యుని సాంగత్యంలో యీ జిడ్డు మరింత చిక్కబడింది. ఇద్దరమూ మరింత దగ్గరయ్యాము. మనసుల మధ్య తెరలు కరిగిపోయాయి. అప్పుడప్పుడు ఆయన ఇంటికి వెళ్ళి అక్కడే భోజనం చేసి వేదాంత చర్చల్లో పడేవారం. వేదాంతానికి పనికిరాని విషయం అంటూ లేదు. కనుక మా చర్చలు వసంతకాలపు సీతాకోకచిలుకల్లా విహరించేవి. ఒకనాడు మీ చరిత్ర ఎప్పుడు మొదలైంది ? అని ఆయన అడిగాడు. సిద్దప్ప పద్ద దైలమాలో పడ్డాను. మానవ సమాజంలో నాగరికత, సివిలైజేషను, వర్గాలు పుట్టినప్పుడే చరిత్ర మొదలవుతుందని పెద్దలంటారు. అవి పుట్టని దశను ప్రాక్ చరిత్ర, ప్రి హిస్టరీ అంటారు. నిజమే మార్క్సిస్టు, మార్క్సేతర పండితులందరూ అదే ముహూర్తాన్ని గుణించి ఆయా జాతుల చరిత్రలకు జన్మ పత్రికలను తయారు చేస్తున్నారు. జాతకాలు వేస్తున్నారు. కాని మార్క్స్ మాత్రం మనిషి ప్రాదుర్భావ ముహూర్తం నుంచీ మానవ చరిత్రను లెక్కలోకి తీసుకుంటున్నాడు. అందుచేత నేను మధ్యేమార్గాన్ని యెన్నుకున్నాను. మా చరిత్ర ఎప్పుడు పుట్టిందో నాకు తెలీదు. కాని ఎక్కడ పుట్టిందో మాత్రం చెప్పగలను అన్నాను. నేను ఎంచుకున్న మధ్యే మార్గం ఇది. నిజానికిది మధ్యే మార్గం కాదు. మానవ చరిత్ర అధ్యయనానికి మార్క్స్ స్వయంగా ఎంచుకున్న మార్గం. నా జవాబు విని ఆచార్యుడు ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు. అంతలోనే తేరుకుని చిరునవ్వు చిందించాడు. అయితే ఎక్కడో యెప్పుడో ఎలాగో చెప్పు అని కుతూహలంగా అడిగాడు. నా కళ్ళల్లోకి చూస్తూ కూర్చున్నాడు. మా చరిత్ర జన్మస్థలం మా దేశంలో లేదు. అది మీ దేశంలో ఉంది. మా చరిత్ర బైకాల్ సరస్సు తీరాన పుట్టింది అన్నాను. ఈసారి ఆచార్యుని ఆశ్చర్యం.. ఏమిటీ అని వాగ్రూపంలో పుట్టింది. ఆయన కళ్ళల్లో కుతూహలం నిండింది. అవును బైకాల్‌ను మా పురాణాలు వైభానస సరస్సు అన్నాయి. గరుత్మంతుడు అక్కడికి వెళ్ళాడు. ఆ గాథ కృత యుగం నాటిదని మా పురాణాలంటున్నాయి. కృతయుగం తొలినాళ్ళు అంటే శావేజి మహర్దశ నాటిదని మనం చెప్పుకొనవచ్చును. అంతర్దశ యేదో మాత్రం ఇంకా తెలీదు అన్నాను. గరుత్మంతుడక్కడికి వెళ్ళే నాటికి గజకచ్ఛప సంగ్రామం సాగుతోంది. అది మొదలై కొన్ని వేల యేళ్ళు గడిచాయి. దానికంత వరకూ అంతూ దరీ కాన రాలేదు. ఆ గజకచ్ఛ పాలనుతిని ఆకలి తీర్చుకొమ్మని గరుడుని తండ్రి కాశ్యపుడు చెప్పాడు. ఇది పురాణ గాథ. గజం అంటే ఏనుగు. కచ్ఛపం అంటే తాబేలు. ఆ ప్రాంతాన ఆ నాడుండేవి మన యేనుగు లాంటివి కావు. అవి జూలు యేనుగులు. వాటిని ఇంగ్లీషులో మేమత్స్ అంటారు. అవిప్పుడు లేవు. అంతరించి లక్షల సంవత్సరాలయి ఉంటుంది. వాటికి



మన వాళ్ళిప్పుడు మహా మాతంగాలని పేరు పెట్టారు. దాని కోర ఒకటి మద్రాసు మ్యూజియంలో ఉంది. దాని పొడవు పదహారడుగులు. దాని కపాలంలోంచి ఒక గుర్రపు రౌతు సులభంగా పోగలడని చరిత్రకారులంటారు. వాటిని ఆనాటి వారు చప్పుళ్ళతో బెదిరించి ఊబుల్లోకి తోలేవారు. తరువాత కొండల మీద నుంచి బండరాళ్ళను దొర్లించి అవి స్పృహ తప్పిన తర్వాత కోసుకొని కొన్ని వారాలపాటు తినే వారు. మాతంగాల మీద బతికే వారికి మాతంగులని పేరు వచ్చి ఉంటుంది.

కచ్ఛపం అంటే తాబేలు. గట్టెక్కి వచ్చే ప్రతి గుల్ల చేపకీ అంటే షెల్‌షిప్‌కు ఆ పేరు వర్తిస్తుంది. వాటిని తిని బతికే వారికి కచ్ఛపులు – కశ్యపులు అని పేరు వచ్చి వుంటుంది. ఈ ఉద్ధతుల మధ్య నిరుపేదల్లాంటి వారు చెట్లెక్కి అక్కడ బతికేవారు. వారిని ఇంగ్లీషులో ట్రీ పీపుల్ అంటారు. వారిని మన పురాణాల వాలఖిల్యులని పిలిచేవారు. వాలఖిల్యులంటే తోక తెగినవారు, పొట్టివారు అని అర్థం. వారిని దూరంగా దక్షిణాదికి తరలించి విడిచిపెట్టిన వాడు గరుడుడని మన పురాణాలంటున్నాయి. పొట్టితనం మంగోలాయిడ్ లక్షణం. ఆఫ్రికా కలహారి ఎడారిలో నేటికీ వున్న పిగ్మీలు పచ్చని వాళ్ళు, పొట్టివాళ్ళు. దక్షిణ నల్ల ఖండంలో వీరి ఉనికి. గరుడుడు వాలఖిల్యులను సుదూర దక్షిణాదికి తరలించాడన్న పురాణగాథ. ఈ రెండింటి మధ్య ఏమయినా చుట్టరికం వుందేమో. శాస్త్రవేత్తలు చెప్పవలసిన సంగతి ఇది. వీరు కాక అక్కడ బలిష్టులైన అంగిరులు కూడా ఉండేవారు. ఈ అంగిరులే అగ్నికి జనకులు. రెండు కొయ్యల్ని రుద్దడం ద్వారా నిప్పు మీద వారు వాల్లభ్యాన్ని సంపాదించారు. అందుచేత వారు మిగతా వారికి నాయకులయ్యారు.

కొయ్యల్ని మధించి నిప్పులను పుట్టించిన అంగిరునికి ప్రమంధుడు అన్న పేరు వచ్చింది. "నీవు అంగిరుల్లో ప్రమంధుడవు" అన్న పేరు రుగ్వేదంలో చాలాచోట్ల కనిపిస్తుంది. అగ్నిని కనిపెట్టిన వారు అంగిరులని పురాణాలు చెబుతున్నాయి. పైగా గ్రీకు పురాణాలు కూడా అగ్నిని తెచ్చి మానవులకిచ్చిన దేవపుత్రుని పేరు ప్రొమెథియన్ అని చెబుతున్నాయి. ప్రొమెథియన్ ప్రమంధ నామసామ్యం గమనించవచ్చును. గ్రీకులు, వైదికార్యులు కూడా ఇండో యూరపియన్ జాతి వారే కద. అంతేకాదు బైకాల్ సరస్సున పుట్టి ఉత్తరంగా ప్రవహించి ఉత్తర ధ్రువ సముద్రంలో కలిసే ఒక నదికి 'అంగారా' అని పేరు. ఇది అంగిరులను సూచిస్తుంది. నేటికీ మన వారుయేనది యెక్కడ కాస్త ఉత్తరం వైపు మలుపు తిరిగినా దానికి ఉత్తర వాహిని అని పేరు పెట్టి ఆ మలుపుని పుణ్యస్థలంగా భావించి అక్కడ స్నానాలు చేస్తూ వుంటారు. ఆ మలుపులో జపతపాలు చేస్తూ వుంటారు. భారతదేశాన ఇలాంటి ఉత్తర వాహినీ పుణ్య స్థలాలు దాదాపు ప్రతి నదికీ వున్నాయి.

అంగిరులకూ అగ్నికీ గల సంబంధం వల్ల అంగార్, ఇంగిలం అని అనేక భాషల్లో అగ్నికి పర్యాయపదాలు నేటికీ చెలామణిలో ఉన్నాయి. భారత పురాణాల లెక్క ప్రకారం ఋషులందరిలోకి అతి ప్రాచీనులు అంగిరులు. అంగిరులు భృగువులకు గురువులు. ఫ్రిగియన్ అంటే భృగు వంశానికి చెందిన గోర్డన్‌ని రాజుగా ఎన్నుకున్న తరువాత ఆయన ఒక రాజధాని నిర్మించి దానికి తన గురువుల గౌరవ సూచికంగా అంగా అని పేరు పెట్టుకున్నాడని చరిత్ర. అది నేటికీ టర్కీలో అంకారాగా నిలిచింది.

అందువల్ల మా చరిత్ర జన్మస్థానం లేక్ బైకాల్, వైఖానస సరస్సు. నాగరికతతోనే చరిత్ర మొదలయింది అని కొందరు పండితులంటారు. కాని నేను మాత్రం అగ్ని సృజనతో చరిత్ర మొదలయింది అంటున్నాను. అగ్నిని తెచ్చిన ప్రొమెథియన్ తొలి విప్లవకారుడు అని మార్క్సు అంటాడు. దేవతలనెదిరించి అగ్నిని తెచ్చి చలితో ఆకలితో బాధపడే మానవులకిచ్చినవాడు విప్లవకారుడే కదా ? మరి అంగిరులు విషయంలో అలాంటి గాథ లేదు కాని యజమానులు నెదిరించి బానిసల పక్షం చేరిన కృష్ణాంగిరసుని గాథ వేదాల్లో వుంది. సామాన్యుని పక్షం వహించిన ప్రతి వాడూ విప్లవకారుడే మరి. అలాంటి విప్లవాల నుంచే చరిత్ర పుడుతుంది అన్నాను.

వర్గ సమాజము, చరిత్ర ఇవి రెండూ మార్క్సిస్టులకు పర్యాయపదాలు. అయినప్పుడు భారత కమ్యూనిస్టులం అయిన మేము చరిత్రహీనులం. మాకు బానిస సమాజం లేదు. ఫ్యూడల్ సమాజం కూడా లేదు. కనక మాకు చరిత్ర లేదు. సీమరాణీ బావుటా భారత భూమ్మీద ఎగిరినప్పుడు మా దేశాన పెట్టుబడి దారీ సమాజానికి అంకురారోపణం అయింది. అంటే మార్క్సిస్టు పండితుల మతం ప్రకారం మా దేశంలో అవతరించిన తొలి వర్గ సమాజం పెట్టుబడిదారీ సమాజం. ఆ సమాజావతరణతో పాటే మాకు చరిత్ర కూడా అవతరించింది. అంతకు ముందున్నదంతా ప్రాక్ చరిత్ర. ప్రీహిస్టరీ అన్ని ప్రాక్చరిత్రల్లాగే అది కూడా విస్మరణీయం.

బైకాల్ తీరానే కాదు. కాస్పియన్ సముద్రం చుట్టూ యెటు చూసినా మా చరిత్ర కనిపిస్తుంది. కశ్యపుల పేరు మీద ఆ సముద్రాన్ని మేము కౌశ్యపి సముద్రం అని పిలుస్తాం. కౌశ్యపి అంటే భూమి అని కూడా అర్థం. అందుచేత కౌశ్యపీ సముద్ర పరిసర కౌశ్యపి అంతా మా చరిత్ర పారాడిన భూమి. ఇలాంటి స్థితిలో మా చరిత్ర ఎక్కడ మొదలయిందో చెప్పగలం కాని ఎప్పుడు మొదలయిందో చెప్పడం ఎలా సాధ్యం? అని ఆచార్యుని ప్రశ్నించాను. ఆయన ఏం చేయగలడు పాపం? ఆయన కూడా ఒక వేదాంతి. పురాణాలు చరిత్రలు కావు. ఆ సంగతి నాకు తెలుసు. ఆయనకీ తెలుసును కాని పురాణాలు

చారిత్రక వాస్తవాలను ప్రతిఫలిస్తాయి. అంటే రిఫ్లెక్ట్ చేస్తాయి అని మార్క్సు అంటాడు. రాజ వంశావళులు, వారి చరిత్రలు వగైరా వాస్తవాలను పురాణాలు చెప్పకపోవచ్చును. కాని మానవ చరిత్ర వాస్తవాలను ప్రతిఫలించి తీరుతాయి. మార్క్సు కనిపెట్టిన చారిత్రక భౌతిక వాదానికీ మోర్గాన్ వాసన ప్రాచీన సమాజానికి ఈ పురాణాలు కావ్యాలు ప్రముఖాధారాలు. అందుచేత పురాణాలు మానవ చారిత్రక వాస్తవాలను ప్రతిఫలిస్తాయన్నారు మార్క్సు. అంతేకాని మనకు తెలిసిన అర్థంలో చారిత్రక సత్యాలను ప్రతిఫలిస్తాయని ఆయన అనలేదు. మానవ చరిత్ర పేలియాంటాలజీ అంటే పురాజీవశాస్త్రం లాంటి ఓ కొంత నిర్ధారణాంధత్వ అంటే జ్యుడీషియల్ బ్లయిండ్నెస్ వల్ల మహా మనుషుల క్కూడా కళ్ల ముందున్నది కానరావు అంటారు మార్క్సు. మార్క్సు అనుయాయులకు ఈ జుడీషియల్ బ్లయిం డ్నెస్సే కాదు. టోటల్ బ్లయిండ్నెస్ వుంది. పేలియాంటాలజీ కోసం భూమి పొరలను పరిశీలించవచ్చును. మానవ చరిత్ర కోసం పురాణాల పుటలను పరిశోధించవలసి వుంటుంది. పురా ణాలు పూర్వ కావ్యాలు వట్టి చెత్త అని కొట్టిపారేసే వారికి యెబ్లయిండ్నెస్ వున్నా ఒకటే. అలాగే నేలవిడిచి సాము చేసే వారికి భూతద్దాలున్నా కాని పేలియాంటాలజీ అవగతం అవుతుందా ? మాయ కులస్త్రీ లాంటిది. దాని కళ్లల్లోకి సూటిగా చూసిన మరుక్షణంలో అదక్కడ వుండదంటాడు శంకరాచా ర్యుడు. ఈ తత్వాన్ని తెలుసుకున్న వారికి ఆయన మాయావాదం మంచులా విడిపోతుంది. అలాగే పురాణాలు, ప్రాచీన సాహిత్యం మీద మన కున్న ప్రిజుడీస్‌ను విసర్జించాలన్న జ్ఞానం కలిగిన మరుక్షణంలో మన జుడీషియల్ బ్లయిండ్నెస్ కూడా మటు మాయం అవుతుంది. అది నా అభిప్రాయం. నా స్వానుభవం కూడా. ప్రస్తుతం నేను వాల్మీకి రామాయణం మూలం చదువు తున్నాను. పేలియాంటాలాజికల్ ఎవిడెన్సెస్‌లాగే మానవ చారిత్రకాధారాలు కూడా అడుగడుగునా నాకు దర్శనమిస్తున్నా యి. పురాణ గాథల్లోనూ వేద మంత్రాల్లోనూ మరెన్ని చారిత్రక వాస్తవాలు కానవస్తాయో అవి చదివితేనే కాని తెలియదు.


మార్క్సు జీవితమంతా పరిశోధనల్లోనే గడిచింది. ఆయన నూనుగు మీసాల నూత్న యవ్వనంలో తత్వశాస్త్రాల మీద నోట్సు రాసుకున్నాడు. ప్రౌఢ యౌవన వయః పరిపాకమప్పుడు అర్థ శాస్త్రం మీద నోట్సు రాసుకున్నాడు. ఈ నోట్సు రాసుకొనడానికి పదిహేనేళ్లు పట్టింది అని ఆయనే చెప్పుకున్నాడు. విద్యార్థుల్లో ఒక నానుడి వుంది ఆల్జీబ్రా గుండె గాబ్రా అని. అలాగే మన వాళ్ళకి తత్వశాస్త్రం అంటే గుండె గాబ్రా. కనక ఆ తత్వశాస్త్రం నోట్సు మీద చాలా చర్చలు జరిగాయి. అర్థశాస్త్రం మీద రాసుకున్న నోట్సుకి 'గ్రుండెస్సీ' అని సంక్షిప్త నామం. ఆ నోట్సులో ఒక ప్రధాన భాగానికి 'ఫార్మెన్' అని పొట్టి పేరు. ధనం ఏయే సామాజికార్థిక రూపాల్లో యెలా వుండేది అని ఆయన రాసుకున్న ప్రికేపిటలిస్టు సోషియో ఎకనమిక్ ఫార్మేషన్స్ మీద రాసుకున్న భాగాన్ని ఫార్మ్‌ని లేదా జర్మనీలో ఫార్మెన్ అంటారు. దాన్ని అధ్యయనం చేయకపోతే చరిత్ర మీద చేసే చర్చలన్నీ నిరర్థకం అవుతాయి. అది మన వారికి సూపర్ గాబరా కలిగించి వుంటుంది. అందుచేత దాన్ని నిర్లక్ష్యం చేశారు. గ్రుండెస్సీ 1939-41 మధ్య మాస్కోలో అచ్చు అయింది. అది యుద్ధకాలం కనక ఎవరికీ అందుబాటు కాలేదు. 1953లో ఫార్మెన్ బెర్లిన్ అచ్చు వేశారు. అప్పుడు జర్మనీ తెలిసిన వారికి అందుబాటులోకి వచ్చింది. 1956లో దాన్ని ఇటాలియన్ భాషలో అనువదించి అచ్చువేశారు. 1964లో మాత్రమే ఇంగ్లీషులో వచ్చింది. హాబ్స్ చాందాన్ని అనువదించాడు. లారెన్స్ నిభార్ట్ వారు ప్రచురించారు. హాబ్స్ చాంపీఠిక 58 పేజీలు. మార్క్సు నోట్సు 54 పేజీలు. ఇదే విషయం మీద మార్క్సు రాతలు, లేఖలు 28 పేజీలు. ఆ పుస్తకం మరుసటేడు మలి ముద్రణకు వచ్చింది. ఆనాటి ప్రతిని నేను 1987లో కొనుక్కోగలిగాను. బానిస సమాజం కన్నా ముందు ప్రాచ్య సమాజం వుండేదని మార్క్సు వివరించాడు. ఆ ప్రాచ్య సమాజంలో భాగాలుగా జర్మన్ సమాజం, స్లావ్ సమాజం కూడా వుండేవని వాటి వివరణ కూడా ఇచ్చాడు. మన వేద సమాజంలో జర్మన్ సమాజం ఛాయలు గోచరిస్తాయి. వేద కాలంకన్న ముందే ఈ దేశాన వున్న మొహంజొదారో హరప్పా సమాజాల్లో ప్రాచ్య సమాజ లక్షణాలు పుష్కలంగా కనిపిస్తాయి. మొహంజొదారో సమాజం యిక్కడ అంతరించలేదు. అదృశ్యం కాలేదు. అదిప్పటికీ దక్షిణ భారతదేశాన వర్ధిల్లుతోంది. మొహంజొదారో సమాజానికీ అయిదారు వేల యేళ్ళనాటి మెసపొటేమియా సమాజానికి పోలికలు పుష్కలంగా కనిపిస్తాయి. ఆ సమాజం, అర్థ నీతి, సంస్కృతి అక్కడి నుంచి యిక్కడకు వచ్చిందా? యిక్కడి నుంచి అక్కడికి వెళ్ళిందా? లేదా ఎక్కడికక్కడ స్వతంత్రంగానే వృద్ధి పొందాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియవు. కాని ఉభయ సమాజాల మధ్య ఆర్థిక సాంస్కృతిక సంబంధాలు చాలా కాలం వరకు కొనసాగినట్లు మాత్రం నిస్సంశయంగా చెప్పవచ్చును.

మొహంజొదారో సమాజ సంస్కృతుల ప్రభావం వేదాల మీద పడినట్లు వేదాల్లోనే యెన్నో ఆధారాలు కనిపిస్తాయి. ఇప్పుడు రామాయణం చదువుతున్నాను. మెసపటేమియా మొహంజొ దారో సమాజం ప్రభావం రామాయణంలో చాలా కనిపిస్తోంది. జుడీషియల్ బ్లయిండ్నెస్ తొలగిపోయిన తరవాత మన సమాజం కొత్త కాంతులతో కొత్త తేజస్సుతో కనిపిస్తోంది. అందరికీ కనిపిస్తుంది కూడా. అందుచేత మార్క్సిజం వెలుగులో మన చరిత్రను తిరిగి చూద్దాం. మన సమాజాన్ని తిరిగి అర్థం చేసు కుందాం. మన కూకట్లను(రూట్సును) తిరిగి పట్టుకుందాం. మన ఆత్మలను తిరిగి అవగతం చేసుకుందాం. ❑

# చిత్రకళలు


## స్వీయ రచనలు

- రాంభట్ల కృష్ణమూర్తి



ఆంధ్రుల చిత్రకళా చరిత్రను వివరించడానికి మనకు ప్రాథమిక సాక్ష్యాధారాలు మిగలలేదు. సాహిత్య గ్రంథాలలో ప్రస్తావనలు లేవు. పోతే కాలం రాపిడికి తట్టుకుని మొండిగా, బండగా నిలిచి వున్న శిల్పాలను బట్టి మన చిత్రకళ స్వరూప స్వభావాలను అనుమాన ప్రమాణంతో మాత్రమే నిరూపించ వలసి వుంటుంది. అలా చూసినప్పుడు మన చిత్రకళ చాలా గొప్ప దశను అనుభవించిందనీ, అనేక దేశాలకు ఒరవడి పెట్టిందనీ నిర్ణయించడంలో తప్పులేదు.

తెలుగు వారి తొలి చిత్ర కళా ప్రస్తావన మనకు బౌద్ధ గ్రంథాలలో కనిపిస్తుంది. అది రెండు వేల ఆరు వందల సంవత్సరాల నాటిమాట. కృష్ణా తీరంలో చేతి వృత్తులూ, వర్తక వాణి జ్యాలూ బాగా పెంపొంది ఉండాలి. ఆనాడు ఇక్కడి నుంచి బీహారులోని రాజ గృహానికి కొందరు వర్త కులు "సాతు" వెళ్లారు. వారిలో ఒక చిన్నవాడు చిత్రకళా కుశలుడు. ఆ రోజుల్లో బుద్ధ భగవా నుడు రాజ గృహానికి తరుచుగా వస్తూ వుండే వాడు. అక్కడి గృధ్రకూట శిఖరం ఎక్కి ప్రకృతి రామణీయకాన్ని ఆస్వా దించడం ఆయనకు చిన్ననాటి నుంచీ వున్న సరదా. గృధ్రకూటం మీంచి చూస్తే రాజ గృహం చుట్టూ కడియం లాగా పర్వతపంక్తి వుం టుంది. పెట్టని కోటలా గా ఈ పర్వతాల నడుమ వెలిసిన ఒక గొల్లపల్లెకు అంతకు ముందు గిరివ్రజమని పేరు వుండేది. కాలక్రమేణా అదే మగధరాజులకు ఇరవై రాజగృహం అయింది. కొండ కడియానికి నడుమగా వ్యాసరేఖలాగ ఒక నది పారుతూ వుంటుంది. దానికి ఇరువైపులా పొలాలూ, పచ్చిక బయళ్లూ వుంటాయి. నిత్య సంచారం చేసే పరుపాలక గణాలకు ఈ కొండ కడియం నడుమ నున్న లోయ తరగని "తృణకాష్ఠ జలసమృద్ధి" నివ్వడంవల్ల ప్రాచీన పశుపాలక గణాలకు అది స్థిరనివాసం కల్పించింది. గృధ్రకూటం మీంచి తిలకించే బుద్ధ భగవానునికి ఈ లోయ అందానికి, ఆనందానికీ, ప్రశాంతికీ, స్థిరతకూ ప్రతిబింబంగా కనిపించి వుండవచ్చును. కృష్ణాతీర వర్తకులు బుద్ధదేవుని దర్శనానికి వెళ్లారు. ప్రశాంత గంభీరమైన బుద్ధుని మూర్తినీ, రాజ గిరి రామణీయకాన్ని చూసి కళా ప్రేరణలో గగుర్పొడిచిన మన యువ చిత్రకారుడు సాహసించాడు. "తమ చిత్రాన్ని గీస్తాను. కాస్త కదలకుండా నిలుస్తారా? అని బుద్ధదేవుని అడిగే శారు. బుద్ధుని హృద యం కూడా కళా ప్లావితం. అందుకనే ఆయన చిరునవ్వును అంగీకార సూచకంగా అందుకున్నారు మన యువ చిత్రకారుడు. ఆయనను ఎండలో నిలబెట్టాడు. తెల్లని కౌశేయం మీద నీడను పట్టాడు. కుంచె పట్టి గైరిక ధాతువుకో ఆ నీడ అందక రేఖలు (ఔట్‌లైన్స్) రచించారు. ఆ తర్వాత బుద్ధుని



సమక్షంలోనే కన్ను, ముక్కు రేఖలను దిద్దాడు. యువకుని ఉపాయాన్ని తన రూప చిత్రాన్నీ చూస్తూన్న బుద్ధదేవుని కన్నులలో కరుణ మెరిసింది. పెదవులపై చిరునవ్వు విరిసింది. ఆ కన్నులూ, పెదిమలూ బుద్ధుని చిత్రాల్లో నేటికీ నిలిచిపో యాయి. ఈ కథ నిజం కావచ్చును. కల్పన కావచ్చును. లేదా రెండింటి కలగలుపూ కావచ్చును. ప్రపంచంలో ఎందరో చరిత్రకెక్కిన వారున్నారు. అసంఖ్యాకుల ఆరాధనలం దుకుంటున్న మత ప్రవక్తలు వున్నారు. వారి చిత్రాలూ, విగ్రహాలూ నేటికీ దేశ దేశాల్లో తయారవుతూనే వున్నాయి. కాని అవి ఒక దానికొకటి పోలవు. బుద్ధుని బొమ్మలు మాత్రం అలా కాదు. ఏ దేశానివైనా, ఏ కాలానివైనా అన్నీ ఒక్క పోలికలోనే వుంటాయి. దీనికి కారణం ఏమిటి ? బుద్ధదేవుని నీడపట్టి తెలుగు యువకుడు రచించిన తొలి చిత్రమే తర్వాత రచనలకు "ఆది" అయి ఉంటుందా? ఏమో చారిత్రకులు నిర్ణయించవలసిన అంశం అది. కళా నైపుణ్యం వస్తూత్పత్తి నైపుణ్యం కన్న కళా నైపుణ్యం చాలా గొప్పది. అయినా వస్తూత్పత్తి కోసం కనిపెట్టిన సాంకేతి కతను మించి మాత్రం పోలేదు కళా నైపుణ్యం. బట్టపైన నీడపట్టి అండక రేఖలు గీసి, ఏకవర్ణమయ చిత్రాలు రచించే పద్ధతి పారిశ్రామిక నాగరికత పెంపొందుతున్న దశలో మాత్రమే యూరప్‌లో పుట్టింది. ఆ పద్ధతిని సిల్ హౌట్ అనే ఫ్రెంచి దేశీయుడు కనిపెట్టాడు. అందుకనే ఇప్పటికీ నీడ బొమ్మలను అతని పేరుకో సిల్ హౌట్ అని పిలుస్తూ వుంటారు. అలాంటిది రెండు వేల ఆరువందల సంవత్సరాలనాడే ఒక తెలుగు చిత్రకారుడు నీడకూ, మనిషికి పోలికలున్నట్లు తెలుసుకుని, నీడ సాయంతో రూపచిత్ర రచన చేశాడంటే, కృష్ణా తీరపు చేతి వృత్తుల సాంకేతికత గొప్పస్థాయికి చేరుకొని వుండాలని వూహించవచ్చును. అప్పటికే తెలుగు చిత్రకళ బాగా వృద్ధి పొంది వుంటుందని కూడా వూహించవచ్చును. ఆ లెక్కన తెలుగు చిత్ర కళ వయసు ఇంకా పెరుగుతుంది. అయినా తెలుగు చిత్రకళకు ప్రాథమికాధారాలు లేవు. పటం (కేన్వాస్), పట్టం (చెట్ల బెరడు, భూర్జపత్రం వగైరా) ఫలకం (బోర్డు) చిత్రాలకు భూమి బంధాలుగా వుండేవి. ఇవి త్వరగా శిథిలం అయే వస్తువులు. ఇంతకన్నా ఎక్కువ కాలం మన్నేది కుడ్య చిత్రం. అయితే గృహాలు శిథిలమైనప్పుడు కుడ్య చిత్రాలు కూడా నశిస్తాయి. కాని కొండ గుహలలో గోడలకు మన్ను మెత్తి గీసిన చిత్రాలకు శైథిల్యం తక్కువ. అందుకనే మనకు ఈనాటికీ మిగిలి వున్నాయి.

## గుహాకుడ్య చిత్రాలు


"చిత్రం హి సర్వ శిల్పానాం ముఖం" అంటారు భోజుడు. చిత్ర, శిల్ప, స్థాపత్య కళల మీద సమరాం గణసూత్ర రాశీ అన్న గ్రంథాన్ని రచించాడీయన. శిల్పం చెక్కడానికి ముందు రేఖా మాత్రంగా వుండే చిత్రాన్ని గీసి తీరాలి. ఆ చిత్ర రేఖలకు అనువుగా రాతిని మలుస్తూ పోవాలి. ఒక శిల్పం పూర్తయ్యేలోగా ఇలాంటి రేఖా చిత్ర రచనను ఎన్నో తడవలు చేయవలసి వుంటుంది. అలాంటి రేఖలకు అండక రేఖలని పేరు. "ఆదికన్న అందంగా పోత స్వరూపం వుండబోదు" అనేది ఆధునిక లోహ శాస్త్రజ్ఞుల సామెత. అలాగే అండక రేఖను మించిన సౌందర్యం శిల్పంలో వుండవోదు. దీన్నిబట్టి కాల కళాఘాతాలకు తట్టుకొని నిలిచిన తెలుగు శిల్పాలను చూసి ఆయా కాలాల మన చిత్ర కళా కౌశలాన్ని ఊహించడానికి ఆస్కారం వుంది. మన శిల్ప కళల శైలినీ, ఆయా కాలాల ఉత్పత్తి నైపుణ్యాన్ని, సాంకేతికతను బట్టి చూస్తే తెలుగు చిత్రకళను ముఖ్యంగా మూడు దశలకు తాగించవచ్చును. మొదటి దాన్ని ఆదియుగం అని పిలుచుకుందాం.


## ఆది యుగం

క్రీస్తు పూర్వం నుంచి క్రీస్తు తర్వాత ఆరేడు శతాబ్దాల వరకూ ఈ యుగం వుంది. తర్వాతిది మధ్య యుగం. ఆరేడు శతాబ్దాల నుంచి పదిహేను, పదహారు శతాబ్దాల వరకూ ఈ యుగం, ఆ తర్వాతి దాన్ని ఆధునిక యుగం అని నేనంటాను. ఆది యుగంలో తెలుగుదేశాన్ని ఏలిన మతం బౌద్ధం. ముని కాలంలో రాజగృహం, కాశీ, కోసల, వైశాలి, కోశాంబి లాంటి పట్టణాల్లో చేతి వృత్తులూ, వాటిననుసరించి వర్తక వాణిజ్యాలూ బాగా పెంపొందినట్లు చరిత్ర చెబుతోంది. దక్షిణాదిన అలాంటిది ఉన్నట్లు ఇంత వరకూ చరిత్రకారులు గట్టిగా చెప్పలేదు. కాని బుద్ధుని అనంతరం చేతి వృత్తులూ, వర్తక వాణిజ్యాలూ, దక్షిణాదిన, ముఖ్యంగా తెలుగుదేశంలో ఎక్కువ నైపుణ్యాన్ని సాధించినట్లు బుద్ధ మత చరిత్ర ఆధారంగా అనుమాన ప్రమాణంతో నిరూపించవచ్చును.

తూర్పు కోస్తాలో తయారయిన సరుకు తీసుకుని కీకారణ్యాల గుండా ప్రయాణం చేసి అనేక సాతులు పడమటి కోస్తాను చేరుకునేవి. అక్కడ నుంచి ఓడల్లో పశ్చిమాసియా మొదలయిన దేశాలకు మన వర్తకులు సరుగులు తారసపడే ఆటవికులను వర్గాలు లేని బౌద్ధ సంఘం వారిని సంఘంలో కొనిపోయేవారు. దారిలో మచ్చిక చేసుకొనడం కోసం వర్ణాలు, వీరికెంతో ఉపకరించేది. ఇలాంటి సమీకరించటం కోసం తాత్విక చర్చలకన్నా బుద్ధ జీవిత గాథల దృశ్య ప్రచారం ఎక్కువ ఫలవంతంగా వీరికి కనిపించింది. ఈ కారణం వల్లనే బౌద్ధ మతాన్ని ముమ్మరంగా ప్రచారం చేయవలసిన అవసరం వచ్చింది. బుద్ధుని అనంతరం రాజగృహం, వైశాలి, పాటలీ పుత్రం, కాశ్మీరాల్లో జరిగిన మహా సంగీతుల్లో (బుద్ధిస్టు కాంగ్రెసులు) తెలుగుదేశం నుంచి వెళ్ళిన ప్రతినిధులు ఈ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని వాదనలు చేశారు. ఆ వాదనలకు

అధిక సంఖ్యాకుల ఆమోదం కూడా లభించింది. అయితే కొద్ది మంది తాత్వికుల పట్టుదల వల్ల బౌద్ధం బద్దలు కాక తప్పలేదు. శిల్పాల ద్వారా, చిత్రాల ద్వారా బుద్ధ జీవిత ప్రచారానికి అడ్డ పడ్డ అల్ప సంధ్యాకులు విడిపోయారు. మిగిలిన వారు సాంఘికులు, చైత్యకవాదులు, మహాయాన వాదులుగా పేరు పొందారు. ఇందులో మహా చైత్యకవాదులన్న పేరు మనకు చాలా ముఖ్యం. సాతు వెళ్ళే దారి పొడుగునా బౌద్ధారామాలూ మహా చైత్యాలూ నిర్మించడానికి తెలుగుదేశపు చేతివృత్తుల వారూ, వర్తక నిగమాలూ, వారికి మదుపు పెట్టే మహారాణులూ, విరివిగా విరాళాలిచ్చారు. దీనితో దేశంలో శిల్పులకూ, చిత్రకారులకూ కొన్ని శతాబ్దాలపాటు చేతినిండా పని దొరికింది. ఈ విధంతర శ్రమ వల్ల నైపుణ్యం తారస్థాయికి చేరడంలో ఆశ్చర్యం లేదు, అమరావతీ శిల్పాలు కాదు. ఇలాగ తారస్థాయికి చేరిన కళ మనకు అమరావతీ శిల్పాల్లో కనిపిస్తుంది. ఆ తర్వాతి దశకు చెందిన నాగార్జునకొండ, జగ్గయ్యపేట శిల్పాల్లో అది నిగ్గు తేలింది. ఈ శిల్పాలు కేవలం శిల్పాలే ఒక రకంగా వర్ణచిత్రాలు కూడా. ఈ శిల్పాలకు మాచెర్ల ప్రాంతంలో దొరికే పాల రాతిని వాడారు. ఇది పేరుకు పాలరాయే అయినా నర్మదా లోయలో దొరికే రాయిలాంటిది కాదు. గ్రీకు, రోము శిల్పాలలో వాడిన రకం అసలే కాదు. తెలుగుదేశపు పాలరాయి అంత మేలు రకం కాదు. పొరలు పొరలుగా విడిపోతుంది. ఈ రాతితో పూర్ణ శిల్పం చెక్కడం చాలా కష్టం. అర్ధ శిల్పానికి మాత్రమే అది అనువుగా వుంటుంది. అందుకని బౌద్ధ శిల్పులు ఈ రాతితో ఎక్కువ అర్ధ శిల్పాలనే మలిచారు. అలాంటి అర్ధ శిల్పాలకు గచ్చుతో కూడా పుష్టినిచ్చి మెరుగులు దిద్దారు. వాటి మీద రంగులు అద్దాడు. ఆ తర్వాత పూర్తి శిల్పాన్ని మలచడానికి అనువైన పదార్థాలు దొరికినప్పటికీ ఈ సంప్రదాయాన్ని అనేక దేశాలు అనుకరించాయి. సింహళం, బర్మా, ఇండో చైనా, ఇండోనేషియా, కోట దేశాలకు ఈ అమరావతి సంప్రదాయం ఎగుమతి అయింది. ఆ దేశాల్లో కొయ్యతో పూర్ణ శిల్పం చెక్కి దానికి చిందంబలి లాంటి జిగురుకో రూపు దిద్ది పైన రంగు అద్దడం పరిపాటి అయింది. మధ్య ఎన్నోసార్లు మన శిల్పనై పుణ్య పరంపర తెగిపోయినప్పటికీ కొండపల్లి బొమ్మలు తయారు చేసే వారు మాత్రం నేటికీ ఈ సంప్రదాయాన్నే పాటిస్తున్నారు. ఈ యుగంలో వ్యవసాయం ముమ్మరంగా పెరగలేదు. బస్తీలు, పట్నాలూ, చేతి వృత్తులకూ, వర్తక వాణిజ్యాలకూ కేంద్రంగా వుండేవి. అడవుల పట్టు నుండే ప్రజలు వివిధ స్థాణుల్లో వర్గ పూర్వదశలో వుండేవారు. అలాంటి వారిలో కొందరిని బౌద్ధ సంఘాలు ఆకట్టుకున్నాయి. బస్తీలలో వృత్తుల వారూ, వర్తకులూ నిగమాలుగా, వికాయాలుగా వ్యవస్థికులై శ్రేష్టులను ఎన్నుకుని ప్రజాతంత్ర పద్ధతిలో తమ వ్యవహారాలను చక్క బెట్టుకుంటూ వుండేవారు. వర్తక వాణిజ్యాల మూలంగా అనేక దేశాలతో సంబంధాలు ఏర్పడి, కళలకూ, కళా కుశలురకూ మంచి ఆదరణ ఏర్పడింది. ఈ నిగమ నికాయల మీద ఆర్థికంగా ఆధారపడిన బౌద్ధ సంఘాలు వీరికి నైతిక, ధార్మిక బలాన్ని సమకూరుస్తూ వుండేవి. చేతి వృత్తులను, వర్తక వాణిజ్యాలను రక్షించడమే ధ్యేయంగా గల పరిపాలన యంత్రాంగం వుండేది. రాజులూ ముఖ్యంగా రాణులు నిగన నికాయాలకు మదుపు పెడుతూ ఉండేవారు. తొలి ఆంధ్రరాజులకు సార్ధవాహుణగల మనిష్ట సంబంధాన్నిబట్టే వారికి “సాతవాహ” “సాతకర్ణి” పేర్లు వచ్చాయని కూడా ఊహించవచ్చును. సాతకర్ణి అంటే సాతు (కారవాన్)కు కరణాలుగా లెక్కలు రాసేవారుగా వుండేవారని అర్థం స్ఫురిస్తుంది. ఇలాగ వృత్తులూ, వృత్తి నైపుణ్యం పెరగడానికి ఎంతో



ఆస్కారంగల ఈ ఆదిమ యుగంలో తెలుగు కళా శైలి వాస్తవికతను సంతరించుకుంది. సమకాలీనమైన గ్రీకు, రోము శిల్పాల స్నాయుపుష్టి, వాస్తవికతా–అమరావతి, నాగార్జునకొండ శిల్పాలలో కనిపించనిమాట నిజమే. అందుకు ప్రధాన కారణం వారెన్నుకున్న భూమిక లోపమే కాని, నైపుణ్యంలో లోపం కాదని ఇప్పటికీ, మిగిలివున్న శిల్ప ఖండాలను నిశితంగా పరిశీలిస్తే తేలుతుంది.

## మధ్యయుగం

బౌద్ధయుగంలో తలెత్తిన సాంకేతికత వల్లా, బౌద్ధ సంఘాల ద్వారా నాగరికతకు అలవడ్డ అనేక మంది ఆటవికుల వల్లా తెలుగు సమాజంలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. వ్యవసాయాన్ని ముమ్మరంగా పెంచితే తప్ప నాగరిక జనావళికి ఆహారాన్నందించడం సమస్యగా తయారైంది. ముమ్మరమైన వ్యవసాయానికి అనువుగా సంఘ వ్యవస్థను మార్చవలసి వచ్చింది. బౌద్ధ సంఘాలలో నిర్వ్యాపారులుగా వున్న లక్షలాది ప్రజలను ఉత్పత్తి రంగానికి మళ్ళిస్తే తప్ప సమాజం మనుగడకే ముప్పు వాటిల్లగల స్థితి ఏర్పడింది. ఈ కొత్త పరిస్థితిని ఎదుర్కొని నిలువగల శక్తి బౌద్ధానికి కొరవడింది. వ్యవసాయానికి ప్రత్యక్ష సాధనాలైన కర్రుగొర్రు సమకూర్చడానికి చాలినంత వృత్తి నైపుణ్యం అంతకుముందే వుంది. కాని పరోక్ష సాధనాలైన వానా.. వరపుల వైనాలు తెల్పడం, పొలాల "పొలి"ని (ఫెర్టిలిటీని) పెంచడం లాంటివి బౌద్ధానికి తెలియదు. అక్కడికీ సంఘంలో కలిసిన ఆటవికుల తాంత్రికతకు శాస్త్రీయ ప్రతిపత్తినిచ్చి వజ్రయానంలాంటి బౌద్ధ శాఖను నిర్మించినప్పటికీ ఫలితం కనిపించలేదు. పరోక్ష వ్యవసాయ సాధనాలు (ఇర్రేషనల్ ఇన్స్ట్రుమెంట్స్ ఆఫ్ లేబర్) గుత్తగొన్న బ్రాహ్మణులు రంగం మీదికి అవతరించారు. బౌద్ధ మతం పతనమై బ్రాహ్మణ మతాలు తలెత్తాయి. బస్తీలు సన్నగిల్లి పల్లెలు వెలిశాయి. బస్తీల్లోని వృత్తి పని వారంతా పల్లెలకు పంపిణీ అయిపోయారు. సరుకు లేకపోవడంతో సాగులు అంతరించాయి. వర్తకులు పల్లెలకు, స్త్రీలకు మధ్య ఆహారం పంపిణీదార్ల స్థాయికి దిగిపోయారు. వృత్తుల ద్వారా, వర్తకం ద్వారా మాత్రమే కోశం నింపుకునే రాజుల స్థానంలో పల్లెలపై ఆధిపత్యం వహించే ప్రాదేశిక రాజరికాలు తలెత్తాయి. అడవులు కొట్టించి, గ్రామాలను నెలకొల్పే రాజులకు ఆదరపు హెచ్చింది. "కాడు వెట్టు".. అంటే అడవులను నరికించి, జనపదాలను వెలయించిన రాజు అనే బిరుదు కోసం పోటా పోటీలు సాగాయి.

పట్నాలకు బదులు పల్లెలు ప్రధాన ఉత్పత్తి కేంద్రాలవడం వల్ల చేతి వృత్తులన్నీ వ్యవసాయానికి అనుబంధాలయ్యాయి. వ్యవసాయ పనిముట్ల తయారీకి మించిన నైపుణ్యానికి అవసరం లేకుండాపోయింది. అందుకని వృత్తి నైపుణ్యం దీన్ని పల్లె అవసరాలకే పరిమితం చేయడం వల్ల కూడా అంతరించకుండా వుండేందుకు దాన్ని అనువంశికం చేయవలసి వచ్చింది. దీనితో అనేక కులాలు, కులధర్మాలు అవతరించాయి. ఈ కుల వ్యవస్థా పాలకులుగా బ్రాహ్మణులు అధికారం స్వీకరించారు. అందుకని వారికి రాజ్య పాలకులు అన్ని పన్నులూ మినహాయించి మొదటి కంతు(వంతు) వారికి చెల్లించేటట్లు కట్టడి చేస్తూ గ్రామ భూములను కేటాయించారు. దీనికే "సర్వకర పరిహారాగ్రహారం" అని పేరు. ఇలాగ సమాజం పరిణామం చెందే దశలో పెంపొందే కళ ఒక్కటే. అది యుద్ధ కళ, లేక హింస. అందుకని ఈ కాలంలో చిత్రకళ ఎక్కడో కొన ఊపిరితో బతుకుతూ వుందని మాత్రమే చెప్పాలి.

పల్లె జీవితం స్థిరపడి, యుద్ధాలు వెనక పట్టిన తర్వాత పల్లెల నుంచి వచ్చే అదనపు ఉత్పత్తికి వినియోగమార్గం కావాలి. ఆది యుగంలాగ విదేశీ వర్తకం లేదు. అందుకని చేతి వృత్తులను పెంపొందించడానికి మదుపు పెట్టే ఆస్కారం లేదు. అలాంటి దశలో ఈ అదనపు ఉత్పత్తి కోటలూ, గుళ్ళ నిర్మాణం మీదికి మళ్ళింది. కాకతీయులు రాజ్యపాలనకు వచ్చే నాటికి గుళ్ళూ కోటలు కట్టడంలో మళ్ళీ శిల్పులు నైపుణ్యాన్ని సంతరించుకున్నారు. అయితే ఈలోగా తెలుగుదేశాన్ని చాళుక్యులు, చోడులు, గాంగులు ముక్కలుగా పంచుకుని ఏలారు. వారితోపాటు వచ్చిన వారి వారి శైలులు ఇక్కడి శైలితో కలిశాయి. అందుకని ఆది యుగంలో అవతరించిన శైలిలో కనిపించే సమైక్యత ఆ తర్వాత తెలుగు శైలిలో కనిపించక పోవడానికి ఇదే కారణం. కాని అమరావతిలో తెలుగు శిల్పులు, చిత్రకారులు సృజించిన శైలీ సంప్రదాయాలు పూర్తిగా పోలేదు. ఆది యుగంలోనే అజంతాకు వ్యాపించిన అమరావతి శైలి, వాకాటక, రాష్ట్ర కూట రాజుల ఆదరాభిమానాలతో స్థానిక వాస్త వికతలను సంతరించుకుని చాళుక్యుల ద్వారా తెలుగుదేశానికి వచ్చింది. అలాగే పల్లవుల ద్వారా దక్షిణాదికి పోయిన తెలుగు శైలి, స్థానిక వాతావరణానికి అనువుగా మారి చోడుల ద్వారా తెలుగుదేశానికి వచ్చింది. ఆది యుగంలోనే కళింగానికి విజయ యాత్ర చేసిన తెలుగు కళ మెట్టినింటి సొమ్ములు అలంకరించుకుని గాంగుల ద్వారా పుట్టినింటికి చేరింది. ఇలా త్రివేణిలా తిరిగి వచ్చిన తెలుగు కళ కాకతీయుల నాటికి ఒక ప్రత్యేక శైలిని సంతరించుకోగలిగింది. కాకతీయుల కాలపు శిల్పాలు మనకిప్పుడు పుష్కలంగా వున్నాయి. ఆనాటి చిత్ర శాలలను గురించి శ్రీనాథ మహాకవి చేసిన వర్ణనలు మాత్రమే ఉన్నాయి. చిత్రకారులు వాడే రంగులను గురించి కూడా శ్రీనాథుని గ్రంథాల వల్ల తెలుస్తుంది.

**తరిపి వెన్నెలలోని ధావళ్య మొక కొంత**
**నవ సుధాకర్దమద్రవము గాగ**
**చిన్నారి పొన్నారి చిరుత చీకటి చాయ**

**అసలు కొల్పిన మషీరసము గాగ**
**నిదుర మేల్కొంచిన నెత్తమ్మి మొగడల**
**తోరంపు పుప్పొళ్ళు అరిదళముగ**
**తొగరు వన్నియ లేక తొలిసంజె కెంజాయ**
**కమనీయ ధాతు రాగంబు కాగ...**
**రంగుల్ని కలిపి కొమరు ప్రాయంపు నూనూగు కొదమ ఎండ**

– అనే కుంచెతో సూర్యుడు ఈ జగత్తును తిరిగి చిత్రిస్తున్నాడని శ్రీనాథుడు వర్ణించాడు. ఇందులో సున్నం, మని, అరదళం, గౌరికం, ఇంగిలీకం, రంగులకు వాడేవారని ఈ పద్యం వల్ల తెలుస్తుంది. అలాగే "ఇంగిలీక మహిమ హేమింపనేరకరువులు రాని తెలిపినారు" అని వేమన్న కూడా అంటారు. చిత్త కాకతీయుల కాలపు సుస్థిరతవల్ల, అదనపు ఉత్పత్తి వల్లా గుళ్ళూ గోపురాల నిర్మాణం ముమ్మరంగా సాగింది. ప్రతి ఇంటి గోడనూ బొమ్మలతో అలంకరించుకొనడం పరిపాటి అయింది. అందుకని శిల్పులకూ, చిత్రకారులకూ ఒక్కసారి పని పెరిగిపోయింది. చిత్ర–శిల్పకళలు భారీ పరిశ్రమగా రూపొందవలసివచ్చింది. ఇలాంటప్పుడు చిత్ర శిల్ప కళల్లో కొత్త పని విభజన అవసరం అయింది. చిత్రాచార్యుడు, శిల్పాచార్యుడు అండక రేఖలు గీసే తక్కువ నైపుణ్యతగలవారు మిగతా పనిచేసుకుపోయే పద్ధతి వచ్చింది. ఈ చిత్ర, శిల్పాచార్యులు కూడా కొన్ని నిర్మాణాలకు అందుబాటులో వుండరు. అందుకని వారు లేకపోయినా పని జరుపుకొని పోవడానికి కావలసిన సుప్రమాణికత–అంటే కొలతల పద్ధతి రూపొందింది. దీనితో చిత్రాల్లో కాని, శిల్పాల్లో కాని వైవిధ్యం కనిపించదు. మూసపోసినట్లు అన్నీ ఒకే తీరులో తయారవుతాయి. కాకతీయు శిల్పాల్లో ఇదే కనిపిస్తుంది. ఆనాటి చిత్రాల్లోనూ ఇదే పద్ధతి ఏర్పడి వుండవచ్చును. కాకతీయుల కాలంలో సుప్రమాణి కత ద్వారా స్థిరపడిన పద్మం, హంస, ఆంధ్రదేశంలో ఏ గుమ్మంలో చూసినా కనిపిస్తాయి. చిత్రాలూ, శిల్పాలూ వాస్తవికత నుంచి దూరం అయి యాంత్రికతను సంతరించుకున్నాయి. ఆది యుగంలో శిల్పాలు ముమ్మరంగా చెక్కినప్పటికీ కనిపించని యాంత్రికత, కాకతీయుల కాలంలో కనిపించడానికి మరొక కారణం కూడా వుంది. ఆదియుగంలో ఎవరయినా నైపుణ్యం పెంచుకొనదానికి కావలసిన స్వేచ్ఛ సమాజంలో వుండేది. కాని కుల వ్యవస్థస్థిరపడిన తర్వాత గుళ్ళ నిర్మాణం ఎంత ముమ్మరంగా సాగినా శిల్పులు చిత్రాకారులు వారికి నియ ఁతమైన కులం పరిధి నుంచే రావాలి. కాని మరొక కులం వారు ఆ నైపుణ్యాన్ని పెంచుకొనడానికి వీల్లేదు. అది వరికే నైపుణ్యం వున్న ఇతర కులం వారెవరైనా ఉన్నప్పటికీ వారి నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి కూడా వీల్లేదు. ఇలాగ కులవ్యవస్థ తెలుగుదేశం కళలకు సంకెళ్ళు వేసింది. ఈ సంకెళ్ళు క్రమంగా బిగిసి మన కళలు జానపద స్థాయికి దిగజారిపోయాయి తర్వాతి కాలంలో, ఈ దిగజారుడు ఆ తర్వాతి కాలంలో స్పష్టంగా కనిపిస్తుంది. కాకతీయ శిల్పంలో వేలెడంత నల్ల శానపురాలలో సైతం కనుబొమలు కూడా స్పష్టంగా చెక్కిన తెలుగు శిల్పులు, విజయనగర కాలం నాటికి జానపద శైలికి ముక్కూ మొహం తీసుకువచ్చారు.

కాకతీయుల తర్వాత విజయనగరం అవతరించే వరకు తెలుగుదేశం అల్లకల్లోలంగా వుంది. ఏ వృత్తి వారికి ఆదరణ లేకపోవడం వల్ల, అనువంశికంగా మాత్రమే వచ్చే నైపుణ్యం అనుగంటింది. తిరిగి విజయనగరం నాటికి నైపుణ్యాన్ని సమీకరించవలసి వచ్చేసరికి హడావుడిగా నేర్చుకున్న విద్య రాణించలేదు. విగ్రహాలూ, ఇప్పటికీ మిగిలిన కొన్ని కుడ్య చిత్రాలు జానపద శైలిలో మాత్రమే కనిపిస్తాయి. రుణ్వాగత చిత్రరచన నాటి వారికి తెలియదనే చెప్పాలి. ఆదికాలపు ఈజిప్టు చిత్రాల్లాగ పార్శ్వాగత చిత్రాలను మాత్రమే చిత్రించగలిగే వారానాడు. అది కూడా రెండవ కన్ను సగం పత్తికాయలా ముందుకు పొడుచుకు రావడం, నిలిచే వారి భంగిమ మూస పోసినట్లు ఒకే తీరులో వుండడం ఆనాటి ప్రత్యేకత. దీన్నొక ప్రత్యేక శైలిగా, విశిష్ట శైలిగా కొందరు విమర్శకులు వర్ణించడం కద్దు. నిజమే, ప్రత్యేక శైలే. కాని నైపుణ్యం పెరగడం ద్వారా అలవర్చుకున్న ప్రత్యేకత అందుకు కారణం కాదు. శిథిల సంప్రదాయం మూలంగా అప్పటికప్పుడు అలవరుచుకున్న అర్ధనైపుణ్యం దానికి కారణం. తంజావూరు సంస్థానంలో ఇదే శైలి ఆ తరువాత వచ్చిన తంజావూరు కళలనూ, అదే కాలంలో బాగా వ్యాప్తికి వచ్చిన తోలు బొమ్మల కళల్లోనూ కనిపిస్తుంది. నిన్న మొన్నటి వరకూ ఇటు తెలంగాణా ప్రాంతపు "చిత్రకారుల" లోనూ అటు ఉత్తరాంధ్రలోని "ముచ్చె" పనివారిలోనూ సాంప్రదాయంగా ఈ జానపద శైలే వుండేది. ఇప్పు దదీ లేదు.

### ఆధునిక యుగం

గ్రామాలు పునాదిగా ఏర్పడిన ఫ్యూడల్ వ్యవస్థ అంతః కలహాలతో అనేక చిన్న చిన్న రాజ్యాలుగా అవతరించడంవల్ల సమాజంలో మరొక మార్పు వచ్చింది. ప్రతి రాజ్యానికీ ఒక పట్నం లాంటి రాజధాని అవతరించింది. ఆ రాజధాని పాలకులకు సౌకర్యాలు కల్పించడం కోసం అదనపు చేతి వృత్తుల వారు అవసరం అయ్యారు. తిరిగి చేతివృత్తులకు ఒక రకమైన ప్రోత్సాహం వచ్చింది. అయితే ఆనువంశికంగా మాత్రమే వృత్తులను చేపట్టినవారు, ఈ కొత్త పరిస్థితికి చాలినంతమంది లేరు. అందుకని ఇతరులు కూడా ఆయా వృత్తులను చేపట్టవలసిన అవసరం ఏర్పడింది. అలాంటి అవసరాన్ని తీర్చాలంటే అంతకు ముందు చేతివృత్తుల వారిని అణచివేస్తున్న "కులం" సంకెళ్ళను బద్దలు కొట్టవలసి వుంటుంది. అచ్చంగా అదే జరిగింది తెలుగుదేశంలో. కులాలను వ్యతిరేకించే అనేక ఉద్యమాలు తలెత్తాయి. అందులో వీరశైవం,

వీరవైష్ణవం లాంటివి ముఖ్యమైనవి. ఈ మతరూపంలో పైకి కన్పించే ఈ ఉద్యమాలకు నాయకత్వం వహించిన వారు కుమ్మరి, కమ్మరి, సాలె, అగసాలె లాంటి కులాలవారూ, ఆ ఉద్యమంపట్ల అభిమానం గల ఇతరులూను. వీరశైవ, వీరవైష్ణవ, తదితర భక్తితత్వ ఉద్యమాలను పరిశీలించి చూస్తే మనకీ విషయం స్పష్టం అవుతుంది. అయితే ఇలా తలెత్తిన ఉద్యమాలు ఫ్యూడర్ దొరలు ఆశించిన పరిధిలోనే ఆగిపోలేదు. అంతకన్న ముందుకు కూడా పోయాయి. తెలుగు దేశంలో తయారయిన జిలుగు బట్టలు యూరపు దేశాల అంగళ్ళను ఆక్రమించాయి. వస్త్రాలపై చిత్ర రచన (కలంకారీ) లో తెలుగువారు ప్రత్యేకతను సంపాదించుకున్నారు. ఒక్క బందరులోనే ఆ రోజుల్లో ఎనిమిది వేల వరకూ కలంకారీ చిత్రకారులున్నట్లు ఫ్రెంచి, ఇంగ్లీషు, డచ్చి, పోర్చుగీసు వర్తకుల రాతలవల్ల తెలుస్తూంది. విదేశాలలో మంచి గిరాకీ ఏర్పడ్డంవల్ల కలంకారీ చిత్రరచనలో సూక్ష్మమైన పని విరజన కూడా ఏర్పడింది. బట్టలను చలవ చేసేవారొకరు. దాన్ని కరక్కాయరసం పాలలో ఉడకబెట్టి మెత్తగా "ఉగ్గులు" తీర్చేవారొకరు. ఆ తర్వాత యూరపు, పర్షియా, మొగలు చిత్రాల "మస్తర్ల" ననుసరించి రేఖా రచన చేసేవారొకరు. వివిధ రంగులు పూయవలసిన "పదస్థలాల"లో పటికను రుద్దే వారింకొకరు. అక్కడ మస్తర్ల ననుసరించి కుంచెతో రంగులు పూసేవా రింకొకరు. ఇలాగ కలంకారీ పనికి సూక్ష్మ పని విభజన జరిగింది, యూరోపియన్ చిత్రాచార్యులు దిగమ చెందే రీతిలో బందరు చిత్రకారులు "మస్తర్లు" (నమూనా బొమ్మలు) తయారు చేసేవారని యూరోపియన్ వర్తకుల రాకలవల్ల తెలుస్తూంది. అయితే ఇలాగే కొద్దికాలం మాత్రమే వృద్ధి పొందిన చేతివృత్తులు తిరిగి అంధయుగంలో పడ్డాయి. యూరోపియన్ వర్తకం లాభ సాటిగా వుందని ఆశ పుట్టి పర్షియా చక్రవర్తి కలంకారీ చిత్రాలను తనకు గుత్తకిప్పించవలసిందని మొగలు చక్రవర్తులకు రాయ బారం పంపాడు. మొగలు చక్రవర్తులు గోల్కొండ నవాబులకు కబురు పంపారు.

**గోల్కొండ నవాబు బందరు కలంకారీలన్నీ తనకే అమ్మాలని ఫర్మానా జారీచేశాడు. లంచగొండులైన రాజ ప్రతినిధులు సరుకు వసూలు చేసేవారే కాని, 'నివరకు చెల్లించే వారు కాదు. పైగా నిర్బంధం, వెట్టి వగైరాలు పెరిగాయి. చేతి వృత్తులు తిరిగి సన్నగిల్లాయి. ఆ తర్వాత ఈస్టిండియా కంపెనీ వారు వాటిని పూర్తిగా నాశనం చేశారు. తెలుగు చిత్రకళకు తిరిగి గ్రహణం పట్టింది. కలంకారీలకు పట పట్ట, కుడ్య చిత్ర కారులకు పనిలేకపోవడంతో వారు ఇతర వృత్తులకు పోవలసి వచ్చింది. కొందరు అద్దాలమీద చిత్ర రచనను కొంతకాలం సాగించారు. కాని అదీ లాభసాటి కానందువల్ల మానివేయవలసి వచ్చింది.**

## జాతీయోద్యమం

ఆ తర్వాత జాతీయోద్యమ కాలంలో తిరిగి చిత్రకళకు పునరుజ్జీవన ప్రయత్నాలు జరిగాయి. బందరు జాతీయ కళాశాలకు ప్రమోద కుమార ఛటోపాధ్యాయ ప్రధాన చిత్ర కళాధ్యాపకుడుగా వచ్చారు. ఈయన తన గురువైన అవనీంద్రనాథ ఠాగోరుకో వివాదపడి, టిబెట్టులోని లాసాకు పోయి అక్కడ చిత్రకళాభ్యాసం చేశాడు. అక్కడున్నప్పుడు ఆయనకు అమరావతీ సంప్రదాయం సంగతీ, ఆంధ్రుల చిత్రకళ సంగతి తెలిసింది. అమరావతిలో ధాన్యకటక విశ్వవిద్యాలయం మహోన్నత స్థితిలో వున్నప్పుడు టిబెటీయ బౌద్ధ భిక్షువులు అక్కడి గ్రంథాలను అనువదించుకున్నారు. చిత్రకళను నేర్చుకున్నారు. చిత్ర శాస్త్ర గ్రంథాలను సంగ్రహించుకున్నారు. వాటిని లాసాకు కొనిపోయి, ధాన్య ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించు కున్నారు. దానికి వారు తమ భాషలో ధాన్యకటకం అనే పేరు పెట్టుకున్నారు. టిబెట్టు భాషలో "రూపాంగ్" అంటే ధాన్యాగారం అని అర్థం. లాసాలోని తూపాంగ్ విశ్వ విద్యాలయం నిన్న మొన్నటి వరకూ బౌద్ధ దర్శనాలకు, కళలకూ కాణాచిగా కటకం నమూనా మీద వుండేది. ప్రమోదకుమార్ ఛటోపాధ్యాయ తూపాంగ్లో అమరావతి చిత్రకళను అభ్యసించారు. తిరిగి తన నైపుణ్యాన్ని కృష్ణా తీరానికే కొనిపోవాలన్న ఆశయంతో బందరు జాతీయ కళాశాలకు చేరారు. అడివి బాపిరాజు, గుర్రం మల్లయ్య, తేజోమూర్తుల కేశవ రావు ప్రభృతులు ఆయన వద్ద చిత్రకళాభ్యాసంచేసి, తమ చిత్రాల ద్వారా, వ్యాసాల ద్వారా తెలుగు చిత్రకళా పునరుజ్జీవనానికి తోడ్పడ్డారు. ఈ పునరుజ్జీవనోద్యమం నుంచి కౌతా ఆనందమోహనశాస్త్రి, రామమోహనశాస్త్రి, దామెర్ల రామా రావు ప్రభృతులు అవతరించారు.


అనేక చిత్రకళా పునరుజ్జీవనోద్యమంలో భాగంగా కేంద్రాలు వెలిశాయి. చిత్రకళాధ్యాపకులు యువ చిత్రకారులకు తరిఫీదునిస్తూ వచ్చారు. అయితే జాతీయోద్యమ కాలపు పునరు జీవన, జాతీయతా భావాలనుంచి ప్రభావికులై పౌరాణిక, చారిత్రక చిత్రాలను రచించడం నేర్చుకున్న కళాకారులకు వాస్తవ పరిస్థితులు ఎదురయ్యాయి. సమాజంలో అలాంటి చిత్రాలను అభినందించేవారే కాని కొనేవారెవరూ కనిపించలేదు. తమ చిత్రకళ ద్వారా బతుకుతెరువు సాధించుకొనడం కష్టం అయింది. అందుకిని చిత్రకళ అన్నది ఒక వృత్తిగా మనగలిగే పరిస్థితి లేకుండా పోయింది. అదొక హాబీగా మాత్రమే మిగిలిపోయింది. జీవికకోసం కొందరు పేరే వృత్తులను అవలంబించారు. వృత్తి ధర్మంలో తీరికలేక, వారిలో క్రమంగా

**మిగతా 36వ పేజీలో**

# గిరీశం - శకారుడూ

## స్వీయ రచనలు

- రాంభట్ల కృష్ణమూర్తి



సాయంకాలమైనది. పూటకూళ్లమ్మకు సంతలో సామాను కొనిపెడతానని నెల రోజులకిందట ఇరవై రూపాయలు పట్టుకెళ్లి డాన్సింగర్లు కింద ఖర్చు పెట్టాను. ఈ వేళ ఉదయం పూటకూళ్లమ్మకీ నాకు యుద్ధమైపోయింది. బుర్ర బద్దలు కొడదామా అన్నంత కోపం వచ్చింది. కాని పూర్రిచ్చర్డు చెప్పినట్లు పేషెన్సు వుంటేగాని లోకంలో నెగ్గలేం - అంటూ భూమ్మీదికి అవతరించాడు గిరీశం.

వసంతసేనా నిలు నిలు ! ఎందుకు హడావుడిగా పారిపోతావు ? నిన్ను చంపనులే! అని భూమి బద్దలు చేసుకొని పైకి వస్తాడు శకారుడు.

భూపతనమైన దగ్గర నుంచీ గిరీశానికి పట్టుకున్నదొకటే గొడవ. ఈ పూటకు భిఛాణా ఎక్కడేయాలి అని.

భూమ్మీది కొచ్చిన దగ్గర నుంచీ శకారునిదొకటే చూపు. ఈ పనిని ఎలా సాధించాలి అని.

బతుకుతెరువు కోసం గిరీశానికున్న సాధనాలు : చురుకైన బుద్ధి, మంచి వాగ్ధాటి.

కార్యసాధన కోసం శకారునికున్న హంగు : రాజుగారి బావ మరిది పదవి.

**పుడితే రాజు గారి బావమరిదివై పుట్టు! కాకుంటే సాని దాని తమ్ముడివై పుట్టు! అని ఒరియాలో సామెత ఉంది. శకారుడికీ రెండూ కలిసి వచ్చాయి. డబ్బుకు కొరత లేదు. అధికారానికి అంతు లేదు. అందుకని అతనికి ఆలోచించవలసిన అవసరం ఎప్పుడో కాని కలగలేదు.**

**గిరీశానికలా కాదు. పూటకు టికాణా లేని బుక్కా ఫకీరతడు. అర్థ విహీనునికి అధికారం ఎక్కడిది? అభిమానం ఎక్కడిది? పూర్రిచ్చర్డు చెప్పినట్లు పేషెన్సును ఒంట పట్టించుకొనక తప్పదు. అందుకే ఆపద గడవడం కోసం సానిదాని మంచం కింద దూరాడు. అగ్నిహోత్రావధాన్లు ఇంట్లో అరవ చాకిరీ చేశాడు. గిరీశానికి పునాదే లేదు. కాని సూది మొన మీద బ్రహ్మాండాలల్లగల ఊహాశాలి! కనుక కలలు కనడం అతని వృత్తి. తన కలలను ఇతరులకు చూపించగలడు. వారిని కూడా ఆ కలల్లోకీడ్చి అందులో వేషం వేయించగలడు.**

స్వర్గానికి నిచ్చేన్లేసి బుచ్చెమ్మని ఒక్కొక్క మెట్టే ఎక్కించేశాడు. ఇల్లూ పెరడూ నౌకర్లూ చాకర్లూ పిల్లా జల్లా మాయలఫకీరు విభూది చల్లినట్లు మొలిపించాడు. "చెప్పడం మరిచిపోయాను. అప్పుడు మన వెంకటేశం మన దగ్గరే వుండి చదువుకొంటాడు" అంటాడు.

"అలా అయితే మరి నాన్నకే ఖర్చుండదు. నాన్నా అమ్మా వాడి చదువు కోసం దెబ్బలాడ్రు".

"నాకో చిన్న గుర్రబ్బండీ కావాలి"

"వేరే నీకు బండీయెందుకు? మా పిల్లల బండిలో నువ్వు కూడా వెళ్లుదువు గాని"

ఇదుగో ఈలాంటి కలల కవచాలను తొడుక్కొని జీవన సంగ్రామంలోకి దిగాడు గిరీశం.

శకారునికీ కలలూ గిలలూ జాన్తానై. నాలుగు నిలువుల లోతు నుంచీ నల్ల శానపు రాతితో కట్టిన పునాది అతనికుంది. బుర్ర బద్దలు కొడదామన్నంత కోపం రావాలే కాని, వస్తే పేషెన్సు తెచ్చుకోవల సిన అవసరం లేదు. అతని కాలు నడవాలనుకొంటే నడుస్తుంది. చెయ్యి కొట్టాలను కొంటే కొట్టేసే స్తుంది. అతను కన్ను మెచ్చిన దాన్ని కామిస్తాడు. పన్ను మెచ్చిన దాన్ని సేవిస్తాడు. ఆలోచనకన్నా ముందు అమలు జరిగిపోయే జీవితం. అలాంటప్పుడు అయిన దానికీ కాని దానికీ అనవసరంగా ఆలోచిస్తూ కూర్చోడం శుద్ధ మూఢత్వం. అంటే శకారుని పట్ల ఆలోచనకీ మూఢత్వానికీ అభేదాధ్యవసాయం కుదిరింది కాబట్టి మూఢత్వం అనే ముసుగుతో శకారుడు జనం మీద పడతాడు.

తడబాటు మాటల్లో తన మౌఢ్యాన్ని ప్రదర్శిస్తాడు. అతడి పాత్రకు జీవం ఇదే. నువ్వు రాక్షసివా దొంగవా ? దొంగవైతే ఎందుకు కరవ్వు. రాక్షసివైతే ఎందుకు రాచుకోవ్వు ? అని ప్రశ్నిస్తాడు. రాముణ్ణి చూసి భయపడ్డ ద్రౌపదిలా పారిపోతావెందుకే అని అడుగుతాడు. ఇంతకీ శకారునికి పురాణ కథ పరిజ్ఞానం లేదంటారా? అతను నిజంగా మూఢుడేనంటారా?

"ఆ బోజనం రాజుగోరు బోంచేసే యేల కాల్లు గుద్దే కాలిదాసు కిచ్చినట్టు అచ్చర నచ్చులనిచ్చే" అన్న పేరిగాడి కోవకు చెందిన వాడా శకారుడు ? కాదు. ఈలాంటి తడబాటు గిరీశానికి కూడా

వుంది. "ఖగపతి అమృతముతేగా భుగభుగమని పొంగి" ఇది బృహన్నారదీయం నాలుగో ఆశ్వాసంలో వుంది అంటాడు.

"కపిత్థాకారా భూగోళా" అని మనుధర్మ శాస్త్రంలో చెప్పినాడు. కపితం అంటే యేమిటి? "నారింజ పండు"

"వెరిగుడ్ ! అందుకు అమర నిఘంటువులో పద్యం నీకు వచ్చునా?" "రాదు చెప్పండి రాసుకొంటాను."

"యింతలు బదరీఫలములు యింతలు మారేడుపండ్లు యీడుకు జోడై..." అని అడ్డంగా నరికేస్తాడు గిరీశం?

అయితే మరి గిరీశం కపిత్థం అంటే అర్థం తెలియని జడుడా? అమర నిఘంటువులో ఏముందో ఎరగని మూఢుడా? కాదు.

కార్యసాధన కోసం శకారుడు చేపట్టిన చంద్రాయుధం తడబాటు, లక్ష్యసిద్ధి కోసం గిరీశం ఉపయోగించిన జోడుగుళ్ల రివాల్వరు ఈ దబాయింపు.

శకారుడివి తెలివి తక్కువ మాటల్లా కనిపిస్తాయి. గిరీశానివి దబాయింపు బదాయింపులా అనిపిస్తాయి. గిరీశం దబాయింపులాగే శకారుని తెలివి తక్కువతనం కూడా ప్రయోజనాపేక్షతో పట్టించుకొన్న లక్షణం.

అర్థమదం అధికార మదం గలవాడు శకారుడు. అలాంటి వాడు తినగా మిగిలిన కరకుట్ల కోసం అనగా మిగిలిన మైరేయం కోసం నలిపి పారేసిన నట్టువరాంధ్ర కోసం అతడి చుట్టూ మూగే ఆశ్రితులు అరవై వేల మంది!

**పల్లెత్తగలవాడు పరివారంలో వుండరాదు. ఎదురు చెప్పగల వాడు ఎక్కడా కానరాకూడదు. అదీ శకారుని అభిమతం. అతడు నందంటే నందీ. పందంటే పందీ. అదే బాబతే చుట్టూ వుండాలి. ఒరేయ్ ! ఆ మొండిగోడ మీంచి బండి తోలుకురారా! అంటే – అదేమిటి బాబూ! గిత్తలు సచ్చిపోవాయే. బండిరిగి పోదా, మీ గులాపోడు సచ్చిపోతాడే! అనకూడదు. అలా అంటే – ఒరేయ్! నేనెవణ్ణో తెలుసా? రాజుగారి బావమరిదిని గిత్తలు చస్తే కొత్త గిత్తలొస్తాయి. బండి విరిగితే కొత్త బండి వస్తుంది. నువ్వు చస్తే కొత్త నువ్వు వస్తావు!**

**అని కళ్లెర్ర చేయాలసిందే శకారుడు. బండి వచ్చిన తర్వాత "చూశావా మరి! గిత్తలు తెగలేదు తాళ్లు చావలేదు" అనాలిసిందే. గిత్తలు తెగడమేటి తాడు సావడమేటి బాబూ! నానెప్పుడూ సూడ్నేదే అని ఆ నౌఖరు వాడనకూడదు. బాబుగారు చెప్పారంటే అంతే. కాకులు పరిగెత్తాల్సిందే, నక్క లెగరాల్సిందే.**

**దీనికింక తిరుగులేదు.**

**ఈ తిరుగులేని అధికారం ఇప్పుడెన్నో చాయలో వుందో తేల్చి చెప్పే నికషోపలమే శకారుని మూఢత్వం.**

అలాగే గిరీశానికి కూడా అనుకొన్న చోటికి తీసుకెళ్లేజోడు గుఱ్రాలసార్టు లాంటిది దబాయింపు అనే ఆ జోడుగుళ్ల రివాల్వరు!

బుచ్చెమ్మ అమాయిక. ఆమె దగ్గర గిరీశం పాదరస్త్రాలేమీ పనికి రాలేదు. లవ్ సిగ్నల్స్ రామ రామా! ఏమీ తెలియవు. కనుక బుచ్చెమ్మ ముందర కొంత శృంగారం కొంత రీజనూ కలిపి సమయం వచ్చినప్పుడల్లా తన మనసు వెల్లబోయాలి. అందుకని క్రియేషన్ అనే పాఠంలోంచి కపిత్థాకార భూగోళం పైకి దిగి అక్కణ్ణుంచి అమర నిఘంటువు మీదుగా 'బంతులు తామర మొగ్గలు దంతీ కుంభముల బోలు తరుణీకుచముల్' ల వరకూ దౌడుతీశాడు. అక్కణ్ణించి విడోస్, బుచ్చెమ్మ ప్రశ్న, విడో మ్యారియేజ్, దమయంతి రెండో పెళ్లికి ధర నుండే రాజులెల్ల దడదడవచ్చిరీ అన్న శాస్త్ర నిదర్శనం అన్నీ వరసనే దడదడా వచ్చేశాయి. ఏ మాటనైనా తను తలుచుకున్న విషయంలోకి అలా అలా మళ్లించగల మాటకారి గిరీశం. అవకాశాన్ని ఆసాంతం వాడుకోగల పొలిటీషియన్ గిరీశం !

హాయిగా బతకాలంటే హైద్రాబాదు నవాబుగారి ముసాహెబ్ ఉద్యోగం లాంటివి తప్ప మరొకటి లాభం లేదని గిరీశం మతం. అలాంటి అధికారం రాలేదు కాబట్టే గిరీశం పొలిటీషియనుగానే వుండిపోయాడు. అందుకని అడుగడుక్కి ఒపీనియన్స్ చేంజి చేస్తూ వచ్చాడు. ఒపీనియన్ చేంజి అయినప్పుడల్లా ధోరణీ వైఖరీ మారడం సహజం కదా!

మరి శకారుడలా కాదు. హమేషా బాద్షా వారి హుజూరున వుండే అదృష్టం అతనికేనాడో అబ్బింది. అలాంటివాడి కింక పాలిటిక్స్ పనేమిటి ? ఒపీనియన్స్ చేంజి చేయవలసిన అవసరం యేమిటి? అందుకని అతని ధోరణిలోనూ వైఖరిలోనూ మార్పురాదు. రావలసిన అవసరమూ లేదు. కాగా అతను కూడా గిరీశంలాగే ప్రాప్తకాలజ్ఞుడు. సమయానుకూలంగా చక్రం తిప్పగల నేర్పరి. మంచి పొలిటీషియన్.

**అయితే అధికారం పని చేయనప్పుడు మాత్రమే పొలిటిక్సు వస్తాయి. పొలిటిక్సు చిక్కనైపేరుకుంటే అధికారం. అధికారం కరిగి పలచనైతే పొలిటిక్సు. ఇది చిదంబర రహస్యం.**

వసంతసేనని చంపడానికి విట చేటులిద్దరూ వెనక్కి తగ్గడంతో ఆ పని తానే చేతులార చేయవలసి వచ్చింది. కాని, హత్య చేస్తే అధికరణుల బోడదీ వుంటుందని తెలుసును. తానెంత రాజుగారి బావమరిది అయినా అధికరణస్థానంలో ఆ పప్పు ఉడకదని కూడా తెలుసును. ఇలా బుర్ర వేడెక్కే సరికి అధికారం ఆవిరై పోయి పొలిటిక్సుగా మారిపోయింది.

విటచేటులిద్దరినీ తస్సాకని పంపించేశాడు. వాళ్ల కన్ను కప్పి వసంతసేన పీక పిసికేశాడు. చచ్చిందని తోచగానే శవాన్ని దాచేసి చడీ చప్పుడూ లేకుండా ఇంటిదారి పట్టాడు.

ఆ తర్వాత అధికరణస్థానంలో అతడు చూపిన పాలిటిక్సు ఆత్రుత తన సహజ ధోరణి విడిచి పెట్టకుండానే కావలసినంత నయం కనపరిచాడు. తాను కింద కూర్చున్నాడు. ముద్దాయికి కుర్చీ వేస్తే పాయంట్ ఆఫ్ ఆర్డర్ తెచ్చాడు. కొసకు ముద్దాయి మీద నేరం రుజువయ్యే సమయం చూసి తాను కుర్చీ ఎక్కి ముద్దాయిని కిందికి దింపాడు.

చారుదత్తుణ్ని కొరత వేయడానికి కొంచుబోతూవుండగా చేటకుడు కట్టుత్రాళ్లు తెంచుకు వచ్చి అసలు దోషెవరో బైట పెట్టబోయినప్పుడు అన్న కొడుకు కొంప తీశాడే అనుకొంటాడు శకారుడు. వెంటనే పాదరసంలా బుఱ్ఱ పనిచేయడం మొదలు పెడుతుంది. పెద్ద పొలిటీషియన్ అయిపోతాడు.

చిటికలో వాడిమీద దొంగతనం మోపి ప్రజల్ని నమ్మిస్తాడు. చారుదత్తుని మీద ప్రజలకు గౌరవం వుంటుంది. ఆ భావాన్ని తొలగిస్తేనే కాని కొరత నెరవేరడం కష్టం. అందుకని హత్య చేసినట్లు చారుదత్తుని నోటనే పలికిస్తాడు.

ఇలా అవసరం వచ్చినప్పుడు అద్భుత సమయస్ఫూర్తి చూపడంలో గిరీశానికి సమవుజ్జీ శకారుడు.

పోతే గిరీశంలో కూడా శకారలక్షణం లేకపోలేదు. కించిత్తు అధికారం చెలాయించే అవకాశం వచ్చిందంటే చాలు గిరీశం ముమ్మూర్తులా శకారుడైపోతాడు.

"ఈ ఘోరమైన అబద్ధాలు నీతో యెవడు చెబుతున్నాడో కన్నుక్కోలేననుకొన్నారా యేమిటీ? సప్త సముద్రాలు దాటినా వాడి పిలకట్టుకొని పిస్తాల్తో వొళ్లు తూట్లు పడేటట్లు ఢాంఢామని కొట్టకపోతే నా పేరు గిరీశమే నినదభీషణ శంఖము దేవదత్తమే!" అని తన ఎంప్రెస్ మధురవాణి ముందు గిరీశం వేసిన చిందులూ – 'దుశ్శాసనుణ్ళాగ సిగపాయదీసి తందునా? ఎవడడ్డం వొస్తాడో' జమదగ్ని కొడుకు భీవుడడ్డం వస్తాడో కుంతి కొడుకు దశకంఠుడడ్డం వస్తాడో చూస్తాను!' అని వసంతసేన ముందు శకారుడు వేసిన రంకెలూ ఒక శాస్త్ర కట్టుకు చెందినవే.

కన్యాశుల్కంలో గిరీశం నాయకుడు. దీన్ని ఆలంకారికు అంగీకరించకపోవచ్చును. ఆలంకారికులు అగ్నిహోత్రావుధాన్లు లాంటివాళ్లు వైయాకరణులు లుబ్ధావుధానులు లాంటివాళ్లు, గిరీశం అన్నట్లు వాళ్లు లోకాతీతులు. బ్రహ్మ చెపితే వినరు."

సరే నాయకుడని చెప్పాక నాటకానికి అతడు ప్రాణం అని వేరే చెప్పనక్కర లేదు. గిరీశం లేకపోతే అటు వెంకటేశం గాలికి ఎగిరిపోతాడు. మధురవాణి ఇటు వానకు కొట్టుకుపోతుంది. గాలీ వాన వస్తే కథే లేదు.

నాటకం అంతా అయిన తర్వాత మనం కూడా 'డామిట్ కథ అడ్డం తిరిగింది?' అని గిరీశంతో నిష్క్రమిస్తాం. మిగతా వాళ్లంతా ఏ గంగలో దిగారో మనం పట్టించుకోం.

మృచ్ఛకటికలో శకారుడే నాయకుడంటే అంతా అగ్నిహోత్రావుధానులు అయిపోతారు. 'యీ గాడిదెకొడుకు యింగిలీషు చదువు కొంపముంచింది' అని సిగపాయ పుచ్చుకొంటారు. పోనీండి శకారుడు ప్రతినాయకుడు. ప్రతి నాయకుడు లేకపోతే నాయికా నాయకులకు కష్టాలుండవు కదా ? వాళ్లు కష్టాలు గడచి గట్టెక్కపోతే ఇంక నాటకమేం వుంది?

చారుదత్తుడెక్కడ? వసంతసేన ఎక్కడ? చారుదత్తుని కొరత వేయబోయే ముందు జన సంచలనం ఎక్కడ? అది లేకపోతే విప్లవ విజయానికి వీలెక్కడ?

అందుకని కన్యాశుల్కానికి గిరీశం ఎంతో మృచ్ఛకటికకు శకారుడంత, ఉభయులూ ఆ నాటకాలకి ప్రాణాలు.


నాటకం అయి ఇంటికి పోతున్నప్పుడు కన్యాశుల్కంలో గిరీశంలాగ మృచ్ఛకటికలో శకారుడు ఖడేరావని మనల్ని నిలేస్తాడు. అందుకని 'అమ్మయ్య బతికాను బాబూ!' అంటూన్న శకారుని వెంట మనకు వెళ్ళక తప్పదు.

ఇంకా బానిస ధర్మం పూర్తిగా చావని రాజస సమాజం వాడు శకారుడు. రాజస సమాజంలో వుంటూ రానున్న కౌబేర సమాజపు తొలిరేకలు సోకినవాడు గిరీశం. అయినా సమాజం ఇంకో రెండు దశలు దాటినా తమ అస్తిత్వానికి ఢోకా లేని శాశ్వతులు వీరిద్దరున్నూ. బతుకు పెద్ద ప్రశ్నోపనిషత్తుగా వున్నంత కాలం ప్రకృతికి భర్తన్నేనే అని ఆత్మ విశ్వాసం వున్నంతకాలం – అంధకారంలో సైతం ఆశను వెతకగలచూపు ఉన్నంతకాలం గిరీశం వుంటాడు. అలాగే పరమపదసోపాన పటంలాగ అధికార అంతరువులు వున్నంత కాలం శకారుడూ వుంటాడు. పింఛను తీసుకోడానికి తాత తాలూకాఫీసుకి వెళితే నువ్వు బతికున్నట్టు సర్టిఫికేటేదయ్యా అని గద్దించే రాష్ట్రీయ శ్యాలకులీనాడు మాత్రం లేరూ? అనుకొన్నట్లు హైద్రాబాదు నవాబు గారి దగ్గర ముసాహిబుద్యోగమే అయి హమేషా హుజూర్న వుండే అదృష్టమే పట్టి వుంటే అప్పుడు ఈ శకారునికి దీసిపోయే వాడా గిరీశం? మొదటి నుంచీ ఎక్కడ ఛిఫాణా వేయాలన్న సమస్యే వుంటే పూర్రిచ్చర్డుని తలచుకోకపోయే వాడా శకారుడు? ఎవరి పరిస్థితుల్ని బట్టి వారి శీలాలు ఏర్పడ్డాయి. ఒకరు పొలిటీషియనూ మరొకరు ఆ పొలిటీషియనుకు ధ్యేయమైన పవరు. అంతే తేడా. కాగా ఉభయులలోను అంచులొరసి ప్రవహిస్తున్న ప్రాణశక్తి ఒకటే. అందుకే ప్రాణాన్ని ప్రేమించే ప్రతి వారికీ వారి మీద అంత అభిమానం. ❑ (పరిశోధన సౌజన్యంతో)

# నవల - తాత్విక సంఘర్షణ

**స్వీయ రచనలు**

- రాంభట్ల కృష్ణమూర్తి



పద్య ప్రబంధాల జాతకం మనకు సరిగా తెలీదు. వచన ప్రబంధానికి మాత్రం చాలా ప్రసవ వేదనపడింది. రాజరికం ప్రౌఢ నిర్భర వయః ఉన్ననాడు కారుశిల్పి అయినా, కవితా శిల్పి అయినా తన యావత్కళా కౌశలాన్నీ రాజాంకితం అనేవాడు. స్త్రీ రత్నంతో సహా సకలరత్న రాసులయ్యేవి. ఏ కారణం వల్లనైనా రాజు మీద మోజు లేని వారు దైవాంతం దైవార్పణం చేసేవారు.

ఆ రోజుల్లో ఉదాత్త భౌతిక చేతన కళా సంపదకు కోట అగడ్తలూ దేవాలయ ప్రాకారాలూ చెలియలి కట్టలుగా వుండేవి. కోట కళలు రాజ పరివారానికి మాత్రమే ఆస్వాదనీయాలు. గుడి కళలు పండుగల్లో పట్నవాసులందరికీ అందుబాటులో ఉండేవి. జానపదులు నిత్యోపయోగశీలమైన కళలనూ, కవితలనూ, తమ నైపుణి మేరకు తామే సమకూర్చుకొనేవారు. వాటికి కర్తలూ భోక్తలూ కూడా వారే. ప్రాచీన రాజుల్ని వర్ణించినా పురాణ రాజ పురుషుల్ని చిత్రించినా రాజ కావ్యాల్లో కృతి భర్తల జీవితమే ప్రతిబింబించేది. రాజనీతి, రాజభక్తి, రాజశృంగారం, పౌరుషం, ఈవి, ఠీవి ఆ కావ్యాల్లో అందంగా చిత్రితమయ్యేది. జానపద కావ్యాల్లో కథ ఏదయినా జనపదుల నీతి, గాథలు, బాధలు, కలకల నవ్వులు, కన్నీటి సెలయేళ్ళు ప్రతిబింబించేవి.

రాజ కావ్యాలనూ, జానపద కావ్యాలనూ కూడా ఒకరు గానం చేస్తే వంద మంది విని ఆహా అని ఆనందించేవారు. కమ్మని కంఠం, గాన నైపుణ్యం గల వారికే అగ్రపీఠం వేసేవారు. ఆంధ్ర కవితా పితా మహ బిరుదాంకితుడైన అల్లసాని పెద్దన్నను మనం మహా కవుల కోవలో చేరుస్తాం. కాని ఆయనంతటి మహా గాయకుడు భారతదేశంలోనే మరొకడు లేడని బుడతకీచు సరదారులు రాసుకున్నట్లున్నారు. ప్రపంచ సంస్కృతి చరిత్రను రచించిన విల్ డ్యూరాంట్ ఆ విషయాన్నే రాశాడు.

అలాంటి ఆ రాజరిక వ్యవస్థ ప్రాయం ఇంకా గ్రైవాలక ముందే యుద్ధ తంత్ర, అర్థ తంత్ర అభివృద్ధి వల్ల తెలుగు సరస్వతి పరిపాకంలో నగరాలు పెరిగాయి. వర్తకులు, రాయసాలు, సైనిక సరదారుల్లాంటి చదువుకున్న నాగరికుల సంఖ్య బాగా పెరిగింది. వీరికి అటు రాజులు మెచ్చే బహుళాలంకార సౌందర్యం కాని, ఇటు జానపదులు మెచ్చే నిసర్గ సౌందర్యం కాని నచ్చలేదు. అలాగే వీరు మెచ్చే నీతి వేరు. వీరికున్న రాజకీయ దృష్టి వేరు. అలవాట్లు కూడా వేరు. అందువల్ల ఈ కొత్త చూపులకు ఆనగల కొత్త సాహిత్యం అవసరమైంది. రాజకావ్య జానపద కావ్యాల్లాంటి శ్రావ్య కావ్యాలు వీరికి అవసరం లేదు. ఎవరికి వారే చదువుకోగల పఠన కావ్యాలు వీరికి కావాలి. ఒక కావ్యాన్ని ఎవరయినా రచిస్తే దాని ప్రతికలు తీయగల కూలి రాయసాలు కూడా సమాజంలో బాగా పెరిగారు. అందువల్ల వినిమయ ప్రబంధాల అవతరణకు కావలసిన వాతావరణం ఏర్పడింది. ఈ కొత్త ప్రబంధాల్లో అటు రాజవృత్తమూ, ఇటు జానపద వృత్తమూ కాక మధ్యమ వర్గీయుల మనసులను అలరించగల వృత్తాలుండాలి. కృష్ణ రాయల కాలం నాటికే వినిమయ కాల్పనిక గద్య ప్రబంధాలు అవతరించి వుండాలి. లేకపోతే అల్లసాని పెద్దన **"కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము లాద్య సత్కథల్ వావిరి పుట్టు రత్నములు"** అని తారతమ్య ఎంచవలసిన పని వుండదు. పెద్దన కాలం నాటి కాల్పనిక కథలు రాజులకు రాజాశ్రితులకు నచ్చేవి కావు. అందువల్లే పెద్దన్న కల్పనా కథలను ఈసడించగలిగాడు. అయితే చక్కని జీవద్వచనంతో ఆ రోజుల్లోనే తయారయిన స్థానాపతి విశ్వనాథ నాయకుని రాయ వాచకం పెద్దన లాంటివారి ఈసడించిన కావ్యాల కోవకే చేరుతుంది. ఇది ఆద్య సత్కథ కాదు. కేవల కల్పనా కథ అంతకన్నా కాదు. అది సాక్షాత్తు శ్రీ కృష్ణదేవరాయల జీవిత కథ అందువల్ల దాన్ని ఏమనడానికి వీల్లేదు. బహుశా ఆ కారణం వల్లనే అది మనదాకా వచ్చి వుంటుంది. ఎందరు ఈసడించినా **"మెచ్చునంటావీవు నీవిక మెచ్చుకుంటే మించిపాయెను ? కొయ్య బొమ్మల మెచ్చు కండ్లకు కోమలుల సౌరెక్కునా ?"** అని వెక్కిరిస్తూ కాల్పనిక వచన ప్రబంధాలు పుడుతూనే వచ్చాయి. వాటికి ఆదరణ పెరుగుతూనే వచ్చింది. పురాణ కథ అయినా కాల్పనిక లక్షణాలు పుష్కలంగా వున్న జైమినీ భారతంలోని చంద్రహాస చరితాన్ని సముఖం వేంకట కృష్ణప్పనాయుడు వచన ప్రబంధంగా అనువదించాడు.

పెద్దన మాటను బట్టి చూస్తే కేవల కల్పనా కథలకూ ఆద్య సత్కథలకూ ఆ రోజుల్లో తీవ్ర వైరుధ్యం వుండేదని నిస్సంశయంగా చెప్పవచ్చును. ఉభయపక్షాల వారికీ ఘర్షణ కూడా సాగేదని ఊహించవచ్చును. యూరపులో కూడా ఇలాగే నగరాలూ నాగరికులూ పెరిగిన తరవాత ఆద్య సత్కథలకూ కేవల కల్పనా కథలకూ ఘర్షణ సాగింది. ఆ రోజుల్లో పుట్టిన

కేవలం కల్పనా కథలను వారు "రొమాన్స్" అని పిలిచేవారు. అది ఇప్పటి నవలకు తొలి పేరు. తరవాత అదే అర్థాన్నిచ్చే ఫిక్షన్ అన్నమాట ఇప్పుడు వాడకంలో వుంది. రష్యన్ భాషలో నేటికీ నవలను "రోమాం" అంటారు. కల్పన, ఆద్యసత్కథ అనే మాటలు తాత్విక పరిభాష కాదు. అందుకని ఆ రెండు ప్రక్రియలకూ జరిగిన ఘర్షణను తాత్విక ఘర్షణ అనడానికి కూడా వీల్లేదు. కాని ఒకటి అనాదరణకు పాల్పడడం, రెండవది అవతరించి ఆదరణను పుంజుకొనడం యాధృచ్ఛికంగా జరిగిన పరిణామం మాత్రం కాదు. ఈ అభివృద్ధి ద్వంద్వ భౌతిక వాదతత్వంలోని పరస్పర విరుద్ధాంశాల సంఘర్షణ న్యాయం ప్రకారమే జరిగింది. ఆద్య సత్కథా పద్య ప్రబంధాలకూ కేవల కాల్పనిక వచన ప్రబంధాలకూ రాసిలోనే కాక గుణంలో కూడా తేడా వుంది. అందువల్ల ఈ గౌణ పరిణామం "రాసి గుణ పరిణామ విపరిణామ న్యాయం" వల్లనే జరిగింది.

అందువల్ల తాత్విక ఘర్షణ ప్రత్యక్షంగా కాకపోయినా అంతర్లీనంగా నాటి నుంచి నేటి వరకూ సాగుతూనే వుంది. కావ్య లక్షణాలను గురించి ప్రయోజనాలను గురించి అలంకారికులు చాలా చర్చించారు. ఆ చర్చలు ఆనాటి పరిస్థితులకు అనువుగా వుండవచ్చు. కాని నేడు అవి యధాతథాంగా పనికిరావు.

**ఇప్పటి కావ్య విజ్ఞానాన్ని బట్టి కావ్యానికి మూడు ప్రయోజనాలున్నాయి. మూడు లక్షణాలున్నాయి. కావ్యం ముందు సౌందర్యం ద్వారా పఠితల హృదయాలకు హత్తుకోవాలి. లోక వృత్తాన్ని తెల్పిడి చేయాలి. నిర్దిష్ట సౌందర్య నైతిక రాజకీయ నిర్ణయాలు చేయగల శక్తిని ప్రసాదించాలి. ఇదీ కావ్య ప్రయోజనం. ఇందుకు సుందరత, వాస్తవికత, తాత్వికత అనే కావ్య గుణాలు ఉపకరిస్తాయి. ఆది ఆలంకారికులకు సౌందర్యం మాత్రమే తెలుసు. మిగతా రెండు గుణాల సంగతి ఊహా మాత్రంగానే తప్ప స్పష్టంగా తెలియదు. అందువల్ల రసాలంకారాది కావ్య లక్షణాలను ప్రతిపాదించిన వారు అవి కావ్య శరీరం అన్నారు.**

ఆ తర్వాత గుణ ధ్వని వాదులు కావ్యాత్మను ఊహించారు. మొత్తం మీద భారతీయాలంకారికులు ఈ రెండు మాటలనూ మనకు ప్రసాదించారు. ఆధునిక దార్శనికులు వీటికే ఫార్మ్ – కంటెంట్ అని పేరు పెట్టారు. వాటినే రూపం విషయం అని కూడా అంటారు. ఈ కొత్త అర్థంలో మనం కావ్య శరీర ఆత్మ పదాలనే వాడుకుందాం. శరీర ఆత్మలు సౌందర్య దర్శన అభివర్గాలు కనక వీటికి తత్వశాస్త్ర మౌలిక ప్రశ్న వర్తిస్తుంది. ఆ ప్రశ్నకు వచ్చే జవాబును బట్టి కవి తాత్విక దృష్టి ఏదో తెలుస్తుంది. కావ్య శరీర ఆత్మల్లో ఏది అగ్రిమం ? ఏది అనగ్రిమం ? ఏది నేయం ? ఏది అనుయాయి ? ఈ ప్రశ్నకు శరీరం అని జవాబిచ్చేవారు శరీరవాదులు ఫార్మలిస్టులు. ఆత్మ అని జవాబిచ్చేవారు కావ్యాత్మ వాదులు. విషయవాదులు ఒక్క రూపాన్నే కావ్యం అంటారు. కాని విషయవాదులు రూప విషయ సమన్వయం చేస్తారు. శరీరాత్మల సమన్వయం సాధిస్తారు. ప్రాచీనాంకాల కావ్య శరీరంగా పేర్కొన్న రసం, శబ్దార్థాలంకారాలు, చమత్కారాలు అన్నీ కావ్య శరీర లక్షణాలు. ఆధునిక పద్ధతుల్లో చెప్పుకోవాలంటే కవి అంటే మన శరీరంలో అస్థిపంజరం, ఎంచుకున్న ప్రక్రియకు అంతర నిర్మాణం కండరాలు, స్నాయువుల్లాంటి కావ్యాంతర నిర్మాణం, కథా ప్రణాళిక, ఆలంకారిక భాష. ఉక్తి వైచిత్రి పాటు, శిల్పం, ఇవన్నీ కావ్య శరీరం కిందికి వస్తాయి. కావ్యాత్మలో ప్రధానాంశాలు ఇతివృత్త భావాలు లోక వృత్తంలో కళాత్మకంగా దర్శించగల సకల విధ వాస్తవాలు, జీవిత వాస్తవంలోని వైరుధ్యాలు, ఆ వైరుధ్యాల సంఘర్షణ, ఇవన్నీ కావ్యాత్మకు చెందుతాయి. అంటే ఒక్క సుందరత తప్ప వాస్తవికత, తాత్వికతలు కావ్యాత్మ అంశాలు. ఈ మూడు గుణాల ద్వారా మూడు ప్రయోజనాలనూ చక్కగా సాధించగల సమగ్ర కావ్యం నవల. రాయల కాలంలో న్నూరేండ్ల కిందట తలెత్తిన మధ్యమ వర్గం ఇప్పుడు తామరతంపరగా విస్తరించింది. వారితోపాటే నవలా ప్రక్రియ కూడా పెంపొంది, దానితోపాటు ఆనాటి తాత్విక ఘర్షణ పదునెక్కింది – అందువల్ల ఇప్పటి తాత్విక సంఘర్షణ స్వరూపాన్ని తెలుసుకొనడానికి ముందు నేటి మధ్యమ వర్గ పరిస్థితిని గురించి తెలుసుకొనడం అవసరం. మధ్యతరగతి వారిలో వారి జీవన విధానాన్ని బట్టి సామాజిక సంస్కారాన్ని బటి మూడు రకాలవారు కనిపిస్తారు.

ఒకరు తమకన్నా పైనున్న వర్గాల వారి స్థాయిని చేరుకోవాల నుకుంటారు. ఆ వర్గ స్వర్గానికి ఎగరగలమన్న ఆశ కనిపించిన ప్పుడు ఆ స్వర్గానికి తీయని రూపకల్పన చేసుకుంటారు. అయితే ఇలాంటి అవకాశం అరుదుగా వస్తుంది. అయినా వారు కాల్ప నిక జగత్తును సృష్టించుకొనడానికి ఏ అభ్యంతరమూ ఉండదు. అలా కాక జీవిత వాస్తవికత ఈ కలలను కరిగించినప్పుడు ఆ వర్గం మీద కోపం పెంచుకుంటారు. కాని కింది వర్గం మీద వారికి సానుభూతి సద్భావాలుండవు. పైవర్గం మీద ఆశాలేశం చావదు. తమకు మారుగా కిందివర్గం పైవర్గం మీద తిరుగు బాటు చేయనందుకూ అందులో జాప్యం జరుగుతున్నందుకూ ఉగ్రులవుతారు. తమ అశక్తత నుంచి ఫ్రాయిడ్ మతానుసారం షండతాక్లేశం అనుభవిస్తారు. దాని నుంచి ప్రదర్శనభావం ఉద్భవిస్తుంది. అక్కడి నుంచి న్యూనతా ఆధిక్యతా క్లేశాలు అవతరిస్తాయి. వాటి నుంచి పరహింసారిరంస, ఆత్మహింసా

పిపాస అంకురిస్తాయి. వీటి నుంచే అనుభూతి వాదం, అస్తిత్వ వాదం, చైతన్య స్రవంతివాదంలాంటి అనేక వాదాలు పుడతాయి.

**కొసకి వీరు నిప్పులు చెరిగే విప్లవ భాషనూ అలంకారాలను వాడ్డానికి అలవాటుపడి కావ్య శరీరమే సర్వస్వం అనే తాత్వికతను ఆకళించుకుంటారు. వీరి శరీరం విప్లవం. ఆత్మ మాత్రం బూర్జువా. వీరి రచనల్లో సౌందర్యం శిల్పం. ఉక్తి వైచిత్రి కనిపిస్తుంది. కాని వాస్తవికత మృగ్యం. తాత్విక తక్షీణ తాత్వికత. తెలిసో తెలియకో వీరు ఉన్నతవర్గానికి సాహిత్యం ద్వారా ఊడిగం చేస్తారు. "మాటలు మండే లావా, మనసంతా జావ జావ. వీరికి మనిషికన్నా మాకు నయం. మచ్చ లేని మేకు నయం. కయ్యిమనే కుక్క, బక్క కొంకి నక్క నయం. దున్న నయం. మన్ను నయం. అంతేకాని నరజన్మము దుర్లభమురా" అన్న జానపద తాత్వికుల సూత్ర ఎరుక కూడా వీరికుండదు.**

రెండో వారు పైకి ఎక్కలేక కిందికి దిగలేక త్రిశంకు స్వర్గంలో వుంటారు. పైవారిని ద్వేషిస్తారు. దూషిస్తారు. కిందివారిని ఏవగించుకుంటారు. తమకన్నా వారి ఆర్థిక జీవనమే మెరుగని తెలిసి కుమిలిపోతారు. అయితే ఇలాంటి వారిలో కేవలం శరీర వాదులు తక్కువ. అందువల్ల కుటుంబ నవలలూ, కాలక్షేపం నవలలూ పుంఖానుపుంఖాలుగా తయారుచేస్తారు. నేటి నవలా రచయితల్లోనూ పాఠకులలోనూ వీరి సంఖ్యే బహుళం వీరు డిమాక్రేట్లు. తెలుసుకుందామన్న కాంక్ష వుంది. తాత్విక సంఘర్షణ వచ్చినప్పుడు శరీరవాదులను మెచ్చుకుంటారు కాని ఒప్పుకోరు.

మూడో వారు తమ బతుకు ఎప్పటికీ శ్రమ జీవులతోనే ముడి పడి వుందని గ్రహిస్తారు. వారిని అభిమానించి అర్థం చేసుకొనడానికి యత్నిస్తారు. కార్మికవర్గ వృత్తాన్ని తమ కావ్యాత్మగా స్వీకరించాలనుకుంటారు. తదనుగుణమైన కావ్య శరీర నిర్మాణం కోసం మథనపడతారు. అయితే ఈ విషయంలో అందరికీ అవగాహన సరిగా వుండదు. ద్వంద్వ భౌతికవాద తత్వాన్ని భౌతికవాద సౌందర్య మీమాంసని అధ్యయనం చేసి సకలలోక వృత్తాన్ని ఆకళించుకున్న కొద్దీ వీరి అవగాహన పదును తేరుతుంది. వీరు శరీరాత్మ సమన్వయవాదులు, అభ్యుదయ రచయితలు.

మొదటి రకం రూపవాదులు ఎంతటి అందె వేసిన శిల్పులైనా వారిని అభ్యుదయ రచయితలు తిరస్కరిస్తారు. నేటి తాత్విక సంగ్రామంలో అభ్యుదయ రచయితలకు వారే ప్రధాన ప్రత్యర్థులు. రెండో రకం వారు డిమాక్రేట్లు. వీరు మిత్రులు. వీరితో గల వైరుధ్యం మిత్ర వైరుధ్యం – ఈ దశాబ్దంలో తెలుగు నాట రూపవాదాలనేకం తల ఎత్తాయి. ఇవి కళ పేరుతో క్రమంగా కళా విధ్వంసానికి దారి తీస్తాయి. విప్లవం పేరుతో విప్లవ విద్రోహానికి తోవ వేస్తాయి. అదృష్టవశాత్తూ అభ్యుదయ రచయితల సంఘం. పునర్నిర్మాణం ఈ రూపవాదం మీద సాగించే సమరాగ్నిలోంచే ఉద్భవించింది. నిజమైన అభ్యుదయ నవల సామాజిక సాగర మథనంలోంచి ఉద్భవించిన జలధికన్య. తాత్విక సమరాగ్నికుండంలోంచి ఆవిర్భవించిన యాజ్ఞసేని. రూపవాదులు అనేక తత్వాల వారున్నారు. తత్వ సాంకర్యాల వారు కూడా ఉన్నారు. అందువల్ల అభ్యుదయ వాదులు కావ్య శరీర – కావ్యాత్మ అభివర్గాన్ని ఆకళించుకుని, శరీర వాద తత్వాల అట్టుముట్టు ఆనవాళ్ళు తెలుసుకొని వారితో నిరంతర అవిశ్రాంత తాత్విక సమరం సాగించవలసి వుంది. ❑

**– (అభ్యుదయ 1980-జనవరి, ఈ దశాబ్ది నవల విశేష సంచిక ఉన్నవ లక్ష్మీనారాయణ గారి శత వార్షిక సంవత్సరం సందర్భంగా అంకితం).**

# చిత్రకళలు

**(30వ పేజీ తరువాయి)**

కళానైపుణి అంత మరికొందరు పుస్తకాలకూ, పత్రికలకు కావలసిన బొమ్మలు వేసియిచ్చే వృత్తి చేపట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చిత్రకళకు వచ్చిన దశ ఇది. అయితే అంతకు ముందు నుంచీ కూడా హైదరాబాదు, మద్రాసుల్లో చిత్ర కళాశాలలున్నాయి. అవి ఏటా అనేకమంది చిత్రకారులను తయారుచేస్తూనే వున్నాయి. చిత్రకారులు రచించిన చిత్రాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే పెద్ద హొటళ్ళ వారూ, ప్రభుత్వమూ కొన్నింటిని కొని ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈ దశలో విరూప చిత్రకళ (ఆబ్‌స్ట్రాక్ట్‌ఆర్ట్) అవతరించింది. దీని ఫలితంగా చిత్రకళ మేడీజీ అయిపోయింది. దాన్తో చిత్ర అది విరూప చిత్రకళకారుల సంఖ్య కూడా పెరిగింది. అది విరూప చిత్రకళ అవడం వల్లా, దానికి రూప రచనతో నిమిత్తం లేకపోవడంవల్లా "ఇది తెలుగు కళ" అని చెప్పడానికి ఆస్కారం లేకుండా పోయింది. అందుకని ఇప్పుడు తెలుగు దేశంలోని ప్రసిద్ధ చిత్రకారులు గీస్తున్న చిత్రాలు ఏ దేశంవైనా కావచ్చును. ఎవరో హాస్యం చేసినట్లు ఇవి మనిషి గీసినవే కానక్కర లేదు. ఏపు చేత్తోనో గాడిన తోకతోనో వేసినవైనా కావచ్చును. ఒకనాడు ప్రపంచానికే వరవడి పెట్టిన తెలుగు చిత్రకళ ముక్కూ మొగం లేని కళగా ఇప్పుడు అవతరించింది. అందులో ఆశ్చర్యం లేదు. పెట్టుబడిదారీ విధానం కళలకూ, కవితకూ గర్భ శత్రువు అన్నాడు కారల్ మార్క్సు. మార్క్సు మహాసూక్తికి ఈనాడు మచ్చుతునకగా తయారయింది తెలుగు చిత్రకళ. ❑

# మార్క్సిస్టు సాహిత్య విమర్శ

## స్వీయ రచనలు



- రాంభట్ల కృష్ణమూర్తి

సాహిత్యం కళ. విమర్శ శాస్త్రం. కళ సామాన్యం నుంచి విశిష్టతను తయారుచేస్తుంది. శాస్త్రం విశేషాన్ని సామాన్యీకరించి సూత్రాలను, న్యాయాలను రూపొందిస్తుంది. జగత్తు కళ ద్వారానే మనిషిలో ప్రవేశిస్తుంది. మనిషి శాస్త్రం ద్వారానే జగత్తులోకి వెళతాడు. మనిషిలో ప్రవేశించిన కళా జగత్తు వ్యక్తి నిష్ఠం అవుతుంది. శాస్త్ర జగత్తు వస్తు నిష్ఠం. వ్యక్తి నిష్ఠ వస్తు నిష్ఠాలైన కళలకు, శాస్త్రాలకు పరస్పర సంఘర్షణ ఎప్పుడూ ఉంటుంది. ఈ సంఘర్షణల వల్లనే కళలూ కళలకు సంబంధించిన శాస్త్రాలూ నిరంతరాయంగా పెంపొందుతూ వస్తున్నాయి. కళలతోపాటే కళల లక్ష్య లక్షణ నిరూపణ కూడా పుట్టింది. కళ సౌందర్య కర్మ అని మార్క్సిస్టు మతం. కర్మ కుశలత పెరగడం కోసం కార్మికులందరి లాగానే సౌందర్య కార్మికులకు కూడా సౌందర్యశాస్త్ర విజ్ఞానం అవసరం. కొందరు పూర్వులు ఆత్మానుభవంతో ఈ తత్వాన్ని గ్రహించారు. "నవేత్తి శాస్త్రవిత్ కర్మ నశాస్త్ర మపి కర్మవిత్ యోవేత్తి ద్వయమప్యే తత్ సహిచిత్రకరో వరః అని భోజుడు చిత్రకారుల గురించి చెప్పాడు. అది సాహిత్యకారులకు కూడా అక్షరాలా వర్తిస్తుంది.

పూర్వ విమర్శకులకు లక్షణ శాస్త్రాల్లో చెప్పిన పంచ సిద్ధాంతాలు, వ్యాకరణ సూత్రాలతో ఒక నిర్దిష్ట ప్రణాళిక ఉంది. సాహిత్యం వ్యక్తి నిష్ఠం కనుక, ఆధునికులు మనస్తత్వంతో సహా అనేక రకాల వ్యక్తివాదాలతో విమర్శ ప్రణాళికలను నిర్మించుకున్నారు.

అలాగే మార్క్సిస్టు విమర్శకు కూడా ఒక ఆరు సూత్రాల ప్రణాళిక ఉంది. ఆ సూత్రాలివి : గతితార్కిక సూత్రం లేదా అభివృద్ధి సూత్రం : విశ్వతోముఖ సంబంధ సూత్రం : ప్రధాన సంబంధ సూత్రం : ఐతిహాసిక సూత్రం : పక్షపాత (పార్టిజాన్షిప్) సూత్రం: సిద్ధాంతాచరణ సమైక్యసూత్రం.

గతితార్కిక సూత్రంలో మూడు న్యాయాలు. 'రూపం విషయం', 'సామాజిక అస్తిత్వం, చైతన్యం', 'వృశ్యం సారం, ధృచ్ఛ. ప్రయోజనం లాంటి ద్వంద్వ అభివర్గాలు అన్నీ ఉంటాయి. ఈ సూత్రాలన్నీ ప్రకృతికి, సమాజానికి, చైతన్యానికి సమానంగానే వర్తిస్తాయి. మార్క్సిస్టు మతం ప్రకారం, సాహిత్యం సామాజిక చైతన్య రూపాలలో ఒకటి. కనక ఈ సూత్రాలను ఆ చైతన్య రూప విశ్లేషణకు అన్వయించుకోవలసి ఉంటుంది. ఈ ప్రణాళికను పూర్తిగా వివరించడానికి ఇది తావు కాదు. కనక సాహిత్య అంశాలను, ప్రయోజనాలను మాత్రమే స్థూలంగా వివరిస్తాను. జగదవగాహనకు జ్ఞానసిద్ధాంతం అని పేరు. ఇంగ్లీషులో దీనికి థియరీ ఆఫ్ నాలెడ్జ్. థియరీ ఆఫ్ కాగ్నిషన్, ఎపిస్టమాలజి అన్న పేర్లు ఉన్నాయి. లెనిన్‌కు ఈ పేర్లు ఏమీ నచ్చలేదు. ఆయన దీనికి "థియరీ ఆఫ్ రిఫ్లెక్షన్" అని పేరుపెట్టాడు. దాన్ని నేను "ప్రతిఫల సిద్ధాంతం" అని అనువదించుకుంటున్నాను. సామాజిక అస్తిత్వం మన చేతనలో ప్రతిఫలించగా అది మన భావాలతో కలిసి వైఖరీ రూపంలో వ్యక్తమవుతుంది. అలా వ్యక్తమయిన దానికి "ప్రతి రుచి" అని పేరు. సౌందర్యాన్ని ఒక విశిష్ట ప్రతిఫల సిద్ధాంతం అన్నాడు లెనిన్. అందువల్ల అన్ని జ్ఞాన సిద్ధాంతాల్లాగే దీనికి కూడా మూడు దశలున్నాయి. ఆ దశలకు తక్షణ, తార్కిక, ఆచరణ ప్రతిరుచులని పేరు. ఇందులో ఆచరణ అంటే స్వీయాచరణ, స్వానుభవం అని అర్థం కాదు. లెనిన్ మతం ప్రకారం ఆచరణలు మూడు రకాలు.

ఒకటి : సామాజిక చారిత్రక ఆచరణ.
రెండు: శాస్త్రీయాచరణ.
మూడు : స్వీయ ఆచరణ.
ఇందులో పూర్వపూర్వాలు ఉత్తమోత్తమాలు.

**దీన్ని బట్టి కవికి స్వానుభవంకన్నా శాస్త్రీయానుభవం, అంతకన్నా సామాజిక చారిత్రకానుభవం ఎక్కువగా ఉండాలని తెలుతుంది. మానవ జాతి సంచయించిన సకల సౌందర్యాన్ని ఆకళించుకుని తార్కికంగా విశ్లేషించుకుని సమకాల స్వానుభవంతో బేరీజు వేసుకున్నప్పుడే మనకు సాహిత్య, స్వరూప స్వభావాలు అర్థమవుతాయి. సాహిత్యం విశిష్ట సౌందర్య ప్రతిఫల సిద్ధాంతం కనుక దానికి సౌందర్యం జీవగర్ర. ఏ సాహిత్య కళా ప్రక్రియకయినా అదే నేయం. అగ్రిమం. ఇలా ప్రతిఫలించేది జగద్వాస్తవి కత అయినందున సాహిత్యానికి రెండో అంగం వాస్తవికత.**

సాహిత్యం జగన్నిష్ఠ వాస్తవానికి ఆత్మనిష్ఠ ప్రతిరుచి కనుక అందులో సాహిత్యకారుని అన్వీక్షకి ఉండి తీరుతుంది. ఇది

మూడో అంగం. సాహిత్యం సౌందర్య వాస్తవిక తాత్త్వికాల త్రివేణీ సంగమం అయితే అందులో సౌందర్యం గంగ అవుతుంది. వాస్తవికత యమున. తాత్త్వికత సరస్వతి. అదెప్పుడూ అంతర్వాహినిగానే ఉంటుంది. అలా ఉండాలి కూడా. కథ పైకి కనిపిస్తే అది పద్యగద్యాత్మకమైన తత్వశాస్త్రం అవుతుందేమో గాని, సుందరకావ్యం మాత్రం కాజాలదు. వస్తు బింబం మన కంటిలో తలకిందులుగా పడినట్లుగానే గద్వాసవిత కూడా తలకిందులుగా ప్రతిఫలించే అవకాశం ఉంది. అపసవ్యంగా పడిన బింబాల్ని సవ్యంగా తిప్పుకోగల తార్కికశక్తి మనిషికి పుట్టుకతోనే అబ్బింది. కాని, ఘటనలని, సంఘటనలని చిక్కురొక్కురుగా ఉన్న అనంత సంబంధాల్ని అంతర్లీనంగా ఉన్న సారాంశాల్ని సవ్యంగా తిప్పుకోగల శక్తి క్రమంగా మాత్రమే అబ్బింది. అది న అబ్బేవరకూ అపసవ్య ప్రతిరుచికి అనువైన తర్కాన్ని ధర్మాన్ని తత్వాన్ని మొత్తం అన్వీక్షకినే తలకిందులుగా తయారు చేసుకుంటాడు. మనిషి అలా తయారుచేసుకున్న తలకిందుల ప్రపంచ చైతన్యమే మతం అని వ్యాఖ్యానించాడు మార్క్స్. ఈ సమాజ వాస్తవికత తలకిందులుగా ఉన్నంత వరకూ ఆ తలకిందులు ప్రపంచ చైతన్యం ఉండి తీరుతుందని కూడా అన్నాడు. మన సాహిత్య రంగంలో కూడా ఈ తలకిందులు ప్రతి రుచి గోచరిస్తూనే ఉంటుంది.

సాహిత్యంలో సుందరత, వాస్తవికత, అన్వీక్షకి అనే మూడు అంగాలు ఆది నుంచీ ఉన్నాయి. కాని, అవి మూడూ ఉన్నాయన్న ఎరుక మాత్రం మనకిటీ వలనే కలిగింది. పూర్వులకు సౌందర్యం సంగతి ఒక్కటే తెలుసు. దాన్నే వాళ్లు బాగా పెంపొందించారు. సౌందర్య ప్రయోజనం రసానందం. సౌందర్యాంశం తప్ప మరో అంశం ఎరగని పూర్వులు కావ్య ప్రయోజనం ఆనందం అన్నారు. అది బ్రహ్మానంద సహోదరమన్నారు. వారలా అన్నందుకు తప్పు పట్టవలసిన అవసరం లేదు. రాజ్య కాంక్షతోనైతేనేమి, ధనదాహంతో అయితేనేమి మధ్య యుగాల్లో సాహసికులు ప్రపంచ పర్యటన చేశారు. అలా తిరిగేటప్పుడు వారికి కొత్త మనుషులు కనిపించారు. కొత్త భాషలు వినిపించాయి. అనేక గణదశలలో ఉన్న మానవుల ఆచారాలు, వ్యవహారాలు వేషభాషలు చూశారు. దీంతో చరిత్రకు ఒక కొత్త అర్థం వచ్చింది. కళ్ళ ముందు ఓ కొత్త జగత్తు వచ్చింది. ఈ గణాల ఆచార వ్యవహారాలు మన పూర్వ కావ్య వర్ణనలో కనిపించాయి. దీంతో కావ్యంలో సౌందర్యం ఒక్కటే కాదు, ఆనాటి వాస్తవికత కూడా ప్రతిఫలించింది అన్న ఎరుక కలిగింది. అప్పటి నుంచి వాస్తవికత కూడా కావ్యానికి కావాలనుకున్నారు. ఆ అనుకోవడంతో కావ్య ప్రయోజనం మారింది. కావ్యం వల్ల ఆనందం ఒక్కటే కాదు, జ్ఞానం కూడా కలుగుతుందని గుర్తించారు. వాస్తవికత ప్రయోజనం జ్ఞానం. దీన్ని కాళ్ళ మీద నిలబెట్టడం కోసం వర్గ సమాజాన్ని వర్గ రహిత సమాజంగా మార్చడం అన్నప్పటికీ అభ్యంతరం లేదు. తలకిందులుగా ఉన్న ఈ సమాజాన్ని తిరిగి తార్కాణాల కోసం ఎన్నో తాత్విక చర్చలు జరిగాయి. ఆ చర్చల సమర్థనకు చరిత్రలో నుంచి చూపించారు. పరిశోధనలు చేశారు. ఫలితంగా శ్రామికులే ఇతిహాసానికి సారధ్య శక్తులు అన్న నిర్ధారణకు వచ్చారు. శ్రామికులు తల్చుకుంటే తప్ప, తలుచుకుని కార్య రంగంలో దిగితే తప్ప ఉత్పత్తి సంబంధాలు మారబోవని, అవి మారితే తప్ప సామాజిక వాస్తవికత మారదని నిర్ధారించారు. ఆ నిర్ధారణకు క్రియా రూపం కల్పించాడు లెనిన్. అదే అక్టోబర్ విప్లవం. సోషలిస్టు సమాజ అవతరణ. అప్పుడు తెలిసింది కావ్యంలో సౌందర్య వాస్తవాలు మాత్రమే కాదు, కవి అన్వీక్షకి కూడా ఆది నుంచి అంతర్లీనంగా అంతర్వాహినిగా ఉంటూ వచ్చిందని. అన్వీక్షకి ప్రయోజనం వివేకం. ఇప్పుడు మనకు కావ్య త్రివేణీ సంగమ స్వరూపం తెలిసింది కనుక, కవికి పాక్షికత అనుల్లంఘనీయమని తటస్థత అసంభవమని నిర్ధారణ చేయగలుగుతున్నాం.

## సౌందర్యం

ఆది మానవుడు తనకు సుఖాన్ని, హితాన్ని, ఆనందాన్ని, శాంతిని కల్పించే ప్రతి వస్తువులోనూ సౌందర్యాన్ని చూశాడు. దీనికి అడ్డుపడిన ప్రతి దాన్ని అసుందరమని, వికారమని భావించాడు. ఆది కావ్యాల్లో సౌందర్యానికి, వికారానికి జరిగిన సంఘర్షణ మనకి స్పష్టంగా కనిపిస్తుంది. సౌందర్య దృష్టి ఆది కాలంలోనే బాగా పెంపొందింది. డబ్బు విలువ తెలియని రోజుల్లోనే ఆది మానవుడు అందం కోసం వెండి, బంగారాలను తవ్వి తీశాడంటాడు మార్క్స్. పుడమి తల్లి చీకటి కడుపులో చిక్కుకున్న కాంతి కిరణాలు వెండి, బంగారాలని ఆయన వర్ణించాడు. బంగారం వర్ణ పటలిలో ఆఖరిదైన అరుణిమను ప్రతిబింబిస్తుంది. వెండి మొత్తం వర్ణ పటలినంతటిని ప్రతిబింబిస్తుంది. కనక ఆది మానవుడు అరుణిమలో అందాన్ని చూడగలిగాడు. ఈ అరుణిమను ఇచ్చింది బంగారం. కనక వేదాలలో ఒకే మాట అందం, ఎరుపు, బంగారం అనే అర్థాలిస్తుంది.

హిరణ్యం, సూర్యునికి హిరణ్యశ్మశ్రుడు అని పేరు. అంటే అందమైన మీసాలని గాని, ఎర్రని మీసాలని గాని అర్థం చెప్పుకోవచ్చు. అగ్నికి హిరణ్య రేతస్కుడు అని పేరు. నిప్పు చేయడం కోసం వాళ్ళు వాడే కొయ్య ముక్కను అరణి అంటారు. దాన్ని "హిరణ్య యీ ఆరణీ" అని ప్రస్తుతించారు. అంటే అక్కడ బంగారంతో చేసిన ఆరణి అని అర్థం చెప్పుకుంటే ఎంత అపహాస్యంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. తెలుగులో కూడా "చెన్ను" అంటే ఎరుపని, అందమని రెండర్థాలు ఉన్నాయి. రష్యన్ భాషలో కూడా 'క్రాస్నా' అన్న మాటకు ఈ రెండర్థాలూ

ఉన్నాయి. అదే సౌందర్యాంశము మాత్రమే ఎరిగిన పూర్వులకు ఆనందం ఒక్కటే తెలుసు. ఆనందాన్ని వ్యక్తం చేసే పద్ధతిహాసం. ఈ హాసానికి ఒక అంచున శృంగారం, మరొక అంచున కరుణ ఉన్నాయి. కనుకనే మన కావ్యాల్లో భ్రష్ట శృంగారాన్ని హాస్యంగా పరిగణించారు. క్షేమేంద్రుని ఉపహాస కావ్యాలు, లంబోదర ప్రహసనం, భగవదజ్జుకం, మత్త విలాసం లాంటి ప్రహసనాలు బూతుల బంగలా వుంటాయి. కరుణ విపాకమైన హాస్యం చాలా అందమైనది. దాన్ని ఇటీవల కాలంలో చార్లీ చాప్లిన్ మాత్రమే సృష్టించగలిగారు. ఆదిలో శృంగార, హాస్య, కరుణ రసాలుండేవి. తరువాత అవి భరతుని కాలం నాటికి ఎనిమిదయ్యాయి. భోజుని కాలం నాటికి పన్నెండయ్యాయి. ఇప్పుడు బహుశా పాతిక వరకూ ఉండవచ్చు. మన దేశంలో సుమారు అయిదు వందల అలంకార శాస్త్రాలు పుట్టాయి. అన్నిటిలో కూడా సౌందర్యమే ప్రధానాంగంగా ఉంటూ వచ్చింది. ఈ సౌందర్యాన్ని కొందరు ప్రాచ్యులు, పాశ్చాత్యులు కూడా దివ్య సౌందర్యంగా వర్ణించారు. లౌకిక సౌందర్యం తుచ్ఛమని, హేయమని కూడా చెప్పారు.

**వాస్తవికత :**

పూర్వాలంకారికులు వాస్తవికతను ఊహించగలిగారు. కాని, నిరూపించలేక పోయారు. క్షేమేంద్రుడు తన ఔచిత్య విచార చర్చలో వాస్తవికతనే ఔచిత్యంగా పేర్కొన్నాడు. వాస్తవికత అను మాట వాడలేదు గాని సాదృశ్యం అన్న మాటను ఆయన ప్రయోగించాడు. అదంతటితోనే ఆగిపోయింది. ఇప్పుడు మనకున్న విజ్ఞానాన్ని బట్టి వాస్తవికతను ఏడు రకాలుగా విభజించుకోవచ్చు.

**ఒకటి :** ఆదిమ వాస్తవికత. ఆదిమానవులు కనిపించిన ప్రతిదానిలోనూ తమనే చూసుకోగలిగారు. తమ గుణగణాలను వాటికి ఆరోపించారు. దీన్నే ఇంగ్లీషులో "యాంత్రోపో మార్ఫిజం" అంటారు. దీన్ని ఆదిమానవుడు కనిపెట్టాడు. ఆదిమానవుని వాస్తవికతను తెలుసుకోవాలంటే ఈ "పురుష భావారోపణ"ను అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఆదిమానవుడు కనిపెట్టిన పురుష భావారోపణ పద్ధతి నేటికి కూడా కవులకు ఆలంబనగానే ఉంటోంది. పురుష భావారోపణను అర్థం చేసుకున్నప్పుడే వేదాలు వర్ణించిన విరాడ్రూపమ్ మన కవగత మవుతుంది. ఆనాటి గణ సమాజాన్ని అంతటినీ వారు ఒకే పురుషునిగా ఊహించి గణ లక్షణాలన్నిటినీ ఆ పురుషునికి ఆరోపించారు. దీంతో పాటు వారు మరొకరకమైన వాస్తవికతను కూడా సృష్టించుకోవలసి వచ్చింది. అది "భ్రాంతి వాస్తవికత". భయంకరమైన ప్రకృతి శక్తుల ముందు నిస్సహాయుడైన ఆది మానవుడు కవితతోను, గానంతోనో, నాట్యంతోనో ఆ శక్తులను తాను లొంగదీసుకున్నాననే భ్రాంతిని కల్పించుకునే వాడు. అలాంటి భ్రాంతే అతడిని ఆశా జీవిని చేసింది. లేకపోతే ప్రకృతి శక్తులతో అతడు పోరాడగలిగి ఉండేవాడు కాడు. ఈ ఆదిమ భ్రాంతి వాస్తవికత కూడా నేటికీ మనకు కనిపిస్తూనే ఉంటుంది.

**రెండోది :** పురాణ వాస్తవికత. పురాణాలు వర్గ సమాజంలో పుట్టాయి. వాటి సమాజ అవసరాల కనుగుణంగా సాహిత్య పాత్రల నిర్మాణం మొదలయింది. ఆదిమానవుడు పురుష భావారోపణాన్ని కనిపెడితే పౌరాణిక కవులు "అచ్చులు" అంటే టైప్స్ తయారు చేయడం నేర్చుకున్నారు. కాని, ఈ పాత్రకు రెండే తలాలు ఉన్నాయి. అయితే అమావాస్య, లేకపోతే పున్నమి. అంతేకాని ఈ మధ్య వెలుగు చీకట్లలో భేదాలుంటాయన్న సంగతి వారికి తెలియదు.

**నాయకుల్ని, ప్రతినాయకుల్ని సృష్టించి స్థిర సమాజానికి, సంచార గణాలకీ వచ్చే పోరాటాన్ని గణదేవతల యుద్ధంగా ప్రతిఫలించాయి పురాణాలు. ఈ వాస్తవికత కాస్త పెంపొంది ప్రాబంధిక వాస్తవికతగా మారింది. ప్రబంధ వాస్తవికతలో పురాణ పురుషులు నాటి సమాజ నాయకులుగా మారిపోయారు. ఛోటా రాజుల దగ్గర నుంచి చక్రవర్తుల వరకూ ప్రబంధ నాయకుల్లో మనకి కనిపిస్తారు. ఆ నాయకుడు రాముడే కావచ్చు, కృష్ణుడే కావచ్చు మరెవరైనా కావచ్చు. వాళ్ళల్లో కనిపించేది ఆనాటి పాలకులు మాత్రమే.**

అయితే ఈ వాస్తవికతలో మూడో తల కూడా చేరింది. వీళ్ళు నిర్మించిన అచ్చులకు కాస్త కండ పుట్టింది. ఆ తర్వాత వచ్చిన వాస్తవికతలు మన దేశంలో సహజంగా పుట్టినవి కావు. యూరప్ దేశాల సంపర్కం వల్ల మనం వాటిని దిగుమతి చేసుకున్నాం. ఫ్యూడల్ సమాజానికి భరతవాక్యంగా పారిపణ్య సమాజానికి నాందీవాచకంగా సంధ్యా సమయంలో పుట్టింది కాల్పనికత. ఈ కాల్పనికతలో రెండు శాఖలున్నాయి. ఒకటి ఉదాసీనం, రెండు క్రియాశీలం.

అంతరిస్తున్న ఫ్యూడల్ సమాజాన్ని చూసి కాకి శోకం పెట్టేవారు తలెత్తుతున్న పారిపణ్య సమాజాన్ని చూసి గగ్గోలు పడేవారు ఉదాసీన కాల్పనిక వాదులయ్యారు. వారి గ్రంథాల్లో ఈ వాస్తవికత స్పష్టంగా కనిపిస్తుంది. మన సాహిత్యంలో విశ్వనాథ వారి రచనలు ఇందుకు ఉదాహరణలు. వ్యక్తి స్వేచ్ఛ పేరనయితేనేమి, మరొక పేరేదైతేనేమి పారిపణ్య సమాజానికి హారతులు పట్టేవారు క్రియాశీలక కాల్పనిక వాదులు. ఈ రకం కాల్పనికత మనకు భావ కవితోద్యమలో కనిపిస్తుంది. కాల్పనిక వాస్తవికతలో జగద్వాస్తవికత కన్నా ఊహా కల్పన ఎక్కువగా వుంటుంది. అది పారిపణ్య సమాజానికే కాక ఆ తర్వాత రానున్న

సమాజానిక్కూడా హారతి పట్టినప్పటికి అందులో ఊహాకల్పనే ఎక్కువగా కనిపిస్తుంది. శ్రీ శ్రీ కవిత అందుకు ఉదాహరణ. కాల్పనిక వాస్తవికత లాగానే సవిమర్శక వాస్తవికత కూడా మనకు విదేశీ సంపర్కం వల్లనే కలిగింది. పారిపణ్య సమాజం వికసించిన దశలో ఈ వాస్తవికత పుట్టింది. స్వాతంత్ర్యం, సౌభ్రాత్రం, సమానత్వం అన్న నినాదాలతో ఏర్పడిన ఈ సమాజం అధికారంలోకి రాగానే మూడింటిని అణిచిపారేసింది. ఈ సంగతి గ్రహించగలిగిన ద్రష్టలు కొత్త సమాజాన్ని విమర్శనా దృష్టితో చూసి రచనలు చేశారు.

**మన సాహిత్యంలో సవిమర్శక వాస్తవికతకు ఏకైక ఉదాహరణ గురజాడ అప్పారావు రచనలు మాత్రమే. ఆయన కన్యాశుల్కం రాసి ఎనభై అయిదేళ్ళయినా అందులో ప్రతి ముక్క ఈనాటికీ నిజంగా కనిపిస్తుంది. "పల్లెటూరి పీపిల్ లెక్చర్లకి అన్ఫిట్. మొన్న మనం వచ్చిన బండి వానికి నాషనల్ కాంగ్రెస్ విషయమై రెండు గంటలు లెక్చరు యిచ్చేసరికి ఆ గాడిద కొడుకు వాళ్ళ వూరు హెడ్ కానిస్టేబిల్ని కాంగ్రెసు వారు యెప్పుడు బదిలీ చేస్తారని అడిగాడు. విలేజస్లో లెక్చర్లు యంతమాత్రం కార్యం లేదు" అన్న గిరీశం మాట ఎంత నిజం!**

అలాగే "నేషనల్ కాంగ్రెస్ అనగా దివాన్గీ చలాయించడం" అని బుచ్చెమ్మకు వెంకటేశం చేత చెప్పించిన మాట ఎంత సత్యం! గురజాడ తర్వాత నా దృష్టిలో ఇంతవరకూ సవిమర్శక వాస్తవికత మన సాహిత్యంలో వెలువడలేదు. పురుష భావారోపణ నుంచి అన్యాపదేశం నుంచి ఇంత వరకూ పుట్టిన వాస్తవిక రూపాలన్నీ జానపద వాస్తవికతలా కనిపిస్తాయి. పురాణాలు ఒక జాతి కలలైతే జానపద కథలు బడుగు మనుషుల కలలు – అని ఒక ప్రముఖ విమర్శకుడు అన్నాడు. జానపద కథల్లో అన్యాపదేశ వాస్తవికత అంటే "ఎలిగారీ" మనకు కనిపిస్తుంది.

**హింసకుల్నీ, పీడకుల్నీ ఎదిరించలేని అశక్తుడు ఆది మానవుడిలాగే భ్రాంతి వాస్తవికతని సృష్టించు కుంటాడు. ఆ భ్రాంతి వాస్తవికతకు మరో రూపమే అన్యాపదేశ వాస్తవికత. ఇంత వరకూ పుట్టిన అందాలన్నిటినీ ఆకళించుకుని అన్ని రకాల వాస్తవికతల సారాన్ని సంగ్రహించి అందులో అవసరము, స్థిరము, సారవంతము, పునరావృతము అయ్యే లక్షణాలను సంతరించుకుని సాగించే రచన సోషలిస్టు వాస్తవికత. ఈ వాస్తవికతకు ఇంతవరకూ గోర్కీ రాసిన "అమ్మ" నవలనే ఉదాహరణగా చూపుతున్నారు.**

నా దృష్టిలో తెలుగువారు ఇంతవరకూ సవిమర్శక వాస్తవికతనే అందుకోలేకపోతున్నారు. గురజాడ మోకాలుని తాకగల రచయితలు కూడా కనిపించడం లేదు. అలాంటప్పుడు సోషలిస్టు వాస్తవికతా నిర్మాణం ఎంత దూరముందో ఊహించవచ్చు. సాహిత్యానికి మూడో అంగం అన్వీక్షకి. ఈ అన్వీక్షకికి ఒక్కొక్క దశలో ఒక్కొక్క సామాజిక చైతన్య రూపం నేయంగా, అగ్రిమంగా వుంటూ వస్తుంది. ఆది మానవుడికి వేయమైన రూపం "ఋతం" అంటే ఎథిక్స్. అతడు ఎలాంటి సాహిత్యాన్ని రచించినా దానికి లోబడే వుంటుంది. పౌరాణిక యుగంలో నేయరూపం మతం. అందువల్ల సాహిత్యమంతా మతానికి లోబడే వుంటుంది. ఈ మతం ప్రబంధ వాస్తవికతా కాలం వరకూ రాజ్యం చేస్తూనే వచ్చింది. భారతదేశంలో మతానికి గుండెకాయ కులం. ప్రబంధ యుగంలో వర్ణాశ్రమ ధర్మాల పేరుతో కొన్ని కావ్యాలు కులాన్ని సమర్థిస్తే భక్త కవులు మతం పేరుతోనే కులాన్ని నిరసిస్తూ వచ్చారు. ఈనాటి సాహిత్యంలో మనకి ఈ తాత్త్విక సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. కాల్పనిక వాస్తవికత సంధియుగం నాటిది కనుక కొంత మత ప్రాబల్యం దాని మీద వుంటుంది. పారిపణ్య సమాజానికి నేయమైన సామాజిక చైతన్య రూపం రాజకీయాలు. ఈ రాజకీయాలు కూడా కొద్ది కొద్దిగా కాల్పనిక సాహిత్యంలో కనిపిస్తాయి. సవిమర్శక సాహిత్యం మాత్రం ఆ రాజకీయాల్ని అన్ని ముఖాల నుంచి విమర్శక దృష్టితో చూస్తుంది. సోషలిస్టు సమాజంలో నేయాత్మకమైన సామాజిక చైతన్య రూపం అన్వీక్షకి అంటే అయిడియాలజీ. సోషలిస్టు అన్వీక్షకిని ఆమూలాగ్రంగా ఆకళించుకోలేనివారు సోషలిస్టు వాస్తవికతనే కాదు ఈనాటి దశలో సవిమర్శక వాస్తవికతని కూడా సృష్టించలేరు. గురజాడ అప్పారావుగారి నాటికి సోషలిస్టు సమాజం అవతరించలేదు. కాని ఇప్పుడు సోషలిజానికి షష్ఠిపూర్తి అయింది. అనేక దేశాలు సోషలిజాన్ని నెలకొల్పుకుంటున్నాయి.


ఈ దశలో సవిమర్శక వాస్తవికతను రచించాలన్న అభ్యుదయ కవికి సోషలిస్టు అన్వీక్షకి తప్పదు. సుందరత, వాస్తవికత, అన్వీక్షకత అనే త్రివేణి సంగమం సాహిత్యం. ఇందులో అన్వీక్షకి అంతర్లీనంగా వున్నప్పుడే ఏ సాహిత్య ప్రక్రియ అయినా రాణిస్తుంది. సౌందర్యం ముందు జన హృదయాన్ని ఆకర్షిస్తుంది. ఆనందాన్నిస్తుంది. వాస్తవికత వారికి విజ్ఞానాన్ని ఇస్తుంది. అన్వీక్షకి పాఠకులను నిర్దిష్ట సౌందర్య, నైతిక, రాజకీయ నిర్ధారణలు చేయగలగడానికి తోడ్పడుతుంది. వివేకాన్ని కలిగిస్తుంది. ❑

**(అభ్యుదయ, విమర్శ విశేష సంచిక- 1987)**

# కమ్యూనిస్టు ఇంటర్నేషనల్

అంతర్జాతీయంగా ఆ పాట బాణికి అనుగుణమైన తెలుగు అనువాదం

- రాంభట్ల కృష్ణమూర్తి



లేవండి వంచితులార
పురిటాకలి వరకము నుంచి
ఘోషించె మోచన లావా
గగనాలన్ ముంచెత్తించి

శోకాల సమయము తీరె
పడిపోవును దాస హవేలీ!
శాసించి చూపెదమోయీ
ఇకమీదట ధారుణినేలి

భూలోక నాకములందు
కరుణించెడు దేవరలేడు!
మన భావి భారం మనది
జనముక్తికి సాగుడు నేడు!

రోషాతిశయమున పొంగి
పదవోయిది అంతిమ సమరం
ఇంటర్నేషనేల్, ఇంటర్నేషనేల్,
నరజాతి సమైక్య వరం

చట్టాలు రాజరికాలు
అవి వంచన మకర ముఖాలు,
సుంకాల గానుగలోన
కడబారెను మా ప్రాణాలు!

ఈ లోక సిరులను దోచి
మకుటాలను దాల్చినవారు,
మన స్వేద రుధిరము మీద
మనుటే కద వారల తీరు!

కష్టించి కార్మికులెల్ల
సమకూర్చిన భూరి ధనాలు,
మింగేటి దొంగల బట్టి
తెరిపింతము వారి కోఠీలు

రోషాతిశయమున పొంగి
పదవోయిది అంతిమ సమరం
ఇంటర్నేషనేల్, ఇంటర్నేషనేల్,
నరజాతి సమైక్య వరం

రండోయి సైనికులార
సరదారుల పొగరణగించ
రారండి చేతులు సాచి
పరపీడా గర్వం దించ

కార్ఖాన గనులు పొలాలు
కలిపించిన బంగరు రాసి
రాబందువోలె హరించు
నరహంతల కూలగనేసి


కష్టించు జీవులమోయి
సకలావని మనకరిగాపు
ఏవేళ కూకని పొద్దు
వినువీధిని పూచును రేపు!

రోషాతిశయమున పొంగి
పదవోయిది అంతిమ సమరం
ఇంటర్నేషనేల్, ఇంటర్నేషనేల్,
నరజాతి సమైక్య వరం! ❑

# లాల్ సలాం!

## స్వీయ రచనలు

- రాంభట్ల కృష్ణమూర్తి



మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!

దరిలేని బానిస చాకిరీ
నరహంతల గుండాగిరీ
ఇక వద్దనీ, ఇది రద్దనీ
పోరాడి నేలకు ఒరిగినా
రణధీరులారా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!!
మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!

మత మూఢ విశ్వాసాలనూ
కుల జాతి విద్వేషాలనూ
నిరసించుతూ, ఎదిరించుతూ
పోరాడి నేలకు ఒరిగినా
యువ శూరులారా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!!
మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!

శ్రమశక్తి దోపిడిదారునీ
సమరాల గుత్త కుబేరునీ
అరికట్టుతూ, హతమార్చుతూ
పోరాడి నేలకు ఒరిగినా
శ్రమ వీరులారా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!!
మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!

చిరశాంతి భువి నిండాలనీ
నరజాతి కల పండాలనీ
యుగస్రష్టలై, కమినిస్టులై
పోరాడి నేలకు ఒరిగినా
ధ్రువతారలారా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!!
మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం!
లాల్ సలాం, లాల్ సలాం, లాల్ సలాం!! ❑

# అదే అదే పతాక

అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా
పదే పదే రణానికై నగార మోగుతోందిరా

ధగద్ధగద్ధగ ప్రభన్ పతాక సాగుతోందిరా
ధిమిద్ధిమిద్ధిమి ధ్వనిన్ నగార మోగుతోందిరా
అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా

యువప్రవాళ పంక్తిలా, నవప్రభాత కాంతిలా
మహారుణ స్రవంతిలా పతాక సాగుతోందిరా
అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా

తటిత్తరంగ ఘోషలా నటత్తురంగ హేషలా
మహాకవీంద్రు భాషలా నగార మోగుతోందిరా
అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా

సనాతనాల బూజుపై, కులం మతం రివాజుపై
పురాణ నమ్మకాలపై తుపాను రేగుతోందిరా
అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా

పరాన్నభుక్కు దేవిడీ, దురాగతాల చావిడీ
తరాలదోపిడీ గడీ పునాది ఊగుతోందిరా
అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా

అహర్నిశల్ వనాలలో, పొలాలు ఫ్యాక్టరీలలో
శ్రమించు కూలి రైతులార రండిరా పదండిరా

అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా
పదేపదే రణానికై నగర మోగుతోందిరా ❑

## భిషక్కు

(మూలం చారగర్)

జాజిపూ దీవె జొంపాలలో
పానవీటికి అల్లంత దూరాన ఆ మూలపై జంటగా
కాలె మైదోయి ప్రేమాగ్నిలో
ప్రేమయే తారకం దైవతం వారికీ
ప్రేమ కాలే చితా

జంటగా
మంచులో నానుతూ
వెన్నెలన్ మజ్జనం బాడుతూ
వేకువన్ తేరి విప్పారు పూజంటలా

శీతంశీతం వనాయాత మందానిలం ఆయె శోకాకులం
నీలనీలాలకా హేళియై వేడి చెక్కిళ్ళపై
ఆగిపోయింది ఓ లిప్తకై

కంటినవ్వారినీ
రేపులో, మాపులో
కాంతిలో, ధ్వాంతిలో
చూచె మాసీదు మీనారు లవ్వారినీ
మందిర ద్వారముల్ చూచె నవ్వారినీ
జీర్ణ కుడ్య ప్రపల్ చూచెనవ్వారినీ

ఆది అంతమ్ముగా చెప్పవోయీ భిషక్
నీదు కల్పాలలో
ప్రేమవాదైకమౌ పర్సవేదున్నదా ?
కామతాపానికేమైన మందున్నదా ?

జాజిపూ దీవె జొంపాలలో
పానవీటికి అల్లంత దూరాన ఆ మూలపై జంటగా..
ఓ భిషక్!! ❑

## నృత్తం


(రఖ్స్ ఎ బిసాత్)

సురూపరంగ రాగ సంచయాల వార్త తెచ్చెనూ
సుమాయుధేక్షు ధన్వు సీధు పాత్ర కొంచు వచ్చెనూ
నిశాతపాల లేతలేత కాకతో తపించుతూ
పయోనిధాన ఫేనరాసి రూపుగొన్న యవ్వనాల్
హరిత్ హరిత్ తృణాల సంచరించి సంవదించగా
ఘుమంఘుమించుతూ నడూ
కటిన్ చలించుతూ నడూ
పదంతడన్ బడన్ నడూ

సురూపరంగ రాగ సంచయాల వార్త తెచ్చెనూ
సుమాయుధేక్షు ధన్వు సీధు పాత్ర కొంచు వచ్చెనూ
మహేశ! నృత్తమంటపం దిశాప్తమై రహించనీ,
ప్రసిద్ధ శిల్పి శీర్ణ మద్దిగంతముల్ రణించనీ
జయించనీ, శిలోచ్చయ ప్రభేదన శ్రమాప్తినీ!
జయించనీ, విశుద్ధ స్నిగ్ధ ముగ్ధ ప్రేమ ప్రాప్తినీ!! ❑


(మఖ్దూం మొహియుద్దీన్ కవితలకు అనువాదం)


# రాంభట్ల స్వీయ రచనలు










# నేనెరిగిన రాంభట్ల కృష్ణమూర్తి

## ఆత్మీయుల జ్ఞాపకాలు

- సురవరం సుధాకరరెడ్డి



రాంభట్ల కృష్ణమూర్తి గారు నాకు తెలిసినంత వరకు ఏ కాలేజీలో చదువుకోలేదు. బహుశా ప్రాథమిక విద్య దాకా మాత్రమే పాఠశాలకు వెళ్లి ఉండవచ్చు. స్వయంకృషితో జ్ఞానార్జన చేశారు. గొప్ప మేధావి. అతి సాధారాణంగా కనిపించే సరదా మనిషి. ఆయన కార్టూనిస్టు. జర్నలిస్టు. తత్వ శాస్త్ర అధ్యయనం చేసిన ఉపాధ్యాయుడు. వివిధ అంశాల మీద లోతైన అధ్యయనం చేశారు. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు ఆయన బోధించిన తత్వశాస్త్ర రాజకీయ పాఠశాలలో పాల్గొన్నాను.

రాంభట్ల కృష్ణమూర్తి గారు భారత్ సోవియట్ మిత్ర మండలిలో (ఇస్కస్) ప్రధాన కార్యదర్శిగా పని చేసేవారు. రాంభట్ల కృష్ణమూర్తి, గజ్జెల మల్లారెడ్డి గారు మంచి స్నేహితులు. వారిని సరదాగా జంట కవులని పిలిచేవారు. మల్లారెడ్డి గారి వ్యంగ్య కవిత్వం అప్పట్లో సుప్రసిద్ధం. వయసు తారతమ్యం లేకుండా, రాంభట్ల అందరితోనూ చాలా సరదాగా మాట్లాడే వారు. అందుకే విద్యార్థులు ఆయనతో చర్చించాలంటే ఆసక్తి, ఉత్సాహం చూపేవారు. వారి అన్నగారు హైదరాబాద్‌లో ప్రారంభించిన పరిశ్రమలో రాంభట్ల కొంత కాలం పని చేశానని చెప్పేవారు. రైస్ మిల్లులకు అవసరమైన ఇంజన్లు, ఆయిల్ ఇంజన్లు తయారు చేసేవారు. దానితో సాంకేతిక అంశాలపైన ఆయనకు మంచి అవగాహన ఉండేది. మార్కెట్లో అమ్మే రేట్లో సగం కంటే తక్కువ ధరకు రైతులకు ఆయిల్ ఇంజన్లు సరఫరా చేయవచ్చునని సోదాహరణంగా చెప్పేవారు.

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఆయన యువ రచయితలను చాలా ప్రోత్సహించే వారు. అనేక మంది శిష్యులను తయారుచేశారు. బూదరాజు రాధాకృష్ణ గారు ఆయనకు మంచి స్నేహితులు.

విశాలాంధ్ర ప్రారంభ దశలో కార్టూన్లు గీసేవారు. తెలుగు పత్రికలలో కార్టూన్లు వేసే సంప్రదాయం లేని రోజుల్లో వ్యంగ్య చిత్రాలు గీసిన రాంభట్లే బహుశా తెలుగులో మొదటి రాజకీయ కార్టూనిస్టు అని మిత్రుడు వ్యాఖ్యానించడం నాకు గుర్తు. తరవాత ఎందువలనో కార్టూన్ల జోలికి పోలేదు. పని ఉన్నా, లేకపోయినా ప్రతి రోజు హిమాయత్‌నగర్ చౌరస్తాలో వున్న అ.ర.సం. కార్యాలయానికి, పార్టీ ఆఫీసుకు వచ్చిపోయే వారు. పార్టీ ఆఫీసు కార్యదర్శి కామ్రేడ్ రామచంద్రరావు గారు ఆయనకు మరొక మంచి మిత్రులు.

హైదరాబాద్‌లో రామోజీ గారు ఈనాడు ప్రారంభించిన తరవాత ఆయన కోరికపై రాంభట్ల, గజ్జెల మల్లారెడ్డి అందులో చేరారు. కొంత కాలం బాగానే గడిచినా ఈనాడు పత్రికలో సమ్మె జరిగినప్పుడు వారిద్దరూ పత్రికలో కొనసాగటంపై విమర్శలు వచ్చాయి. అదొక ఇబ్బందికర పరిస్థితి. రాంభట్ల దాంట్లోంచి బయటపడ్డారు. కానీ మల్లారెడ్డి గారు కొంత కాలం కొన సాగినట్లున్నారు.

హైదరాబాద్‌లో రామోజీ గారు ఈనాడు ప్రారంభించిన తరవాత ఆయన కోరికపై రాంభట్ల, గజ్జెల మల్లారెడ్డి అందులో చేరారు. కొంత కాలం బాగానే గడిచినా ఈనాడు పత్రికలో సమ్మె జరిగినప్పుడు వారిద్దరూ పత్రికలో కొనసాగటంపై విమర్శలు వచ్చాయి. అదొక ఇబ్బందికరమైన పరిస్థితి. క్రమంగా రాంభట్ల దాంట్లోంచి బయటపడ్డారు. కానీ గజ్జెల మల్లారెడ్డి గారు మరి కొంత కాలం కొనసాగినట్లున్నారు. పార్టీకి ఆయన దూరమయ్యారు. ఆంధ్రభూమి, ఉదయం తదితర పత్రికల సంపాకుడిగా పని చేశారు.

"తెలుగునాట భక్తి రసం
తెప్పలుగా పారుతోంది
డ్రైనేజీ స్కీము లేక
దేంజరుగా మారుతోంది" అని వ్యంగ్య కవిత్వం రాసిన మల్లారెడ్డి ఆ తర్వాత అధికార భాషా సంఘం అధ్యక్ష పదవీ స్వీకరణ సందర్భంలో వేద మంత్రాల మధ్య బాధ్యతలు తీసుకోవటం విషాదకరం. మల్లారెడ్డి గారు దూరమైనా కృష్ణమూర్తి గారు మాత్రం చివరి వరకు మార్క్సిస్టు సిద్ధాంతంపట్ల, పార్టీపట్ల విశ్వాసంతో కొనసాగారు. కృష్ణమూర్తి గారి కుమార్తె అరుణ విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొనేది. ఆయన ఆర్మేనియా పర్యటించి వచ్చిన తరవాత ఆ ప్రేరణతో కుమారుడికి ఆర్మేన్ అని పేరు పెట్టుకున్నారు. ఆయన శతజయంత్యోత్సవ సందర్భంగా మరొకసారి ఆయన స్మృతులు గుర్తుకు తెచ్చుకునే అవకాశం కలిగింది. ❑

## ఆత్మీయుల జ్ఞాపకాలు

# చర్చించటం వ్యసనమైన సందర్భం!

- యేటుకూరి ప్రసాద్



"ఉద్యమాల్లో తిరిగేవాళ్లకు చదువు సంధ్యలేం వస్తాయి? ఉన్నదాంతో తృప్తిపడి, జండాలు పట్టుకుని జీవితం గడుపుతుంటారు – అని అందరూ అంటుంటారు. అలా కాదు – మనం మన సబ్జెక్టుల్లో డాక్టరేట్ సాధిద్దాం!" అనుకున్నాం నేనూ, వరవరరావు ఆబిడ్స్‌లోని మహబూబియా గర్ల్స్ స్కూల్ ఎదురుగా సినిమా హాలు మెట్ల మీద కూర్చుని. 1960 చివరి సంవత్సరాల్లో అనుకుంటా, పేపర్ వాల్యుయేషన్ కోసం వచ్చి, మహబూబియా గర్ల్స్ స్కూల్లో కలుసుకున్నాం ఇద్దరం. వరవరరావుతో నా స్నేహం 1963 నుంచి అనుకుంటా. ఇలా డాక్టరేట్ ప్రస్తావన మా మధ్య రావడం, క్రమంగా ఇద్దరం మా అభిమాన అంశాల్లో డాక్టరేట్లు సంపాదించడం జరిగింది.

గుంటూరులో 'యువజన' నడుపుతున్న నన్ను హైదరాబాదుకు పొమ్మని, అక్కడి నుంచి పత్రిక నడుపుదామని మా యువజన, విద్యార్థి పార్టీ నాయకత్వం నిర్ణయించి, ఆదేశించింది. అప్పటికి నేను గుంటూరులోని ఏ.సీ. కాలేజీలో తెలుగు ట్యూటర్‌గా పని చేస్తూ, మా ఆవిడ కుసుమతోపాటు మా ఇంట్లోనే ఉంటున్నా. 1961లో ఇద్దరం హైదరాబాద్ వచ్చి మా మామ గారింట్లో ఉంటూ ఉద్యోగాన్వేషణ సాగించాం. పాతబస్తీలోని అగ్రవాల్ మల్టీపర్పస్ స్కూల్‌లో తెలుగు అధ్యాపకుడిగా రూ.126 నెల జీతం మీద ఉద్యోగం దొరికింది. అదీ మా మామ గారికి వున్న పరువు వల్ల ! ఆ రోజుల్లో చిక్కడపల్లిలో ఉంటున్న నాకు రాంభట్లతో పరిచయం ఏర్పడింది. ఆ పక్కనే ఆర్టీసీ చౌరస్తా దగ్గర రాంభట్ల కృష్ణమూర్తి గారి వాటర్ పంప్ ఫ్యాక్టరీ ఉండేది. విశాలాంధ్రకు తొలి నుంచీ పాఠకుడిని నేను. మా అన్నగారు బలరామ్మూర్తి గారూ, రాంభట్ల గతంలో విశాలాంధ్రలో సహ కార్మికులూ, పార్టీ సభ్యులూను.

ప్రతి రోజూ స్కూలు నుంచి నేరుగా రాంభట్ల ఆఫీసుకు వెళ్ళే వాణ్ణి. అక్కడే రాత్రి 8 గంటల వరకూ కూర్చుంటుండేవాళ్లం. ఇద్దరం కలిసి బయల్దేరి మధ్యలో చిక్కడపల్లిలో నేనాగితే, ఆయన బర్కత్పురాలోని వాళ్లింటికి వెళ్లేవారు. అప్పట్లో రాంభట్ల కుటుంబం అన్నగారింట్లోనే ఉండేది. ఆ రోజుల్లోనే వారి ఇద్దర మ్మాయిల్లో ఒకామె హఠాత్తుగా చనిపోయింది. రాంభట్లకు నిత్యం ఏదో ఒక పుస్తకం చదివే అలవాటు. అది మరొకళ్లతో పంచుకోటం ఆయనకున్న వ్యసనం. అందుకు నేను సాయపడుతుండేవాణ్ణి. ఆరో దశకం నాటి సాహిత్య ధోరణులూ – అప్పుడప్పుడే వస్తున్న దిగంబర కవులూ – రాజకీయ ప్రకంపనలూ – కమ్యూనిస్టు పార్టీ విడిపోతున్న దశ – మానవుడి ఆవిర్భావం నుంచి ప్రస్తుత దశకు చేరుకున్న సామాజిక, చారిత్ర కాంశాలూ – ఒకటేమిటి, ప్రతీ అంశం చర్చించుకుంటుండే వాళ్లం మేం. నాకు – గిరీశం అన్నట్లు – రాంభట్లతో మాట్లాట్ట మే ఒక ఎడ్యుకేషన్. అలా ఆయనకో మంచి విద్యార్థిలా మారా ను నేను. 1960ల నుంచీ, మా ఇంటి చుట్టు పక్కల ఉంటున్న తాతాజీ (తాపీ ధర్మారావు), అబ్బూరి, రామరాజు, సి.నా.రె., బెల్లంకొండ రామదాసు, స్థానం, సింగరాజు లింగమూర్తి, బూదరాజు, పోరంకి తదితరులతో నిత్యం కలవడం – వాళ్లతో అనేక విషయాలు చర్చించుకుంటూ ఉండటం నాకు దక్కిన ఒక అవకాశం. ఈ చర్చలను రాంభట్ల నేను విమర్శించు కుంటుండేవాళ్లం. పార్టీ సభ్యులుగానూ – సాహిత్యం తదితర అంశాల అభిమానులం గానూ ఉంటూ ఒకరికొకరం సన్నిహితులమయ్యాం. గురు శిష్యులమయ్యాం. ఒక పుస్తకం గురించి చర్చించటం, దాన్ని సంపాదించి చదివి విశ్లేషించటం కూడా ఓ అలవాటుగా మారింది.

తాతాజీ మా ఇంటికి దగ్గర్లో ఉండేవాళ్లు. ప్రతిరోజూ ఏదో సమయంలో వాళ్లింటికెళ్లేవాణ్ణి. ఆయన తన జీవిత అనుభవా లనూ, ఆటు పోట్లనూ, తను రచలు ఎలా చేసిందీ, ఎవరెవరితో స్నేహం చేసిందీ అన్నీ మా సంభాషణల్లో దొర్లుతుండేవి. యువజన కోసం ఆయన చేత ప్రతీ నెల 'ఊసుపోక' అని ఒక శీర్షికను రాయిస్తూ ఉండేవాణ్ణి. ఆయన చదివిన పుస్తకాల గురించి, చూసిన గ్రంథాలయాల గురించి చాలా వివరంగా చెబుతుండేవారు. అప్పట్లో ఆయన సేకరించిన పుస్తకాలిచ్చి చదవమంటుండే వారు. ఆ విధంగా ఆయన రచనల నేపథ్యం, వాటి కోసం ఆయన సంప్రదించిన గ్రంథాల ఆనుపాన్లు తెలి శాయి. రాంభట్ల తరచూ తాతాజీ ఇంటికొస్తుండేవారు. తాతాజీ కుమారుడు మోహనరావూ రాంభట్ల విశాలాంధ్రలో సహోద్యో గులు. అంతకుమించి, ప్రాణస్నేహితులు. ఇలా మా ఇద్దరికీ తాతాజీ మీదా, ఆయన రచనల మీదా, గొప్ప గౌరవం కల్గింది. అంతలో ఓసారి నా చేత పీహెచ్‌డీ చేయించాలని తాతాజీ చాలా ప్రయత్నం చేశారు. రామరాజు గారిని సూపర్‌వైజర్‌గా ఒప్పించారు తాతాజీ. వారింటికి దగ్గరలోనే ఉన్న

రామరాజుగారు తరచూ తాతాజీని కలుస్తుండేవాళ్లు. ప్రజా కళారూపాలు – రాజ కీయ పక్షాలు అన్న అంశం నాకు తగిందని తాతాజీ నిర్ణయించి వాళ్లకీ వీళ్లకీ చెబుతూ అందుకు కొంత శ్రమ తీసుకున్నారు. అయితే, 'ముఖాముఖీ'లో నిడదవోలు వెంకటరావు గారు ఎక్స్‌పర్ట్‌గా రావడం, ఈ అంశం ఆయనకు నచ్చకపోవడంతో నాకు సీటు రాలేదు. తాతాజీ చాలా నిరుత్సాహపడ్డారు. అది అలా వుంచితే, రాంభట్ల – తాతాజీ – నేనూ సామాజిక అంశాల మీదా, మానుష శాస్త్రం మీదా, వాటి ఆధారంగా వచ్చిన అనేక ఇంగ్లీషు పుస్తకాల మీదా నిత్యం చర్చిస్తుండేవాళ్లం.

ఓ పుస్తకాన్ని ఎలా చదవాలి ? మన సంస్కృతీ సంప్రదాయాలకి ఎలా అన్వయించుకోవాలి ? సమానాంశాలను ఎలా పసికట్టాలన్నది ? తాతాజీ, రాంభట్ల గార్లే నాకు నేర్పించారు. అలాగే, మార్క్సిజం పుస్తకాలను చదివే అవసరాన్ని పార్టీ నాకు 60లలో తెలియపర్చింది. పార్టీ చీలిన తర్వాత కేడర్‌కు శిక్షణ అవసరమని భావించిన పార్టీ అందుకు అవసర మైన సిలబస్‌ను, ఉపాధ్యాయులను ఎంపిక చేసి హైదరాబాద్ ఢిల్లీల్లో శిక్షణా తరగతులను నిర్వహించింది. హైదరాబాద్‌లో నేనూ, రాంభట్లా – ఢిల్లీలో రాంభట్ల మాత్రమే, హాజరవడం జరి గింది. 1973లో రాంభట్లను మాస్కో క్లాసులకు కూడా పంపింది పార్టీ. నా ఉపాధ్యాయత్వం హైదరాబాద్, సికింద్రాబాద్‌కు పరిమితమైంది. ఈ కాలంలో సిద్ధాంతపరమైన గడ్డు అంశాలను మన ఆచారాలతో పొంతన చేస్తూ, మన ప్రాచీన గ్రంథాల్లోని సూక్తులతో కలగలుపుతూ చెప్పటం ఎలాగో రాంభట్ల నాకు బోధపర్చేవాడు. అలా ఇద్దరం సాహిత్యపరంగానూ, సిద్ధాంత పరంగానూ పరస్పరం చదువుతూ, చర్చించుకుంటూ, అన్వయించుకుంటూ మా ఆలోచనా పరిధిని పెంచుకుంటుండే వాళ్లం. రాంభట్లకి తాను చదివింది వెంటనే పక్కనున్న వాళ్లకు చెప్పి తన ఆలోచనల్లో ఏదయినా గందరగోళాలు వుంటే జల్లెడ పట్టాలన్న తపన ఉండేది. అందుకు నేను బాగా పనికొచ్చేవాణ్ణి.

నేను తెలుగులో పీ.హెచ్.డీ చేయడానికి మా ఇద్దరి సాహిత్య సాన్నిహిత్యం నాకు చాలా తోడ్పడింది. 1973లో తాతాజీ చని పోయిన తర్వాత ఆయన సాహిత్య జీవితాల మీద పనిచెయ్యాలని అనుకున్నా. రామరాజు గారు ఓకే అన్నారు. తాతాజీతో నీకున్న సాన్నిహిత్యం ఇందుకు బాగా సహకరిస్తుందంటూ రాంభట్ల వెన్నుచరిచాడు. తాతాజీ కుటుంబ సభ్యులంతా నాకు నిత్యం పరిచయంవున్న వాళ్లే సంతోషంగా సహకరిస్తామన్నారు. తాతాజీ వున్నప్పుడు అనేకమంది రచయితలూ సినిమా రంగంలో ఆయన సహచరులూ వస్తూండేవాళ్లు. వాళ్లందరిని నాకు పరిచయం చేస్తూండేవారు తాతాజీ. ఇవన్నీ నాకు కలిసొచ్చిన అంశాలు.

తాతాజీ రచనలు – ముఖ్యంగా 'దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు?', 'పెళ్లి–దాని పుట్టు పూర్వోత్తరాలు', 'ఇనుప కచ్చడాలు' – సామాజిక శాస్త్రం, మానుష శాస్త్రం ఆధారంగా రాసినవి. వీటి ఆకరాలు తాతాజీయే కొన్ని చెప్పినా, మిగిలిన వాటి కోసం రాంభట్ల, నేనూ వేటాడాం. ఫ్రేజర్ పుస్తకాలూ, బ్రిఫాల్ట్ పుస్తకాలూ, వాల్ రచనలూ, బుల్ఫించ్ రచనల కోసం వేట ప్రారంభించి సంపాదించాం. వాటిని చదవడం నా వంతు. చర్చించటం, అన్వయించుకోవటం ఇద్దరి వంతూను. సాధారణ శైలిలో రాసుకొని, మా సూపర్‌వైజర్‌కు చూపించి చర్చించటం, అక్కడక్కడా సరిదిద్దుకోవడం నా వంతు. రాంభట్లకూ నాకూ చివరకు మా గైడ్ డాక్టర్ యస్వీ రామారావు గారికి, తాపీ వారి మీద గౌరవం, వారి రచనల మీద విపరీతమైన అభిమానం ఉండడం నాకు అదనపు లాభం. మాతృస్వామ్యం నుండి పితృ స్వామ్యం కోరుకొన్న సమాజంలో వచ్చిన మార్పుల్లోని అన్ని దశలనూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆయా రచనల్లోని అంశాలను ఆయా దశల్లోని పరిణామ ప్రభావాలను విశదీకరిస్తూ ఉండే వాళ్లం. మోర్గాన్ రచనలు ఇద్దరం కలిసే చదివాం, చర్చించాం.

పెళ్లికీ, దేవాలయాలకూ, ఇనుప కచ్చడాల్లోని అంశాలకూ అన్వయిస్తూ పోవడంలో రాంభట్ల సాయం అడుగడుగునా ఉంది. రామారావు గారి అనుమానాలు తీర్చడంవల్ల నేను రాసే అంశాలపై స్పష్టత వచ్చింది. సాలార్జంగ్ మ్యూజియం గ్రంథాలయంలో నాకు దొరికిన ఓ. ఏ. వాల్ రచన 'సెక్స్ అండ్ సెక్స్ వర్షిప్' అన్న పుస్తకం నాకు చాలా ఉపయోగపడింది. సిద్ధాంత గ్రంథాన్ని అంశాల వారీగా విభజించడంలో రాంభట్ల సంస్కృతీకరిస్తే నేను అలా కాదని తెలుగు శీర్షికలు వుంచాను. రాంభట్లకు సంస్కృతం మీద పట్టుంది. అందువల్ల ఆయన రచనల్లో దాని ప్రభావం మనకు కనపడుతుంది. అదీకాక, వాడుకలో లేని పదాలను వాడుకలోకి తేవాలన్నది ఆయన అభిప్రాయం. మేం కలిసి చదివిన అంశాలను, కథలనూ తన దగ్గరకు వచ్చిన వాళ్లకు ఆయనా, నా దగ్గరకొచ్చిన వాళ్లకు నేనూ వివరిస్తుండేవాళ్లం. దానివల్ల ఆయా అంశాల్లో మాకో స్పష్టత వచ్చేది. అది నాకు నా సిద్ధాంత గ్రంథం తయారీలో బాగా ఉపయోగపడింది. తిరుమల రామచంద్ర ఓ సందర్భంలో నాతో "మనకు అనుమానం ఉన్న విషయాలు రాంభట్లకు చెబితే, ఇహ దాని గురించి ఆరా తీసి రెండు రోజుల తర్వాత మనకు వివరించే లక్షణం రాంభట్లది" అన్నారు. ఇది అక్షరాలా నిజమని నాకు ఆయనతోవున్న నాలుగు దశాబ్దాల సాన్నిహిత్యంలో రుజువైంది. తనకు ఏదైనా అనుమానమొస్తే వెంటనే నాతో ఆ విషయాన్ని పంచుకోవడానికి మా ఇంటికి వచ్చేవాడు. అలాగే నేనూను. ఇలా నా సిద్ధాంత గ్రంథానికి స్పష్టమయిన తాత్విక పునాది నిర్మించుకోవడం సాధ్యమయింది.

డెబ్బైల నుంచి అ.ర.సం నిర్మాణం కోసం పనిచేసిన వాళ్లలో రాంభట్ల, గజ్జెల మల్లారెడ్డి, వై.విజయకుమార్‌తోపాటు నేనూ ఉన్నాను. పార్టీ శిక్షణా తరగతుల్లో ఉపాధ్యాయుడిగానూ

అ.ర.సం కార్యకర్తలంగానూ ఇద్దరం కలిసి పనిచే శాం. ఇస్కస్ లోనూ, ఇండో చెకోస్లవేకియా మిత్రమండలిలోనూ, ఇండోజెర్మన్ మిత్ర మండలిలోనూ ఆయనతోపాటు కలిసి పనిచేసే అవకాశం నాకు కలిగింది. ఆయన 2001 డిసెంబర్ ఏడో తేదీన తుది శ్వాస విడిచాడు. సరిగ్గా ఒక సంవత్సరానికి, 2002 డిసెంబర్ ఏడో తేదీన నాకు గుండె జబ్బు చేసి, సుమారు ఆరు నిమిషాలు నాకు గుండె ఆగిపోయింది. అందరూ కంగారుపడ్డారు. కరెంటు షాకుల వల్ల తిరిగి గుండె ఆడడం మొదలయింది.

**అప్పుడు, ఐసీసీయూలో నేను ఉన్నప్పుడు మిత్రుడు ఆర్వీయార్ వచ్చాడు. "ఏమిటిలా జరిగింది? రాంభట్లకేదో అనుమానం వచ్చి వుండొచ్చు – మాట్లాడదాం రమ్మంటే వెళ్లొచ్చారా?" అన్నాడు. అప్పుడు నేను నవ్వి, "ఔను! ఆయన చనిపోవడానికి ఒక నెల ముందు 'పంచములెవరు?' అన్న స్క్రిప్ట్ తెచ్చిచ్చి 'చదవండి, మాట్లాడదాం!' అన్నాడు. కానీ, కుదర్లేదు. బహుశా ఆ విషయంలోనే వెళ్లొచ్చానేమో! అయితే, ఏం మాట్లాడామో గుర్తులేదు" అన్నాను.**

అ రాంభట్లగారూ, నేనూ పనిచేసిన అన్ని రంగాల్లోనూ అభిప్రాయాలను పంచుకుంటుండేవాళ్లం. రాంభట్ల విజ్ఞాన ఖని. ఒక ఆలోచనా యంత్రం. మా ఇద్దరి మిత్రులు సెట్టి ఈశ్వరరావు గారు. ఆయన ఓ మారు మా ఇద్దరిముం దు ఇలా అన్నారు: "రాంభట్లకు అవసరాన్ని మించిన విషయాలెన్నో తెలుసు. అయితే, ఆయన చదువు ఎలా క్రమబద్ధంగా సాగలేదో, అలాగే ఆయన ఆలోచనలు కూడా ఒక క్రమంలో ఉండవు. అపారమైన విషయాలు తెలుసు. కవిత్వం, చిత్ర లేఖనం, రాజకీయం, మానసిక శాస్త్రం, తత్వశాస్త్రం – ఒకటేమిటి, అన్నీ తెలుసు. అవన్నీ కలగాపులగంగా ఉంటాయి. వాటిని సరిచేసుకుని తీసుకోవడం మన వంతు" అంటూ సరిగ్గా రాంభట్ల వ్యక్తిత్వ దర్శనానికి నిలువుటద్దం పట్టారు.

ఒక విషయం ప్రస్తావనకు వస్తే, దాన్ని ఆసాంతం చర్చకు పెట్టి సవివరంగా మాట్లాట్టం రాంభట్ల లక్షణం. ఒక్కో సందర్భంలో సమయం కూడా గమనంలోకి రాని దృష్టాంతాలూ ఉన్నాయి. ఇక్కడ ఓ ముచ్చట. రాంభట్ల చనిపోయిన తర్వాత విశాలాంధ్ర ప్రచురణాలయంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశాం. పలువురు ప్రముఖులూ, మిత్రులూ, శిష్యులూ రాంభట్ల గుణగణాలను విపులంగా ప్రస్తావించటంతో సభ ముగించే సరికి రాత్రి తొమ్మిది గంటల సమయమైంది.

**అప్పుడు నేనూ, బూదరాజూ, రాజేశ్వరావూ కూర్చుని సభ గురించి మాట్లాడుకున్నాం. ఒక్క ముక్కలో రాంభట్ల చర్చించే ధోరణిని హాస్యంగా చెబుతూ, "ఏదోలే, తొమ్మిది గంటలకయినా సభ ముగించగలిగాం. చాలా దూరాలకు వెళ్లాల్సిన వాళ్లున్నారు. ఇవేళ రాంభట్ల ఉంటే సభ ఇప్పటికి కూడా తెమిలేది కాదు – తేదీ మారేది!" అని నవ్వుతూ అన్నాడు బూదరాజు. అవును మరి! చక్కని రాత – ఆకట్టుకునే వక్తృత్వం– సమయా సమయాలను పట్టించుకోకుండా వివరాలకు ప్రాధాన్యమిచ్చే సహజ వాక్చాతుర్యం రాంభట్లకు మాత్రమే ఉన్న లక్షణాలు!** ❑

## చంద్రహాసం

ఎర్రని వేకువ వస్తే
విచ్చిన గుండెలు చూస్తే
ఆకులు వలిచిన మోదుగ
నిలువున నిప్పులు పూస్తే

ఒకరిని మూర్కొనును భయం !
చివురించును ఒక హృదయం !!

రేపు నేడు కనిపిస్తే
నిజంగా నిజంగా వస్తే
పొత్తిలిలో పురిటిపాప
పిడికిలూపి నినదిస్తే

ఒకరిని పెనవేయు భయం !
ననలు తొడుగు ఒక హృదయం !!

హాస చిత్రములు గీస్తే
చంద్రహాసమదలిస్తే
గుమ్మపాల నురుగులాగ
గోర్వెచ్చగ విహసిస్తే

ఒకరిని కబళించు భయం !
కుసుమించును ఒక హృదయం !! ❑

(రాంభట్ల - శశ విషాణం)

# డిగ్రీలు లేని పాండిత్యం

## ఆత్మీయుల జ్ఞాపకాలు

- ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి



ప్రసిద్ధ చరిత్రకారుడు మల్లంపల్లి సోమశేఖరశర్మకు డిగ్రీలు లేవు. కానీ ఆంధ్ర విశ్వ విద్యాలయంలో సి.ఆర్.రెడ్డి వైస్ ఛాన్సలర్‌గా ఆయనను చరిత్ర అధ్యాపకుడు గానూ, ఆ శాఖాధ్యక్షులుగానూ నియమించారు. సోమశేఖరశర్మ తెలుగులో, ఆంగ్లంలో గొప్ప చరిత్ర రచనలు చేశారు. ఆ తర్వాత ఈ కోవలో ప్రసిద్ధి చెందిన మరో చరిత్రకారులు రాంభట్ల కృష్ణమూర్తి. ఆయనకు చరిత్ర, పురాతత్వ శాస్త్రం, జాతి శాస్త్రం మొదలైన సామాజిక శాస్త్రాల విస్తృత అధ్యయనం ఉంది. ఏ విశ్వ విద్యాలయమూ ఆయన సేవల్ని వినియోగించుకోలేకపోయింది. అయితే తన చుట్టూ వున్న అభ్యుదయ రచయితలను తన జ్ఞాన విస్తృతితో ప్రభావితుల్ని చేయగలిగారు. ఏటుకూరి ప్రసాద్, ఆర్వీ రామారావ్, కాచినేని రామారావ్, ఎస్వీ సత్యనారాయణ యువ అభ్యుదయోద్యమ రచయితలు తదనంతర కాలంలో రాటుదేలిన రచయితలుగా రూపొందడానికి రాంభట్ల దోహదపడ్డారు. వీరందరి మధ్య ఆయన అభ్యుదయ సాహిత్యంలో ఒక పెద్ద తలకాయగా ఉన్నారు.

జాతులు, భాషల వలసల పరస్పర ప్రభావాల తీరు తెన్నులను అడిగినా, ఇనపకచ్చడాలను చరిత్రను అడిగినా రాంభట్ల పాండిత్యం ఏకధాటిగా ప్రవహించేది. రాంభట్ల తనకున్న పాండిత్యాన్ని, చరిత్ర జ్ఞానాన్ని కుదురుగా రచన చేసి ఉనట్లయితే (ఒక్క ఆత్మకథ తప్ప) మనకు తెలుగులో డి.డి.కోశాంబి చరిత్రకారుడిగా నిలిచిపోయేవారు. ఆయన కుదురుగా రచన చేయకపోవడం ఒక లోపమైతే, తన జ్ఞాన విస్తృతిని ఒక క్రమ పద్ధతిలో కూర్చకపోవడం మరో లోపం. ఆయనతో తరచూ మాట్లాడిన వారు చరిత్ర జ్ఞానాన్ని సంపాదించి చరిత్రకారులుగా ఎదిగారు. ఏమైనా, గిరీశం అన్నట్లు ఆయనతో మాట్లాడ్డమే ఒక ఎడ్యుకేషన్. అన్నట్లు ఇక్కడ ఒక మాట చెప్పాలి. హైదరాబాదు హిమాయత్‌నగర్‌లో మేడ మీద గదిలో యువజన కార్యాలయంతోపాటు అ.ర.సం. కార్యాలయం కూడా ఉండేది. ఆ గదిలో కలిసే మిత్రులు రాంభట్లను 'గిరీశం' అనేవారు. గజ్జెల మల్లారెడ్డిని 'మధురవాణి' అనేవారు. అప్పుడు మల్లకవి అ.ర.సం రాష్ట్ర అధ్యక్షుడు. రాంభట్ల కార్యదర్శి. వీరిద్దరిని కలవడానికి హైదరాబాదులోని అ.ర.సం సభ్యులు, మిత్రులు తరచూ ఆ మేడ మీది గదికి వచ్చేవారు. ఎప్పుడు చూసినా చర్చల సందడి వాతావరణం ఉండేది. నేను 1983లో సార్వత్రిక విశ్వ విద్యాలయంలో చేరకముందు ఎక్కువగా ఇక్కడే వీరిని కలిసే వాడిని. అక్కడే హిమాయత్‌నగర్ 12వ వీధిలో ఉన్న బూదరాజు రాధాకృష్ణను, రాంభట్లను వారి ఇళ్ళ వద్ద మూడు నాలుగుసార్లు కలిశాను. అక్కడా, మిత్రుల ద్వారా ముఖ్యంగా అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో చేరిన తర్వాత రాంభట్లను గురించిన వివరాలు మరిన్ని తెలిశాయి. రాంభట్ల ద్వారా కూడా కొన్ని విని, ఆయన జ్ఞానవిస్తృతికి ఆశ్చర్యం కలిగేది. తాపీ ధర్మారావు మీద ఏటుకూరి ప్రసాద్ పరిశోధన చెయ్యాలనుకున్నప్పుడూ, ఆ తర్వాత రాంభట్ల అందించిన ప్రోత్సాహం వల్ల ఒక మంచి పరిశోధన గ్రంథం రూపొందింది.

రాంభట్ల ఒక వ్యంగ్య కవితా చిత్రకారుడు అనే విషయం ఆ తర్వాత తెలిసింది. ఆయన శశవిషాణం ఈ తరం రచయితలకు తెలిసి ఉండకపోవచ్చు. ఆయనతో ప్రత్యక్షంగా గడిపిన వారికి మాత్రమే తెలిసిన అంశాలు చాలానే ఉన్నాయి. 1955లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభ ఎన్నికలప్పుడు అప్పటి ఆంధ్రప్రభ సంపాదకుడిగా ఉండిన నార్ల వెంకటేశ్వరరావు కమ్యూనిస్టు వ్యతిరేకతను వెల్లడిస్తూ సంపాదకీయాలు రాసేవారు. రాంభట్ల విశాలాంధ్రలో వ్యంగ్య కార్టూన్ కవితకు శ్రీకారం చుట్టారు. బహుశా తెలుగులో రాజకీయ వ్యంగ్య కార్టూన్ కవితకు ఉద్యమించిన తొలి వ్యక్తి రాంభట్లే అనుకోవచ్చు. విశాలాంధ్రలో రాంభట్ల వ్యంగ్య కార్టూన్ల ధాటికి తట్టుకోలేక ఆంధ్రప్రభ బొంబాయి నుండో, మద్రాసు నుంచో ఒక కార్టూనిస్టును (పేరు గుర్తు లేదు) పిలిపించుకుని వ్యంగ్య కార్టూన్లు వేయించుకోవాల్సి వచ్చింది.

**రాంభట్ల బాల్యం, ఆ తర్వాతి జీవితం కూడా చాలా మట్టుకు కుదురైనది కాకపోవడం వల్లనే ఆయన సంపూర్ణ చిత్రకారుడిగా, రచయితగా ఎదగలేకపోయాడేమోనని నేననుకుంటాను. నిజానికి ఇందువల్లే చరిత్ర, చిత్రకళ, సాహిత్యం ఈ మూడు రంగాల్లో ఆయన తర్వాతి తరాలకు ప్రేరకుడయ్యాడే కాని మార్గదర్శి కాలేకపోయాడేమో ! ఏమైనా ఈ తరం అభ్యుదయ రచయితలు గానీ, అభ్యుదయేతర రచయితలు గానీ రాంభట్ల జీవితం నుంచి, ఆయన సంపాదించిన పాండిత్యం నుంచి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది.** ❑

# మహా మేధావి రాంభట్ల కృష్ణమూర్తి

## ఆత్మీయుల జ్ఞాపకాలు

- అంపశయ్య నవీన్



రాంభట్ల కృష్ణమూర్తి గార్ని సరిగ్గా ఎప్పుడు మొట్ట మొదటిసారి కలిశానో గుర్తులేదు. 1971లోనో, లేదా 1972లోనో అయ్యుంటుందని అనుకుంటున్నాను. అభ్యుదయ రచయితల సంఘాన్ని (అరసం) పునరుజ్జీవింపచేసే ప్రయత్నాలు జరుగుతున్న రోజులవి. ఆ రోజుల్లోనే నేను రాంభట్ల వారిని కలుసుకున్నట్టు గుర్తు. "మీరు అ.ర.సంలో పనిచెయ్యాలి" అని ఆయన నాతో చెప్పాడు. అప్పటికే నాలో వామపక్ష భావాలు బలపడటం వల్ల నేను అ.ర.సం పట్ల ఇంటరెస్ట్ చూపించాను. నాలో వామపక్ష భావాలున్నాయని రాంభట్ల గ్రహించటం వల్లనే నాకాయన ఆ మాట చెప్పాడని కూడా అర్థమయ్యింది. రాంభట్ల గారికి ఆ అభిప్రాయం కలగడానికి కారణమేమంటే ఆయన సరిగ్గా అప్పుడే వెలువడిన నా నవల 'అంపశయ్య' చదివాడు. నిజానికి, రాంభట్లను నేను మొట్ట మొదటిసారి చూసింది మాత్రం 1970లో. చలసాని ప్రసాదరావు 1970లో 30 మంది యువ రచయితలు శ్రీశ్రీని కలిసి ఇంటరాక్ట్ అయ్యేలా ఏర్పాటు చేసిన మీటింగ్‌లో నేను రాంభట్లను కలిశాను. రాంభట్లతో ఏర్పాటు చెయ్యబడిన కమిటీకి, ఆ యువ రచయితలు అడిగే ప్రశ్నలను మొదలు చూపించాలన్న నిబంధన పెట్టారు. (తర్వాత ఆ నిబంధనను తీసేశారనుకోండి.) ఆ రోజంతా, రాంభట్ల - చలసాని ప్రసాదరావులతోపాటు నాతో సహా 30 మంది యువ రచయితలం కలిసే ఉన్నాం. చలసాని ప్రసాదరావు, రాంభట్ల కృష్ణమూర్తి చాలా మంచి మిత్రులు.

1972-73 ప్రాంతంలో, ఒకసారి విజయవాడలో 'అ.ర.సం' సభలు జరిగినప్పుడు రాంభట్ల గారే నన్ను ఆ సభలకు రమ్మనమని ఆహ్వానించాడు. ఆ సభల్లో నేను ఉత్సాహంగా పాల్గొన్నాను. సభలు ముగిశాక మేం విజయవాడ నుండి బయల్దేరినప్పుడు రాంభట్ల నేను ఒకే ట్రెయిన్లో పక్కపక్కనే కూర్చొని ప్రయాణం చేశాం. నేను వరంగల్ స్టేషన్లో దిగిపోయేంత వరకూ రాంభట్ల నాతో అనేక విషయాల గురించి మాట్లాడుతూనే ఉన్నాడు. వేదాల నుండి మొదలు పెడితే, కమ్యూనిస్టు మేనిఫెస్టో వరకు - ఎన్ని విషయాల గురించి ఎంత సాధికారంగా మాట్లాడాడో వింటుంటే నాకు ఆశ్చర్యం కల్గింది. వివిధ విషయాలను గూర్చి ఆయనకున్న జ్ఞానం నన్ను అబ్బురపరచింది. దాదాపు మూడు గంటలసేపు నాకెక్కడా విసుగు కలగకుండా ఆయన వెరైటీ ఆఫ్ టాపిక్స్ గురించి చెబుతుంటే, ఆయన నుండి నేనెంతో నేర్చుకోవచ్చుననిపించింది.

ఆ సందర్భంలోనే నేను 'అంపశయ్య' నవలను గూర్చి చెప్పి మొదటి ముద్రణ ప్రతులు అయిపోయాయని, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు రెండవ ముద్రణను తీసుకురాగలరా ? అని అడిగాను. "ఈ విషయంలో వాళ్లకు మీరో మాట చెప్పగలరా?" అని కూడా అడిగాను. "అలాంటి ఆశలేమీ పెట్టుకోకండి. విశాలాంధ్ర అనే సంస్థ ఒక పుస్తకాన్ని ప్రచురించాలంటే చాలా తతంగం ఉంటుంది. ఇట్సె వెరీ వెరీ స్లో మూవింగ్ మెషీన్.. వాళ్ళు మీ పుస్తకాలు వేస్తారని ఆశ పెట్టుకుంటే మీరు డిస్సప్పాయింట్ అవుతారు" అని ఆయన కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పేశాడు. ఆయన చెప్పిన మాట అక్షరాలా నిజమని నాకు కొద్ది రోజుల్లోనే రుజువయ్యింది.

ఇది జరిగిన కొద్ది రోజుల తర్వాత ఆయనొకసారి కరీంనగర్ కొచ్చి నన్ను కలుసుకున్నాడు. "ఈ రోజు సాయంత్రమే నేను మళ్ళీ హైదరాబాద్ వెళ్ళిపోవాలి... ఈ లోగా... అంటే, 11.30 వరకు మీరిక్కడొక అ.ర.సం మీటింగ్ అరేంజ్ చెయ్యగలరా?" అని అడిగాడు. అప్పుడు పది గంటలు అవుతున్నది. "ఇంత తక్కువ వ్యవధిలో మీటింగ్ ఏర్పాటు చెయ్యటం సాధ్యమయ్యే పనేనా?" అన్నాన్నేను. "ప్రయత్నం చెయ్యండి. ఎంత మంది వచ్చినా ఫరవాలేదు" అన్నాడాయన. నేను వెంటనే కార్యరంగంలోకి దిగాను ఓ 20 మంది మిత్రులకి విషయం చెప్పి "రాంభట్ల కృష్ణమూర్తి అని గొప్పమేధావి. ఆయన ఉపన్యాసం చాలా గొప్పగా వుంటుంది. మనకెంతో ప్రయోజనకరంగా కూడా వుంటుంది మీరు తప్పక రావాలి" అని వాళ్లకు గట్టిగా చెప్పాను. బస్ స్టేషనుకు దగ్గరలోనే ఉన్న ప్రభుత్వ హైస్కూల్ హెడ్ మాస్టర్ నాకు మంచి మిత్రుడు. ఆయనను రిక్వెస్ట్ చేస్తే ఆయన ఆ స్కూల్‌లో మీటింగ్ పెట్టుకోవటానికి హాలు ఇచ్చాడు. సరిగ్గా 11.30 గంటలకు ఆ హైస్కూల్‌లో అ.ర.సం. మీటింగ్ జరిగింది. 30 మంది వరకు శ్రోతలొచ్చారు. రాంభట్లగారు చాలా చక్కని ఉపన్యాసం చేశారు. దేశంలోని పరిస్థితుల్ని విశ్లేషించి, అ.ర.సం వంటి సాహిత్య సంస్థ అవసరం ఎంత వుందో చెప్పాడు. ఆయన సరిగ్గా గంట సేపు మాట్లాడాడు. వచ్చిన శ్రోతలందరూ చాలా మంచి ఉపన్యాసం విన్నామని సంతోషించారు. అంత తక్కువ

వ్యవధిలో నేను 30 మంది వరకు ఆ సమావేశానికి రప్పించటం, అప్పటికప్పుడు ఒక హాల్ మాట్లాడటం, సమావేశం చాలా బాగా జరగటం - రాంభట్లను చాలా సంతోషపరచింది. సభలను నిర్వహించే నా శక్తియుక్తుల పట్ల కూడా ఆయనకు గౌరవం కల్గింది. ఇలా రాంభట్ల గారితో నాకు సాన్నిహిత్యం ఏర్పడిన తర్వాత నేను ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా ఆయనను కలుసుకుంటూ వుండేవాడిని. 1975లో 15 కథలతో నా మొదటి కథా సంకలనం వెలువడటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఆ కథా సంకలనాన్ని ప్రచురించటానికి, మూడేళ్ల ప్రయత్నాల తర్వాత, విశాలాంధ్ర ప్రచురణాలయం వారు అంగీకరించారు. అదెలా జరిగిందో కూడా చెప్పాలి.

ఆనాటి అగ్ర కమ్యూనిస్టు నాయకులలో ఒకరైన నీలం రాజశేఖరరెడ్డి గారికి నా 'అంపశయ్య' నవల బాగా నచ్చింది. హైదరాబాద్‌లో కలిసినప్పుడు ఈ విషయం నాకు చెబుతూ యేటుకూరి ప్రసాద్ గారు "రాజశేఖరరెడ్డి గారు మిమ్మల్ని ఒకసారి వాళ్లింటికి తీసుకురమ్మన్నారు" అని చెప్పాడు. "వారెప్పుడుంటారో తెలుసుకొని మిమ్మల్ని వాళ్లింటికి తీసుకెళ్తాను" అని కూడా యేటుకూరి ప్రసాద్ చెప్పాడు. అప్పుడు నేను పరీక్షల పేపర్లు మూల్యాంకనం చేసే (స్పాట్ వాల్యుయేషన్) పని మీద హైదరాబాద్‌లోనే ఉన్నాను. రెండు రోజుల తర్వాత యేటుకూరి ప్రసాద్ నన్ను నీలం రాజశేఖరరెడ్డి గారి దగ్గరకు తీసుకెళ్లాడు. ఆయన నాతో చాలా ఆప్యాయంగా మాట్లాడాడు. 'అంపశయ్య' ఆయనకెందుకు నచ్చిందో చెప్పాడు.

"దేశంలోని వామపక్ష పార్టీల మధ్యన ఐక్యత అవసరం అనే పాయింట్‌ను మీ నవల్లో చాలా బాగా చిత్రించారు" అన్నాడు. అలా నాతో చాలాసేపు మాట్లాడిన నీలం రాజశేఖరరెడ్డి గారు యేటుకూరి ప్రసాదొకొక మాట చెప్పాడు- "ఇక నుండి నవీన్ రాసే పుస్తకాలన్నింటిని మన విశాలాంధ్ర వాళ్లే ప్రచురించాలి... నేను చెప్పానని ఆ ఎడిటోరియల్ బోర్డ్ వారికి చెప్పండి" అన్నాడు. నీలం రాజశేఖరరెడ్డి గారు చెప్పారని చెప్పడం వల్ల విశాలాంధ్ర వారు నా కథా సంకలనాన్ని ప్రచురించటానికి ఒప్పుకున్నారు. అప్పుడు జోషి గారు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్‌గా ఉండేవాడు. ఆయనను నా కథల పుస్తకం ఎప్పుడొస్తున్నదని ఎప్పుడడిగినా "వస్తుంది.. అప్రూవ్ అయ్యింది" అని చెబుతుండేవాడు. ఒకసారి కలిసినప్పుడు "మీ కథా సంకలనానికి ఎవరితోనయినా ముందుమాట రాయిస్తే బావుంటుంది. ఎవరితో రాయించమంటారు?" అని అడిగాడు. నేను వెంటనే "రాంభట్ల వారు రాస్తే బావుంటుంది" అన్నాను. "అలాగే చేద్దాం" అన్నాడు జోషీ గారు. అలా, 'లైఫ్ ఇన్ ఎ కాలేజి' పేరుతో వెలువడిన నా మొదటి కథా సంకలనానికి రాంభట్ల కృష్ణమూర్తి గారు "ముక్తానుషంగం" పేరుతో చాలా గొప్ప ముందుమాట రాశాడు. సుదీర్ఘంగా రాయబడిన ఆ ముందుమాటలో రాంభట్ల గారు నా కథలను గురించే కాకుండా, 'అంపశయ్య'ను గురించి, అప్పటికింకా వెలుగు చూడని - రాత ప్రతిలో మాత్రమే ఉన్న - నా మరో నవల 'ముళ్లపొదలు' గురించి కూడా చక్కని విశ్లేషణను రాశారు. 'చైతన్య స్రవంతి' అనే మాటకు ఆయన 'ముక్తానుషంగం' అనే మాట చక్కగా సరిపోతుందని చెప్పి, 'చైతన్య స్రవంతి' శిల్పం మీద ఒక సాధికారికమైన వ్యాసం రాశారు. అది చదివి నేను పులకించిపోయాను. ముందు మాటంటే, ఒక కొత్త రచయితను ప్రోత్సహిస్తూ రెండు మంచి మాటలు రాయడం అని కాకుండా, ఆ కొత్త రచయిత రాస్తున్న విధానం గురించి (అంటే ఇక్కడ 'చైతన్య స్రవంతి' గురించి) ఇంత వివరంగా, విశ్లేషణాత్మకంగా రాయటం చాలా గొప్ప విషయమనిపించింది. తర్వాత 'చైతన్య స్రవంతి' శిల్పం మీద రాస్తున్న ఎంతో మంది పరిశోధకులకు రాంభట్ల రాసిన ఈ ముందుమాట ('ముక్తానుషంగం') ఎంతో మార్గదర్శకంగా నిలిచింది. రాంభట్ల కృష్ణమూర్తి గార్ని నేను మరో సందర్భంలో కలిసినప్పటి సంఘటన నాకెప్పుడూ గుర్తొస్తుంది. ఆ రోజుల్లో నాకు అత్యంత సన్నిహితుడైన ఎం.వి. తిరుపతయ్య అనే మిత్రుడు అడివి బాపిరాజు మీద పరిశోధన చేస్తున్నాడు. "అడివి బాపిరాజు దగ్గర రాంభట్ల వారు కొన్ని రోజులు 'మీజాన్' పత్రికలో పనిచేశాట్ట. ఆయనను ఒకసారి కలిసి బాపిరాజు గురించి ఏం చెబుతాడో వినాలి" అన్నాడు తిరుపతయ్య. సరేనని నేనొకసారి తిరుపతయ్యను రాంభట్ల ఇంటికి తీసుకెళ్లాను. ఓ రెండు మూడు గంటలు రాంభట్ల, అడివి బాపిరాజును గురించి ఎన్ని విషయాలు చెప్పాడో గుర్తు చేసుకుంటే ఇప్పటికీ నాకు ఆశ్చర్యం కల్గుతుంది. 'మీజాన్' పత్రికను గురించి, బాపిరాజు ఎడిట్ చేసే విధానం గురించి, ఆ రోజుల్లో అదే పత్రికలో బాపిరాజు నవల 'తుఫాన్' సీరియల్‌గా వెలువడిన విషయాన్ని గూర్చి - ఇలా ఎన్నో విషయాల్ని నాన్ స్టాప్ మూడు గంటలసేపు చెప్పాడు రాంభట్ల. తుఫాన్ నవల సీరియల్‌గా వెలువడుతున్నప్పుడు బాపిరాజు కథా నాయకుడి పేరు మర్చిపోయి, రెండు వారాల తర్వాత మరేదో పేరు పెట్టాడట. ఈ విషయం గమనించిన ఓ సబ్ ఎడిటర్ బాపిరాజు దగ్గరకు వెళ్లి "పెద్ద పొరపాటు జరిగింది.. గతవారం మీరు హీరోకు పెట్టిన పేరు ఈ వారం మారిపోయింది" అన్నాడట. ఆ మాట విన్న బాపిరాజు ఒక్క క్షణం ఆలోచించి గొల్లున నవ్వి "ఆ హీరోకు రెండు పేర్లున్నాయని చెబుతూ ఇంకో ఛాప్టర్ రాయటానికి ఇదో మంచి అవకాశం" అన్నాడట. బాపిరాజు, తనూ కలిసి శ్రీలంకకు వెళ్లిన విషయం కూడా రాంభట్ల గారు చెప్పారు. ఇలా రాంభట్ల యే విషయం మాట్లాడినా ఎంతో ఆసక్తికరంగా ఉండేది. ఎన్నోసార్లు నాకు రాంభట్ల గారితో అత్యంత సన్నిహితంగా మెలిగే అవకాశం కల్గింది. ఆ మహా మేధావిని నేనెప్పుడూ మరచిపోలేను! ❑

# ఆలోచనా యంత్రం

## సహచర స్మరణ



- ఆర్వీ రామారావు

హిమాయత్ నగర్ 12వ వీధిలో (ఇప్పుడది 13వ వీధి) బాల సదన్. హైదరాబాద్ పాతనగరంలో కొంత మందిమి సాహిత్యరంగంలో కొద్ది కాలంగా కృషి చేస్తుండేవాళ్లం. మిత్రుడు పుల్లారెడ్డి మమ్మల్ని ఒక రోజు బాలసదన్‌కు తీసుకెళ్లాడు. అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణం కోసం అంతకు ముందే తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభమైనాయి. ఆ సందర్భంగా జరుగుతున్న సమావేశమే అది.

అక్కడ ఇద్దరు వ్యక్తులు మమ్మల్ని ఆకట్టుకున్నారు. ఒకరు జెండా కర్రలాగా ఉన్నారు. ఆయన ఇప్పుడూ అంతే. ఆయనే డా. ఏటుకూరి ప్రసాద్. రెండో వ్యక్తి పొడవాటి జులపాలు. మధ్య పాపిట. వయసు 60కి లోపు. నవ యువకులు ధరించే దుస్తులు. మాసిపోయిన బూట్లు. ధారాళంగా మాట్లాడేవారు. సకల విషయాల గురించి మాట్లాడుతుండే వారు. మాట్లాడడమే వృత్తిగా పెట్టుకున్నట్టు అనిపించింది. ఆ విశిష్ట వ్యక్తే రాంభట్ల కృష్ణమూర్తి. మొదటిరోజు చూసిన దగ్గర నుంచే ఆయన గొప్పవాడనిపించింది.

అక్కడికి సాహితీ రంగంలోని అనేకమంది ప్రముఖులు వచ్చే వారు. పేరున్న రచయితలనందర్నీ చూసే, మాట్లాడే అవకాశం ఆ బాలసదన్ సమావేశాల్లోనే కలిగింది. ఎంతోమంది రచయితలతో పరిచయమైనా నాకు మాత్రం రాంభట్లే ఎక్కువగా నచ్చారు. ఆ నచ్చడం ఆయన శిష్యరికానికి దారితీసింది. ఆయన మాత్రం ఎవరినీ శిష్యుడిగా భావించేవారు కాదు. వయసుతో నిమిత్తం లేకుండా అందరినీ "ఫ్రెండూ" అనే పలకరించే వారు.

అదేం విచిత్రమో కానీ ఎప్పుడు కలుసుకున్నా నమస్కారం, గుడ్ మార్నింగ్, గుడ్ ఈవెనింగ్, గుడ్ నైట్ లాంటి లాంఛన ప్రాయమైన మర్యాదలు ఆయన విషయంలో ఎప్పుడూ పాటించ లేదు. బాలసదన్ దగ్గర్లోనే అ.ర.సం. కార్యాలయం ఉండేది. అందరమూ అక్కడ చేరేవాళ్లం. రాంభట్ల మాటలు వింటూ తెలియకుండానే బోలెడు విషయాలు గ్రహించగలిగాం. కొన్నాళ్ల తరవాత నేను ఎం.ఏ. మధ్యలో ఉండగానే ఈనాడులో సబ్ ఎడిటర్ ట్రెయినీ కోసం దరఖాస్తు చేశా. రాంభట్లకు చెప్పలేదు. ఇంటర్వ్యూకు పిలుపువచ్చింది. నాతోపాటే దరఖాస్తు చేసిన అంబటి మహేంద్రరాజుకు మొదటిరోజు ఇంటర్వ్యూ. అక్కడ ఇంటర్వ్యూ బోర్డులో రాంభట్ల ప్రత్యక్షమయ్యారు. మహేంద్ర రాజు నేరుగా అ.ర.సం. ఆఫీసుకు పరుగెత్తుకొచ్చి "నువ్వు రాంభట్లకు చెప్పలేదుగా! మరి రేపు ఆయనే ఇంటర్వ్యూ బోర్డులో ఉంటారు. ఎలా?" అన్నాడు. ఇద్దరమూ కొంతసేపు గూడు పుఠాణీ చేసి చివరకు చెప్పాలని నిర్ణయించుకున్నాను. చెప్పాను. "నో యూ ఆర్ నాట్ అటెండింగ్ ది ఇంటర్వ్యూ. ముందు ఎం.ఎ. పూర్తి చేయి. ఆ తర్వాత చూద్దాం" అన్నారు. ఆ సలహా పాటించా. ఈలోగా ఎం.ఏ. పూర్తి అయిందనిపించా. మళ్లీ ఎం.ఏ. ఇంగ్లీషులో చేరా. నైట్ కాలేజి. వారం వెళ్లా. నా ఉద్యోగం సంగతి ఎత్తితే "నువ్వు చదువుతూ ఉంటే నీకు ఈనాడులో ఉద్యోగం రాదు." అన్నారు. ఇంగ్లీషు ఎం.ఏ. వది లేశా. నెలలు గడిచాయి. ఈనాడులో ఉద్యోగం మాత్రం రాలేదు.

చివరకు ఈనాడులో 1977 జనవరిలో చేరా. అయితే నేను ఏ బ్యాచ్‌వాడినీ కాదు. నాకేం పని చెప్పాలో తెలియదు. ఏ పని చెబితే అదే చేసేవాడిని. ఈనాడులో సమ్మె పరిణామాల నేపథ్యంలో నేను ఆ ట్రెయినీ ఉద్యోగం కాస్తా వదిలేయాల్సి వచ్చింది. సమ్మెకు నాయకత్వం వహిస్తున్న వారికి నేనెవరో తెలుసు. రాంభట్లకు సన్నిహితుడిని అని కూడా తెలుసు. అదే నాకు ప్రతికూలమైంది. సమ్మెకు అనుకూలురు నన్ను రాంభట్లకు సన్నిహితంగా పరిగణించి సమ్మె విషయాలు ఏవీ చెప్పేవారు కాదు. నా తత్వం తెలిసిన రాంభట్ల నా ఆత్మ సమ్మె చేసే వారితో ఉందనుకునేవారు. చివరకు అటో ఇటో తేల్చుకోవలసిన రోజు వచ్చింది. ఆ రోజు వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేసే వారిని రాంభట్లే ఈనాడు అధిపతి రామోజీరావు దగ్గరకు తీసుకెళ్లి "మేం ఇలా పనిలేకుండా కూర్చోలేం. పేపర్ తీసుకొస్తాం" అని చెప్పిం చారు. అది ఆయన ఉద్యోగ ధర్మం. అప్పటికి ఆయన ఈనాడు అడ్మినిస్ట్రేటివ్ ఎడిటర్. ఆ పదవిలో ఉన్న వారు యాజమా న్యంలో భాగం. అన్ని డిపార్ట్‌మెంట్ల వాళ్లనూ తీసుకెళ్తున్నారు కానీ నన్ను తీసుకెళ్లలేదు. పైగా "వెయిట్ చెయి." అన్నారు. రాత్రి ఎనిమిదో ఎంతో అయింది. అందరినీ తీసుకెళ్లిన తర్వాత నన్ను పిలిచి "ఫ్రెండూ! ఇప్పుడు నువ్వు కచ్చితమైన నిర్ణయానికి రావలసిన సమయం వచ్చింది." అన్నారు. సరే అని బయటి కొచ్చాను.

సమ్మె చేస్తున్న వాళ్లు మర్నాడు నేను విద్యుత్ సౌధ దగ్గర బస్సు దిగగానే నాకు అంతరాత్మ ప్రబోధం చేశారు. దాని మాటకేం గానీ పరిస్థితి నాకు అనుకూలంగా కనిపించలేదు. దగ్గర్లో ఉన్న

ఇరానీ హొటల్‌కు వెళ్లి రాంభట్లకు ఫోన్ చేసి "నేను పని చేయలేను" అని చెప్పా. అక్కడితో ఆ ఉద్యోగం పూర్తి అయింది.

ఈ గొడవకేం గానీ నేను అక్కడున్న ఆరు నెలల కాలం సాయంత్రం ఏ ఆరింటికో రాంభట్ల, నేను కలిసి హిమాయత్ నగర్ దాకా నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. ఇది రోజువారీ కార్యక్ర మం. దారిలో రాంభట్ల అనేక విషయాలు మాట్లాడే వారు. నాకు బోలెడు కొత్త విషయాలు తెలిసేవి. ఆ తరువాత మళ్లీ హిమా యత్ నగర్ అ.ర.సం. ఆఫీసులో కూర్చునే వాళ్లం. అక్కడ మళ్లీ రాంభట్ల మాటలు వినడమే.

కొత్త విషయాలు తెలుసుకుంటున్న దశలో బోలెడు అనుమా నాలు రావడం సహజం. నేను రాంభట్లను ప్రశ్నలతో వేధించే వాణ్ని. ఎంగెల్స్ "ఫ్యామిలీ, ప్రైవేట్ ప్రాపర్టీ అండ్ స్టేట్" అనే పుస్తకం మీద చెప్తూనే ఉండేవారు. ఈ విషయంలో నేనూ, కాచినేని రామారావు అనేక ప్రశ్నలు లేవనెత్తే వాళ్లం. "మీ ఇద్దరికోసం నేను ఆ పుస్తకం ఆరు సార్లు చదివాను" అని రాంభట్ల ఓ సందర్భంలో అన్నారు. ఆ పుస్తకంలోని అంశాలను మన దేశ పరిస్థితికి, ముఖ్యంగా తెలుగు సంస్కృతికి అన్వయించి చెప్పే వారు. మార్క్సిజాన్నీ మన పరిస్థితులకు అన్వయించి చెప్పడం రాంభట్లలో ఉన్న విశిష్టత. ఆయనకు అనేక రంగాలలో ప్రవేశం ఉండొచ్చు. కవిత్వం, సాహిత్య విమర్శ, చిత్రలేఖనం, రాజకీయ కార్టూన్లు మొదలైన రంగాలలో ఆయన దిట్టే కావచ్చు. అనేక మంది మార్క్సిస్టు పండితులు మార్క్సిజాన్ని రాజకీయాలకు అన్వయించి చెప్పే వారు కానీ రాంభట్ల సాహిత్య రంగానికి అనువర్తింప చేసే తీరు విలక్షణమైంది. ఒక్క వై. విజయకుమార్ తప్ప ఏ మార్క్సిస్టు పండితుడూ ఈ పని చేసే వారు కాదు. నాకు మార్క్సిజం మీద ఆసక్తి ఉన్నా నేను ఎంచుకున్న రంగం సాహిత్యం. అందువల్ల రాంభట్ల మాటలు బాగా ఆకట్టుకునేవి.

ఎం.ఏ. చదువుతున్న రోజుల్లోనే రాంభట్ల నన్ను రోజూ కాలేజీ అయిపోయిన తర్వాత "కొత్తబాట"లో పని చేయమని సూచిం చారు. ఒక రోజు నాకు ఫోన్ చేసి "ఎక్కడున్నావు?" అన్నారు. చెప్పాను. అక్కడే ఉండు అన్నారు. ఓ పదిహేను నిమిషాలకు వచ్చేసి నా చేతిలో మూడు కాగితాలు పెట్టారు. నేను చదివి మొదటి కాగితం ఉంచి మిగతా రెండు కాగితాలు చెత్త బుట్టలో వేశాను. "అదేమిటి పడేస్తున్నావ్?" అన్నారు. "మీరు మొదటి పేజీలో చెప్పిన దాన్ని మిగతా రెండు కాగితాల్లో ఖండించారు" అన్నాను. రాంభట్లతో ఓ సమస్య ఉండేది. రాసేటప్పుడు ఆయన చేయి కన్నా ఆయన ఆలోచనలు అపరిమితమైన వేగంతో పరు గెత్తేవి. అందుకే బండి పట్టాలు తప్పేది. "ఆ మొదటి కాగితంలో చివరి లైన్ ఏమిటో చదువు" అన్నారు. ఇక అక్కడి నుంచి నాకు డిక్టేట్ చేస్తూ పోయారు. అది ప్రగతి గుప్త రాసిన చిన్న పుస్తకం "అస్తి స్మృతులు"కు ముందుమాట. అది ఎన్నటికైనా ప్రామాణిక మైందే. ఏటుకూరి ప్రసాద్ "ఎర్రజెండా", నవీన్ కథల పుస్తకం "లైఫ్ ఇన్ ఎ కాలేజ్"కు రాసిన ముందు మాటలూ అలాంటివే.

"నేను చాలా రోజులు రాంభట్లకు "గణపతి"ని. ఆయన చెప్తూ ఉంటే రాసేవాడిని. మధ్యలో దారి తప్పితే గుర్తు చేసేవాడిని. అంపశయ్య నవీన్ "లైఫ్ ఇన్ ఎ కాలేజ్"కు ముందుమాట రాసే ముందు నేనూ, రాంభట్ల అనేక రోజులు చైతన్య స్రవంతి గురించి మాట్లాడుకున్నాం. నేను అప్పటికీ ఎం.ఏ. సంస్కృతం చదువుతున్నాను కనక ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు అని నా అజీర్తినంతానంతా బయట పెట్టేవాడిని. ఆ ముందు మాటకూ నేనే "గణపతి"ని. ఏదైనా సమావేశంలో మాట్లాడే ముందు "ఫ్రెండూ! ఏం మాట్లాడమంటావ్?" అనేవారు. నాకు తోచింది చెప్పే వాడిని. ఓ చిన్న కాగితం మీద ఆ పాయింట్లు రాసుకుని జేబులో పెట్టుకునే వారు. అయితే మళ్లీ ఆ చీటీ తీసి చూసిన జ్ఞాపకం మాత్రం నాకు లేదు. రాంభట్ల ఈ లోకం నుం చి నిష్క్రమించడానికి కొద్ది నెలల ముందు ఆయన ఇంటికెళ్లాను. మాకిద్దరికీ అలవాటైన రీతిలో జరిగిన సంభాషణ ఇది:

"ఊ! ఇంతకి ఏంటటావ్?"

"దేని గురించి?" "అదే నా పుస్తకం (సొంతకథ) గురించి."

"రాశానుగా!"

కొంతసేపు మౌనం తర్వాత "తప్పులున్నాయంటావ్?"

"అదీ రాశానుగా!"

"చదివానులే."

మరి కొంతసేపు తరవాత మౌనాన్ని చీలుస్తూ "ఆ తప్పులకు కారణం ఎవరు?" అన్నారు రాంభట్ల.

"పుస్తకం మీది, నాకెలా తెలుస్తుంది?"

"ఇది వరకంతా నేను చెప్తూ ఉంటే నువ్వు రాసుకునే వాడివి. గత పదేళ్ల నుంచి నువ్వు విశాఖపట్నం, విజయవాడ మళ్లీ విశాఖపట్నం అని తిరుగుతున్నావు. నేను చెప్తే రాసుకునే వాళ్లు లేరు. తప్పులొస్తే వచ్చి ఉంటాయి. దానికి నీదే బాధ్యత" అన్నారు. ఇది ఆయనకు నా మీదున్న అభిమానానికి సంకేతం. నేను రాంభట్లను విపరీతంగా అభిమానించాను. ఆయన నా మీద అపరిమితమైన ప్రేమ కురిపించారు. నా మిత్రుడు, రాంభట్ల ప్రిన్సిపల్‌గా ఉన్నప్పుడు ఈనాడు మొదటి బ్యాచ్‌లో ఉన్న దేవులపల్లి అమర్ నేనేదో రోడ్డు మీద ఉన్నప్పుడు ఏదో అనుమానం అడుగుతాడు. నాకు తెలియదు అంటే "మరి నువ్వు చెప్పకపోతే నాకు ఎవరు చెప్తారు. రాంభట్ల లేదు గదా" అంటాడు. రాంభట్లను అభిమానించే వారందరమూ ఆయన జ్ఞాన సంపద చూసి మురిసిపోయే వాళ్లమే.

అందరికీ సమాన హోదా కల్పించడానికి మన రాజ్యాంగ పీఠిక పూచీ పడుతోంది. సమానావకాశాలు కల్పించినా వాటిని వినియోగించుకునే స్తోమత అందరికీ ఉండదు. అవకాశాల

లేమిలో ఉన్న అవరోధాలను అధిగమించి అవకాశాలను పొందే సామర్థ్యం కొందరికే ఉంటుంది. రాంభట్ల ఆ పనే చేశారు. ఆయనకు బడికెళ్లి చదువుకునే అవకాశం అంతగా లేదు. అయిదవ తరగతి గట్టెక్కకుండానే చదువు ఆపేయవలసి వచ్చింది. అదీ ఉర్దూ మీడియం చదువే. అంటే పాఠశాల విద్యకు అంతరాయం కలిగిందే తప్ప చదువుకోవాలనే తపన తగ్గలేదు. తొలిదశలో ఆబగా జ్ఞానం సంపాదించడానికి దొరికిన పుస్తకమల్లా చదివారు. తెలుగు మాత్రమే కాకుండా ఇంగ్లీషు, సంస్కృత భాషల్నీ నేర్చుకున్నారు. వైదిక సంస్కృతం, లౌకిక సంస్కృతం మీద కూడా పట్టు సంపాదించారు. వేద భూమి, వేల్పులకథ, జనకథలో ఆయన మన సమాజ మూలాల అన్వేషణకు పడిన తపన ద్యోతకం అవుతుంది.

**అకడమిక్ చదువు లేకపోవడం రాంభట్లకు మేలే చేసింది. అకడమిక్ పండుతుడు అన్న నింద తప్పించుకున్నారు. దొరికిన సమాచారాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించారు. కొత్త సూత్రీ కరణలు చేశారు. కచ్చితమైన సూత్రీకరణ సాధ్యం కానప్పుడు ఊహలు చేశారు. ఆ ఊహలు శిలాశాసనాలు కాకపోవచ్చు. కానీ భవిష్యత్ పరిశోధకులకు అపారమైన ముడి సరుకుగా, దివిటీగా ఉపకరిస్తాయి.**

ఆయన తెలుగు తెలుగులా రాశారు. తెలుగు భాషా స్వభావం పొట్టి వాక్యాలన్న తెలివిడి ఉండేదు. సంస్కృతం, ఇంగ్లీషు తెలిసినా ఆ వాక్య నిర్మాణ పద్ధతి ప్రభావం ఆయన రాతలో కనిపించదు. ఎదుటివారిని తన వాదనా పటిమ ద్వారా ఒప్పించగలిగారు. ఆయనతో మాట్లాడను, మాట్లాడితే కన్విన్స్ చేసేస్తారు అని బాహాటంగానే చెప్పిన విప్లవవాదులూ ఉన్నారు. గుడిపాటి వెంకటాచలం లాంటి రచయితల ప్రతిభ గుర్తిస్తూనే, పడ్డ బాధలను అంగీకరిస్తూనే ఆయన కేవలం భావ వాది అని తేల్చేశారు రాంభట్ల.

ఒకానొక సందర్భంలో రాంభట్ల జానపద సాహిత్యం మీద ప్రసంగిస్తుంటే జానపద సాహిత్యం మీద పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టా పుచ్చుకుని అనేక మంది పరిశోధకులకు మార్గదర్శకంగా ఉన్న ఓ ప్రొఫెసర్ వంచిన తలెత్తకుండా నోట్స్ రాసుకున్నారు. అమర్ అనుమానమే నాది. ఇప్పుడు మాకు అనుమానం వస్తే చెప్పడానికి రాంభట్ల లేడు. మాకు అనుమానమే రాకుండా ఆయన చెప్పిన ప్రతి విషయాన్నీ బుర్రలో నిలవ చేసుకునే తాహతు బహుశా మాకెవరికీ అబ్బలేదు. అగస్త్యుడిలా ఆయన జ్ఞాన సంద్రాన్ని ఆపోసన పట్టేశారు. నిజానికి ఆయన ఒక ఆలోచనా యంత్రం. ❑

## తత్వం

అనగా అనగా ఆంధ్రదేశమున
అధికారానికి వచ్చారయ్యా
అకస్మాత్తుగా ముగ్గురు రాజులు
ఒకరికి ఊరూ లేదూ-రెండు పేరూ లేదు!

ఊరూ పేరూ లేని రాజులూ
పట్టంకట్టే సంకల్పంతో
ఇట్టటు దిక్కులు పరకాయిస్తే
జాగా కానా రాదూ-చెప్తే వినాలేదూ!

కనివిని ఎరుగని కందనవోలు
కాలవగట్టున డేరా వేసీ
సాలు రాబడిని గుణించి చూస్తే
రాబడి సున్నకు సున్న-పోబడి హళ్ళికి హళ్ళి!

హళ్ళికి సున్నకు పెళ్ళీ చేయ పం
దిళ్ళు వేసి పెద్దలను పిలవగా
వచ్చిన మూడూ రూపాయిల్లో
ఒకటి చెల్లాచెల్లదూ-రెండూ ఒల్లానొల్లవూ!

చెల్లని ఒల్లని రూపాయలతో
పుల్లలు కంపలు కొని తెప్పించీ
ముద్దుగ మూడూ మేడలు వేస్తే
ఒకటికి గోడల్లేవూ-రెంటికి కొప్పుల్లేవూ!

గోడలు కప్పులు లేని మేడలో
నీడలు పారని కొలువు కూటమున
వరసగ మూడు తఖ్తులు వేస్తే
ఒకటికి కోళ్ళూ లేవూ-రెంటికి తాళ్ళూ లేవూ!

కాళ్ళూ కోళ్ళూ లేని తఖ్తుపై
కళ్ళూ ఒళ్ళూ కానని ఆనని
ముగ్గురు రాజులు కొలువున్నారు
ఒకరు కదలా కదలరూ-ఇద్దరు మెదలా మెదలరూ!

కదలని మెదలని రాజుల పొగడగ
వందనాలతో బందగీలతో
వచ్చారయ్యా ముగ్గురు బట్టులు
ఒకరికి మాటా లేదూ-ఇద్దరు మంతీ లేదు!

మాటా మంతీ లేని బట్టులూ
పోటా పోటీ పడుతూ మూడూ
చాటుపద్యాలు చదివారయ్యా
ఒకటికి ప్రాసా లేదూ-రెంటికి భాషా లేదూ!

భాషా ప్రాసా లేని పొగడ్తకు
భలే ఖుషీ అయిపోయిన రాజులు
ఇచ్చారయ్యా మూడు ఇనాములు
ఒకటీ కానా రాదూ-రెండూ లేనే లేవూ!

హుళక్కి బహుమతి పొందిన బట్టులు
బజారులో పదిమంది ముందరా
మౌనంగా బిట్టేడ్చారయ్యా
దీని భావామేమీ? దీని తత్వామేమీ??

**- రాంభట్ల కృష్ణమూర్తి శశ విషాణం నుంచి 14 జనవరి 1954**

# ప్రజల కోసం పాండిత్యం

## సహచర స్మరణ

- చందు సుబ్బారావు



అసలే ఆయన ఇంటి పేరు మా విశాఖలో పండిత కుటుంబాల వారిది. సంప్రదాయవాదులు. మార్పుకు దూరంగా మసలే వారు. నాబోటి వాడిని అల్లంత దూరంలో ఉంచేవారు. ఇది చాలదన్నట్టు 1971 ప్రాంతంలో అ.ర.సం. పునర్నిర్మాణ కార్యానికి బయల్దేరిన గజ్జెల మల్లారెడ్డితోపాటు రాంభట్ల వచ్చినప్పుడు జడుసుకున్నాను. గజ్జెల గారితో అప్పటికే పరిచయం ఉన్నా ఈ కృష్ణమూర్తి ఎవరో దేవుడా అనుకుంటూ. పైగా నోరు విప్పితే చాలు వేదాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ప్రబంధాలు - ఇంకా గట్టిగా కదిపావో మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావో, గోర్కీ, టాల్‌స్టాయ్!

చాల్లేదని ఏదైనా వాదించబోయావో కాళిదాసు, భవభూతి, ఆది శంకరుడు, ఆనందవర్ధనుడూ.. ఏమన్నారో, ఏమనలేదో! మనకేం తెలుస్తుంది.

మనది మూడో తరగతి పాండిత్యం కదా. యువ కిశోరులం! అభ్యుదయ భావావేశ ప్రకాండులం! ఏదో మాట్లాడాలని నాకొచ్చిన 'శివ తాండవ స్తోత్రం'లోని 'జటా కటాహ.. ధరాధరేంద్రనందినీ.. ధగద్ధగవినిర్గమత్' అంటూ మొదలెట్టాను. 'మిత్రమా నేర్చుకుంటే క్షుణ్ణంగా దోష రహితంగా నేర్చుకోవాలి. మనలో దోషాల్ని పట్టుకోవాలని పండితలోకం పొంచి ఉంటుంది జాగ్రత్త' అంటూ నేను చెప్పిన శ్లోకంలోని దోషాలు ఎత్తి చూపాడు ! హహ్హహ్హ.. మళ్లీ ఆయన ముందు సంస్కృత శ్లోకాలు చదివితే ఒట్టు!

నేను యూనివర్సిటీ లెక్చరర్‌ను. సైన్సులో డాక్టరేట్‌ను. ఆధునిక సాహిత్యం, సమాజం, పార్టీ, అ.ర.సం - విరాసాదుల గురించి కొద్దో గొప్పో తెలిసిన వాణ్ని.. వాళ్లతో మసలుతున్న వాడిని, మా మల్లారెడ్డి గారిలా తగినంత ప్రేమగా "చందూ.. ఏం చేస్తున్నావ్.. కులాసానా" అంటూ పలకరిస్తాడనుకుంటే ఈ రాంభట్ల ఏమిటో.. గంటల తరబడి బోధన.. అంతం లేని ఉపన్యాస వేదన. ఏ మాట చెప్పినా దాని పుట్టుపూర్వోత్తరాల గురించి వివరణ.. సవరణ.. నాకు మాత్రం మెప్పు నిరాకరణ. పాండిత్యం ఎవరి కోసం? ఒకసారి రాంభట్లే 'విశ్వనాథ పాండిత్యం ప్రజల కోసం కాదు. పండితోత్తముల కోసం' అన్నాడు. 'హహ్హహ్హ..!' "వారి క్కూడా అందనంత శైలిలో రాశాడనుకోండి".. హహ్హహ్హ! నాకు నవ్వు రాలేదు. విశ్వనాథ గురించి చెబితే మళ్లీ ఏమంటాడనుకుని.. ప్రజలు.. సాహిత్యం.. వేమన.. బ్రహ్మేంద్ర.. బసవన్న అన్నాను. వేమన్నకు ముందు.. బసవన్నకు వెనక.. బ్రహ్మేంద్రకు ఆధారం.. అంటూ మూడు గంటలు వివరించాడు. బతుకు జీవుడా అనుకుంటూ మౌనం వహించాను !

ఒకసారి హోటల్ డాల్ఫిన్‌లో ఏదో అ.ర.సం. కార్యక్రమం కోసం వచ్చాడు రాంభట్ల. మా ఖర్మ కాలి మల్లారెడ్డి రాలేదు. మొత్తం సమయం ఆయనకే ధారాదత్తం అయ్యింది. రాంభట్ల మీద అభిమానం ఉన్న నా స్నేహితుడు, ఆంధ్ర విశ్వ విద్యాలయ సహోపాధ్యాయుడు ఐ.సి.హెచ్. బసవరాజు ఉరఫ్ జ్యేష్ఠ కూడా వచ్చాడు. లంచ్ టైంలో కలిసాం. కలిసి భోం చేసాం.

ఆనక జ్యేష్ఠ "మీరు అ.ర.సం.లో మంచి పండితులని విన్నాం.. అందుకే వచ్చాను" అన్నాడు. ఆయన అ.ర.సం. సభ్యుడు కాదు. సానుభూతిపరుడు మాత్రమే.

జ్యేష్ఠకు బదులుగా "మీ దృష్టిలో పాండిత్యం అంటే ఏమిటి?" అనడిగాడు.

"ఎక్కువ చదువు.. ఎక్కువ ఎరుక.. ఎక్కువ ఆధిపత్యం" అన్నాడు జ్యేష్ఠ.

రాంభట్ల విచిత్రంగా నవ్వి.. "విశ్వనాథ వారికి మేనిఫెస్టో అంటే ఏమిటో తెలియదు. కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రభావంతో ప్రపంచంలోని మూడో వంతు ప్రజలు సోషలిస్టు సమాజంలో జీవిస్తున్నారు. ఎలా.. ఎందుకు.. ఏమిటి తేడా అని ఆయనకు తెలుసునా?"

"తెలియదు గాక తెలియదు" నేను!

"తెలియకపోవచ్చును. ఆయన రంగం కాదు కదా" జ్యేష్ఠ.

పాండిత్యానికి రంగాలుండవు. వీరంగాలు "శ్రీరంగాలే" ఉంటాయి.. తరంగాలే ఉంటాయి. సైనిక మార్చ్ విప్లవ తరంగాలే ఉంటాయి. అర్థం కాకపోతే నీ పాండిత్యానికి తీవ్ర భంగం కలుగుతుంది" అన్నాడు.

### జ్యేష్ఠ మౌనం!

ఆయనతో అనేకమార్లు స్టాండింగులూ, సిట్టింగులూ చేసిన నేను కూడా రాంభట్లను ఎదిరించలేకపోయాను. కుదించలేక పోయాను. ఆ రోజు డాల్ఫిన్‌లో 'ఐదు గంటలసేపు ఉపన్యాసం..

బోధన.. శోధన. ఒక్కసారి ధైర్య చేసి "శశ విషాణం"లో గీతాలు వినిపించాను. ఆయన చిరునవ్వు.

"మీ కార్టూన్లు చూశాను" అంటూ మరొకమారు పోజిచ్చాను.

"కార్టూన్ అనే పదం ఎలా వచ్చిందో తెలుసా మిత్రమా" అనడిగాడు!

చచ్చాన్రా దేవుడా అనుకుంటూ తలవంచుకున్నాను.

నన్ను ప్రేమతో, అభిమానంతో, అ.ర.సం. విశాఖ కార్యదర్శినన్న ఆదరణతో, సాహిత్య జీవినన్న అనురాగంతో, సాటికార్యశీలత కలిగిన ఉద్యమ భాగస్వామినన్న అభిమానంతో చూచినమాట వాస్తవమే. సమాన హోదాతో మాట్లాడాలన్న కుతీ, దుగ్ధ, అహం, వాంఛ నెరవేరలేదు. సరిగదా.. ప్రతిసారీ అవమానమే.. పరాభవమే. కించిత్తు మౌనం. కూసింత అభిమానం!!

హహ్హహ్హ.. ఈసారి నాదే పైచేయి.

రాంభట్ల కృష్ణమూర్తి గారి మౌనం ఖాయం. హహ్హహ్హ.. అనుకుంటూ సాయంత్రం 'సిట్టింగు'లో గురువు గారూ చర్ల గణపతి శాస్త్రి గారు నాకు మంచి స్నేహితులయ్యారు. సంస్కృతాంధ్ర పండితులు" అంటూ ఇహిహి...అన్నాను.

"మిత్రమా.. మంచి పరిణామం. చర్ల గారు రాసిన కావ్యాలన్నీ చదివారా ? ఆయన గాంధేయుడని తెలుసా? "పాండిత్యం ప్రజల కోసమే" అన్న గ్రంథాల సారాంశం ఎరుగుదురా? ఆయన లాక్షణిక అలంకార శాస్త్రాలను తెలుగులో అనువదించారని తెలుసునా ? చర్ల వారిని చిట్టచివరి అలంకార శాస్త్రజ్ఞుడని ఎందుకన్నారు ?"

ఎందుకన్నారో మనకెలా తెలుస్తుంది?!!

కనీసం చర్ల వారిని కలిసారా.. వెరీగుడ్. అభినందనలు. అంటాడనుకున్నాను. ఈ కృష్ణమూర్తి గారు నాకు చర్ల వారి గురించి వివరిస్తాడనుకున్నాను. 'You are a mediocre stupid' అన్నట్లు ఆయన కళ్లల్లో నాకు కనిపించింది. ఆయన పెదవుల్లో నాకు వినిపించింది. నిజం చెప్పొద్దూ.. చర్ల ఏదో ఓల్డ్ పండితుడు అనుకున్నాం. దేవుడా.. "గాంధీజీతో సంప్రదాయం పై తర్కించిన మేధావి" అని నాకేం తెలుసును!

"మిత్రమా.. శశవిషాణం గీతాల నుంచి.. నిన్న మొన్నటి గీతాల వరకూ...!

"చింతేల నిగ్రహించు బలం లేకపోయినా
గొంతెత్తి మానిషాద మలాపించుతూ పద...
కొవ్వొత్తిలాగ కాలి ప్రదీపించు వారికి
చెయ్యెత్తి లాల్ సలాం సమర్పించుతూ పద" అన్న ఇటీవల తన గీతం. ఆనంద సంగీతం. సహృదయానంద సంఘర్షణా కేతనం..!! అని మాత్రం అర్థమైంది.

నాతోపాటు నా మిత్రుడు, సోదరుడు అదృష్టదీపక్ ఇదే సందిగ్ధంలో పడ్డాడు. సంక్షోభంలో చిక్కుకున్నాడు. నిజానికి గజ్జెల, రాంభట్ల ద్వయంతో అదృష్ట దీపక్‌కు నాకంటే ఎక్కువ సాన్నిహిత్యమూ, సాహిత్య బాంధవ్యమూ, సరస సమీకృత బంధమూ ఉన్నాయి.

కానీ ఫలితం ఇద్దరికీ సున్నానే. కానీ.. ఏళ్లు గడిచే కొద్దీ మా అ.ర.సం. పునర్నిర్మాణం జరిగే కొద్దీ 1980, 1990 ప్రాంతానికి ఈ ద్వయం కృష్ణార్జునుల్లా మమ్మల్ని లొంగదీశారు. శిక్షణ ఇచ్చారు. ప్రజల కోసం పాండిత్యం అంటూ రాంభట్ల మాకు నూతన సందేశం ఇచ్చారు. మమ్మల్ని మురిపించారు. పాండితీ మండిత మహా కుంభవృష్టి మాపై కురిపించారు. అ.ర.సం. కోసం తన పాండిత్య దృష్టి, గమనం మళ్లించారు. "ప్రజలకు వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, అరణ్యకాలు, బుద్ధ దేవుడు, క్రీస్తు, గుప్తులు, మౌర్యులు ఏం చెప్పారు" అంటూ వివరించి, వింగడించి, విశ్లేషిమంచే మా రాంభట్ల కృష్ణమూర్తి పాత్ర ఏమిటో ఇంకా వివరించాలా?!! ❑

## జయీభవ!

పంతాల బాపయ్య ఓ పంతులయ్య
గంజి కావడి గేయ సంజీవరాయ

ముందుబాసలు చేస్తె ముట్టేది లేదు
కమిటీలలో వేస్తె కడుపు నిండాదు

సెక్రటరీ పనిని చేసేది లేదు
ఉపమంత్రి పదవిస్తె ఒప్పేది లేదు

మంత్రి పదవొకటిస్తె మాకదే చాలు
అడగబోవుటలేదు మడులు మాన్యాలు

అయ్యవార్లకు చాలు అర్ధజీతాలు
పిల్లవాళ్ళకి చాలు పూటపాఠాలు

జయవిజయీభవ! దిగ్విజయీభవ!!

**(17 అక్టోబర్ 1953)**

**(రాంభట్ల శశ విషాణం నుంచి)**

సహచర స్మరణ

# విజ్ఞాన ఖని



-కేశవ్ గోపాల్

కొన్ని జ్ఞాపకాలు తాత్కాలికంగా మరుగున పడతాయేమో గానీ, మరపురావు. వాటికి వయసు లేదు. రాంభట్ల కృష్ణమూర్తి గారిని నిన్న గాక మొన్న కలుసుకున్నట్లుంది. హైదరాబాదులో చిక్కడపల్లి నుంచి హిమాయత్‌నగర్ వరకూ నడుచుకుంటూ వచ్చి, సంగం హోటల్ ముందర 'ఏంటి బ్రదరూ.. జరంత చాయ్ కొడ్దామ' – అంటూ (కరచాలనం చేస్తూ) వినిపించినట్లు న్నాయ్ ఆయన మాటలు. ఎదుటి మనిషి చదువు, వయసు, హోదాలతో నిమిత్తం లేకుండా పలకరించే తీరు ఆయనది. ఆయన సాన్నిహిత్యంలో ఏదో మాయ ఉన్నట్లనిపిస్తుంది. ఏ విషయం గురించైనా అలుపు లేకుండా మాట్లాడగలరు – తత్త్వ శాస్త్ర మూలాలు మొదలుకుని మార్క్సిస్టు అర్థశాస్త్రం దాకా, భాష పుట్టు పూర్వోత్తరాలు మొదలుకుని భాషా వికాసం, కవిత్వాల దాకా, భాష పుట్టక ముందు ఆదిమానవులు గుహల్లో చెక్కిన రాతి బొమ్మలు మొదలుకుని ఆధునిక కళాధోరణుల దాకా, సంగీతం, ఆయుర్వేదం, శిల్ప శాస్త్రాల దాకా – మధ్యలో పేర్లూ, ఊర్లతో సహా – తడుముకోకుండా చెప్పగలరు ఆయన.

1972లో అనుకుంటాను, నేను హిమాయత్ నగర్‌లో ఇస్కస్ (భారత–సోవియట్ సంఘంలో) డాక్టర్ శ్రీమతి పద్మావతి శాస్త్రి ఆధ్వర్యంలో నడిచే సాయంకాల తరగతుల్లో రష్యన్ భాష నేర్చుకుంటూ ఉండేవాణ్ణి. విశాలాంధ్ర(విజయవాడ) దినపత్రికలో అప్పటికే నా కథలూ, వ్యాసాలూ, కవితలూ కొన్ని ప్రచురితమయ్యాయి. ఆ పత్రికకు మొదటిసారి కడప జిల్లాలోని లక్కిరెడ్డిపల్లి బ్లాక్‌లోని ఒక ప్రాథమిక పాఠశాల శిథిలస్థితి గురించి, పనితీరు గురించి ఛాయా చిత్రాలతో సహా పంపించిన ఒక పెద్ద వ్యాసం అచ్చయింది. అప్పట్లో అది చూసిన నిడమర్తి ఉమారాజేశ్వరరావు నన్ను ఇంకా రాయమని ఉత్తరం రాశారు. ఉద్యోగరీత్యా నేను హైదరాబాద్‌కు తరలి వచ్చాను. అప్పుడు నా వయసు 30 ఏళ్ళు. హిమాయత్‌నగర్‌లో విశాలాంధ్ర కార్యాలయానికి దాదాపు రోజూ వెళ్తుండేవాణ్ణి. అక్కడే నాకు విశాలాంధ్ర విలేకరులు మక్కెన సుబ్బారావు, కె.శ్రీనివాసరెడ్డి, టెలీప్రింటర్ ఆపరేటర్ కొండా లక్ష్మణరావు, అరసం ప్రధాన కార్యదర్శి ఏటుకూరి ప్రసాద్ పరిచయం చేశారు. రాంభట్లను తరచూ కలుస్తూ ఉండేవాణ్ణి – మనిషి పొడగరి, సన్నగా ఉండేవారు. అప్పటికే జుత్తు చాలా వరకూ నెరిసి ఉండేది. మధ్యపాపిటి, గుబురు కనుబొమ్మల కింద కళ్ళద్దాలు, పల్చటి పెదాలు, ముందరి జుత్తు పాయలు కిందికి వంగి పొట్టేలు కొమ్ముల్లాగా విశాలమైన నుదుటి మీద రెండు వైపులా వేలాడుతూ ఉండేవి. మీసాలు పెట్టుకునేవారు కాదు. ఆయన్ను చూస్తే ఒక విలక్షణ నటుడు రంగస్థలం మీద నుంచి అప్పుడే రంగు తుడిచేసుకుని వచ్చినట్లుగా ఉండేవారు.

రాంభట్ల ఎలాంటి భేషజం లేకుండా మాట్లాడేవారు. హాస్య ప్రియుడు. చమత్కారం, అప్పుడప్పుడు మాటల్లో ధ్వనించేవి. ఒకటి రెండుసార్లు ఆయనతో మాట్లాడితే చాలు, మళ్ళీ ఎప్పుడు కలుస్తారా, మళ్ళీ ఎప్పుడు ఆయన మాటలు విందామా అనిపించేది.

**ఆయన ఎక్కడుంటే అక్కడ చుట్టూ ముగ్గురు, నలుగురైనా యువకులు ఉండేవారు. యువకులంటే ఆయనకు అపారమైన అభిమానం. యువశక్తికి పెద్దల అనుభవం కూడా తోడైతే వాళ్ళు ఏదైనా సాధించగలరని ఆయన విశ్వసించేవారు. ప్రముఖ పాత్రికేయులు, ప్రస్తుత తెలంగాణ అ.ర.సం. అధ్యక్షులు అర్వీ రామారావు, హైదరాబాద్ తెలుగు విశ్వ విద్యాలయ ఉపకులపతిగా పనిచేసిన యస్వీ సత్యనారాయణ, రచయిత, పాత్రికేయులు మందలపర్తి కిషోర్, కాచినేని రామారావు ఆయన్ను గురుభావంతో చూసేవారంటే వారికి అభ్యంతరం ఉండదేమో! అప్పట్లో ఆంధ్రప్రదేశ్ అ.ర.సం. ప్రధాన కార్యదర్శి ఏటుకూరి ప్రసాద్, 'అన్న'గా అందరికీ సుపరిచితుడైన నల్లూరి వెంకటేశ్వర్లు, (సినీ నటులు కూడా), కె.ప్రతాపరెడ్డి, ఎ.పుల్లారెడ్డి తదితరులు ప్రజానాట్యమండలి పునరుద్ధరణకు ప్రత్యక్షంగా కృషి చేశారు.**

అప్పుడే యువగాయనీ గాయకులు ఆర్.ప్రభు(నాంపల్లి టేషను కాడా పాట) రామచంద్రారెడ్డి, శ్రీమతి శారద తదితరులు వెలుగులోకి, ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆ సందర్భంగా రాంభట్ల కృష్ణమూర్తి తమ విలువైన సలహాలు, సూచనలతో ప్రజా నాట్య మండలి కార్యక్రమాలను ముందుకు నడిపించారు. సంగీత పరంగా సినీ సంగీత దర్శకులు సి.మోహన్‌దాస్(తోబుట్టువులు చిత్రం)తోబాటు రాంభట్ల యువకులతో పాటలు, గేయాలు

రాయించి దగ్గరుండి వాటికి స్వరకల్పన చేయించడంలో నిర్విరామ కృషిచేశారు.

తేదీలు నాకు గుర్తు లేవుగానీ, ప్రజా నాట్య మండలి హైదరాబాద్ రవీంద్రభారతిలో ఒక చక్కటి సంగీత నృత్య రూపకం, ఉక్కు పిడికిళ్ళు నాటిక (నా రచన) ప్రదర్శించింది. ఏటుకూరి ప్రసాద్ పట్టుబట్టకపోతే, రాంభట్ల నాకు మార్గ దర్శకత్వం చేయకపోయి ఉంటే ఆ నాటికను నేను రాయగలిగే వాణ్ణి కాదు (ఆ నాటిక తర్వాత ఆంధ్రప్రదేశ్ అంతటా వందకు పైగా ప్రదర్శనలకు నోచుకుంది).

అప్పటికే హిమాయత్ నగర్లో ఒక మేడ మీద చిన్న గదిలో అ.ర.సం. కృషితో నార్ల చిరంజీవి గ్రంథాలయం ప్రారంభ మైంది. అక్కడికి రాంభట్ల దాదాపు రోజూ వచ్చి కూర్చునేవారు. సాయంత్రం నాలుగున్నర నుంచీ ఎనిమిది గంటల దాకా నేనూ హాజరు. దాశరథి రంగాచార్య, శ్రీమతి పరిమళా సోమేశ్వర్ (అప్పుడు అ.ర.సం. అధ్యక్షులు), బూదరాజు రాధాకృష్ణ (ప్రముఖ భాషా శాస్త్రవేత్త, విమర్శకులు, తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్), గజ్జెల మల్లారెడ్డి (ప్రముఖ కవి, వక్త), దేవరాజు మహారాజు, ఇంకా చాలా మంది యువ రచయితలు అక్కడ కలుసుకునేవారు. ప్రసిద్ధ రచయితలు చాలా మంది అ.ర.సం. ఆఫీసుకు వస్తూ ఉండేవారు. వారిలో ఈనాడు వ్యంగ్య చిత్రకారుడు శ్రీధర్ కూడా ఒకరు. ఆర్వీ రామారావు, యస్వీ సత్యనారాయణ నాకు అక్కడే పరిచయం. ప్రముఖ భాషా శాస్త్రవేత్త తిరుమల రామచంద్రను, అంపశయ్య నవీన్‌ను మొద టిసారి నేను అక్కడే కలిశాను. యువ రచయితలు తమ కవితలు చదివి వినిపించేవారు. బాలకృష్ణ కులకర్ణి అనే యువకుడు హిందీలో రెండు, నాలుగు పాదాలతో చిన్న కవితలు వినిపించే వారు. ఇలా ఆ గ్రంథాలయం ఒక పాఠశాలగా మారింది. అక్కడ రాంభట్ల అనేక విషయాల మీద మాట్లాడుతూ ఉండేవారు. ఇదంతా ఎందుకు రాయల్సి వచ్చిందంటే – ఆయన ప్రధాన ఆకర్షణ అని చెప్పడానికి.

రాంభట్ల యువకుల్లో యువకుడిగా కలిసిపోయేవారు. హుషారు, సాదాసీదాతనం, మనిషిని తలతిప్పుకోనివ్వని వాక్పటిమ ఆయన ప్రత్యేకత. అడవి బాపిరాజు గారి సంపాదకత్వంలో మీజాన్‌లో పనిచేశారు. పాత్రికేయుడు, విమర్శకుడు, రచయిత, కవిగానే గాకుండా ఆయన చిత్రకారుడు కూడా. ప్రస్తుతం 'విశాలాంధ్ర' అని దినపత్రిక మీద కనిపించే పెద్ద అక్షరాలు రూపొందించింది ఆయనే. టి.వేంకటేశ్వరరావు, మోహన్ కంటే చాలా ముందు 'విశాలాంధ్ర'లో వ్యంగ్య చిత్రాలు వేసేవారు. నాకు పరిచయమైన తర్వాత కూడా ఆయన చిత్తు కాగితాల మీద తన షీఫర్ పెన్‌తో బొమ్మలు, రేఖా చిత్రాలు గీస్తుండే వారు. నేను ఒకటి రెండుసార్లు ఆయన ముఖాకృతిని రేఖాచిత్రం గీయడానికి ప్రయత్నించాను. ఆయన ఎదురుగానే. చూసి బాగుందన్నారు.

ఆయన దగ్గర నాకు బాగా చనువుండేది. ఒకసారి ఆయనతో పాటు వాళ్ళింటికెళ్ళాను. చిక్కడపల్లిలో. నా దగ్గర ట్విన్ లెన్స్ 120 కెమెరా ఉండేది. ప్రముఖ సాహిత్య విమర్శకులు, రచయిత, అనువాదకులు రాచమల్లు రామచంద్రారెడ్డి(రా.రా) మాస్కో ప్రగతి ప్రచురణాలయ సంస్థలో పనిచేస్తూ సెలవు మీద వచ్చినప్పుడు ఆ కెమెరాను నాకు బహుమతిగా ఇచ్చారు. అప్పుడది నా దగ్గరుంది. 'మీ ఫొటో తీస్తాను, రాంభట్ల గారూ!' అని అడిగాను. 'మన ముఖం బాగా రాదు మిత్రమా అయినా చూద్దాం!' అన్నారు. వాళ్ళింటి మెయిన్ గేట్‌కూ, ఇంటి లోపలికి వెళ్ళే ద్వారానికి మధ్య పైకప్పు లేకుండా దాదాపు, 5, 6 అడుగుల ఖాళీ స్థలం, పిట్టగోడ ఉండేది. అక్కడ ఆయన్ను కుర్చీలో కూర్చోబెట్టి తెలుపు – నలుపు ఫిల్మ్‌తో ఫొటో తీశాను. కడిగించి ప్రింట్ వేయించి ఆయనకు చూపిస్తే 'అరే! మన ముఖం ఇంత బాగా వచ్చిందే' అని సంబరపడిపోయారు. తర్వాత దాన్ని పెద్దది చేయించి ఇంట్లో పెట్టుకున్నట్లు నాకు గుర్తు. నాకు నచ్చిన విషయమేమంటే – అప్పుడు అక్కడ ఉన్న వెలుతురులోనే ఆయన రూపురేఖలు, బహుశా ఆయన స్వభావం కూడా వ్యక్తమయ్యేలా వచ్చింది ఆ ఫొటో. అది నాకొక మరపురాని అనుభవం.

తర్వాత నా జీవితంలో ఒక ముఖ్యమైన ఘటన. 1981 ఫిబ్రవరిలో నాకు యాక్సిడెంట్ జరిగింది. కుడికాలు మడమ మోటార్ బైక్ వెనక చక్రంలో ఇరుక్కుపోయి దాదాపు నుజ్జు నుజ్జయింది. ఉస్మానియా ఆసుపత్రిలో జరిగిన శస్త్రచికిత్స ఏ కారణాల వల్లనో విఫలమైంది. అప్పుడు నేను కొన్ని నెలలపాటు మఖ్దూం భవన్‌లో మంచం మీదే గడపాల్సి వచ్చింది. నా పరిస్థితిని చూసిన నీలం రాజశేఖర్‌రెడ్డిగారు తమ బాల్య మిత్రుడు డా.ఎన్. బాలకృష్ణా రెడ్డితో మాట్లాడి ప్లాస్టిక్ సర్జరీకి ఏర్పాటు చేశారు. డా.ఎన్.బాలకృష్ణా రెడ్డి ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్‌కు సుమారు మూడు గంటలకంటే ఎక్కువ సమయమే పట్టింది. నాకు ఆపరేషన్ జరగడానికి ముందు, జరిగి స్పృహ వచ్చిన తర్వాత రాత్రి తొమ్మిదిన్నర గంటలవరకూ రాంభట్ల నా పక్కనే ఉండిపోయారు. మిత్రులంటే అంత ఆప్యాయత, అభిమానం ఆయనది. ఇది నా జీవితంలో మరువలేని మనసులో ముద్ర వేసుకుపోయిన స్మృతి. భౌతికంగా రాంభట్ల గారిని కోల్పోవడం చాలామందికి, అ.ర.సం.కు తీరని లోటు. ఆయన మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సజీవ విజ్ఞాన సర్వస్వం అంటే అతిశయోక్తి కాదు. యువకులను వెన్నుతట్టి ప్రోత్సహిం చిన మార్గదర్శి. మంచి వక్త. ఆయన కలం పట్టి రాసేది అరుదు. అప్పట్లో "ఈనాడు" దినపత్రిక ఆదివారం సంపాదకీయం రాసే వారు. అది మిగతా

**(మిగతా 80వ పేజీలో)**

# రాంభట్ల జ్ఞాపకాలు

## సహచర స్మరణ

- అదృష్టదీపక్



రాంభట్ల కృష్ణమూర్తి, గజ్జెల మల్లారెడ్డి నాకు ఒకేసారి పరిచయమయ్యారు. పాతతరం పొడవు చేతుల చొక్కా పంచె కట్టులతో మల్లారెడ్డి అచ్చమైన తెలుగుతనానికి ప్రతినిధిగా ఉండేవారు. రాంభట్ల మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉండే వారు. 1970 దశకంలో మా కుర్రకారు అంతా నేరోకట్ పేంటులతో కుస్తీలు పడుతున్న రోజుల్లో రాంభట్ల బెల్ బాటం పేంటూ, పొడవుగా వేలాడే జులపాలూ, పెద్ద పెద్ద చెంప దుబ్బులూ, నడుం బెల్టుకు వేలాడే చిన్న తోలు ముక్కా - ఇలాంటి అతి నవీన వేషధారణతో 'కమ్యూనిస్టు హిప్పీ'లా ఉండేవారు. తాను పుట్టిన కోనసీమను గుర్తు చేసుకుంటూ "అయాం ఎ కోబ్రా" (కోనసీమ బ్రాహ్మడు) అని చమత్కారంగా చెప్పేవారు.

వేదాలు, దాస్ కేపిటల్, ప్రపంచ నాగరికతలు, సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం - ఇలా ఏ విషయం గురించి అయినా తడుముకోకుండా సాధికారంగా వివరించే రాంభట్ల చదువులో మాత్రం మిడిల్ స్కూలు గడప దాటలేదనేది పచ్చి నిజం! స్వయం కృషితో తెలుగు, సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో అపారమైన పాండిత్యం సంపాదించారు. సమకాలీన సమాజంలో 'నడిచే విజ్ఞాన సర్వస్వం'గా పేరు పొందారు.

ఒకసారి ఏదో పనిమీద హైదరాబాదు వెళ్లి ఈనాడు ఆఫీసులో రాంభట్లను కలిశాను. ఆయన అక్కడ అడ్మినిస్ట్రేటివ్ ఎడిటర్ హోదాలో ఉన్నారు. నేను వెళ్లేసరికి ఆయన ఎదురుగా టేబుల్ మీద 'ముప్పై రోజుల్లో కన్నడ భాష', కన్నడ - ఇంగ్లీషు నిఘంటువు' వంటి పుస్తకాలేవో ఉన్నాయి. "ఇవన్నీ ఎందుకు?" అని అడిగాను. "ఫ్రెండూ - మీ యువకులందరూ వచన కవితను ఉద్ధరిస్తున్నట్టు ఫోజు పెడుతున్నారు. పన్నెండవ శతాబ్దంలోనే అక్క మహదేవి కన్నడంలో అద్భుతమైన వచనాలు రాసి చదువుతుంటే జనం ఉద్రేకంతో ఊగిపోయేవారట! వాటిని అనువదించడం కోసం కన్నడం నేర్చుకుంటున్నాను" - ఇదీ ఆయన సమాధానం!

అపారమైన ఆయన అనుభవమూ, విజ్ఞానమూ ఉపన్యాసాలకే పరిమితం కావడాన్ని ప్రస్తావిస్తూ' ఆ విషయసంపద అంతా పుస్తకరూపంలో తీసుకొస్తే తరువాత తరాలకు ఉపయోగకరంగా ఉంటుంది కదా" అన్నాను. "నాకు రాసే ఓపిక లేదు. ఎవరైనా

### అంగార గంగ

బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
అంగార గంగలా తరంగించుతూ పద
అందాలచేలవాలె పతంగాల మూకలు
చండాగ్ని కీలలాగ ప్రదాహించుతూ పద
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
నేరాల కుమ్మరించె దురంతాల మబ్బులు
సంవర్త ఝంఝలాగ ప్రభంజించుతూ పద
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
చింతేల నిగ్రహించు బలం లేకపోయినా
గొంతెత్తి మానిషాదమలాపించుతూ పద
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
శాపాలతోటి కాళతమోరాసి తూలదు
ఏపాటిదైన వెల్గు ప్రసారించుతూ పద
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
కొవ్వొత్తిలాగ కాలి ప్రదీపించువారికి
చెయ్యెత్తి లాల్ సలాము సమర్పించుతూ పద!
బంగారుభూమి సూక్తమలాపించుతూ పద
అంగారగంగలాగ తరంగించుతూ పద

- రాంభట్ల

రాసిపెట్టాలి. నేను చెబుతుంటే రాయగలిగిన గణపతులేరీ? నువ్వూ, ఆర్వీ రామారావూ, మందలపర్తి కిషోర్ ఉన్నారు కానీ మీరెవ్వరూ నాకు అందుబాటులో ఉండరు" అన్నారు.

డా. గరికపాటి రాజారావు, సుంకర సత్యనారాయణ, నాజర్ లాంటి హేమాహేమీలతో ఒకనాడు ఉజ్వలంగా ప్రకాశించిన ప్రజా నాట్యమండలి వేరు వేరు కారణాలతో 1970 నాటికి నిస్తేజంగా తయారైంది. 1974లో పార్టీ కార్యక్రమాలలోనూ, మహాసభలలోనూ పాటలు పాడడానికి అత్యవసరంగా ఒక దళం

తయారైంది. ఆ దళానికి చలనచిత్ర సంగీత దర్శకుడు సి.మోహనదాస్ నాయకుడు. సినీ నేపథ్య గాయకుడు టి.ఆర్. జయదేవ్, నేను, కృష్ణమూర్తి (ప్రస్తుతం ఎస్పీ బాలుగారి 'స్వరాభిషేకం' కార్యక్రమానికి ఆర్కెస్ట్రా కండక్టర్), ప్రభు (నాంపల్లి టేసన్ కాడా ఫేం), రామచంద్రారెడ్డి సభ్యులుగా ఉండేవాళ్లం. మేము పాడవలసిన పాటల జాబితాలో రాంభట్ల ప్రసిద్ధ గీతం 'అంగారగంగ' కూడా ఉండేది. మా దళంలో మిగిలిన సభ్యులంతా నాకంటే మంచి గాయకులే కానీ "సంవర్త ఝుంఝులాగ ప్రభంజించుతూపద" లాంటి పదాలు స్పష్టంగా పలకలేకపోయేవారు. రెండు మూడుసార్లు విన్న రాంభట్ల అసంతృప్తితో గిలగిలలాడిపోయారు. "ఇక మీదట ఆ గీతం దీపక్ ఒక్కడే పాడతాడు. మిగిలిన వాళ్లెవరూ దాని జోలికి రాకండి" అని ఆర్డర్ జారీచేశారు.

నేను నిరుద్యోగ పర్వంలో ఉన్నప్పుడు రాంభట్ల "నీ గురించి మల్లకవి వివరంగా చెప్పాడు. నువ్వు ఈనాడుకి నిరభ్యంతరంగా రావచ్చు. అయితే 'జీర్ణమంగే సుభాషితం' అన్నట్టు నీకు అలవాటైన ఉద్యమాలకూ, ఊరేగింపులకూ దూరంగా ఉండాలి. నువ్వేమీ కంగారుపడకు – మా దగ్గరే ఉందువుగాని!" అంటూ ఉత్తరం రాశారు.

రాంభట్ల గేయాలలో సంస్కృత పద విన్యాసాలు ఎక్కువగా ఉండేవి. రావణస్తవం ఆయనకు మహా ఇష్టం. పంచచామర వృత్తాన్ని అలవోకగా నడిపేవారు. మఖ్దూం మొహియుద్దీన్‌ను అనువదించినా పంచచామరమే! రైతు పోరాట గీతం రాసినా అదే నడక! "దురాధికారదుర్దమం – దురాపవాదకర్దమం – రుషాకషాయ వీక్షణచ్ఛటాళిలో దహించుతూ..." ఇలా సాగుతుంది ఆ రైతు గీతం! నేను ఆయనకు రాసే ఉత్తరాలలో "రావణ భట్ల" "ఓం హ్రీం క్లీం భట్ల" అని సంబోధించేవాణ్ని. ఒకసారి ఆయన జవాబు రాస్తూ "నా కలానికి రెండు వైపులా పదునువుంది. ఉదాహరణకు ఈ పాట చూడు" అంటూ "అంబరావే – జగదంబరావే! కాళిరావే – మహంకాళి రావే!" అనే జానపద గీతం రాసి పంపారు. 17-11-1989 తేదీన నాకు రాసిన ఉత్తరంలో "నాలో సంస్కృత పద పిశాచావేశం చాలా తగ్గింది కాని పూర్తిగా తగ్గలేదు" అన్నారు.

తెలుగు పత్రికలలో పొలిటికల్ కార్టూన్‌లకూ, కార్టూన్ కవితలకూ ఆద్యుడు రాంభట్ల! కార్టూన్‌లు ఆర్.కృష్ణమూర్తి పేరుతోనూ, రన్నింగ్ కామెంటరీ "శశవిషాణం' పేరుతోనూ ప్రచురించిన సవ్యసాచిగా సంచలనం రేకెత్తించారు. కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకులు కూడా వాటికోసం 'విశాలాంధ్ర' పత్రిక చదివేవారట! 1954 ఆగస్టులో విశాలాంధ్ర ప్రచురణాలయం (విజయవాడ) వారు రాంభట్ల కృష్ణమూర్తిగారి 'శశవిషాణం గీతాలు' పుస్తక రూపంలో ప్రచురించారు. వెల ఆరు అణాలు. ప్రస్తుతం ఆ పుస్తకం ఎవరి దగ్గరాలేదు. మా ఊళ్లో మార్క్సిస్టు పార్టీ నాయకుడు ఒకాయన పార్టీ ఆఫీసులో ఉన్న పుస్తకాలన్నిటినీ చిత్తు కాగితాల కింద ఓ బేకరీషాపులో అమ్మేశాడు. అనుకోకుండా వాటిలో నాకు 'శశవిషాణం గీతాలు' రెండు కాపీలు దొరికాయి. ఒక కాపీని రాంభట్లకు పంపాను. "ఫ్రెండూ – ఆ పుస్తకం నా దగ్గర కూడా లేదు. గొప్ప కానుక పంపావు" అంటూ ఎంతో ఆనందంగా ఉత్తరం రాశారు.

ఒకసారి రామచంద్రపురంలో మా హిస్టరీ రీడర్ డాక్టర్ రుద్రయ్య చౌదరి గారు డిన్నర్ ఏర్పాటుచేశారు. ఆ రోజు మల్లారెడ్డి, రాంభట్ల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్లేట్లలో రకరకాల మాంసాహార వంటకాలు వడ్డించారు. "రాంభట్ల గారు చికెనూ, మటనూ కూడా బాగానే తింటున్నారే!" అన్నాడో అతిథి. "ఏ మాంసం అయినా తింటాను – ఒక్క నరమాంసం తప్ప!" అన్నారు రాంభట్ల. "దానికి మాత్రం అడ్డేమిటి?" అన్న రుద్రయ్య చౌదరి గారి ప్రశ్నకు రాంభట్ల జవాబు – "సరిగ్గా వండిపెట్టే మనిషి ఏడీ?" అని!

ఒకసారి విద్యార్థి సమాఖ్య ఏర్పాటు చేసిన సదస్సులో "సమాజ పరిణామక్రమం" అనే అంశం మీద ప్రసంగించడానికి రాంభట్ల కాకినాడ వచ్చారు. ఉన్న రెండు రోజులూ నేనూ ఆయనతో కలిసే ఉన్నాను. రెండో రోజు ఆయన ఖాళీగా ఉన్న సమయంలో ఓ సాహితీ మిత్రుడు వచ్చి పిచ్చాపాటి మొదలుపెట్టి – "మీరు మహాప్రస్థానం మీద నా సమీక్ష గ్రంథం చదివారా?" అని అడిగాడు. "అబ్బే – నాకంత ఓపికా, తీరికా ఎక్కడివి?" అన్నారు రాంభట్ల అమాయకంగా! "నా శ్రమనూ, కృషినీ ఏ మాత్రం పట్టించుకోకుండా రా.రా. ఆ పుస్తకాన్ని చాలా దుర్మార్గంగా విమర్శించాడు. నాకు మార్క్సిస్టు అవగాహన లేనందుకు అడుగడుగునా వెక్కిరించారు. రా.రా.కు మాత్రం మార్క్సిజం గురించి ఏం తెలుసు?" అని తన ఆక్రోశాన్ని వెళ్లగక్కాడు.

"మార్క్సిజం సంగతి తరవాత చూద్దాం. అసలు మహాప్రస్థానం గొప్పతనం ఏమిటో తెలుసుకోకుండా ఆ కావ్యాన్ని సమీక్షించాలనుకోవడం పెద్ద పొరపాటు!" అన్నారు రాంభట్ల. "విశాలాంధ్ర వాళ్లు ఆ పుస్తకాన్ని ఇప్పటికి పన్నెండుసార్లకు పైగా ముద్రించారు. దాని గొప్పతనానికి అది నిదర్శనం కాదా?" అన్నాడు ఆ సమీక్షకుడు.

**"ఎక్కువ ముద్రణలు పొందడం మాత్రమే పుస్తకం గొప్పతనానికి క్రైటీరియా కాదు. అలా అయితే ఆంధ్రదేశంలో ఒక పుస్తకం ప్రతి సంవత్సరం కొన్ని లక్షల ప్రతులు అమ్ముడవుతుంది. కాని సాహితీ విలువలను బట్టి చూస్తే – అది పరమ చెత్త పుస్తకం. ఆ పుస్తకం ఏమిటో తెలుసా? వినాయక వ్రతకల్పం!" అని ముక్తాయించారు రాంభట్ల!**

అప్పుడు ఆ మిత్రుడు ముఖంలోని ఎక్స్ ప్రెషన్ ఇప్పటికీ నాకు గుర్తుంది! ❑

# సంచార విజ్ఞాన సర్వస్వం

## సహచర స్మరణ

- ఆచార్య ఎస్వీ సత్యనారాయణ



1946లో 'మీజాన్' పత్రికలో 'నైజాము నవాబును నారాయణగూడా చౌరస్తాలో ఉరితీయాలి' అనే సంపాదకీయాన్ని రాంభట్ల రాశారు. అది అచ్చయిన సంచికను అప్పటి నైజామ్ రాష్ట్ర ప్రధానమంత్రి మీర్జా ఇస్మాయిల్ దగ్గర పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పనిచేసిన కుందూరి ఈశ్వరదత్ చదివి, ఆ పత్రిక బయటపడితే దాని సంపాదకుడు అడవి బాపిరాజును ఉరి తీస్తారని భయపడి, ఆ సంచిక ప్రతులన్నీ తెప్పించుకుని తగుల బెట్టించాడు.

**'బంగారు భూమి సూక్త మాలపించుతూ పద**
**అంగార గంగ లాగ తరంగించుతూ పద**
**కొవ్వొత్తిలాగ కాలి ప్రదీపించు వారికి**
**చెయ్యెత్తి వందనాలు సమర్పించుతూ పద'**

.. అంటూ ఒక తరాన్ని తట్టిలేపిన ప్రగతిశీల సాహితీవేత్త, మా తరానికి గురుతుల్యులు రాంభట్ల కృష్ణమూర్తి. ఒక చేత్తో వేదోపని షత్తుల్నీ, మరో చేతితో మార్క్సిజాన్ని ఔపోసన పట్టిన సంచార విజ్ఞాన సర్వస్వం ఆయన. 24 మార్చి 1920న తూర్పుగోదావరి జిల్లా అమలాపురం తాలూకా, అనాతవరం గ్రామంలో పుట్టిన రాంభట్ల రెండు సంవత్సరాల వయసులోనే ఆయన తండ్రి పోయారు. ఫలితంగా కొంత కాలం తాతగారి దగ్గర, ఇంకొంత కాలం చిన్నాన్న దగ్గర, మరి కొంత కాలం మేనమామ దగ్గర బాల్య జీవితం గడపడంతో థర్డ్ క్లాస్ మూడుసార్లు చదివి, ఫిఫ్త్ క్లాస్ చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది. అయినా స్వశక్తితో సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషల్ని అధ్యయనం చేసి, వాటిలో పాండిత్యాన్ని సంపాదించారు. సంస్కృతంలోని వేదోపనిషత్తులు, తెలుగులో పురాణ-ప్రబంధాలు, ఆంగ్లంలో విజ్ఞాన శాస్త్ర, - మార్క్సిస్టు గ్రంథాలు ఒకటికి పదిసార్లు చదివి, వాటిపై సాధికారాన్ని సంపాదించిన 'రాంభట్ల' తన 66 ఏళ్ల వయస్సులో కన్నడంలో వీర శైవ వచనాలను చదువుతూ కన్నడ భాష నేర్చుకున్నారు. ప్రపంచ ప్రసిద్ధ జర్మన్ రచయిత బెర్తోల్ బ్రెఖ్టలాగా, సుప్రసిద్ధ భారతీయ రచయిత శరత్చంద్రలాగా బాల్యమంతా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో గడపడం వల్ల ఆయా ప్రాంతాల ప్రజల జీవన విధానాలు, ఆచార వ్యవహారాలు తెలుసుకునే అవకాశం ఆయనకు లభించింది. నిరంతర అధ్యయనం వాఙ్మయ శాఖల్లోకి మార్గం చూపింది.

1935లో నాంపల్లి (హైదరాబాద్)లోని వేమనాంధ్ర భాషా నిలయంలో కందుకూరి, చిలకమర్తి, పానుగంటి, గురజాడల సాహిత్యాన్ని అవలోకనం చేసిన రాంభట్ల గురజాడ 'కన్యాశు ల్కం' నాటకాన్ని కంఠస్థం చేశారు. 1936లో చరిత్రాధ్యయనం, 1938లో 'వందేమాతరం' ఉద్యమ ప్రవేశం, 1939లో హఠ యోగ అభ్యాసం చేసిన రాంభట్ల 1940-43 కాలంలో తాళపత్ర గ్రంథాల్లో నిక్షిప్తమైన తాంత్రిక విద్యల్ని అభ్యసించడమే కాక వాటిని ప్రాక్టీస్ చేశారు. 'శంకరుని వేదాంతం నన్ను హేతు వాదిని చేస్తే, తాంత్రిక వేదాంతం నన్ను భౌతికవాదిని చేసింది' అంటారాయన.

1943లో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం కార్యదర్శి కావడంతో సంగీతం, నాట్యం, చిత్రకళలపై అనేక గ్రంథాలను చదివే అవకాశం ఆయనకు దొరికింది. భోజుడు రాసిన 'సమ రాంగణ సూత్రధార' అనే గ్రంథాన్ని, అహోమల సోమేశ్వర దేవుడు రాసిన 'అభిలషితార్థ చింతామణి' అనే గ్రంథాన్ని బరోడా నుంచి తెప్పించుకుని అధ్యయనం చేశారు. గ్రంథాల ద్వారా విగ్రహశిల్పం, కుడ్యచిత్రాలు, పట చిత్రాలు గీయడం, విగ్రహాలను చెక్కడం వంటి అనేక అంశాలను ఆయన గ్రహించగలిగారు. ప్రముఖ నవలా రచయిత అడవి బాపిరాజు సహచర్యంతో ఆయన సంపాదకత్వంలోని 'మీజాన్' పత్రికలో 'జర్నలిస్టు'గా చేరారు. తెలంగాణ సాయుధ పోరాటం మీద అనేక వ్యాసాలను ప్రచురించి, ఆ పత్రికను 'ఆంధ్ర మహాసభ' ఉద్యమ దర్పణంగా మలిచారు. 1945లో మీజాన్‌ను 'దొడ్డి కొమరయ్య ప్రత్యేక సంచిక'గా వెలువరించడమే కాక, అజ్ఞాతంలో ఉన్న తెలంగాణ సాయుధ పోరాట సేనాని రావి నారాయణరెడ్డితో ఇంటర్వ్యూ చేసి, దాన్ని ఆ సంచికలో వేశారు. ఆ సంచిక సంపాదకీయాన్నీ కొమరయ్య ఫోటో కింద "లేచింది లేచింది ఒక విప్లవజ్వాల' అనే గేయభాగాన్ని రాసింది రాంభట్లే.

1945లో ఉర్దూ మీజాన్‌లో పొలిటికల్ కార్టూన్లు వేసిన 'రాంభట్ల' 1946, 47 సంవత్సరాలలో తెలుగు 'మీజాన్'లో నైజామ్ నవాబును, ఆయన కొలువులో పనిచేసే మంత్రుల్నీ అధిక్షేపిస్తూ 'కార్టూన్ కవితలు' రాసి, తెలుగులో ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. 1946లో 'నైజాము నవాబును నారాయణ

గూడా చౌరస్తాలో ఉరి తీయాలి' అనే సంపాదకీయాన్ని రాంభట్ల రాశారు. ఆ సంచికను నైజామ్ రాష్ట్ర ప్రధానమంత్రి మీర్జా ఇస్మాయిల్ దగ్గర పీఆర్‌వోగా పనిచేసిన కుందూరి ఈశ్వరదత్ చదివి, ఆ పత్రిక బయటపడితే దాని సంపాదకుడు అడవి బాపిరాజును ఉరి తీస్తారని భయపడి, ఆ సంచిక ప్రతులన్నీ తెప్పించుకుని తగుల బెట్టించాడు.

1946లోనే బహుశా భారతదేశంలోనే మొట్టమొదటి జర్నలిస్టుల సమ్మెను నిర్వహింపజేసిన ఘనత కూడా రాంభట్లకు దక్కుతుంది. ప్రూఫ్ రీడర్ల జీతాలను పెంచాలంటూ 18 రోజుల పాటు 'మీజాన్' పత్రికలోని సిబ్బంది అంతా సమ్మె చేసి విజయం సాధించారు.

1948 ఫిబ్రవరిలో 'మీజాన్' పత్రికకు రాజీనామాచేసి, మద్రాసు చేరారు. జూన్‌లో విజయవాడ నుండి వెలువడిన 'తెలుగుదేశం' పక్ష పత్రికలోను, 1949-51ల్లో మద్రాసు నుండి వెలువడిన 'సందేశం' పత్రికలోనూ సంపాదకవర్గ సభ్యునిగా పనిచేసిన రాంభట్ల 1952లో 'ప్రజాశక్తి' బై వీక్లీలోనూ, 1952 జూన్ నుండి 'విశాలాంధ్ర' దినపత్రికలోనూ ఉప సంపాదకునిగా పనిచేశారు. అలాగే 'ప్రజాశక్తి', 'విశాలాంధ్ర'ల అక్షరాలను డిజైన్ చేసిన 'అక్షరశిల్పి' కూడా రాంభట్లే.

1943లో ఆంధ్ర ప్రాంతంలో 'అభ్యుదయ రచయితల సంఘం' స్థాపింపబడిన కొద్ది రోజుల్లోనే అదే సంవత్సరం హైదరాబాద్‌లో చదలవాడ పిచ్చయ్య గారి పర్యవేక్షణలో అడవి బాపిరాజు అధ్యక్షులుగా, వట్టికోట ఆళ్వారుస్వామి కార్యదర్శిగా స్థాపించబడిన 'నిజామాంధ్ర అభ్యుదయ రచయితల సంఘం'లో సభ్యులుగా చేరిన 'రాంభట్ల' 1973లో గుంటూరులో జరిగిన అ.ర.సం రాష్ట్ర మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 1976 వరకు కొనసాగారు. యువ రచయితలెం దరికో సైద్ధాంతిక స్పష్టతను సమకూరుస్తూ మార్గనిర్దేశం చేశారు.

1951లో సిగ్రియా కుడ్యచిత్రాల నకళ్ళను సేకరించడానికి బాపిరాజు గారితో కలిసి 'సిలోన్' వెళ్ళొచ్చిన రాంభట్ల 1958లో సోవియట్ యూనియన్‌లోని 'ఆర్మీనియా' సందర్శించిన మొట్టమొదటి ప్రతినిధివర్గానికి నాయకత్వం వహించారు.

**దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా సాహిత్యరంగంలో కృషి చేసినప్పటికీ రాంభట్ల గురించి అనేక మందికి తెలియకపోవడానికి ప్రధాన కారణం ఆయన కలం పేర్లతో రాయడమే. సొంత పేరుతో ఆయన రాసింది తక్కువే. 'అగ్నివేశ', 'పుష్యమిత్ర', 'అగ్నిమిత్ర', 'విశ్వామిత్ర', 'పాణిని', 'కవి రాక్షస' 'కృష్ణాంగీరస్', 'కృష్ణ', 'శశ విషాణం', 'కాట్రేని యెర్రయ్య' మొదలైన అనేక కలం పేర్లతో రచనలు చేసిన రాంభట్ల కవిగా, విమర్శకునిగా, చిత్రకారునిగా, తెలుగులో తొలి రాజకీయ కార్టూనిస్టుగా, అభ్యుదయ సాహిత్యోద్యమ రథసారథిగా తెలుగు సారస్వత లోకంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి, సంచార విజ్ఞాన సర్వస్వం.**

1967లో భారత సోవియట్ సాంస్కృతిక సంస్థ (ఇస్కస్) హైదరాబాద్ నగర కార్యదర్శిగా పనిచేసిన రాంభట్ల 1968లో హైదరాబాద్లో జరిగిన 'అఖిల భారత శాంతి మహాసభ' ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 1969లో 'ఇస్కస్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 1974 వరకు కొనసాగారు. 1970వ దశాబ్దంలో 'అభ్యుదయ రచయితల సంఘం' పునర్ని ర్మాణ ఉద్యమంలో గజ్జెల మల్లారెడ్డి, వై.విజయకుమార్‌లతో కలిసి కీలక పాత్ర పోషించారు.

వివిధ ప్రజా సంఘాల్లో క్రియాశీల కార్యకర్తగానూ, కార్యనిర్వాహకునిగానూ బాధ్యతలు వహిస్తూనే ప్రజానాట్య మండలి గాయనీ గాయకులు పాడుకోవడానికి వీలుగా అభ్యుదయ గీతాలెన్నింటినో రాసి రచయితగానూ వాసికెక్కారు. "మృతవీరులారా! లాల్ సలామ్', 'అంగార గంగ', 'రండిరా! పదండిరా!', 'అదే అదే పతాక జైత్రయాత్ర' వంటి రాంభట్ల రాసిన అనేక గీతాలు శ్రమ జీవుల గీతాలకు ఒక నూతన వరవడిని దిద్దాయి.

"యూజినీ పాటియార్' అనే ప్రఖ్యాత ఫ్రెంచి కవి రాసిన 'ఇంటర్నేషనల్' అనే అంతర్జాతీయ గీతాన్ని ప్రపంచ వ్యాపిత కార్మికవర్గం పాడుకుంటున్న ప్రఖ్యాతబాణీలో, అన్యభాషా ఛందంలో తెలుగు అనువాదాన్ని చేశారు. ప్రముఖ ఉర్దూ కార్మిక వర్గ కవి 'మఖ్దూం' గీతాలు కొన్నింటిని తెలుగులోకి అనువ దించిన రాంభట్ల, ఏటుకూరి 'ఎర్రజెండా' పాటలకు రాసిన 'సంజాయిషీ' తెలుగు పీఠికా సాహిత్యంలో ఒక మైలురాయి. 1943లో సురవరం ప్రతాపరెడ్డిగారి 'గోల్కొండ పత్రిక'కు వ్యాసాలు రాయడం ద్వారా సృజనాత్మక సాహిత్యంలోకి ప్రవేశించారు. 1953లో ఆంధ్ర రాష్ట్రానికి 'కర్నూలు'ను రాజధాని చేసినప్పుడు, దానిపై అధిక్షేపాత్మకంగా 'శశ విషాణం' గీతాలు రాశారు. ఈ గీతాలు పుస్తక రూపంలో వెలువడి నాయి. 1959లో కేంద్ర ప్రభుత్వం కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలదోసినప్పుడు 'కేరళ బాగోతం' అనే నృత్య రూపకం రాశారు. 'ఆంధ్ర ప్రదేశ్ దర్శిని'లో చిత్రకళపై వ్యాసాన్ని రాశారు. అనేక కవితా సంపుటాలకు ప్రామాణికమైన పీఠికలను రాశారు. ❑

# రాంభట్ల.. అరసం

## సహచర స్మరణ



- పెనుగొండ లక్ష్మీనారాయణ

అనేకానేక విశేషణాలకు సరితూగే మనిషి ఆయన. మా అభ్యుదయ రచయితల సంఘానికే కాక కమ్యూనిస్టు ఉద్యమానికి దొరికిన ఓ ఆణిముత్యం. ఆయన మాట్లాడుతుంటే వినటానికి, ఆయన రాసింది చదవటానికి ఒకస్థాయి కావాలి. ఆయన మాటలు జ్ఞానబోధలు, రాతలు విజ్ఞాన ఖనులు. ఇంతకీ ఈ మహావ్యక్తి ఎవరంటే రాంభట్ల కృష్ణమూర్తి. వారి శతజయంతి సంవత్సరమిది (24.3.1920 - 7.12.2001). వారు నడిపిన, నేతృత్వం వహించిన అభ్యుదయ రచయితల సంఘం వారి శత జయంతిని తెలుగు నేల నాలుగు చెరుగులా జరపాలని నిర్ణయించింది. వారి రచనలను పునర్ముద్రించే ప్రయత్నాన్నీ ఈ సందర్భంలో కొనసాగిస్తూ ఉంది. అ.ర.సం. తెలంగాణ విభాగం అధ్యక్షులు ఆర్వీ రామారావు చొరవ దీనికి ప్రధానం. తన గురించి రాంభట్ల చెప్పుకున్న మాటలను ముందుగా మీ ముందుంచుతున్నాను :

**"నేను పన్నెండో యేట పుస్తకాలు చదవడం మొదలుపెట్టాను. పద్నాలుగో యేట కవితలల్లడం నేర్చాను. పదిహేడో యేట సెంట్రింగ్ కార్పెంటరుగా పనిచేశాను. నాది నియత విద్య కాదు. అనియత విద్య. నేను మాట్లాడేటప్పుడు "ఈ విషయమే పుస్తకంలో ఉంది అని కొందరడ్డుతారు. అలాంటప్పుడు "అమ్మా మా నాన్న ఎవడే అని అడిగిన కొడుక్కి జాబాలి చెప్పిన జవాబు నాకు స్ఫురణకు వస్తుంది. మీది యే యూనివర్సిటీ అని అడిగిన వారికి మాత్రం నాది గోర్కీ యూనివర్సిటీ అని చెబుతాను. విశ్వమే తన విశ్వ విద్యాలయం అని గోర్కీ చెప్పుకున్నాడు. మరి నాదీ అదే"**

(జనకథ - రాంభట్ల వాస్యావళి, విశాలాంధ్ర ప్రచురణ)

తూర్పు గోదావరి జిల్లా అనాతవరం అగ్రహారంలో జన్మించిన రాంభట్ల చదువు ప్రాథమిక స్థాయిలోనే ఆగిపోయింది. స్వయం కృషితో సంస్కృతాంధ్రాంగ్ల భాషల్ని అధ్యయనం చేసి ఆ భాషల్లో అపార పాండిత్యాన్ని సాధించారు. వేద వేదాంగాలు, పురాణాలు, ఉపనిషత్తులు, తెలుగు ప్రాచీనాధునిక సాహిత్యాలు, ఆంగ్ల సాహిత్య మర్మాలు ఆయనకు కరతలామలకం. వేదాల్లోనే 'ఎర్ర జెండా' విషయం రాసుందని మార్క్సిజం తరగతుల్లో చెప్పే వారు. భారతీయ భాషల్లోనే ప్రామాణికమైనదిగా గుర్తింపు పొందిన తిరుమల రామచంద్ర రచన "లిపి పుట్టు పూర్వోత్తరాలు"లోని లోపాలు చెప్పి సరిచేయించిన భాషా శాస్త్రవేత్త రాంభట్ల. తొలి రాజకీయ కార్టూనిస్టుగా తెలిసిన రాంభట్ల అడవి బాపిరాజు సూచనతో విశాలాంధ్ర, ప్రజాశక్తి దిన పత్రికలకు ఆ పేర్లను అందంగా అక్షరీకరించిన చిత్రకారులు, చరిత్రకారులు రాంభట్ల. "జనకథ"లో ఆదికాలం నుంచి వేదకాలం వరకూ ఓ 45 వ్యాసాలను రాశారు. మార్క్సిజం అవగాహనతో రాసిన ఆ వ్యాసాలను రాంభట్ల తప్పితే మరొకరెవరూ రాయలేరనేది ఒప్పుకోవాల్సిందే. వారి రచనలన్నీ ఎంతో ఆలోచనామృతాలు.

ఇంతటి రాంభట్ల మా అరసానికి నాయకుడు. మాకు ఆయనంటే ఎంతో అభిమానం. ఆ మహా మేధావికి అ.ర.సం. గుంటూరు జిల్లా శాఖ నవంబర్ 1986లో అమరజీవి పులుపుల వెంకటశివయ్య సాహితీ పురస్కారం గుంటూరులో అందించి గౌరవించుకుంది. గుంటూరు వచ్చినప్పుడల్లా నాకు తెలియజేసే వారు. నేను కలిసేవాడిని. ఎవరు కలవటానికి వచ్చినా, రమ్మని కోరినా "మా లక్ష్మీనారాయణను అడగండి. అతనితో మాట్లాడండి" అని చెప్పేవారు. వై.విజయకుమార్, బూదరాజు రాధాకృష్ణ మొదలైన వాళ్లంతా కార్యకర్తలకు ఇచ్చే గౌరవమది. వీళ్లంతా ప్రేమమూర్తులు.

అ.ర.సం.తో ఎనలేని, విడదీయరాని జీవితం రాంభట్లది. వారు రాసుకున్న "సొంత కథ" (మీడియా హౌస్ పబ్లికేషన్స్, మార్చి 2001)లోని "అరసం అలజడి" అధ్యాయం ద్వారా ఎన్నో విశేషాలు తెలుస్తాయి. అందులోని కొన్ని ముఖ్య విషయాలను మీ దృష్టికి తెస్తాను. 1955లో విజయవాడలో అ.ర.సం. 5వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. "నేనప్పుడు అక్కడే వున్నాను" అన్నారు. 1970ల్లో అ.ర.సం. పునర్నిర్మాణం అనుకున్న తరువాత హైదరాబాద్‌లో శ్రీశ్రీకి సెవెన్ స్టార్ సిండికేట్ సన్మానం తలపెట్టడం, అది జరగకుండానే శ్రీశ్రీ అధ్యక్షతన వి.ర.సం ఏర్పడటం గురించి చెప్పారు. ఆ కాలంలోనే అ.ర.సం. పునర్నిర్మాణంతోపాటు "ఆఫ్రో ఏషియా సాహిత్య సంఘ నిర్వహణ" గురించి కూడా రాంభట్ల హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు ప్రయాణాలు కొనసాగించారు. తనతోపాటు అ.ర.సం. పునర్నిర్మాణం కొరకు కృషి చేసిన గజ్జెల మల్లారెడ్డి గురించి చెప్పుకొచ్చారు.

1955 జూలై 30, 31 తేదీలలో శ్రీశ్రీ అధ్యక్షతన జరిగిన

అ.ర.సం. ఐదో రాష్ట్ర మహాసభల తరువాత సుదీర్ఘ కాలం అనంతరం 10, 11, 12 ఆగస్టు 1973 తేదీలలో గుంటూరులో అ.ర.సం నూతన ప్రణాళిక రాసే బాధ్యత రాంభట్లపైనే పడింది.

ఆ ప్రణాళిక గురించి రాంభట్ల మాటల్లోనే –

"సాహిత్యానికి మార్క్సిజాన్ని అన్వయిస్తూ నేను ఒక ప్రణాళికను తయారుచేశాను. రాజకీయాన్వయానికి అలవాటు పడిన వారందరూ ఆ ప్రణాళికను తిరస్కరించారు. దాన్ని రెండు మూడుసార్లు వడగట్టి ఒక్కో రూప వస్తు అభివర్గం మాత్రమే వుంచి రాశాను. అప్పటికే నా మీద సాహిత్యం అంటే తెలియని వారు కోపంతో ఉన్నారు" అయినా మల్లిక్ (అ.ర.సం. ముఖ్య కార్యకర్త – విశాలాంధ్ర ఉపసంపాదకుడు) చొరవతో ఆ ప్రణాళిక ముందుగా విజయవాడ, హైదరాబాద్‌లో జరిగిన ముఖ్యుల సమావేశంలో ఆమోదం పొందింది. ఆ సందర్భంగా రాంభట్ల చేసిన తీవ్ర వ్యాఖ్యలను మీ దృష్టికి తెస్తున్నాను.

**"రాజకీయాలు తప్ప మరో సామాజిక చైతన్య రూపాన్ని వాసన కూడా చూడకపోవడం కమ్యూనిస్టు నాయకుల అలవాటు. ఈ అలవాట్లను ఎవరికి వారు పదిలంగా కాపాడుకుంటున్నారు."**

**మరో వ్యాఖ్య : "కమ్యూనిస్టు పార్టీలో అత్యధికులకు మార్క్సిజం పరిజ్ఞానం తక్కువ. దాన్ని రాజకీయాలకు అన్వయించడం కాస్త తెలుసును కాని సాహిత్యానికి అన్వయించడం అసలు తెలియదు."**

1973లో జరిగిన మహాసభ ముందుంచిన ఆ ప్రణాళిక గురించి విస్తృతచర్చ జరిగింది. ఆ ప్రణాళికలో పేర్కొన్న ఎనిమిదో అంశం "సోషలిస్టు వాస్తవికతను తన పరమ లక్ష్యంగా అభ్యుదయ రచయితల సంఘం ఎన్నుకుంటుంది." సోషలిస్టు సమాజం లేనిది సోషలిస్టు వాస్తవికత ఎక్కడ నుంచి వస్తుందనే చర్చ లేచింది. దీనికి రాంభట్ల సమాధానం ఏమిటంటే రష్యాలో సోషలిజం రాక ముందే గోర్కీ "అమ్మ" నవల రాశారు. అందులో సోషలిస్టు వాస్తవికత వుందన్నారు. అలాగే పరమ లక్ష్యమా? – చరమ లక్ష్యమా? అని కూడా చర్చ చోటు చేసుకుంది. ఆ మహాసభకు హాజరైన ప్రతినిధిగా నాకు ఇవి గుర్తు.

ఆ ప్రణాళిక గురించి చెబుతూ..

"ఇంత వరకు అభ్యుదయ రచయితల కోసం రాసిన ప్రణాళికలో రాజకీయాలు తప్ప సాహిత్య ప్రస్తావన భూతద్దం పెట్టి వెతికినా కానవచ్చేది కాదు. అలాంటి ప్రణాళికలకు అలవాటుపడిన వారికి మార్క్సిస్టు తత్వ శాస్త్ర అభివర్గాలతో రాసిన ప్రణాళిక సాహిత్యంగా కనిపించడంలో ఆశ్చర్యం ఏముంది" అని రాంభట్ల తన భావాల్ని స్పష్టం చేశారు. ఇప్పుడు ఇవన్నీ ఎందుకనే వాళ్లుంటారు. ఇది చరిత్ర. చరిత్ర నుంచి మనం తెలుసుకోవాల్సిందీ, నేర్చుకోవాల్సింది వుంది. సమీక్షించుకోవాల్సి ఉంది. అందుకే మన కోసం మళ్లీ గుర్తు చేయటం, చేసుకోవటం. అ.ర.సం.తో రాంభట్లది విడదీయ రాని, విడదీయ లేని జీవితం. అ.ర.సం.లో 1973 నుండి 1996 వరకు వారిది నాయకత్వ పాత్ర. 1970 నుండి క్రియాశీల కార్యకర్తృత్వం.

## అ.ర.సం.లో రాంభట్ల

అ.ర.సం. పునర్నిర్మాణం కొరకు 1970 నుండి మొదలైన కృషిలో గజ్జెల మల్లారెడ్డితో కలిసి విశేష కృషి చేశారు. తెలుగు నేల మొత్తం తిరిగారు. శాఖలు ఏర్పాటుచేశారు. అరసాన్ని బలోపేతం చేశారు. 1973లో గుంటూరులో జరిగిన ఆరవ రాష్ట్ర మహాసభలో రాంభట్ల ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. 1976లో హైదరాబాద్‌లో జరిగిన ఏడవ మహాసభలో కూడా ప్రధాన కార్యదర్శిగా రాంభట్ల మళ్లీ ఎన్నికయ్యారు. 1978, 1985లో కాకినాడ, తిరుపతిలో జరిగిన 8, 9 రాష్ట్ర మహాసభల్లో అధ్యక్షవర్గ సభ్యులయ్యారు. 1988లో భీమవరంలో జరిగిన పదో రాష్ట్ర మహాసభలో కార్యవర్గ సభ్యుడిగా మాత్రమే పరిచయమయ్యారు. గుంటూరులో 1992, నరసరావుపేటలో 1996లో జరిగిన 11, 12 రాష్ట్ర అ.ర.సం. మహా సభలలో ఉపాధ్యక్షునిగా ఎంపికయ్యారు. భీమవరం, నరసరావుపేటలో జరిగిన అ.ర.సం. మహాసభలకు అధ్యక్షత వహించింది రాంభట్లే. అలాగే అ.ర.సం. తెనాలిలో రాంభట్ల అధ్యక్షతననే మహాసభ జరిగింది. రాంభట్లవంటి వారితో కలిసి అ.ర.సం. కార్యవర్గంలో వుండడం, పనిచేయటం నాకెంతో గౌరవం.

రాంభట్ల 2001 డిసెంబర్ 7న హైదరాబాద్‌లో అమరుల య్యారు. వారి సంతాపసభ గుంటూరులో నా అధ్యక్షతన 15 డిసెంబర్ 2001, శనివారం నాడు అ.ర.సం. నిర్వహించింది. వారికి జోహార్లర్పించటమంటే వారి రాసిన మహత్తర గీతం "మృతవీరులారా లాల్ సలాం"ను ఎలుగెత్తి పాడటమే! "అంగారగంగ"ను ఆలపించటమే!

"శాపాలతోటి కాళ
తమో రాసి తూలదు
ఏ పాటిదైన వెల్గు
ప్రసారించుతూ పద
కొవ్వొత్తిలాగ కాలి
ప్రదీపించు వారికి
చెయ్యెత్తి లాల్ సలాం
సమర్పించుతూ పద.

శతజయంతి సందర్భంగా కామ్రేడ్ రాంభట్ల కృష్ణమూర్తికి అ.ర.సం. జాతీయ సమితి పక్షాన చేయెత్తి లాల్ సలాం సమర్పిస్తున్నాను. ❑

# స్వయం నిర్మిత మేధో సౌధం

## సహచర స్మరణ

- మందలపర్తి కిషోర్



బహుముఖ ప్రజ్ఞావంతులకు తెలుగునాట కొదవ లేదనే మాట నిజమే! తెలుగునాట సంఘ సంస్కరణ ఉద్యమానికి ఒరవడి దిద్దిన 'గద్య తిక్కన' కందుకూరి వీరేశలింగం కవి - నవలాకారుడు - ప్రహసనకర్త - పత్రికా సంపాదకుడు - విద్యాలయాల నిర్మాత, నిర్వాహకుడూనూ. ఆధునిక తెలుగు సాహితీకి ఆద్యుడనిపించుకున్న గురజాడ అప్పారావు అటు తెలుగులోనూ ఇటు ఇంగ్లీష్‌లోనూ కూడా గొప్ప కవి. మంచి కథకులు. అద్భుతమయిన నాటకకర్త. తొలితరం భాషా శాస్త్ర వేత్త. అన్నిటికీ మించి న్యాయశాస్త్ర పరమయిన లావాదేవీల్లో ఆరితేరిన నిపుణుడు. ఆంధ్రుల సాంఘిక చరిత్రను అక్షరీక రించిన సురవరం ప్రతాపరెడ్డి సమర్థుడయిన వకీలు-గొప్ప సాహిత్య పరిశోధకుడు-చక్కని కథకుడు-బాధ్యత కలిగిన రాజకీయవేత్త కూడా. ఆంధ్ర పితామహుడు మాడపాటి హనుమంతరావు గొప్ప విద్వాంసుడు-తొలితరం కథకుడు-తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని రగిలింపచేసిన సంస్కర్త-హైదరాబాద్ మేయర్‌గా రాణించిన రాజకీయవేత్త కూడా. ఇక అడివి బాపిరాజు ఒక చేత కలమూ మరో చేత కుంచె పట్టి బహుముఖీనమయిన ప్రజ్ఞను ప్రదర్శించారు. శివ శంకరులు బహుభాషా కోవిదులు, బహు ప్రక్రియల్లో నిష్ణాతులు. గద్య-పద్య-గేయ రచనల్లో తన ప్రతిభ ప్రదర్శించిన కవి కూడా. ఎంకి పాటల నండూరి సుబ్బారావు గొప్ప హిందూస్తానీ సంగీత విద్వాంసులు కూడా. చలం, కొడవటిగంటి, గోపీచంద్, శ్రీశ్రీ, ఆరుద్ర తదితరులు అనేక ప్రక్రియల్లో రాణించిన బహుముఖ ప్రజ్ఞావంతులే కదా!

కానీ ఒకే వ్యక్తి ప్రముఖ కవిగానూ, ప్రసిద్ధ విమర్శకుడు గానూ, విశిష్ట చిత్రకారుడు గానూ, పత్రికా రచయిత గానూ - సంపాదకుడుగానూ, తొలి తెలుగు కార్టూనిస్ట్ - కవిగానూ, వేదాల గురించి సృజనాత్మకంగా ఆలోచించి - విస్తృతంగా రాసిన పరిశోధకుడు గానూ, 'కన్యాశుల్కం' నిపుణుడు గానూ, మార్క్సిస్టు మేధావి గానూ, తెలుగులో జర్నలిజం అధ్యయన కేంద్రానికి మొట్ట మొదటి ప్రధాన అధ్యాపకుడు గానూ రాణించిన వారు మాత్రం రాంభట్ల కృష్ణమూర్తి ఒక్కరేనేమో! ఆ రాంభట్లగారి శత జయంతి సంవత్సరమిది! ఎనభయి వసంతాల జీవన సారాన్ని సామాన్య పాఠకులకు నచ్చేలా - 'సొంత కథ' చెప్పి ఒప్పించి, మెప్పించిన రచయిత రాంభట్ల. పుట్టింది ఎక్కడో తూర్పుతీరంలో అయినప్పటికీ, రాంభట్ల జీవనంలో అత్యధిక భాగం హైదరాబాద్‌లోనే గడిచింది. ఒకప్పుడు ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల అధిపతిగా ఉండిన సరిపల్లె విశ్వనాథ శాస్త్రీ రాంభట్లకు స్వయానా మేనమామ. కానీ ఆయన ప్రభావం రాంభట్లపై దాదాపు లేదనే చెప్పాలి. ఉన్నమాట చెప్పుకోవాలంటే, రాంభట్ల ఒక స్వయం నిర్మిత మేధో సౌధం! రాంభట్ల పాఠశాలల్లో పెద్దగా చదువుకోలేదు - చదువుకున్నది కాస్తో కూస్తో ఉర్దూ మీడియంలోనే! మాతృభాష తెలుగులోనూ, స్వయంకృషితో నేర్చుకున్న ఇంగ్లీష్‌లోనూ, కొద్దోగొప్పో పాఠశాల ల్లో చదువుకున్న ఉర్దూలోనూ రాంభట్లగారు తర్వాతి కాలంలో పాండిత్యం సంపాదిం చడం విశేషం. అంతకుమించి, లౌకిక సంస్కృతంలోనూ, వైదిక సంస్కృతంలోనూ ప్రవేశం కల్పించుకో వడానికి ఆయన - ఆ రోజుల్లో- ఎన్ని అగచాట్లు పడివుంటారో ఊహించుకోవచ్చు. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలాంటి గ్రంథాలయాల్లోనే ఆయన తెలుగు - సంస్కృత సాహిత్య అధ్యయనం సాగింది. ముఖ్యంగా రుగ్వేదం చదువుకోవడానికి తను చాలా కష్టపడవలసి వచ్చిందని ఆయన చెప్పేవారు. లిఖిత చరిత్రకూ, నిశ్చల నిశ్చితాలయిన కళా నియ మాలకూ, పిడివాదపు ఇనప కచ్చడాలకూ అతీతంగా ఊహించ గల సాహసం రాంభట్ల సొంతంబీ అది కేవలం స్వార్జితం!! భారతీయ తత్వ శాస్త్రం, అలంకార శాస్త్రాల్లో చక్కని అభినివేశం తోపాటుగా, పాశ్చాత్య మనోవిజ్ఞాన శాస్త్రం మీద కూడా రాంభట్ల గారికి మంచి పట్టుండేది. ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు, క్షేమేం ద్రుడు తదితరుల గురించి ఎంత ప్రభుత్వంతో మాట్లాడే వారో, మార్క్స్-ఎంగెల్స్, ఫ్రాయిడ్, యూంగ్ గురించి అంతే అధికారి కంగా మాట్లాడగలగడం రాంభట్ల విశిష్టత. రాంభట్ల సుశిక్షితు లయిన హిప్నోటిస్ట్. మ్యాజిక్ మీద ఆసక్తితో అదీ నేర్చుకున్నారు. అయితే, మ్యాజిక్‌ను ఆయన ప్రధానంగా తంత్రంగా సాధన చేశారు.

పదహారేళ్ల ప్రాయంలోనే బతుకుతెరువు కోసం కార్మికుడిగా కాయకష్టం మొదలుపెట్టిన రాంభట్ల పాతికేళ్ల పరువంలో-1945లో-పత్రికా రచన రంగంలో కాలుపెట్టారు. అడివి బాపిరాజు సంపాదకులుగా నిజాం నవాబు మొదలుపెట్టిన 'తెలుగు మీజాన్'తోనే రాంభట్ల జర్నలిస్టు అయ్యారు. రాంభట్లను

పత్రికా రంగానికి పరిచయం చేసిన పుణ్యం మీజాన్ పత్రికకు సహాయ సంపాదకులుగా ఉన్న శ్రీనివాస చక్రవర్తికే దక్కాలి! 'డ్యూటీ ఎక్కిన' తొలినాడే రాంభట్ల కాలమిస్ట్‌గా అవతారమెత్తడం విశేషం. ఆ పత్రికలో రాంభట్ల నిర్వహించిన "మిర్చీ-మసాలా" పేజీ కొత్తతరం పాఠకులకు సరికొత్త స్వరం సమకూర్చి చరిత్ర సృష్టించింది. నిజాం నవాబును నారాయణగూడా చౌరస్తాలో ఉరి తీయాలని 'మీజాన్' సంపాదకీయంలోనే డిమాండ్ చేసిన దుస్సాహసి రాంభట్ల. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం గురించిన కీలకమయిన - విశ్వసనీయమయిన సమాచారం కోసం ఆ కాలపు కమ్యూనిస్టులు 'తెలుగు మీజాన్' పత్రికనే చూసే వారంటే, ఆ పత్రిక ఎలా వుండేదో ఊహించుకోవచ్చు. వట్టికోట ఆళ్వారుస్వామి ద్వారా రాంభట్లకు తెలంగాణ సాయుధ పోరాటం గురించిన విశ్వసనీయ సమాచారం అందుతూ వుండేది. దాన్ని వార్తల రూపంలో, వ్యంగ్యచిత్రాల రూపంలో రాంభట్ల అచ్చు వేయించేవారు. అలా మూడేళ్లపాటు కొనసాగించగలగడంలో రాంభట్ల నిబద్ధత మాత్రమేకాక, అడివి బాపిరాజు - శ్రీనివాస చక్రవర్తి లాంటి పెద్దల ఔదార్యం కూడా ఇమిడి వుందని మర్చిపోకూడదు! 1950 దశకం తొలి నాళ్లలో- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, "పోలీస్ యాక్షన్" నేపథ్యంలో - రాంభట్ల సకుటుంబంగా హైదరాబాద్ వదిలి వెళ్లేంత వరకూ ఆయన మీజాన్‌లో పనిచేస్తూనే వున్నారు.

రాంభట్ల చిన్నప్పటినుంచీ బొమ్మలు వేస్తూనే వున్నప్పటికీ, అడివి బాపిరాజు సాంగత్యంలోనే ఆయన చిత్రకళ పరిపూర్ణతను సాధించుకుంది. అప్పటి వరకూ పెయింటర్‌గా రాణించాలనుకుంటూ ఉండిన రాంభట్లను కార్టూన్ కళవైపు మళ్లించింది బాపిరాజు గారే. నవ్వుతూ నవ్విస్తూ వుండడమే రాంభట్ల స్వభావం. బహుశా అందువల్లనే ఆయన కార్టూన్ కళ హృదయాన్ని అలవోకగా గ్రహించగలిగారు. పదిహేడు-పద్దెనిమిది శతాబ్దాల నాటికే విలియమ్ హోగార్త్‌లాంటివాళ్లు కార్టూన్ కళలో ప్రవేశపెట్టిన నైతిక ధోరణి, వంద సంవత్సరాల తర్వాత గానీ జేమ్స్ గిల్‌రే లాంటి వాళ్ల చేతుల్లో పదునుదేరి రాజకీయ వ్యంగ్య చిత్రరచనగా పరిణమించలేదు. 'పంచ్'లాంటి పత్రిక ద్వారా అది, మన దేశానికి చేరుకుని, స్వతంత్ర స్వభావాన్ని సంతరించుకోడానికి మరో వంద సంవత్సరాలు పట్టేసింది. ఇరవయ్యో శతాబ్ది ప్రథమార్థంలో తలిశెట్టి రామారావు పుణ్యమాని విశేష జనాదరణకు పాత్రమయిన కార్టూన్ చిత్రకళ పాతిక ముప్పై యేళ్లలోనే దేశవ్యాప్తంగా ప్రబల ధోరణిగా రూపుదిద్దుకుంది. ఆనాటి రాజకీయ వాతావరణంలోని వాడినీ, వేడినీ మన కార్టూనిస్టులు తమ కళకు ఆపాదించుకోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఆ తరానికి చెందిన రాజకీయ వ్యంగ్య చిత్రకారుల్లో అగ్రగణ్యుడు రాంభట్ల కృష్ణమూర్తి. స్వతహా మంచి కవి కూడా కావడంతో, ఆయన చిత్ర కళకు కవిత్వ కళ తోడయింది. ఫలితంగా, 1950 దశకం తొలినాళ్లలో 'శశవిషాణం' రాజకీయ కార్టూన్- కవితా ప్రక్రియగా అవతరించింది. లెక్క ప్రకారం అది ఓ కాలమ్. అయితే, పూర్తిగా విభిన్నమయిన కాలమ్.

తెలుగు నాట వ్యంగ్య, అధిక్షేప కవిత్వం శతాబ్దాలుగా ఉన్నదే.. ఆధునిక రీతిలోనూ, ఈ తరహా కవిత్వం పునరుద్ధరింప చేసిన ఘనత మాత్రం అభ్యుదయ కవులకే దక్కుతుంది. 1940 దశకంలోనే అభ్యుదయ కవులు వ్యంగ్య-అధిక్షేప కవితలను పాటలుగా రాయడం మొదలుపెట్టారు. బహుశా ఈ కోవలో తొలి తాంబూలం తాపీ ధర్మారావుకే దక్కాలి! పిలకా గణపతి శాస్త్రీలాంటి సాంప్రదాయిక సంస్కృత విద్వాంసుడు కూడా ఈ బృందంతో చేరడం విశేషం. 1945లో శ్రీశ్రీ చక్రపాణి సంపాదకత్వంలో వెలువడుతూ ఉండిన 'ఆంధ్రజ్యోతి' మాసపత్రికలో 'సిరిసిరి మువ్వ పద్యాలు' మొదలుపెట్టి యాభయి వరకూ రాశారు. వాటికి అనుబంధంగా ఆయన రాసిన 'ప్రాస క్రీడలు', 'లిమబుక్కులు' కూడా ప్రధానంగా వ్యంగ్య కవితలే.. ఇవీ యాభయ్యాభయ్యే రాయడం విశేషం. మొత్తం అన్నింటినీ కలిపి 'మూడు యాభయిలు' అనే పుస్తకంగా విడుదల చేశారు. శ్రీశ్రీ తర్వాత కొన్ని డజన్లమంది అలాంటి కవితలు రాయడానికి ప్రయత్నించారు కానీ, పెద్దగా సఫలం కాలేకపోయారు. ఈ ప్రయత్నాలకు పూర్తిగా భిన్నమయిన ఓ ప్రక్రియ త్వరలోనే మొదలయి పాతుకుపోయింది. అదే రాజకీయ కార్టూన్-కవితాప్రక్రియ. ఆ ప్రక్రియకు ఆద్యులు రాంభట్ల కృష్ణమూర్తి.

'శశ విషాణం' అంటే కుందేటి కొమ్ము అని అర్థం. అసాధ్యమయినదీ అస్తిత్వంలో ఉన్నట్లు ఆధారం లేనిదీ అయిన విషయం గురించి చెప్పడానికి 'శశ విషాణం' అనే పదాన్ని ఆలంకారికంగా వాడడం సంస్కృత సాహిత్యంలో కనిపిస్తుంది. భర్తృహరి సుభాషిత త్రిశతిలోని నీతి శతకంలోని అయిదో శ్లోకంలో ఈ మాట వస్తుంది. (ఈ శ్లోకానికి ఏనుగు లక్ష్మణకవి చేసిన అనువాదం- "తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు..." పద్యం - సుప్రసిద్ధం. అందులోని, 'కుందేటి కొమ్ము' అనేది శశ విషాణానికి అనువాదమే!) మహాయాన బౌద్ధ మౌలిక సూత్రాల సంకలనంగా వెలువడిన 'లంకావతార సూత్ర'లో కూడా ఈ మాట కనిపిస్తుంది. "వాగ్వికల్ప మాత్రం హి మహామతే శశ విషాణం స్వహేతు లక్షణాభవేత్" అనే సూత్రంలో ఈ కుందేటి కొమ్ము కనిపిస్తుంది. 'శశివిషాణం' అనే పద్యాన్ని "చైతన్య పూరితమయిన, వాస్తవిక అస్తిత్వ చిహ్నాలేవీ లేని విషయం" అనే అర్థంలోనే ప్రయోగించారు. రాజకీయ వ్యంగ్య చిత్రాలతో కూడిన కవితలకు 'శశవిషాణం' అనే పేరుపెట్టడంలోని ఆంతర్యమేమిటో ఇవాల్టి పాఠకులకు వివరించనక్కర్లేదు. రాజకీయ రంగంలో చైతన్యంగానీ, వాస్తవికత కానీ కరువయిన నేపథ్యంలో ఆదర్శవాదం 'శశవిషాణం'గా మిగలక

మరేమవుతుంది? ఈ నేపథ్యంలో, 50వ దశకం మొదట్లో రాంభట్ల-'విశాలాంధ్ర' దినపత్రికలో-మొదలుపెట్టిన రాజకీయ కార్టూన్ - కవితా ప్రక్రియ 'శశవిషాణం'. ఈ కార్టూన్ - కవితా ప్రక్రియ ప్రధానంగా తెలుగు పత్రికా రంగంలో సువ్యవస్థితమ యింది. ముగారి రాసిన 'ధూర్తాయణం' అరవయి దశకంలో ప్రాచు ర్యానికి నోచుకోగా, మల్లిక్ 'టుమ్రీలు' డెబ్బయి దశకంలో పాఠకుల నాలికలపై నాట్యమాడాయి. డెబ్బయి దశకం ద్వితీ యార్థంలో దేవిప్రియ మొదలు పెట్టిన 'సమాజానంద స్వామి' కూడా పాఠకులను ఆకట్టుకోగలిగాడు. ఎనభయి దశకంలో దేవిప్రియ-మోహన్ జోడీ ముందుగా 'ఆంధ్రప్రభ'లోనూ, తర్వాత 'ఉదయం' దినపత్రికలోనూ కొనసాగించిన 'రన్నింగ్ కామెంటరీ' వారిద్దరికీ మంచి పేరు తెచ్చింది. ఇటీవలి కాలంలో సతీష్‌చందర్ కూడా ఈ ప్రక్రియలో తన నేర్పు ప్రదర్శిస్తున్నారు. 1970-90 దశకాల మధ్యలో తెలుగు నాట రాజకీయ కార్టూన్ ప్రక్రియ వేన వేల కొమ్మలూ రెమ్మలతో వికసించింది. అయితే, మన కవి-కార్టూనిస్టుల్లో చాలామందికి ఈ ప్రక్రియకు ఆద్యుడయిన వ్యక్తి మన మధ్యనే వున్న విషయం తెలియకపో వడాన్ని మించిన దురదృష్టమేముంది? కొందరికి ఈ విషయం తెలిసినా, తెలియనట్లు గడిపేశారు! కనీసం రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి సందర్భంగానైనా, ఆయననూ, అపూర్వమైన రాజ కీయ కార్టూన్-కవితా ప్రక్రియ 'శశవిషాణం'నూ తల్చుకోవడం మన కార్టూనిస్టుల, వ్యంగ్య-అధిక్షేప కవుల కనీస కర్తవ్యం!

(60వ దశకంలో ప్రముఖ కవి ఆరుద్రకు డయాబిటిస్ రావడంతో వైద్యుల సలహా మీద-ఆయన గడ్డం గీయడం మానేశారు. అది జరిగిన కొత్తలో ఆరుద్ర- రాంభట్ల మద్రాసులో కలిశారట. వాళ్లిద్దరూ పాత మిత్రులే! పలకరింపులయ్యాకా, "ఏమిటీ కొత్త గెటప్పు?" అనడిగారట రాంభట్ల. "నాన్నృషిః కురుతే కావ్యమ్ అన్నారుగా పెద్దలు! అంచేత..." అన్నారట ఆరుద్ర గడ్డం దువ్వుకుంటూ. "నేనూ అందుకే మీసం కూడా తీసేశా!" అన్నారట రాంభట్ల. క్వశ్చన్ మార్క్ మొహం పెట్టారట ఆరుద్ర. "అదే నాన్-రుషిః కురుతే కావ్యం అని కదా పెద్దలన్నది!!" అన్నారట రాంభట్ల. మిత్రులిద్దరూ పగలబడి నవ్వుకున్నారట. ఇది ఆరుద్ర గారే స్వయంగా నాతో చెప్పిన విషయం!) ❑

# ఎర్రపాట

చిట్టీత పండెరుపు
చిలక ముక్కెరుపు
పసిపాప నవ్వెరుపు
పాలబుగ్గెరుపు
తొలిచూపు వలగొన్న
ఎలనాగ చెకిట
సిగ్గు దొంతరలెరుపు
సిందూర మెరుపు
పగడాల దండెరుపు
ప్రత్యూష మెరుపు
రానున్న రేపెరుపు
ప్రాణ కాంతెరుపు
మూడు లోకాలలో
మూడు కాలాల
నినదించు నిజమెరుపు
నిండు మనసెరుపు
శ్రమ ఎరుపు క్షమ ఎరుపు
శాంతి సుఖమెరుపు
పాటుపడువారి
పోరాటాలు ఎరుపు
స్నేహభావము ఎరుపు
జిజ్ఞాస ఎరుపు

తెంపరితన మెరుపు
తెలుగుతన మెరుపు
నిండు గుండెలలోన
నిత్యసత్యము ముంచి
రానున్న రేపు కప్పిన
మంచు తెరచించి
పాట పాడువారి
పోరాటాలలో నుంచి
పైపైకి ఎగిరేటి
బావుటా ఎరుపు !
ఎరుపన్న ఎందుకో
నీకింత వెరుపు ?
వెలుగన్న ఎందుకో
నీకింత ఉలుకు ?
మోకాలు అడ్డితే
వేకువాగేనా ?
మూకుడు మూసితే
నిజము దాగేనా ?
పసిపాప చిరునవ్వు
ఏ సీమదోయి ?
ఎలనాగ నునుసిగ్గు
ఏ భూమిదోయి ?

తొలి సంజకెంజాయ
లెవరబ్బ సొమ్ము ?
ఏ ఫ్యాక్టరీ సృష్టి
నిత్య సత్యమ్ము ?
పనివారి నుదిటి
చెమట ముత్తియపు కోవ
ఏ రేవు నుంచి
ఓడెక్కనో చెపుతావ ?
నరజాతి కనుగొన్న
నవయుగారుణ బింబ
ఏ రేవు నుంచి
ఓడెక్కనో చెపుతావ ?
ఎర్ర జెండా నాది
ఈ భూమి నాది
నిండు హృదయం నాది
స్నేహితము నాది
పొడవబోయే పొద్దు
పాలబుగ్గల ముద్దు
కొంచువచ్చు మరో
ప్రపంచమ్ము నాది.


- రాంభట్ల కృష్ణమూర్తి
శశ విషాణం నుంచి

## అరసంలో రాంభట్ల





హైదరాబాద్‌లో 1975 ఫిబ్రవరి 14, 15 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అ.ర.సం) మహాసభలో మాట్లాడుతున్న రాంభట్ల కృష్ణమూర్తి, హాజరైన సభ్యులు



అరసం 7వ మహాసభలకు హాజరైన ప్రతినిధులు

మిత్ర వాక్యం

# తెలుగులో పురా మానవ చరిత్రకు సూత్రకర్త

-కల్లూరి భాస్కరం



పందొమ్మిది వందల ఎనభైలలో నేను డి.డి.కోశాంబీ ప్రభావంలోకి వచ్చాను. ఆయన రచించిన 'మిత్ అండ్ రియాలిటీ' నా కళ్ళ ముందు ఒక అద్భుత పురా ప్రపంచాన్ని తెరచింది. అప్పటికి నాకు తెలిసిన పురాణ ఇతి హాస కథలను ఆ పుస్తకం వెలుగులో అర్థం చేసుకోవడం ప్రారంభించాను. ఆ తర్వాత కొన్నేళ్లు గడిచాక 'అభ్యుదయ' పత్రిక సాహిత్య విమర్శ మీద వెలువరించిన ఒక సంచికలో రాంభట్ల కృష్ణమూర్తి గారి వ్యాసం ఒకటి చదివాను. ఆయన పలుకు, పరిశీలన చాలా భిన్నంగా కనిపించాయి. వాటిలో మనకు తెలియని లోతులు, తెలియని చరిత్రా ఉన్నట్టు తోచింది. నా అభిరుచికి దగ్గరగా ఉండి, నేను కనెక్టు కావలసిన పండితునిగా ఆయన కనిపించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఉన్న మగ్దూం భవన్‌లో జరిగిన ఒక సమావేశంలో వారి ప్రసంగం విని, వారిని కలుసుకునే అవకాశం కలిగింది.

అప్పటికి నేను ఆంధ్రప్రభ దినపత్రికలో పనిచేస్తున్నాను. కొత్త సహస్రాబ్ది ప్రారంభానికి కాస్త అటు-ఇటుగా వాసుదేవదీక్షితులు గారి తర్వాత జి.శ్రీరామమూర్తి గారు ఆంధ్రప్రభ సంపాదకులు అయిన తర్వాత ఎడిట్ పేజీలో ఎలాంటి మార్పులు చేయాలని ఆలోచించుకున్నప్పుడు రాంభట్లగారితో కాలం రాయిస్తే బాగుంటుందని నేను సూచించాను. శ్రీరామమూర్తిగారు సరే అన్నారు. ఆంధ్రప్రభ ఆదివారం సంచికలో రాంభట్లగారి ఆత్మ కథను ధారావాహికగా ప్రచురించినా బాగానే ఉంటుందని అప్పుడే మరో సూచన చేశాను. దానికీ ఆయన అంగీకరించారు.

ఈ రెండు సూచనలతో రాంభట్ల గారిని బర్కత్పురాలో ఉన్న వారి అపార్ట్‌మెంట్‌లో కలుసుకున్నాను. ఆయన రెండు ప్రతిపాదనలకూ అంగీకారం తెలిపి, మొదట కాలమ్ ప్రారంభిద్దామనీ, అది నడుస్తుండగా నా ఆత్మకథను రాయడం ప్రారంభిస్తాననీ, కాలమ్ పూర్తి అయిన వెంటనే ఆత్మకథ ప్రచురణ మొదలు పెట్టవచ్చుననీ సూచించారు. అప్పుడే ఒక షరతు కూడా పెట్టారు. కాలమ్ నేను డిక్టేట్ చేస్తాను, వారం వారం మీరు ఎవరైనా వచ్చి రాసుకోవాలన్నారు. నేనే వస్తానని వారితో చెప్పాను. ఆ విధంగా వారం వారం రాంభట్ల గారి ఇంటికి వెళ్ళే అవకాశం నాకు కలిగింది. సమాన అభిరుచి కారణంగా అది నాకు మహాభాగ్యంగా మారింది. 'కథనం' అనే పేరుతో వెలువడిన ఆ కాలమ్ కారణంగా గంటల తరబడి ఆయనతో కూర్చుని ఆయన చెప్పే పురా చరిత్ర, పురా మానవ చరిత్రలకు చెందిన ఆసక్తికరమైన ఎన్నో ముచ్చట్లకు శ్రోతనయ్యాను. కోశాంబీ నా కళ్ళ ముందు తెరిచిన అద్భుత ప్రపంచాన్ని రాంభట్ల గారి మాటలు, కథనాలు మరింత విస్తారం చేస్తూ పోయాయి. మధ్య మధ్య ప్రపంచ విషయాలు, ఇంటి విషయాలు, వ్యక్తిగత విషయాలు ఆయన నోట దొర్లేవి. ఆయన అర్ధాంగి సుభద్ర గారు అల్పాహారాలతో, తేనీటితో మా సంభాషణకు మధ్య మధ్య ఇంధనాన్ని సమకూర్చేవారు.

అప్పుడే కొత్తగా ఆయన 'జన కథ' వెలువడింది. నాకు ఒక ప్రతిని ఇచ్చి ఆంధ్రప్రభలో దానిని సమీక్షించమని కోరారు. 'మిత్ అండ్ రియాలిటీ' తర్వాత 'జన కథ' పఠనం నాకు అంతటి మరో మహత్తర అనుభవం. అందులోని ప్రతి పుటలోనూ కుప్పపోసిన ఆశ్చర్యాలే. నేనే ఆంధ్రప్రభలో ఆ పుస్తకాన్ని సమీక్షించాను. ఇప్పుడది తలచుకుంటే నాకే ఎంతో దుస్సాహసమనిపిస్తుంది. ఎందుకంటే, ఇన్నేళ్లలో జనకథను మళ్ళీ మళ్ళీ చదువుతూనే ఉన్నాను. ఇప్పటికీ చదువుతూనే ఉన్నాను. కానీ ఆ పుస్తకంలోని విషయం ఈనాటికీ పూర్తిగా నాలో జీర్ణమయిందని చెప్పలేను. అందులోని విషయ గాంభీర్యం, లోతు అందుకు ఒక కారణమైతే, హ్రస్వలిపి లాంటి రాంభట్ల గారి శైలి ఇంకొక కారణం. ఆయన వాక్యాలు, నిర్ధారణలు చాలా సందర్భాలలో వ్యాకరణ సూత్రాలను తలపిస్తాయి. దానికితోడు ఆయన సాధారణంగా సోర్సు చెప్పరు. జనకథ తర్వాత ఆయన రచించిన వేదభూమి, వేల్పుల కథ కూడా నా చేతికి అందాయి. వాటితోనూ నాకు జనకథ అనుభవమే. 'పురాతన సమాజం' రాసిన లూయీ హెన్రీ మోర్గన్ ప్రభావంతో ఎంగెల్స్ రచించిన కుటుంబం-స్వంత ఆస్తి-రాజ్యం ఆవిర్భావం చదివిన తర్వాత జనకథ రాయాలనే ఆలోచన తనకు కలిగిందని, ఎంగెల్స్ పుస్తకం కానీ, గురజాడ వారి 'కన్యాశుల్కం' కానీ ఎప్పుడు చదివినా కొత్తగానే అనిపిస్తాయని-తన అనుభవాన్ని జనకథలో రాంభట్లగారు రాసుకున్నారు. జనకథతో సహా వారి రచనలతో సరిగ్గా నాది కూడా అదే అనుభవం.

రాంభట్ల గారి నోట విన్న అనేక విశేషాలను అప్పుడే కాగితం మీద పెట్టలేకపోయిన నా పొరపాటుకు ఇప్పటికీ చింతిస్తూనే ఉన్నాను. గుర్తున్న వాటిలోనూ అనేకం వివాదాన్ని

రేకెత్తించగలవి కనుక వాటిని అలా ఉంచితే ఒకటి, రెండు విషయాలకు పరిమితమవుతాను.

అశ్వమేధయాగం గురించిన ముచ్చట వాటిలో ఒకటి. ఈనాడు నుంచి తప్పుకున్న తర్వాత ఒకసారి ఏదో పని మీద ఆయన ఈనాడు ఆఫీసుకు వెళ్లారట. అక్కడ కొండవీటి వెంకట కవి గారు కొన్ని పుస్తకాలలో సీరియస్‌గా తలదూర్చి కనిపించారు. ఏమిటి శోధిస్తున్నారని రాంభట్లగారు అడిగారు. 'ఏమీ లేదు, ఎన్టీఆర్ గారు అశ్వమేధయాగం చేయాలనే యోచనలో ఉండి, దాని గురించిన కథా-కమామిషూ తెలుసుకోమని నన్ను అడిగారు' అని కొండవీటి వెంకటకవి గారు చెప్పారు. అశ్వమేధ యాగం చేస్తారు సరే, చేయించేవారు దొరకద్దా అని ప్రశ్నించిన రాంభట్ల గారు వెనకటి ఒక ఉదంతాన్ని చెప్పుకుంటూ వచ్చారు. జైపూర్ మహా రాజా వారికి ఇలాగే అశ్వమేధ యాగం చేయాలన్న ఆలోచన కలిగిందట. కానీ చేయించగల సమర్థులు దగ్గరలో ఎవరూ దొరకలేదు. ఉత్తర భారతం అంతా గాలించి చివరికి దక్షిణాదికి వచ్చి ఆంధ్రదేశంలో ఒకరిని పట్టుకున్నారు. ఆయన రాంభట్ల ఇంటి పేరు వారే. ఆయన జైపూర్ వెళ్ళి రాజు గారి చేత అశ్వమేధ యాగం చేయించాడు. యాగవిధి ప్రకారం రాజుగారి భార్యలలో ఒకరిని ఋత్విక్కునికి దానమివ్వాలి. అలా ఒక రాణిని స్వీకరించి ఆమెను వెంట బెట్టుకుని రాంభట్ల వారు స్వస్థలానికి తిరిగి వచ్చారు. ఆ రాణి ద్వారా కలిగిన సంతానంతో రాంభట్లలోనే ఇంకొక శాఖ ప్రారంభమయిందట.

బెంగాల్‌లో బాల వితంతువులను కాశీకి తీసుకు వెళ్ళి అక్కడ గంగార్పణం చేయడం గురించి ఆయన చెప్పేవారు. అక్కడి మహిళల దుస్థితికి చలించిపోయి, వారిలో ఆత్మవిశ్వాసం నింపడం లక్ష్యంగా శరత్‌చంద్ర చటర్జీ నవలలు రచించాడనీ, ఆంధ్రదేశంలోని మహిళలు అదే దురవస్థను ఎదుర్కొంటూ ఉండడం వల్లనే శరత్ నవలలను పెద్ద ఎత్తున తెలుగులోకి అనువదింపజేశారనీ అంటుండేవారు. కాలుజారి మోసపోయిన కన్నె పిల్లలు, వితంతువులు ఆత్మహత్యకు పాల్పడడం అప్పట్లో పరిపాటిగా ఉండేదనీ, అలాంటి వారిని కాపాడే బాధ్యతను చలం, ఆయన మిత్రులు కొందరు నెత్తిన వేసుకుని అర్ధరాత్రి కాలువ గట్టు మీద కాపలా కాసేవారనీ, డాక్టర్ రంగనాయకమ్మ గారు వారిని దగ్గరకు తీసి వైద్యం చేసేవారనీ అనేవారు. అంత ప్రసిద్ధంగా చరిత్రకెక్కని ఇలాంటి విషయాలు అనేకం ఆయన నోట దొర్లుతూ విస్మయం కలిగిస్తూ ఉండేవి.

బ్రిటిష్ ప్రభుత్వంలో నాటి మద్రాసు మ్యూజియం డైరక్టర్‌గా ఉండి, Castes and Tribes of Southern India' అనే పేరుతో ఏడు సంపుటాలను వెలువరించిన ఎడ్గార్ థర్స్ టన్‌ను ఉటంకిస్తూ వివిధ బ్రాహ్మణ శాఖల పుట్టుక గురించిన విశేషాలను ఆయన తవ్విపోస్తూ ఉండేవారు. అవి ఆశ్చర్యకరం గానే కాక, తీవ్ర వివాదాస్పదంగా కూడా ఉండేవి. 'తాటి మాల' ల గురించి తను ఈనాడులో రాసిన ఆదివారం సంపాదకీయం ఎలా వివాదానికి దారి తీయించిందో ఆయనే చెప్పేవారు. ఒక రకంగా ఈనాడు నుంచి ఆయన తప్పుకోవడానికి అదే కారణమని చెప్పినట్టు జ్ఞాపకం. ఆ సంపాదకీయాన్ని నిరసిస్తూ బ్రాహ్మణ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించి, పత్రిక తెప్పించుకోవడం మానేస్తామని యాజమాన్యాన్ని బెదిరించాయి. ఆ తర్వాత, ఆ సంపాదకీయం రాసింది బ్రాహ్మణుడే నన్న సంగతి పొత్తూరి వెంకటేశ్వరరావు గారి ద్వారా తెలిసి నొచ్చుకున్నారట. సోషల్ యాంత్రపోలజీలో అభిరుచి, అధ్యయనం ఉన్న వ్యక్తిగా ఆయన పంచుకునే ముచ్చట్లు తప్పనిసరిగా ఎవరో ఒకరికి అభ్యంతరకరంగా తోచి వివాదాస్పదం కావడం సహజమే. అందుకాయన జంకి ఊరుకుని ఉంటే ఎంతో విలువైన పురా మానవ పరిణామ చరిత్ర తెలుగు వారికి అంది ఉండేది కాదు. రాంభట్ల గారు రచించిన జనకథే కాక, వేదభూమి, వేల్పుల కథ, చివరికి సొంతకథ కూడా పురాచరిత్ర, పురా మానవ పరిణామ చరిత్రలకు సంబంధించి ఎంతో విలువైనవి. మోర్గన్ వెలుగులో, ఎంగెల్స్ రచన ప్రభావంతో, జార్జి థాంప్సన్, మలినో విస్కీ, ఫ్రెడరిక్ హ్రోజ్నీ తదితరుల నుంచి అందిన అవగాహనతో వేద పురాణ ఇతిహాసాలలోనూ, జన వ్యవహారంలో ఉన్న భాషల్లోనూ ఉన్న గణ లక్షణాలతో సహా పురా మానవ, సామాజిక, ఆర్థిక, రాజకీయ, భాషా పరిణామ చరిత్రలను ఆయన రాశిపోశారు. తెలుగులో ఈ కోణంలో ఇంత విస్తారమైన కృషి చేసిన వారు మరొకరు లేరు. ఈ అంశాలపై ఆసక్తి ఉన్న ఏ కొద్ది మందో తప్ప ఆయన కృషిని గుర్తించవలసినంతగా పండితులు గుర్తించలేదు.

పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి గారి వివరణతో ప్రచురితమైన వాత్స్యాయన కామసూత్రాల గురించి ఆయన తరచు ప్రస్తావించేవారు. అందులోని కన్యా సంప్రయుక్తాధి కరణంలోని 'ప్రత్తా జనపదకన్యాం దశమేహని కించి దౌపాయనకం గృహీత్వా ప్రవివేశా అంతఃపురం ఉపభోజ్యా విసృజ్యా ఇత్యాంధ్రాణామ్' అనే 42వ సూత్రాన్ని ఉదహరించి, వెనుకటి గాంధర్వ పద్ధతి ఇందులో చెబుతున్న తొలిరేయి హక్కుగా మారి ఉంటుందనీ, రైట్ ఆఫ్ ఫస్ట్ నైట్ పేరిట ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీలలో ఒకప్పుడు ఉన్న ఈ ఆచారం మన దేశంలో ఒక్క ఆంధ్ర దేశంలోనే ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుందనీ ఆయన అనేవారు.

చెకొస్లవేకియాకు చెందిన పండితుడు ఫ్రెడరిక్ హ్రోజ్నీ పేరు కూడా తరచు ఆయన నోట దొర్లేది. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో లభించిన హ్రోజ్నీ అభినందన సంచిక ఆయనను చాలా ప్రభావితం చేసింది. ఆసియా మైనర్ (నేటి టర్కీ)ను ఏలిన హిట్టైట్లు మాట్లాడిన భాష సంస్కృతానికి

తోబుట్టువేనని నిరూపించడం ద్వారా ప్రఖ్యాతుడైన హ్రొజ్నీ తెలుగు-తమిళాలను ద్రావిడ భాషలని కాక సుమేరో-అసీరియా భాషలు అనాలని ప్రతిపాదించాడు. దాని ఆధారంగా రాంభట్ల గారు సుమేరు, ఆసీరియా భాషలతో సంబంధమున్న అనేక తెలుగు మాటలను ఎత్తిచూపారు.

'కన్యాశుల్కం' గురించి అయితే ఆయనది నిత్యస్మరణే. తెలుగు నాట ఇప్పటికీ ఉన్న గణసమాజ అవశేషాలను ఆ పుస్తకంలోంచి ఆయన ఉదహరిస్తూ ఉండేవారు. తత్త్వ శాస్త్రం రాంభట్ల గారికి ఇష్టమైన రంగాలలో ఒకటి. ఈ రంగానికి సంబంధించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు ఆశ్చర్యాన్ని కలిగించడమే కాక, ఆయనకు గల అవగాహన లోతును వెల్లడిస్తాయి. 'నేను నిరీశ్వరవాదిని, భౌతిక వాదిని కూడా. ఈ రెండింటినీ ఒకరి నుంచే నేర్చాను, ఆయనే శంకరాచార్యుడు' అనేవారు. చారిత్రకంగా చూస్తే మన దేశాన దేవుడు లేడనీ, క్రీస్తు శకం ప్రథమ సహస్రాబ్దిలోనే దేశ విజేతల ద్వారా మనకు దేవునితో పరిచయం కలిగిందనీ అనే వారు. అలాగే, వీరశైవ, వైష్ణవాల పుట్టుక వెనుక క్రైస్తవ, ఇస్లాం ప్రభావం ఉందని అనేవారు. షడ్దర్శనాలలో ఒకటైన సాంఖ్యం అన్నింటికంటే అతి ప్రాచీనమనీ, అది వ్యవసాయ నాగరికత నుంచి పుట్టిందనీ, పండితులు మొదలుకొని జనసామాన్యం వరకూ అందరూ ఆదరించినది సాంఖ్యాన్నేననీ ఆయన అనే వారు. సాంఖ్యాన్ని అభివృద్ధి చేసిన కపిల అనే స్త్రీ పేరును ఆ తర్వాత కపిలుడిగా మార్చారని చెప్పేవారు.

గత ఇరవయ్యేళ్లుగా రాంభట్ల గారి రచనలతో నాకు దాదాపు నిత్య పరిచయం. ముందే చెప్పినట్టు అవి ఎప్పటికీ నిత్య నూతనంగానే ఉంటాయి. చర్చ, వివరణ రూపంలో వాటిని మరింత ముందుకు తీసుకువెళ్లవలసిన అవసరం ఉన్నా ఆ పని జరగలేదు. కనీసం రాంభట్ల వారి పుస్తకాలలో ఉపయోగించిన ముఖ్యమైన పదాలను వివరిస్తూ ఒక పదసూచి తయారు చేయాలని నా కోరిక. దీని గురించి ఏటుకూరి ప్రసాద్ గారితో అన్నప్పుడు, తప్పక ఆ పని చేయండి, మేమే వేస్తామని చెప్పి ప్రోత్సహించారు కానీ నా మహాభారత రచనలో కూరుకుపోయి ఇంత వరకు ఆ పని చేయలేకపోయాను. సోర్సు చెప్పనంత మాత్రాన రాంభట్ల వారి ప్రతిపాదనలు నిరాధారాలు కావని క్రమంగా నేను గ్రహిస్తూ వచ్చాను. ఆయన ఉపయోగించిన పదాలు, చేసిన ప్రతిపాదనలు కొన్నింటికి ఇన్నేళ్లలో అనేక ఇతర రచనల ద్వారా నేను సోర్స్‌ను గుర్తించగలిగాను. ఈ మధ్యనే నేను వెలువరించిన 'మంత్రకవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే' అనే పుస్తకంలో కోశాంబీ, జార్జి థాంప్సన్, జోసెఫ్ కాంబెల్‌లతోపాటు రాంభట్ల వారిని కూడా విస్తారంగా ఉటంకించాను. ఆయన శత జయంతి సందర్భంలో ఆ రూపంలో ఆయనను స్మరించుకోవడం నాకు అమితమైన సంతృప్తినిస్తున్న అంశం.

ఆంధ్రప్రభలో ఆయన కాలమ్ ప్రచురితమైనంత కాలం వారం వారం ఆయనను కలుసుకుని గంటల తరబడి గడపడం కొనసాగింది. కలసిన ప్రతిసారీ ఆత్మకథ ఎంత వరకూ వచ్చిందో చెపుతూ ఉండేవారు. అయితే ముందు అనుకున్నట్టు ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో దానిని ప్రచురించడానికి వీలుపడలేదు. మొదట శ్రీరామమూర్తి గారు, ఆ తర్వాత నేను ఆంధ్రప్రభ నుంచి తప్పుకోవడమే అందుకు కారణం. అది పూర్తి అయిన తర్వాత మిత్రులు గోవిందరాజు చక్రధర్ గారు తమ మీడియా హౌస్ పబ్లికేషన్స్ తరఫున 'సొంత కథ' పేరుతో దానిని ముద్రించారు. ఆ తర్వాత కూడా రాంభట్ల వారిని అప్పుడప్పుడు కలసుకుంటూనే ఉన్నాను. ఆయనతో నా చివరి సంభాషణ ఇప్పటికీ నాలో చేదును, విషాదాన్ని నింపుతూ ఉంటుంది. ఆయన ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైరైన 'మూర్తి గారు'(టి.ఎస్.ఆర్.సి.మూర్తి) గురించి తరచూ చెబుతుండేవారు. ఒక్కసారి మాత్రం ఆయనను నేను చూసిన గుర్తుంది. ఆయన భార్య కాలం చేసింది. పిల్లలు విదేశాలలో ఉన్నారు. ఆయన ఒక్కడే ఉంటున్నారు.

ఒకరోజు పొద్దునే రాంభట్లగారు నాకు ఫోన్ చేసి, "ఈ విషయం మీకు తెలుసా?" అని అడిగారు.

"ఏమిటి, చెప్పండి" అన్నాను.

"మూర్తి గారు పోయారు" అన్నారు.

"అలాగా, అయ్యో, నాకు తెలియదు" అన్నాను.

కొన్ని క్షణాలు రాంభట్ల గారు మౌనం వహించి, 'ఎలా పోయారో చెప్పనా?" అన్నారు.

"చెప్పండి" అన్నాను.

"పొద్దున్నే వెళ్ళి పాల ప్యాకెట్ తెచ్చుకున్నారు. ప్యాకెట్ టీపాయ్ మీద పెట్టి పడకుర్చీలో కూర్చున్నారు. అంతే, పక్కకు వాలిపోయారు. హార్ట్ ఎటాక్ వచ్చింది" అని చెప్పి రాంభట్ల గారు కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు.

ఆ తర్వాత, "మీరు ఒకసారి వస్తారా?" అని అడిగారు.

"నేను ఈ రోజు చెన్నై వెడుతున్నాను. రెండు రోజుల తర్వాత వస్తాను. తప్పక మిమ్మల్ని కలుస్తాను" అని చెప్పాను.

మరునాడు చెన్నై చేరిన తర్వాత సాయంత్రం ఇంటికి ఫోన్ చేస్తే, "రాంభట్ల గారు పోయారట ! టీవీలో చెబుతున్నారు" అని మా ఆవిడ చెప్పింది. నేను నిశ్చేష్టుడినయ్యాను. ముందు రోజు ఉదయం ఆయన ఫోన్ సంభాషణను గుర్తు చేసుకున్నాను. మూర్తిగారి మరణంతో దానిని రిలేట్ చేసుకున్నప్పుడు అసలు సంగతి నాకు అర్థమైంది. మూర్తిగారి మరణం ఆయనను ప్రభావితం చేసినట్టుంది. అందుకే నన్ను ఒకసారి రమ్మన్నారు కాబోలు! రాంభట్లగారిని తలచుకున్నప్పుడల్లా ఆ ఫోన్ సంభాషణ నా చెవుల్లో యథాతథంగా ధ్వనిస్తూ ఇప్పటికీ విచారాన్ని రేపుతూనే ఉంటుంది. ❑

# మనసున్న మహా మేధావి

## మిత్ర వాక్యం



-ఎం.వి.ఆర్.శాస్త్రి

జగమెరిగిన మార్క్సిస్టు మహామేధావి. ఎన్నో వందల మంది కమ్యూనిస్టు మేధావులకు, అభ్యుదయ రచయితలకు స్ఫూర్తి ప్రదాత అయిన రాంభట్ల కృష్ణమూర్తి గారి గురించి నాకు తెలిసింది తక్కువ. ఆయనతో నా సాహచర్యమూ కొద్దిదే. నా మీద ఆయన ప్రభావం పెద్దగా లేదు. కాబట్టి శతజయంతి సంచికకు నేనేమి రాయగలనని తటపటాయించాను. కాని మిత్రుడు ఆర్.వి.రామారావు "కాబూలీవాడి"లా వదలలేదు. గడువు చివరి రోజున ఈ నాలుగు మాటలు రాయక తప్పలేదు.

రాంభట్ల గారిని నేను మొదట కలిసింది 1969లో. నంద్యాల కాలేజి విద్యార్థులకు రాజకీయ తరగతి అధ్యాపకుడిగా ఆయన వచ్చిన సందర్భంలో. అప్పట్లో నేను నంద్యాల గవర్నమెంటు పాలిటెక్నిక్‌లో ఎలెక్ట్రికల్ ఇంజనీరింగు రెండో సంవత్సరం విద్యార్థిని. కాలేజీ ఎగ్గొట్టి మరీ-మార్క్సిజం సిద్ధాంత గ్రంథాలను దీక్షగా చదువుతున్న వాడిని. ఏ.ఐ.ఎస్.ఎఫ్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటున్న వాడిని. మా నాయకుడు కామ్రేడ్ వి.వి.రామారావు. (అనంతర కాలంలో రాష్ట్ర ఎఐటియుసి అధ్య క్షుడు, విశాఖపట్నం పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు). రామారావు సివిల్ ఇంజినీరింగు విద్యార్థిగా ఉంటూ పూర్తికాలం స్టూడెంట్స్ ఫెడరేషన్, కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంస్థల ఆర్గనైజర్ గా అవస్థలు పడుతూ పనిచేస్తూ నా వంటి కుర్రాళ్ళను ఇన్ స్పైర్ చేస్తూండేవాడు. అప్పట్లో మా విప్లవ తమకం ఎలాంటిదంటే ... ఓ సారి నాకో పెద్ద సమస్య వచ్చింది. కాలేజి ఎగ్గొడుతున్నానని తెలిసి మండిపడి మా నాన్న నన్ను చదువు మానేసి ఇంటికి రమ్మంటూ తిట్ల దండకంతో ఉత్తరం రాశాడు. ఆ సంగతి రామారావుకు చెబితే "కామ్రేడ్. మహా అయితే ఇంకో రెండేళ్ళు ఇలాంటి తిప్పలు తప్పవు. ఎలాగో ఓర్చుకోవాలి. ఆ తర్వాత ఎలాగూ విప్లవం రాక తప్పదు. సోషలిస్టు రాజ్యం వచ్చాక ఎవరికీ ఏ సమస్యా ఉండదు" అన్నాడు ఎంతో నమ్మకంతో. అంతేకదా అని నేనూ నమ్మకంతో నిట్టూర్చాను.

అలాంటి నెత్తురుమండిన, శక్తులు నిండిన విప్లవ స్వాప్నిక కాలంలో నేను రాంభట్ల గారిని మొదటిసారి చూశాను. నంద్యాలలో మేమున్న ప్రాంతంలో రామారావు రూములో బస చేసి రెండు రోజులు పూర్తిగా ఆయన మాతోనే ఉన్నారు. మార్క్సిజం గురించి, కమ్యూనిస్టు ఆలోచనా విధానం గురించి, చరిత్రను చూడాల్సిన గతితార్కిక పద్ధతి గురించి మాకు తెలియని ఎన్నో విషయాలు చెప్పారు. ఆది ద్రావిడుల నాగరికతను నాశనం చేసిన ఆర్యుల అజ్ఞానపు ఆనవాళ్లు అంటూ ఆయన వేదాలలోని వృత్రాసుర, త్రిపురాసుర గాథలను వివరిస్తుంటే మేము ఆశ్చర్యంతో నోరువెళ్ళబెట్టాం. నంద్యాల టౌన్‌లో జరిగిన బహిరంగ సమావేశంలో రాంభట్లగారు ఐతరేయ బ్రాహ్మణం నుంచి సంస్కృతంలో గడగడ కొటేషన్లు ఇస్తూ ఆంధ్రులకూ, సోవియట్ యూనియన్‌లో తాను చూసిన అర్మేనియాకూ ముడిపెట్టిన తీరు మాకు అద్భుతం అనిపించింది. ఇంతటి పాండిత్యం, ఇంతటి మేధాశక్తి నాకు ఏనాటికైనా అబ్బితే ఎంత బాగుండు అనుకున్నాను. అటు మీద చాలాకాలం నేను రాంభట్ల గారికి ఏకలవ్య శిష్యుడిని.

కాలేజీ చదువు తరవాత నేను మా ఊరు (కృష్ణా జిల్లా జగ్గయ్యపేట) చేరాను. ఉద్యోగం చేసే ఉద్దేశం ఎంత మాత్రమూ లేక, కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన సాగాను. అందులో భాగంగా జగ్గయ్యపేటలో అభ్యుదయ రచయితల సంఘం శాఖను మొదలెట్టాం. దానికి నేను సెక్రెటరీని. రాంభట్ల గారేమో రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శి. మా కొత్త శాఖకు మార్గదర్శనం కోసం 1974లో కాబోలు హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఆయనను కలిసాను. అప్పట్లో చార్మినార్ చౌరస్తాలోని సంగం థియేటర్ దగ్గర ఆయన అన్నగారికి AGE WORKS అని చిన్న ఫ్యాక్టరీ ఉండేది. ఈయనా రోజూ కాసేపు అందులో కూచునేవాడు. అక్కడే నాతో చాలా గంటలు ఆప్యాయంగా మాట్లాడారు. చిక్కడపల్లి రోడ్ల మీద నాతో కలిసి నడుస్తూ విలువైన ఎన్నో సూచనలు ఇచ్చారు.

అప్పట్లోనే జగ్గయ్యపేటలో ఇండో సోవియట్ కల్చరల్ సొసైటీ (ఇస్కస్) శాఖను పెట్టదలిచాం. దాని విషయంలో ఒక పేచీ వచ్చింది. ప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకుడు, ఉమ్మడి మద్రాసు రాష్ట్ర, ఆంధ్ర శాసనసభల్లో ప్రముఖ ప్రతిపక్ష నేత అయిన పిల్లలమర్రి వెంకటేశ్వర్లు గారిది మా ఊరే. పెట్టబోయే ఇస్కస్ కమిటీలో ఎవరుండాలన్న దానిపై ఆయన చెప్పింది మా కుర్ర కారుకు నచ్చలేదు. మేము అన్నదానికి ఆయన ఒప్పుకోలేదు. చిన్నవాళ్ళం కాబట్టి కమ్యూనిస్టు పార్టీ లోతుపాతులు మాకు తెలియవు. మనందరం కలిసి నడుపుకునే సంఘంలో ఈ

పెద్దాయన పెత్తనమేమిటి అని చిర్రెత్తింది.

ఏమి చెయ్యాలి అని అడగటానికి మళ్ళీ హైదరాబాద్ వెళ్లి రాంభట్ల గారిని కలిశాను. ఎందుకంటే ఆ కాలాన ఇస్కస్‌కు కూడా ఆయనే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. 'ఓస్! దీనికేముంది! మెంబర్లు అందరూ ఎలా అనుకుంటే అలాగే కానివ్వండి' అని ఆయన చెప్పారు. 'పిల్లలమర్రి గారు ఒప్పుకోరు' అంటే 'రాష్ట్ర కార్యదర్శిని నేను. మీ కమిటీని ఆమోదించాల్సింది నేను' అన్నారు. మా మాటే నెగ్గినందుకు నాకు మహా సంతోషం వేసింది. 'ప్రారంభసభకు మీరు తప్పక రావాలి అన్నాను. తప్పక వస్తాను. అన్నీ దగ్గరుండి నడిపిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. అంతటివాడే అభయం ఇచ్చాక ఇంకేమి కావాలి అని ఈల వేస్తూ ఇంటికి వెళ్లాను. స్టేట్ సెక్రెటరీనే మాకు అండగా ఉన్నాడన్న పొగరుతో పిల్లలమర్రి గారికి ప్రారంభసభ సంగతి మేము చెప్పనైనా చెప్పలేదు. చెపితే ఎక్కడ చెడగొడతాడోనని భయం.

అన్నట్టే రాంభట్ల గారు మా ఊరు వచ్చారు. మా ఇంట్లోనే బస చేశారు. 'మంచి బ్రాహ్మడు. వేదాలు, పురాణాల గురించి ఎంత చక్కగా చెపుతున్నాడో' అని మా అమ్మ తెగ సంతోషించింది. భోజనం చేశాక ఆయన్ను ఏవో సందేహాలు కూడా అడిగింది ఆ బ్రాహ్మడు చక్కగా సమాధానం చెప్పి మా అమ్మను మెప్పించాడు. ఇక సభ దగ్గర కథ అడ్డం తిరిగింది. పిల్లలమర్రిగారు పిలవక పోయినా వచ్చి మొత్తం కార్యక్రమాన్ని తన చేతుల్లోకి తీసుకుని తాను కోరిన వాళ్ళతో కమిటీ వేయించారు. ఆయన చెప్పిన దానికల్లా రాంభట్ల 'సరే' అన్నారు. నేను తెల్లబోయాను. 'ఇలా చేశారేమిటి మహానుభావా' అని తరవాత అడిగితే తేలిగ్గా నవ్వేసి 'ఏం చేస్తాం? ఆయన పార్టీ రాష్ట్ర కమిటీ మెంబరు. ఆయన ఏరియాలో ఆయన మాటకు నేను ఎదురు చెప్పకూడదు.' అన్నారు. నాకు ఇంకా అర్థం కాలేదు. అది గ్రహించి 'అనువుగా నప్పుడు పంతానికి పోకూడదు. ఏదో జోక్ వేసి ఇరకాటం నుంచి తప్పించుకోవాలంతే. నన్ను చూసి నేర్చుకో' అని నాకు హితబోధ చేసి బస్సెక్కారు.

ఎన్నో అనుభవాలు అయి కమ్యూనిస్టు తత్త్వం బోధపడ్డాక నేను ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీకి గొడుగు పట్టటం లాంటి విప్లవ కార్యక్రమాలు కట్టిపెట్టి బతుకుతెరువు నిమిత్తం హైదరాబాద్ ఈనాడు దివాణానికి చేరాను. ఆ సమయాన రాంభట్ల గారు ఈనాడుకు ఎడిటర్ (ఎడ్మినిస్ట్రేషన్)గా ఉన్నారు. నేను రామోజీ రావు గారికి ఉత్తరం రాయటం, ఆయన నన్ను పిలిపించి మాట్లాడి సెంట్రల్ న్యూస్ బ్యూరో బాధ్యత చూసేపని ఆఫర్ చెయ్యటం 1978 ఫిబ్రవరి 10న నేను ఉద్యోగంలో చేరే వరకు ఆయనకు తెలియదు. తెలిశాక చాలా సంతోషించారు. సంపాదకీయం రాయటానికి గజ్జెల మల్లారెడ్డిగారు రోజూ ఈనాడు ఆఫీసుకు వస్తుండేవారు.(అప్పటికింకా ఆయన ఎడిటర్ గా చేరలేదు.) రాచమల్లు రామచంద్రారెడ్డి గారు ఎడిట్ పేజీకి పనిచేస్తుండే వారు. వీరు, రాంభట్ల సోమాజీగూడ ఈనాడు ఆఫీసు రెండో అంతస్తులో ఒకే కాబిన్లో కూర్చునేవారు. నా సీటు కూడా దాని పక్కనే. ముగ్గురు దిగ్గజాల ముచ్చట్లు వినటం, ఫస్ట్ ఫ్లోర్‌లోని క్యాంటీన్‌కు వారితో కలిసి వెళ్లి మాట్లాడటం గొప్ప అనుభవం.

రాంభట్లగారు చొరవ తీసుకుని 'మీజాన్'లో తన పాత సహచరుడైన బుద్ధవరపు చిన (బి.సి.) కామరాజు అనే "తూలికా భూషణ్"ను ఈనాడులో న్యూస్ ఎడిటర్‌గా చేర్పించారు. వారిద్దరూ ఆప్తమిత్రులు. వారితోబాటు డైనింగ్ హాల్‌లో మాట్లాడుకుంటూ భోంచేయటం వల్ల తెలుగు పత్రికా రంగ పూర్వాపరాల గురించి చాలా విషయాలు నాకు తెలిశాయి. అప్పుడప్పుడూ తిరుమల రామచంద్రగారు వారిని కలవటానికి వస్తుండే వారు. ఆయనా మీజాన్‌లో పనిచేసిన వాడేనట. ఆయన రాసిన 'నుడి-నానుడి' వెనుక రాంభట్ల హస్తం చాలా ఉందని ప్రతీతి. నేను అడిగినా రాంభట్ల గారు అసలు గుట్టు విప్పలేదు. చేరిన కొద్ది కాలానికే కామరాజు గారు ఈనాడు నుంచి అలిగి వెళ్ళిపోయారు. రాంభట్ల గారు జోక్యం చేసుకో గలిగి కూడా చేసుకోక నిర్వికారంగా మిన్నకుండిపోయారు. పేరుకు ఎడిటర్ (ఎడ్మినిస్ట్రేషన్) అయినా సంతకాలు పెట్టటానికి మించి ఆయనకు నిర్ణయాధికారాలు పెద్దగా ఉండేవికావు. ఉన్న కొద్దిపాటి అధికారాన్ని ఆయన వినియోగించుకునే వాడు కాదు. అంతకు ముందు జగ్గయ్యపేటలో నాకు అనుభవమయినట్టే ఈనాడులోనూ ప్రతి విషయంలో ఆయన తామరాకు మీద నీటిబొట్టు. ఆఫీసు వ్యవహారాల్లో ఆయన ఎల్లప్పుడూ His Masters Voice .

రామోజీరావు గారు, రాంభట్ల గారు చాలా ఏళ్ల నుంచీ మిత్రులు. ఈనాడు పెట్టక ముందు కూడా అబిడ్స్‌లోని మార్గదర్శి ఆఫీసులో పనివేళల తరవాత వారు తరచుగా కలిసి ఆత్మీయంగా ఇంగ్లీషులో మాట్లాడుకునే వారట. యజమాని దగ్గర అంత చనువు ఉన్నదన్న దర్పాన్ని రాంభట్ల గారు ఎవరి ముందూ కనపరిచే వారు కాదు. 'ఈనాడులో పని చేసినంత కాలమూ ఆఫీస్ బాయ్ నుంచి చీఫ్ ఎగ్జిక్యూటివ్ దాకా ఆయన అందరితోనూ ఒకే విధంగా స్నేహభావం చూపేవారు. అదే సమయంలో తన డిస్టెన్స్ తాను మెయింటైన్ చేసేవారు. ఏ పని దొంగో ఆయనని ఏ కాంటీన్‌లోనో మాటల్లోకి దించి హస్కుకొట్టి ఆ తరవాత ఇంచార్జి చేత తిట్లు తిని పితూరీ చేస్తే ఈ పెద్దాయన 'నీదే తప్పు. అతడలా అనవలసిందే. నువ్వు పడవలసిందే ' అని నిష్కర్షగా చెప్పేవాడు.

రాంభట్ల గారు మాటల పోగు. రోజూ ఒకటి రెండుసార్లు ఎడిటోరియల్ డెస్క్‌కు వచ్చి కూచునేవారు. ఏ సబ్ ఎడిటరో రాస్తున్న ఏ వార్తనో పట్టుకుని ఆయన ఎడ్యుకేట్ చేస్తూ పోతే ఎవరికీ సమయం తెలిసేది కాదు. డెడ్ లైన్లు పాటించవలసిన

న్యూస్ ఎడిటరుకూ షిఫ్ట్ ఇంచార్జీలకూ మాత్రం మహా ఇబ్బందిగా ఉండేది. కాని అవతలి వాడు సాక్షాత్తూ ఎడిటరు. ఏం చేస్తాం అని గొణుక్కునేవాళ్ళు. ఒక సందర్భాన మఫిసిల్ డెస్క్ ఇంచార్జీగా ఉన్న నేనూ, న్యూస్ ఎడిటరు సంతపురి రఘువీరరావు గారూ కలిసి రామోజీరావు గారి దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేశాం. ఆయన నవ్వి, రాంభట్ల గారిని పిలిచి "ఇదుగో రాంభట్లా ! రేపటి నుంచి డెస్క్‌కు వెళ్ళకు" అన్నారు. ఆయన 'సరే' అన్నారు. ఏం లాభం? మర్నాడు యథా ప్రకారం వచ్చి మామూలుకంటే ఎక్కువసేపు "లాఠీ చార్జి" (అది ఆయన బాధితులు అభిమానంతో పెట్టుకున్న పేరు) చేశాడు. అదీ ఎంత బాగా అంటే - కిందటి రోజు ఫిర్యాదు చేసిన నేను కూడా ఆయన అనర్గళ ప్రసంగాన్ని అత్యాసక్తితో వింటూ కూచున్నాను!

అప్పట్లో నేను సికింద్రాబాద్ నుంచి సైకిల్ మీద సోమాజీగూడ ఈనాడు ఆఫీసుకు వెళుతుండే వాడిని. రాంభట్ల గారేమో సాయంత్రం సోమాజిగూడ ఆఫీసు నుంచి చిక్కడపల్లిలోని తన ఇంటికి ఈవెనింగ్ వాక్‌గా నడిచి వెళుతుండే వారు. సైకిల్ నడిపించుకుంటూ ఆరు కిలోమీటర్లూ ఆయనతోపాటు నేనూ వెళ్ళేవాడిని. ఏ సుమేరియన్ సంస్కృతి గురించో, హనుమంతుడు సంజీవి పర్వతం మోసుకురావటం గురించో, సత్య హరిశ్చంద్రుడి అబద్ధాల గురించో, కంచర్ల గోపన్న పాపాల గురించో ఆయన అపర గిరీశం లా లెక్చరు ఇస్తూ మింట్ కాంపౌండ్ మీదుగా చకచక నడిచి పోతుంటే వింటున్న నాకు ఒళ్ళు తెలిసేది కాదు. ఇల్లు చేరాక కూడా సబ్జెక్టు పూర్తి కాకపోతే నన్ను ఆయన ఇంట్లో కూచోబెట్టి ఇంకో అరగంటో గంటో కంటిన్యూ చేసేవారు. విన్నదంతా నెమరు వేసుకుంటూ మళ్ళీ చిక్కడపల్లి నుంచి సికింద్రాబాదుకు ఇంకో ఆరు కిలోమీటర్లు సైకిలు మీద వెళ్ళేవాడిని. ఆ రకంగా చాలా నెలల 'దారి ముచ్చట్ల' వల్ల 1955 మధ్యంతర ఎన్నికలలో కమ్యూనిస్టు - కాంగ్రెస్ సైద్ధాంతిక సంఘర్షణల వంటి అనేక ఘట్టాలపై రింగ్ సైడ్ వ్యూ నాకు అవగతమయింది. ఆయనే సరదాగా అన్నట్టు - రాంభట్లతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్!

రోజు వారీ సంపాదకీయాన్ని గజ్జెల మల్లారెడ్డి గారు రాస్తే ఆదివారం ఎడిటోరియల్ రాంభట్ల గారు రాసేవారు. 1980లో కాబోలు రాంభట్ల గారు ఈనాడు ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ తరవాత రామోజీరావు గారు నా చేత అప్పుడప్పుడూ సంపాదకీయాలు, ఎడిట్ పేజి వ్యాసాలు రాయించేవారు.

> **రామోజీరావు గారు, రాంభట్ల గారు చాలా ఏళ్ల నుంచీ మిత్రులు. ఈనాడు పెట్టక ముందు కూడా అబిడ్స్‌లోని మార్గదర్శి ఆఫీసులో పనివేళల తరవాత వారు తరచుగా కలిసి ఆత్మీయంగా ఇంగ్లీషులో మాట్లాడుకునే వారట. యజమాని దగ్గర అంత చనువు ఉన్నదన్న దర్పాన్ని రాంభట్ల గారు ఎవరి ముందూ కనపరిచే వారు కాదు. 'ఈనాడులో పని చేసినంత కాలమూ ఆఫీస్ బాయ్ నుంచి చీఫ్ ఎగ్జిక్యూటివ్ దాకా ఆయన అందరితోనూ ఒకే విధంగా స్నేహభావం చూపేవారు. అదే సమయంలో డిస్టెన్స్ మెయింటెన్ చేసేవారు.**

మల్లారెడ్డి గారు 1983లో ఆంధ్రభూమికి వెళ్ళాక రోజువారీ సంపాదకీయాన్ని నేను, వరదచారి గారు, 'సహవాసి' ఉమా మహేశ్వరరావు గారిలో ఒకరం రాసేవాళ్ళం. ఆదివారం సంపాదకీయం మాత్రం ఉద్యోగ విరమణ తరవాత కూడా చాలా రోజులు రాంభట్ల గారే రాసేవారు. బ్రాహ్మలకు పూర్వీకులు మాలలు అని తెలుస్తూ ఎడిటర్‌గా ఉండగానే 'కుల మతాల మతలబు' శీర్షికతో ఆయన రాసిన సంపాదకీయానికి బ్రాహ్మణ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దివాకర్ల వెంకటావధాని గారి లాంటి పెద్దలు వచ్చి రామోజీరావు గారిని కలిసి నిరసన తెలిపారు. ఆ సంపాదకీయానికి పత్రికా ముఖంగా విచారం వ్యక్తపరిచినట్టు నాకు జ్ఞాపకం. కానీ రాంభట్ల గారు మాత్రం బెసగలేదు. తాను రాసింది తప్పంటే ఒప్పుకోలేదు.

నేను రాసిన ఎడిటోరియల్ అయినా ఎడిట్ పేజీ వ్యాసమైనా, స్పెషల్ స్టోరీ అయినా నేరుగా రామోజీరావు గారితోనే చర్చించి ఆయనకే చూపేవాడిని. కాబట్టి ఉద్యోగపరంగా నా రాతల విషయంలో రాంభట్ల ప్రమేయం ఉండేది కాదు. అయినా నేను రాసింది పత్రికలో శ్రద్ధగా చదివి మెచ్చుకోళ్ళనూ చివాట్లనూ ధారాళంగా అందిస్తుండే వారు. 1984 ఆఖరులో నేను తీవ్రంగా జబ్బు పడి మూడు నెలలు ఇంట పట్టున ఉన్న సమయాన పోతన భాగవతం, వేయి పడగలు, కథలు-గాథలు లాంటి గ్రంథాలను విరివిగా చదివాను. ఆ తరవాత డ్యూటీలో చేరి నేను రాసిన మొదటి సంపాదకీయాన్ని చూసి 'శాస్త్రుల్లూ! బాగా చదివి నట్టున్నావు. మాటలు బాగా పిక్కావు' అని తనదైన శైలిలో రాంభట్ల మెచ్చుకున్నారు.

రాంభట్ల గారు ఒకప్పుడు ప్రసిద్ధ కార్టూనిస్టు. స్వతహాగా ఆర్టిస్టు. ఆయన ఏది రాసినా బొమ్మ గీసినట్టు, శిల్పం చెక్కినట్టు ఉండేది. ఒక్క కొట్టివేత గానీ, హంసపాదు గాని ఉండేది కాదు. ఏ సబ్జెక్టు మీద అయినా ఎంత తక్కువ వ్యవధిలో అయినా అలవోకగా ప్రామాణిక రచనని బహు సొగసుగా ఆయన రాయగలరు. అయినా డిక్టేటర్‌గా ఉండటమే ఆయనకు ఇష్టం. ఆదివారం సంపాదకీయం ఆయన చెప్పే పద్ధతి కూడా చిత్రంగా ఉండేది. ఉద్యోగ విరమణ తరవాత ఆయన సీటులో నేను కూచునేవాడిని. ప్రతి గురువారం అనుకున్న సమయానికి ఆయన ఠంచన్‌గా వచ్చేవారు. వస్తూనే 'శాస్త్రుల్లూ! ఉత్తిష్ఠంతు' అనేవారు. ఏ వైదిక కార్యమైనా మొదలెట్టే ముందు

**(మిగతా 76వ పేజీలో)**

# తెలుగు వారి టాలెమీ

## మిత్ర వాక్యం



-వాడ్రేవు చినవీరభద్రుడు

ప త్రికా రచయిత రాంభట్ల కృష్ణమూర్తి "సొంత కథ"లో ఈ వాక్యాల్ని చూడండి : "మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం సాహిత్యం ఒక సామాజిక చైతన్య రూపం. వ్యక్తి చేతనం వేరు, సామాజిక చేతనం వేరు. చాలా మంది యువ రచయితలకు ఈ సంగతి తెలియదు. మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం ఆ చైతన్యం రెండు రకాలు. ఒక సంఘటన చూసినప్పుడూ, విన్నప్పుడూ తక్షణమే చేసిన వ్యాఖ్యకు సామాహిక మనస్తత్వం అని పేరు. ఆ సంఘటన పూర్వాపరాలను జాగ్రత్తగా ఆలోచించి చేసిన వ్యాఖ్యను సామాజిక చైతన్యం అంటారు. సామాజిక మనస్తత్వానికీ, సామాజిక చైతన్యానికీ ఉన్న తేడా ఇది. సామాజిక చైతన్య రూపమైన సాహిత్యం ఎవరు సృష్టించినా అందులో మూడు అంశాలు ఉండి తీరుతాయి. అవి ఒకటి సౌందర్యం, రెండు వాస్తవికత, మూడు తాత్వికత. ఈ మూడూ పాఠకునికి విజ్ఞాన దాయకాలు. అందులో సౌందర్యాంశ చదవాలన్న కోరికను కలిగిస్తుంది. వాస్తవికాంశం విజ్ఞాన దాయకం. తాత్వికాంశం వివేకదాయకం. అంటే సాహిత్యం వల్ల ఆనందం, విజ్ఞానం, వివేకం కలుగుతుంది."

ఈ వాక్యాల్లో కనిపించే స్పష్టత వెనుక ఒక జీవితకాలపు అన్వేషణ ఉందన్న విషయాన్ని మనం గుర్తు పెట్టుకోవాలి. రాంభట్ల కృష్ణమూర్తి (1920-2001) తన జీవితాన్వేషణలో గ్రహించిన విశేషాల్ని "సొంతకథ"గా, "వేల్పులకథ"గా రాశారు. కానీ వాటిలో ఆయన చెప్పింది కథలు కాదు. తాను జీవితం అనే సాన మీద నిగ్గు తేల్చుకున్న తన అభిప్రాయాల్నే. అందులో ఒక సారవంతమైన భావుకత కూడా కనిపిస్తుంది. ఇక్కడ భావుకత అన్న మాటను ఉత్పాదక శక్తి కలిగిన ఒక ఊహాగాన స్వభావం అన్న అర్థంలో వాడుతున్నాను. ఈ భావుకత ఆయనలో ఒక లెర్నింగ్ వృద్ధి చెందుతూ రావడం కనిపిస్తుంది. ఎదుట ఉన్న ప్రతి అపరిచిత అంశాన్నీ సమూలంగా అర్థం చేసుకోవాలనుకునే మనస్తత్వం, ఆసక్తీ సామాన్యమైనవి కావు. అవి మంత్రాలైనా, పంపు మోటార్లయినా వాటి ప్రయోజన రహస్యాన్ని తెలుసుకుని తీరాలనుకునే ఆయన తృష్ణ ఓ లెజెండ్.

బహు ముఖాలుగా విస్తరిల్లిన ఆయన ఆలోచనాధారలో ప్రతిక్షణం నుంచీ మరింత విస్తారమైన ఆలోచన వృద్ధి పొందించ వచ్చు. ఇటువంటి సారవంతమైన వాక్యాల్ని ఆయన రచనల నుంచి కొల్లలుగా ఎత్తి పోయవచ్చు.

ఉదాహరణకి కొన్ని వాక్యాలు చూడండి:

**"జనంలో ప్రచలితంగా ఉన్న మూఢ విశ్వాసాలన్నీ సోషల్ సైకాలజీలో భాగాలే. ఆ విశ్వాసాల మూలాలను తవ్వి తీస్తే అది సోషల్ కాన్షస్‌నెస్ అవుతుంది. ఒకని మీద జాలిపడడం గొప్ప కాదు. జాలి కలగవలసిన అవసరం కలిగించకుండా ఉండడం గొప్పదనం. గణ దశ తొలి రోజుల్లో ఏడుస్తున్న ఏ శిశువుకైనా ఏ స్త్రీ అయినా పాలు కుడిపేది. అది ఘృణ లేని దశ. అర్థసంబంధం లేని ధర్మం అధర్మం. ధర్మ సంబంధం లేని అర్థం అనర్థం. ధర్మం అంటే మతం అన్న అర్థం కూడా ఉంది కనుక మతానికి పునాదిరాళ్లుగా ఉన్న మన కులాలు కూడా అర్థాధీనాలే. అంచాత కుల రాగ ద్వేషాలు, ఉచ్చ నీచాలూ వీటిలో మార్పులు రావాలంటే అవి ఉపన్యాసాలతోనూ, నినాదాలతోనూ మారవు. అవి ఆర్థిక సంస్కరణల వల్ల మాత్రమే మారతాయి."**

రాంభట్ల ఆలోచన నుంచి భవిష్య పరిశోధనకు దారి తీయగల కొన్ని ముఖ్యాంశాల్ని ప్రస్తావిస్తాను. ఒకటి, ఆయన తన అధ్యయనాన్ని తన సమకాలీన వామపక్ష మేధావుల్లాగా మార్క్స్, ఏంగెల్స్, మోర్గాన్‌లతో ఆపకుండా సోషల్ ఆంత్రపాలజీ వరకూ కొనసాగించడం. ఈ అధ్యయనంలో ఆయన చేసే సూత్రీకరణ లు అన్ని వేళలా నిజమే కావాలని లేదు. ఆ సూత్రీకరణలను చదువుతుంటే ఆయన ఒక ఆధునిక టాలెమీగా కనిపిస్తాడు.

టాలెమీ భూగోళ, ఖగోళ అధ్యయనాల్లో యూరప్ మానవుడి ఆద్యుడు. ఆయన తరువాత ఆయన చూపిన దారిలో నడిచిన భౌతిక శాస్త్రవేత్తలు ఆయన ఆలోచనలు తప్పనే రుజువు చేశారు. కానీ, అటువంటి రుజువుల కోసం ప్రయత్నించడంలోనే భూమి రహస్యాల్నీ, విశ్వరహస్యాల్నీ వాళ్లు ఆవిష్కరించగలిగారు. అందుకే ఆ కీర్తి టాలెమీకే చెందుతుంది. రాంభట్ల ఆలోచనలు కూడా అటువంటి అన్వేషణను పురికొల్పితే, రేపు అవి తప్పని రుజువైనా అందుకు చింతించవలసిన అవసరం ఉండదు. ఆ అన్వేషణ తప్పకుండా ఒక నూతన ప్రపంచ చరిత్రను ఆవిష్కరిస్తుంది.

ఉదాహరణకి, ద్రావిడ భాషలకీ, పశ్చిమ ఆసియా భాషలకీ మధ్య ఉండే సారూప్యత గురించి ఆయన పదే పదే చెబుతూ

వచ్చిన పరిశీలనలు. సుమేరియన్ బృహత్కథ "గిల్గమేష్"లో నాయకుడైన ఎంకిడుకీ, తెలుగు ఎంకికీ మధ్య గల నామ సారూప్యం చిన్న ఉదాహరణ. తెలుగులోని అంకడు, అంకన్న, అంకమ్మ, వియ్యన్న, వియ్యమ్మ వంటి పదాలకూ సుమేరియన్ పదాలకూ గల సారూప్యత నిజంగా పరిశోధించవలసిన విషయం. చెంచుల్లో "అంకడు" నామవాచకం ఎక్కువగా కనిపించడానికి గల కారణాల్ని రాంభట్ల పరిశీలనతో పునః పరిశీలించాల్సిందిగా స్థలనామ పరిషత్ వారినొకసారి నేను కోరాను. ఆయన "సొంతకథ"లో చెప్పుకున్న దాన్ని బట్టి ఆయన పూర్ణ దీక్ష పొందిన శాక్తుడు. శాక్తం మూలాలు సాంఖ్యంలో ఉన్నాయి. సాంఖ్య తొలిరూపంలో ఒక గాఢ నిరీశ్వరవాదమే కాక శుద్ధ భౌతికవాదం కూడా. కానీ, కాలక్రమంలో అది తన మౌలిక లక్షణాల్ని పోగొట్టుకుని ఈశ్వరవాదంగా రూపొంది వేదాంతంలో కలిసిపోయింది. తొలి సాంఖ్యం సృష్టి మూల రూపాన్ని మూల ప్రకృతి అన్నది. దాన్నుంచే సృష్టి పరంపర కొనసాగింది. ఈ ఆది భౌతికవాదాన్నే బౌద్ధులు ప్రతీత్య సముత్పాదవాదంగా మలుచుకున్నారు సృష్టికి పదార్థమే మూలమనీ, ఇది ఈశ్వర సంకల్ప జనితం కాదనీ యూరప్‌లో వికసించిన భౌతిక వాదాలకు సమానమైన ఆలోచనలు సాంఖ్యంలో, బౌద్ధంలో కనిపిస్తాయి. ఇంతకీ సాంఖ్యం గురించీ, పశ్చిమాసియా గురించీ, వాటికీ, ద్రావిడ భాషలకూ ఉన్న సారూప్యత గురించీ తెలుసుకోవడం ద్వారా ఆయన ఏం సాధించాలనుకున్నారు? మానవ చరిత్ర మూలాల్ని తవ్వి తీయడంలో, ఆయన ప్రణాళికలో – దేవుడిని నిరాకరించడం, దేవతలుగా పూజలందుకుంటున్న గ్రామదేవతల రూపంలో ఇంకా మిగిలి ఉన్న గణ సమాజపు అవశేషాల్ని పైకి చూపడం ద్వారా క్రియాశీలక స్త్రీ శక్తిని ఆవాహన చెయ్యడం, ఆత్మ స్థానంలో పంచభూతాత్మకమైన ప్రకృతిని పునః ప్రతిష్ఠించడం ద్వారా శ్రేయోదాయకమైన మానవ తత్వశాస్త్రాన్ని పునరావిష్కరించడం – ఉన్నాయనుకుంటాను. హేతువాదం, భౌతిక వాదం, నిరీశ్వరవాదం – ఆయన సమకాలికులు చాలా మంది ఆయన కన్నా గట్టిగా – తెలుగు నేల మీద ప్రచారం చేసినవే. కానీ, ఆ ప్రచారానికి ఉండవలసినంత వైజ్ఞానిక బలం లేదు. సత్యశోధన లేదు. ఆ గుణాలే రాంభట్లని ప్రత్యేకంగా నిలుపుతాయి. ఇంతా చేసి ఆయన రాస్తాడు కదా, గురజాడ కన్యాశుల్కం నాటకం ద్వారానే తనకు సోషల్ ఆంత్రపాలజీ పట్ల, ప్రాగైతిహాసం మీదా ఆసక్తి కలుగుతూ వచ్చిందనీ, కందుకూరి వీరేశలింగం గారి స్వీయ చరిత్ర చదవడం వల్ల ఒక సామాజిక రహస్యోద్యమాన్ని ఎలా నిర్మించాలో బోధపడిందనీ. రాంభట్ల రచనా వ్యాసంగం ఇక ముగిసింది కాబట్టి ఆయన ఆలోచనల మీద తదుపరి పరిశోధన మొదలు కావాలి మరి. ❑

("సాలోచన," ఇండియాటుడే తెలుగు, 2001 నుంచి)

# మనసున్న మహామేధావి

(74వ పేజీ తరువాయి)

భూత పిశాచాలను ఆ చోటు నుంచి లేచి వెళ్ళమంటూ' ఉత్తిష్టంతు భూత పిశాచాః ఏ తే భూమి భారకాః' అన్న శ్లోకం చెబుతారు. నన్నూ అలాగే లేచి తన సీటు తనకు ఇవ్వమని గురువు గారి ఆదేశం! నన్ను భూత పిశాచాలతో పోల్చినందుకు నవ్వుకుంటూ నేను లేచాక ఆయన కూచునే సరికి టైపిస్టు వస్తుంది. లేక వస్తాడు. వెంటనే ఆయన కుర్చీలో వెనక్కి వాలి డిక్టేషను మొదలు పెడతారు. ఒక్కోసారి తనకు ఏదీ తట్టకపోతే 'నీకు ఏ సబ్జెక్టు కావాలి? అని టైపిస్టునో మరోకరినో అడిగి వారు ఏది కోరుకుంటే ఆ విషయం మీద గడగడ డిక్టేట్ చేస్తారు. మధ్యలో నా వంటి వాళ్ళు ఏదైనా అంటే దాని మీద ఒక అర్ధ గంట లెక్చరిచ్చి, తాను ఎక్కడ ఆపారో అక్కడి నుంచి మళ్ళీ ఎత్తుకుంటారు. పూర్తి అయిన తర్వాత ప్రూఫు కూడా ఆయన చూడరు. తేట తెనుగులో పొట్టి పొట్టి వాక్యాలే తప్ప దీర్ఘ సమాసాలు, చేంతాడంత వాక్యాలు ఆయన వాడరు. వర్ధమాన జర్నలిస్టులకు, ఔత్సాహిక రచయితలకు రాంభట్ల రచనలు అవశ్య పఠనీయాలు. విశాలాంధ్రలో పనిచేసిన రోజుల్లో అసెంబ్లీ సమావేశాలలో కమ్యూనిస్టు సభ్యుల ప్రసంగాల గురించి వి.హనుమంతరావు గారు ట్రంక్ కాల్‌లో ఐదు నిమిషాలలో చెప్పిన దాన్ని తాను ఒక గ్యాలీ మాటరుగా విస్తరించి రాస్తే ఆయా సభ్యులే మహా ఆనందించే వారని రాంభట్లగారు అనేవారు.

1983 మార్చి 24న చిక్కడపల్లి కోనసీమ ద్రావిడ సంఘం హాలులో నా పెళ్లి అయింది. అది చిన్న హాలు. దగ్గరి బంధు మిత్రులు, కొలీగ్స్‌ని మాత్రమే పిలిచాను. రాంభట్ల గారిని వెళ్లి ఆహ్వానించలేదు. కనీసం కార్డయినా పంపలేదు. అయినా ఆయన నా మీద ప్రేమ కొద్దీ పెళ్ళికి వచ్చారు. 'మా శాస్త్రుల్లు పెళ్లి అని తెలిసింది. నన్ను ఒకరు పిలవాలా ? నేనే వచ్చాను' అంటూ అందరితో కలివిడిగా మాట్లాడారు. పెళ్ళి కానుకగా నాకో సిగరెట్టిచ్చి సరదాగా తానూ ఒకటి ముట్టించారు. దటీజ్ రాంభట్ల! కపటం, డాంబికం లేని, మల్లెపూవులా స్వచ్ఛమైన మనసు గల మంచి మనిషి కాబట్టే రాంభట్ల కృష్ణమూర్తి గారంటే అందరికీ ఇష్టం.

1990 చివరిలో నేను డిప్యూటీ ఎడిటరుగా ఆంధ్రప్రభకు, అక్కడి నుంచి 1994లో ఎడిటరుగా ఆంధ్రభూమికి వెళ్ళాక రాంభట్ల గారితో సాంగత్యం క్రమేణా సన్నగిల్లింది. అప్పుడప్పుడూ ఫోన్‌లో మాట్లాడుకునే వాళ్ళం. ఒకసారి బర్కత్ పురాలో తాము కొత్తగా కొనుక్కున్న ఫ్లాట్ చూడమని పిలిచి చాలా సేపు మాట్లాడారు. అదే మా చివరి కలయిక. ❑

# రామభటులు

## మిత్ర వాక్యం

-హాస్యబ్రహ్మ డాక్టర్ శంకరనారాయణ



"ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు" అన్నాడు త్యాగయ్య. దీనినే కాస్త మార్చి "ఎందరో మహానుభావులు ఎందరికని వందనాలు?" అని ఆరుద్ర అన్నాడు. మహానుభావులు తారసపడడం కూడా పూర్వ జన్మ సుకృతం అంటారు పెద్దలు. నా పూర్వ జన్మ అకౌంట్ నా దగ్గర 'నమ్మకం'గా లేదు కాబట్టి అది ఈ అపూర్వ జన్మ సుకృతమేనని నేను గట్టిగా నమ్ముతున్నాను. వ్యత్యస్తపాదారవిందుడో నాకు తెలీదు గానీ తెలుగు సాహిత్యంలో అటు 'వంటి' వ్యక్తి రాంభట్ల కృష్ణమూర్తి గారు. నేను నిత్యం పాదాభివందనం చేయదగిన మహానుభావుల్లో ఒకరు. ఈ కాలం వారి సంగతి ఏమైనా, గతి ఏమైనా రాంభట్ల వారు జీవించి వున్న కాలంలో ఆయనను తెలియని వారు లేరు. ఆయనకు తెలియనిదీ లేదు. గిడుగు రామమూర్తి పంతులు గారిని చూడలేకపోతినే అనే బాధ ఉండేది నాకు ఒకప్పుడు. గురజాడ అప్పారావు గారితో నేను మాట్లాడలేకపోయానే' అనే బాధ ఉండేది. కానీ రాంభట్ల కృష్ణమూర్తి గారిని చూశాక, ఆయనతో మాట్లాడాక, ఆయన ఆశీస్సులను పుష్'కలం'గా పొందాక ఆ బాధపోయింది. జన్మధన్యం అయింది అనవచ్చు గానీ, ధన్యం కావడం అంటే ఏమిటో నాకు తెలీదు కాబట్టి అంతటిమాట అనలేదు. ఏ మాటకా మాటే చెప్పాలంటే నేనూ మాజీ నాస్తికుణ్నే. పెళ్లికి ముందు ఎవడైనా నాస్తికుడే. పెళ్లయిన తర్వాత దేవుడు తప్ప ఇంకెవడూ రక్షించ లేడనే 'గూఢ నమ్మకం' ఏర్పడుతుంది.

రాంభట్ల కృష్ణమూర్తి గారి పరిచయభాగ్యం నాకు 1984లో ఏర్పడింది. ఇప్పటిలాగే అప్పుడు కూడా (ఇప్పటికన్నా బాగా అనుకోండి ఫర్వాలేదు) ఈనాడు దినపత్రికలో పనిచేస్తుండేవాణ్ని (పోనీ జీతం తీసుకుంటూ ఉండేవాణ్ని.. అంటే మీరు ఏకీభవిస్తారు. ఏకరు). 1982లో ఈనాడులో చేరిన నాకు జర్నలిజంలో నూనూగు మీసాల నూత్న యవ్వనం. (యవ్వనం.. అనకూడదు.. యౌవనం అనాలని నాకూ తెలుసు) ఈనాడులో శిక్షణ కాలం పూర్తయిన కొద్ది కాలంలోనే జనరల్ డెస్క్ ఇన్‌ఛార్జి నయ్యాను. ఈ విషయంలో గొప్పగా చెప్పుకుంటాను. కానీ ఆర్.వి.రామారావు గారనే 'ఆప్త శత్రువూ' నా గర్వభంగం చేశారు. తాను 'అప్రెంటిస్'గా ఉండగానే షిఫ్ట్ ఇంఛార్జ్ అయ్యానని చెప్పారు. అప్పటి నుంచి ఆయన దగ్గర తప్ప మిగతా వాళ్లకు నా ఘనత గురించి చెబుతుండే వాణ్ని. ఇంతకీ ఆ విషయం వదిలేసి, రాంభట్ల వారి విషయంలోకి వస్తాను. నాకూ మానవత్వం ఉందని 'ఋజువు' చేసుకుంటాను.

రాంభట్ల వారు పరిచయం అయిన కొద్దిరోజుల్లో నేను ఆయనకు సన్నిహితుణ్నయ్యాను. దానిని ఆసరాగా చేసుకుని 'నడిచే బాసర' లాంటి ఆ పెద్ద మనిషి నామీద ఒక భయంకరమైన జోకు జోకారు. సీరియస్‌గా ఉండాల్సిన అంతలావు కమ్యూనిష్టాగరిష్ఠుడే జోకు వేసినప్పుడే నేను మాత్రం ఎందుకు నోటికి ప్లాస్టరు వేసుకున్నట్టు, ఎందుకు గమ్మున ఉంటాను ? ఎందుకు ఉండాలి ? "మీరు రాంభట్ల వారు అంటే 'రామభటుల' వారు, ఏమైనా అనవచ్చు" అన్నాను. ఆయన 'కిసుక్కున' నవ్వారు తప్ప, నా 'ప్రకటన'ను ఖండించలేదు.

ఇంకో సందర్భంలో రాంభట్ల వారి వల్ల నాకో అదృష్టం. కాదు కాదు దృష్టం అంటే కనిపించేది. నేను డెస్క్ ఇంఛార్జిగా చేతికొచ్చిన వార్తనల్లా సొరకాయలను కోసేసినట్టు ఎడాపెడా కోసేస్తుంటే జర్నలిస్టు పితామహుడైన రాంభట్ల వారికి తిక్క రేగింది. వెంటనే ఆయన నా క్యారికేచర్ గీసి నా చేతికిచ్చేశారు. నా చేతిలో ఒక గొడ్డలిని పట్టుకుని, భుజం మీద పెట్టుకున్నట్టు గీశారు.

నా ఎడిటింగ్‌కు ఇంతకు మించిన గర్వకారణమైన తీపి గుర్తు ఇంకొకటి లేదు. ఆయన బొమ్మ నా ఫైళ్లలో ఎందులోనో ఉండి, ఇప్పుడు కనిపించడం లేదు. రాంభట్ల వారితోపాటు అది కూడా స్వర్గానికో, అత్యాధునిక సౌకర్యాలున్న నరకానికో వెళ్లిందేమో! నేను అక్కడికి వెళ్లే వరకు ఇదమిత్థంగా చెప్పలేను.

రాంభట్ల వారి శశవిషాణ గీతాలు నేను చదివాను. దానికి 'ప్రతీకారం' గానో ఏమో నా రచనల్ని కూడా ఆయన చదివారు. అందువల్ల నా మీద అపేక్ష పెంచుకున్నారు.

ఆయన ఒక 'డిక్టేటర్' కూడా. హైదరాబాద్ బర్కత్‌పురలో ఆయన నివాసం ఉండే ఇంటికి 'ఆన్ డ్యూటీలో వెళ్లి ఆయన 'డిక్టేట్' చేస్తూ ఉంటే, నేను బుద్ధిగా రాసి ఆంధ్రప్రభ ఎడిటర్ గారికి ఇచ్చాను.

రాంభట్ల వారు 'వ్యాసు'డయితే, నేను జర్నలిస్టు గణపతిన య్యానులే అనుకుంటాను. ఎవ్వరికీ చెప్పను. ఆయనలో సృజనాత్మకత ఉంది కానీ భజనాత్మకత లేదు. ఆయన న్యూస్‌ను

కొత్తలు అనేవాడు. రాంభట్ల గారి అంతటి సాహస జర్నలిస్టులు ఎక్కడో నూటికో, కోటికో ఒక్కరుంటారు. నిజాం నిరంకుశ పాలన సాగుతున్న రోజుల్లో రాంభట్ల గారు ఒక పత్రికలో 'నిజాం నవాబును నారాయణగూడా చౌరాస్తాలో ఉరి తీయండి' అంటూ సంపాదకీయం రాశారు.

'ప్రభులెక్కిన పల్లకీ కాదోయ్' అది 'మోసిన 'పత్రిక ఏమిటి?' అని ప్రజాస్వామ్యం 'వెల'సిల్లుతున్న ఈ రోజుల్లో ఇలాంటి సాహసాన్ని కనీసం ఊహించగలమా ? శ్రీ కృష్ణ దేవరాయలు అష్టదిగ్గజాలను పోషించినట్లు, ఇప్పుడు 'నయారాజులు' రాసే, మోసే ఎంతోమంది జర్నలిస్టులను పోషిస్తున్న దృష్టాంతాలను ఎన్ని వినడం లేదు !

'అంగళ్ల రత్నాలు – అమ్మినారిచ్చోట' అని పాడుకుంటాం. అదేం గొప్ప.. రత్నాలు, వజ్ర వైడూర్యాలు ఇప్పుడు అంగళ్లలో అమ్ముడుపోతున్న వార్తలు, కథనాలకన్నా ఖరీదైనవా ఏమిటి? వార్తల్లో వాతలు తగ్గిపోయి మోతలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో

ఏది వార్త ? ఏది కాదు? రాంభట్లా !

ఓ మహాత్మా ఓ మహర్షి

రాంభట్ల వారు నాతో చెప్పిన ప్రతి చమత్కార వచనమూ ఒక ఆశీర్వచనమే. ఆయన నా పేరు శంకరనారాయణ కాబట్టి శంకర నారాయణ డిక్షనరీ గుర్తొచ్చేటట్టు నన్ను డిక్షనరీ అని పిలిచేవారు.

ఆంగ్ల సాహిత్యంలో షేక్ స్పియర్ ఎంతో, తెలుగు జర్నలిజం లో రాంభట్ల కృష్ణమూర్తి గారూ అంతే.. ఆయనలాగా పారం ముట్టిన వారు, సారం పట్టిన వారూ తిరుమల రామచంద్ర గారి లాంటి వారు ఏ కొద్దిమందో. ఇంతకీ రాంభట్ల వారు ఏం చదువుకున్నారు ? షేక్ స్పియర్లాగానే... షేక్ స్పియర్ను 'ఫోర్త్ స్టాండర్డ్ గ్రాడ్యుయేట్' అని అనేవాళ్లు. రాంభట్ల గారూ దాదాపు అంతే. రాంభట్ల గారూ ఐదు తరగతులు చదువుకున్నారు గానీ 5వ తరగతిలో కేవలం మూడుసార్లు 'విజయవంతం'గా ఫెయిలయ్యారు. అందువల్ల రాంభట్ల 'స్టాండర్డూ', ఒకటే. బాణం వేయదలుచుకున్నప్పుడు ఎదురుగా ఉన్నది ఎవరున్నా రన్నది ఆలోచించకపోవడం జర్నలిస్టు జగదేక వీరుడయిన రాంభట్ల వారి లక్షణం. నగధీరుడయిన రాంభట్ల వారితో కలిసి ఒక భాషా సదస్సులో పాల్గొనే అవకాశం నాకు కలిగింది. అందులో ప్రముఖ భాషా శాస్త్రవేత్త ఆచార్య చేకూరి రామారావు (చేరా) గారు పాల్గొన్నారు. అందరూ వద్దని వాదించే 'ఐదు' ఉంటే తప్పేముంది? ఉండాల్సిందేనని చేరా గారు వాదించారు. అది విన్న రాంభట్ల గారు 'ఐదు'పంతులు ఆయన సంగతి మనకెందుకు లెండి' అని చమత్కరించారు.

రాంభట్ల గారు నిత్యం ఉత్సాహం తొణికిసలాడే వ్యక్తి. 72వ సంవత్సరంలోనూ 'నేనూ యువకుడినే' అని నాతో అన్నారు. అలాగే ఆనందంగా ఉన్నారు. ఆయన చమత్కారాలు కోకొల్లలు. కోనసీమ బ్రహ్మణులను 'కోబ్రా'లు అని వ్యంగ్యాస్త్రం విసిరారు. చిత్రమేమిటంటే రాంభట్ల కృష్ణమూర్తి గారు కోనసీమ బ్రహ్మణుడే. ఆయన ఒక పత్రికలో 'బ్రహ్మణులను తాటి మూలలు' అని రాయడం కూడా వివాదాస్పదమైంది. అయినా ఆయన తన అభిప్రాయం మార్చుకోలేదు. రాంభట్ల గారు రాసిన కొన్ని విషయాలు వివాదాస్పదం అయి ఉండవచ్చు గానీ ఆయన తెలుగు జాతి యావత్తూ గర్వించదగిన గొప్ప జర్నలిస్టు, పండితుడు అనే విషయాల్లో ఎటువంటి వివాదమూ లేదు. అచ్చంగా రాంభట్ల గారి లక్షణాలనే పుణికి పుచ్చుకున్న సుప్రసిద్ధ పాత్రికేయుడు, తెలంగాణ అరసం అధ్యక్షుడు అర్.వి. రామారావు గారు రాంభట్ల గారి శతజయంతి కార్యక్రమాలను భుజస్కంధాల మీద వేసుకుని విజయవంతంగా నిర్వహించడం రాంభట్ల గారి శిష్యుడిగా, అర్.వి.రామారావు గారికి మిత్రుడిగా నాకు గర్వ కారణం. రాంభట్లా జిందాబాద్! దివి నుంచి భువికి దిగిరండి! మీ అవసరం ఇక్కడ ఎంతో ఉంది. ❑

## కారణం లేని వీరణం

కాంగ్రెస్ సర్కారు వారు గద్దెలెక్కగానే
కుండపోతగా వర్షం కురిసిందదె చూడు

పీటలు వేయకముందే ఫెళఫెళ గోదారి
సివాలెత్తి ఊళ్ళునాళ్ళు చేసె వల్లకాడు

సియార్గారి తిరువడిగళ్ సేవించిన మంత్రి
పెదవులు కదపక ముందే పిడుగులు పడ్డాయి

తొలి శాసన సభకింకా తలుపులు విడలేదు
ఆంధ్రామాత్యుల అడుగులు అవె తడబడ్డాయి!

ముజ్జగాల తావెళితే మజ్జిగకే కరువు
పెరుగుకు చీటీ వ్రాసెను ఘరానాగ ఒకరు

కారణాలు లేకుండా కాంగ్రెస్ సర్కారు
వీరణాలు వాయిస్తే వినేవారు ఎవరు?

**(28 అక్టోబర్ 1953)**

**రాభంట్ల కృష్ణమూర్తి శత విషాణం నుంచి**

# బడిలో చదవని బహు గ్రంథ రచయిత

## మిత్ర వాక్యం

సాహితీ సంపద నుంచి..

చదువు లేని వ్యక్తి కోట్లు గడించారంటే అశ్చర్యపోనక్కర లేదు. వందల ఎకరాల మాగాణికి యజమాని అంటే అసలే ఆలోచించనక్కరలేదు. కానీ మూడో తరగతి మూడుచోట్ల మూడుసార్లు చదివిన వ్యక్తి, ఆ తర్వాత భాగ్య నగరం చేరుకొని ఆ మూడో తరగతి మళ్లీ చదివి, అలా అయిదో తరగతి వరకు మాత్రమే చదివి ఆపేసిన తర్వాత తాను లక్షలాది మందిని చైతన్యపరచే వ్యాసాలు, గ్రంథాలు రాశారంటే నమ్మలేం. కాశీ మజిలీ కథ అని అనుకోవచ్చు. లేదా కాళిదాసు నాలుక మీద కాళికాదేవి బీజాక్షరాలు రాసినట్లు ఈ కలికాలంలో అటువంటిదేమైనా జరిగిందని భ్రమపడాల్సి ఉంటుంది. రాంభట్ల కృష్ణమూర్తి గురించి ఏ మాత్రం తెలిసిన వారైనా అది కథ అనుకోలేరు. నిజమని నమ్ముతారు. అపారమైన ఆయన విజ్ఞానానికి జోహార్లు సమర్పిస్తారు!

తూర్పు గోదావరి జిల్లా అనాతవరంలో 1920 మార్చి 24న జన్మించిన రాంభట్ల మాట్లాడే విజ్ఞాన సర్వస్వంగా మిత్రులు, సన్నిహితుల ప్రశంసలందుకొన్నారు. కదిలే గ్రంథాలయంగా కీర్తి పొందారు. "వినే ఓపిక ఉండాలే కానీ, మనకు తెలియని ఓ కొత్త ప్రపంచాన్ని కళ్ల ముందు సాక్షాత్కరింపగల సమర్థుడు. మంచి వక్త. తెలుగుదనంతో మాట్లాడగల తెలుగువాడు."శశ విషాణం" గీతాల కవి. వివిధ సంస్కృతులూ, తాత్త్వికతల అధ్యయనం మీద ఆసక్తిగల వ్యక్తి. సమకాలీన తెలుగు జర్నలిజానికి సొగసులందించారు. కార్టూన్‌ను ఓ ఉద్యమంగా చేపట్టి ప్రజా చైతన్యానికి వినియోగించిన తొలి రాజకీయ కార్టూనిస్టు. ఈనాటి జర్నలిస్టుల్లో – కార్టూనిస్టుల్లో చాలా మంది రాంభట్లకు ప్రత్యక్ష–పరోక్ష శిష్యులనడంలో ఆశ్చర్యం లేదు" అంటారు ఆయన స్నేహితులు. 'తెలుగు గోష్ఠి'కి చెందిన సీనియర్ – మల్లిక్ మాటల్లో చెప్పాలంటే– "జీవితంలో ఆయనకు ఎవరూ ఎప్పుడూ ఎక్కడా ఎలాంటి సన్మానాలూ చేయలేదు. చేస్తామన్నా ఆయన ఒప్పుకోలేదు. అందువల్ల ఇవి బిరుదులో కితాబులో కావు. ఆయన వల్ల ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలకు లోనైన వారు ఆయన తో సంభాషణ అనే జ్ఞానసంద్రాల్లో మునిగి ముత్యాలో, రత్నాలో ఏరుకున్న వారు వందలాది మంది రచయితలు. ముఖ్యంగా పత్రికా రచయితలు, చిత్రకారులు, మేధావులు ఎవరికి వారు తమ మనసుల్లో తామే అనుకున్న మాటలివి. ఆయనలోని విజ్ఞానం లోతుల్ని, అవగాహనలోని నిజాయితీ గాఢత్వాన్ని, ఆలోచనల ఎత్తునీ, సత్యాన్వేషణ దీక్షని స్వయంగా తెలుసుకున్న వారు అభిమాన గౌరవాలతో చెప్పిన మాటలివి" అంటారు.

రాంభట్ల తాత ముత్తాతలది విశాఖపట్నం జిల్లా. ఆయన రెండో సంవత్సరంలో ఉండగానే తండ్రి చనిపోవడంతో ఓ చోట స్థిరంగా ఉండి విద్యనభ్యసించ లేకపోయారు. అనాతవరం, గజపతినగరం, ఇల్లెందుల్లో చదువుకొని, తిరిగి హైదరాబాదులో అయిదో క్లాసుతో చదువు మానేశారు. చిన్నతనం నుంచీ బొమ్మలు గీయడం నేర్చుకొన్నారు. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు అన్నీ ఆయన సొంతంగానే అధ్యయనం చేశారు. గ్రంథాలయాలను నమ్ముకొన్నారు. అందువల్ల అవే ఆయన విశ్వ విద్యాలయాలయ్యాయి. ఆయనకి మంచి జ్ఞాపకశక్తి ఉండేది. అదే ఆయన వరం. అలాగే ఆయనకి గొప్ప తార్కికత, సులభమైన శైలి సహజ సిద్ధంగా అబ్బాయి. అందువల్ల ఏ అంశాన్నయినా పాఠకులు నమ్మేలా చెప్పగలరు. మీ పేరేమిటి అనే వ్యాసంలో రాంభట్ల.. తన తార్కికతకి ఎంత బలమైన వాదన జోడించారో చూడండి. చరిత్రను పరిశీలించి చూస్తే శివుడు పాత దేవుడు. అతగానికి పూజలు కూడా విస్తారంగానే ఉన్నాయి. గుళ్ళూ గోపురాలు తక్కువే. ఆయన భక్తులు మాత్రం ఎక్కువ. ఆరాధకులు ఎక్కువ. ఆయన ఆకారం సింపుల్. అడిగిన వారికి అడిగినన్ని వరాలూ ఇస్తాడు. అడక్కపోయినా బూడిద ఇస్తాడు. విష్ణువు గొప్ప దేవుడు. ఆయన గుళ్ళూ గోపురాలూ గొప్పగా ఉంటాయి. అడిగిన వారందరికీ అడిగిన వరాలు ఓ పట్టాన కాని ఇవ్వడు. ఇచ్చినా అందులో ఎక్కడో ఓ చిన్న మెలిక ఉంటుంది. ఇప్పుడింక మనుషుల సంగతికొద్దాం. పేదా బిక్కీ అడుగూ బడుగు జనం అంతా శివభక్తులు. వాళ్లు కూడా శివుడు లాగే ఉంటారు. దిగంబరంగానో అర్ధ దిగంబరంగానో బతుకుతారు. కప్పుకొనడానికి బూడిద మాత్రమే వారి దగ్గరుంటుంది. వారిలో నోరున్నవారు అపోజిషన్‌గా తయారవుతారు. ఎంత అపోజిషన్ అయినా కళ్లముందు పవరు కనిపిస్తూ ఉంటుంది. కనక అడక్కపోయినా కోరిన వరాలన్నింటినీ కుమ్మరిస్తూ ఉంటారు. ఇక పవరులోకి వచ్చినవారూ, వారి నాశ్రయించుకుని ఉన్న కింకరులు, అందరూ విష్ణు భక్తులు. వాళ్ళు కూడా విష్ణువు లాగే పీతాంబరాలు, హారకేయూర ధారులు, శేష వస్త్రాలూ

శాలువలూ కప్పుకొంటారు. వారి కన్ను పడిన చోట కనక వర్షాలు కురుస్తాయి. వారి పాదాలు సోకిన నేల పరశువేది అవుతుంది. వారంతా పవరులో ఉన్న పొలిటీషన్లు. విష్ణువులాగే ఒక పట్టానా వరాలివ్వరు. ఇచ్చినా అందులో లెక్క లేనన్ని మెలికలుండి తీరుతాయి. ఈ వ్యంగ్యం, సునిశిత హాస్యం, చమత్కారం, పురాణాలపై చరిత్రపైన ఉన్న పట్టు, అవగాహన ఆయన్ని పత్రికల వైపు ఆకర్షించాయి.

రాంభట్ల కృష్ణమూర్తికి అడివి బాపిరాజుతో పరిచయం ఏర్పడింది. అది ఆయన్ని "మీజాన్" పత్రికలో ఉప సంపాదకుడిగా చేరేలా ప్రోత్సహించింది. అయితే ఆయన అందులోనే ఉండిపోలేదు. ఆనాటి విషయాల గురించి మల్లిక్– "మనిషి, సమాజ చరిత్ర, కళ, సంస్కృతి, మతం, తాత్వికత– ఇవి ఆయన అభిమాన విషయాలు. ఆదిశంకరుని అద్వైతం తనను మార్క్సిస్టు తాత్వికతను సన్నిహితం చేసిందని ఆయన చెప్పిన మాట చాలా మందికి అర్థం కాలేదు. గోర్కీ లాగానే తనకూ ప్రపంచమూ సమాజమే విశ్వవిద్యాలయాలయ్యాని ఆయన చెప్పిన మాట చాలా మందికి అవగతం కాదు. చుట్టూ లోకాన్ని, జీవితాన్ని గమనిస్తూ అనుభవిస్తూ ఆయన అధ్యయనం చేశారు. ఆనాటి గొప్ప గ్రంథాలయాలు, ఎందరో మహనీయుల ప్రత్యక్ష పరిచయాలు, ఏకసంథాగ్రాహ్యత ఆయనకు తోడ్పడ్డాయి. జీవిక కోసం శరీర కష్టంతో శ్రమతో కూడిన అనేక పనులు చేశారాయన, ఫౌండరీలలో పనిచేశారు. తన పాతికేళ్లప్పుడు 'మీజాన్'లో పాత్రికేయుడిగా అడుగుపెట్టిన నాటి నుంచి పత్రికా రచయితగా పెద్ద పెద్ద అంగలతో ముందుకు సాగుతూ పరిణతి చెందారు. 'మీజాన్' పత్రిక నుంచి ఆయన ఎందుకు వెళ్ళిపోవలసిందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. "నిజాం నవాబుని ఉరితీయాలి" అని తాను రాసిన సంపాదకీయమే ఆయన నిష్క్రమణకు కారణమైంది. 1952లో "విశాలాంధ్ర" పత్రికలో చేరారు. తర్వాత కర్మాగారాలలో పని చేశారు. ఆ తర్వాత 'ఈనాడు' పత్రికలో చేరారు. రాజకీయాలకు – సామాజిక శాస్త్రాల అధ్యయనానికి జీవితాన్ని అంకితం చేశారు. అభ్యుదయ రచయిత సంఘం సారథుల్లో ప్రముఖులు రాంభట్ల. ప్రతి అంశాన్నీ మార్క్సిజం వెలుగులో అధ్యయనం చేయడం, అన్వయించడం ఆయనకు చాలా సహజంగానే అబ్బింది. "ఇస్కస్" అనుబంధంతో రష్యా వెళ్లారు. అలాగే అమెరికా, శ్రీలంకలు సందర్శించారు. ఈనాడులో పదవీ విరమణ చేశాక వివిధ పత్రికల్లో వ్యాసాలు రాశారు. 'ఉదయం' పత్రికలో కొన్నాళ్ళు రాశారు. ఆయన కావ్యాల్లో తొలిది– "శశ విషాణం" కవితల సంపుటి ప్రచురించారు. "తెలుగు మెరుగులు"ను 1986లో ప్రచురించారు. 'తెలుగు పుట్టు పూర్వోత్తరాలు' అనే పెద్ద వ్యాసం ఇందులో ఉంది. సుమేరు, అసీరియా సంస్కృతికి, తెలుగు సంస్కృతికి బాంధవ్యాలను ఆయన అందులో చర్చించారు. 1992లో దాన్ని విస్తృతం చేసి "తెలుగుదేశంపై సుమేరు సంస్కృతి ప్రభావము" పేరుతో ప్రచురించారు. అదే సంవత్సరం 'పారుటాకులు' అనే వ్యాస సంకలనం అచ్చయింది. 1997లో 'జనకథ', 1998లో 'వేద భూమి', 2001 మార్చిలో 'సొంత కథ', అదే సంవత్సరం ఆగస్టులో "వేల్పుల కథ" ప్రచురితమయ్యాయి. ఆయనకు "తెలుగు గోష్ఠి" సంస్థతో చివరి పద్దెనిమిది సంవత్సరాలలో అనుబంధం ఏర్పడింది. ఆయన ఆలోచనలు అసాధారణమైనవి. మేధావులు తప్పక ఆలోచించి, పరిశోధించాల్సిన సారభూతమైన ఆలోచనలు. అందుకే ఆయన్ని ఒరిజినల్ థింకర్ అనేవారు. మేధావులు, సంస్కృతిపై పరిశోధిస్తున్న వారు ఆలోచించేందుకు అనేక సమస్యలను, ప్రశ్నలను ఆయన ఆ తరం ముందుంచారు. కొన్నివేల వ్యాసాలు రాసినా, పుస్తకాల రూపంలో వచ్చినవి చాలా స్వల్పమని ఆయన మిత్రులంటారు. రాంభట్ల కృష్ణమూర్తి 2001 డిసెంబరు ఏడో తేదీ కన్ను మూశారు. తెలుగు జాతి, భాష, సంస్కృతి మూలాల కోసం ఆయన సాగించిన అన్వేషణని ఎవరో ఒకరు కొనసాగిస్తారన్న నమ్మకం ఆయనకూ ఉండేది... మనకూ ఉండాలి! ❑

# విజ్ఞాన ఖని రాంభట్ల

(78వ పేజీ తరువాయి)

రోజుల్లో కంటే భిన్నంగా, విశిష్టంగా ఉండేది. 'నేను డిక్టేటర్‌ను చెప్తాను రాసుకురండి" అని చమత్కరించేవారు. ఆయనకు సంస్కృతం, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో కూడా మంచి పట్టు ఉండేది. ప్రముఖ కార్మిక నాయకులు, కవి మఖ్దూం మొహియుద్దీన్‌తో, కార్మిక నాయకుడు, ఉర్దూలో ప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు డా. రాజ్‌బహదూర్‌గౌర్, మరో కార్మిక నాయకుడు కె.ఎల్. మహేంద్ర గార్లకు మంచి మిత్రుడు రాంభట్ల. సారస్వత చర్చల్లో, కవితా గోష్టుల్లో పాల్గొనేవారు. ఆయన తన చిన్న వయసులో పడిన కష్టాలు గుర్తుకు తెచ్చుకుంటూ తాను అనేకసార్లు నత్త గుల్లలో నత్తలా ముడుచుకుపోయి, మళ్ళీ మళ్ళీ బయటికొచ్చానని, జీవితంలో కష్టాలకు కుంగిపోక ధైర్యంగా నిలబడాలనీ నాతో మాటల సందర్భంగా అనేవారు. స్వయంకృషితో రాణించిన వ్యక్తి, అరుదైన మనిషి రాంభట్ల.

యువకులను పెద్దలు, అనుభవజ్ఞులు ఎలా ఆదరించాలో ఆయన్ను ఆదర్శంగా తీసు కోవాలి. ఆయన శతజయంతి సందర్భంగా నాలుగు మాటలు రాసే అవకాశం నాకు దక్కుతుందని నేను ఊహించలేదు. రాంభట్ల లాంటి గురువుంటే యువకులు పరిపూర్ణంగా వికసించి, చైతన్య వంతులౌతారనేది నా ప్రగాఢ విస్వాసం. ❑



ఇది ఈనాడు జర్నలిజం స్కూల్ - రాంభట్ల ప్రిన్సిపాల్‌గా మొదటి బ్యాచ్ జర్నలిజం విద్యార్థులు 1976




2021 ఆగస్టు 30వ తేదీన రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి సదస్సు ఆహ్వాన పత్రిక

## ఆచార్యునికి నీరాజనాలు



# దటీజ్ రాంభట్ల

-పి.వి.ఆర్. గోపీనాథ్

అది 1976 మే లేదా జూన్ కావచ్చు. ఈనాడులో సబ్ ఎడిటర్/విలేఖరిగా శిక్షణ పొందుతున్నాం మొత్తం 26 మంది. జర్నలిజం స్కూలు అనేది ఈ తరగతి గదికి శ్రీ రాంభట్లగారే ప్రిన్సిపాల్. కానీ ఆయన స్వభావమేమిటో తెలిసిపోయిందనుకునే మాలో ఎవరికీ ఆయన పట్ల బొత్తిగా భయమే లేదు. ఆ స్థానాన్ని కూడా భక్తే ఆక్రమించేసింది మరి. మేం ఇరవై ముగ్గురం కాగా, మా ఆడపడుచులు ముగ్గురే. సరి నేను మరి కాస్త దుడుకు, చొరవ ఉన్నవాడిని కావడంతో ఓ రోజు...

నేను : మన డైలీలో నవల ఉంటే బాగుంటుందేమో కదా

రాంభట్ల గారు : వౌహటేమిటి మూడుంటేనూ..

నేను : ఎక్కువైతే కుర్రకారు చెడిపోతారేమో..

రాంభట్ల గారు : నేను చూస్తానులే.

నా భావం నవల అంటే డైలీ సీరియల్. కానీ గురువుగారు తన శైలిలో లలన అంటూ హింటిచ్చారు. అందుకు నేను తగిన సందేహం వెలిబుచ్చగా ఆయన నా భుజం చరుస్తూ అలాగ...

సో, దటీజ్ రాంభట్ల. ఆయన ఏనాడూ మమ్మల్ని శిష్యులుగా చూడలేదు మరి. అందరమూ ఆయన దోస్తులమే.

మరో సందర్భం. ఓ సారి నేను మా బుర్రా (సుబ్రహ్మణ్యం)తో కలిసి గురువు గారింటికి వెళ్ళాను. అక్కడ వారి అమ్మాయి టీ బిస్కట్లు ఇచ్చింది. పరిచయం చేయగానే నేనేదో అనబోగా బుర్రా వారించాడు. అది ఆయన చూసేసినట్లున్నారు. వెంటనే ఏమీ అనలేదు. కానీ, కాసేపైన తర్వాత ఒకటే మాట..

'మన అభిప్రాయాలు మనకే ఉంచుకోవాలి' అచ్చంగా ఇవే పదాలు కాకపోయినా సారాంశం ఇదే అని గుర్తు.

ఇంకో ముచ్చట.

నేను శిక్షణ ముగింపజేసుకుని సబెడిటరైతే వారు ప్రిన్సిపాల్ హోదా వదలి అడ్మినిస్ట్రేటివ్ ఎడిటరైనారు. నన్ను హైదరాబాద్ నుంచి విజయవాడకు బదిలీ చేశారు.

అది నా స్వస్థలమే ఐనా.. మిత్రుల హెచ్చరికలు భయపెట్టడంతో మొరాయించాలనుకున్నాను.

ఇది తెలిసిన నా డెస్క్ ఇంచార్జి శ్రీ రామవరపు వేముగోపాల రావు గారు గురువుగారితో వీడు అక్కడకి పోవడానికి ఏడుస్తున్నాడండీ అని చెపితే రాంభట్ల గారు నవ్వి.. ఏడవనీ మరింత బలపడతాడులే అన్నారట.

(బాలానాం రోదనం బలం కదా మరి)

ఇక చివరగా రాంభట్లగారే దయతో నాకు ప్రసాదించిన బిరుదులు లేదా తోకలు..

1. జూనియర్ బద్రుద్దీన్, 2. జూనియర్ విశ్వనాథ.

మొదటి దానికి కారణం నా వినికిడి లేమి. మా ఇంకో గురువు శ్రీ చలసాని ప్రసాదరావు గారికి అసలేమీ వినపడేది కాదు. నాకు 40 శాతమే వినబడేది. అందుకే వారు బద్రుద్దీన్ కాగా నేను జూనియర్‌ను అయినాను. బధిరుద్దీన్ అనవచ్చు కానీ బాగుండదనుకున్నారు కాబోలును.

ఇక రెండో విశేషణానిక్కారణం.. నేను విశ్వనాథవారికి వీరాభిమానిని. ఆ రోజులలోనే వేయి పడగలను ఓ అరడజను సార్లు చదివేసి పాత్రలను కూడా గుర్తు పెట్టుకున్నవాడిని. పైగా నాకూ కొంత చాదస్తం.

భాష విషయంలో అప్పటికే వివాదాలు లేవదీసిన ఘటాన్ని కావడంతో ఆ తోక తగిలించారనుకోవాలి.

చివరగా రాంభట్ల గారికి కోపం అనేది తెలియదనే మా అభిప్రాయం. ఆయన ఎవరినీ కనీసం కసరనైనా లేదు మరి.

అందుకే ఆ మహనీయునికి నివాళిగా...

ఉ.మా.

ఆతడు కృష్ణుడే యనగ నందరు మెచ్చెడి యొజ్జయే కదా
వాతలు వేయదెవ్వరికి, వాదన పెంచడు, హాస్య ధోరణిన్
భ్రాతయొ, తాతయో యనెడి భ్రాంతియె మాకును మాట సూడగా
నీతులె పల్కుచుండు మరి నిక్కము సంజయ, వ్యాసుడే యనన్..

కం. నడచే గ్రంథాలయమన
తడబడడే ప్రశ్న వేయ తన ధోరణిలో
విడమరచి బోధ సేయుచు
గడయై భాసిల్లె తనదు గణముల కెపుడున్...

తాత.. బ్రహ్మ, తండ్రి, తాత కూడా కావచ్చును. కాగా సంజయ మరియూ వ్యాసుడు అనేవి ఆ కృష్ణుడి కలం పేర్లు. చక్కగా అమిరాయి కదూ! ❑

# ఏ చట్రంలోనూ ఇమడని వ్యక్తిత్వం

ఆచార్యునికి నీరాజనాలు

-డా.గోవిందరాజు చక్రధర్



'నా'తో మాట్లాడటమే ఓ ఎడ్యుకేషన్' అని గురజాడ అప్పారావు కన్యాశుల్కంలో గిరీశం చేత వ్యంగ్యంగా చెప్పించి ఉండవచ్చు. అయితే రాంభట్ల కృష్ణమూర్తితో మాట్లాడడం మాత్రం నిజంగా ఎడ్యుకేషనే. కాకుంటే ఆయనతో మనం మాట్లాడనవసరం లేదు. వినే ఓపిక, ఆసక్తి ఉండాలే గానీ ఆ వాక్ ప్రవాహం అలా అలా జీవ నదిలా ముందుకు సాగుతూనే ఉంటుంది. ఆ ప్రవాహంలో ప్రస్తావనకు రాని అంశాలంటూ ఏమీ ఉండవు. విశేషమేమంటే - విషయం ఏదైనా కన్యాశుల్కం ప్రస్తావన లేకుండా అది ముగియదు.

1977లో హైదరాబాద్‌లో ఈనాడు జర్నలిజం స్కూలు ప్రవేశ పరీక్ష రాసినపుడు పరీక్ష హాలులో మొదటిసారి రాంభట్ల కృష్ణమూర్తిని చూశాను. ఆ తరవాత ఇంటర్వ్యూ బోర్డులో కూడా ఆయన ఉన్నారు. కానీ ప్రత్యేకించి నన్నేమీ ప్రశ్నలు అడగలేదు. ఆ బాధ్యత రామోజీరావు తీసుకున్నారు.

రాంభట్ల కృష్ణమూర్తి జర్నలిజం స్కూలుకు ప్రిన్సిపల్. రాచమల్లు రామచంద్రారెడ్డి విద్యార్థులతో ది హిందూ పత్రిక నుంచి అనువాదాలు చేయిస్తూ ఉండేవారు. సాయంత్రం నాలుగు ప్రాంతంలో రాంభట్ల చకచకా అడుగులు వేస్తూ క్లాసులోకి ప్రవేశించేవారు. అలా వచ్చి కూర్చున్నాక హుషారుగా కబుర్లు చెప్పడం మొదలు పెట్టేవారు. ఆ కబుర్లకు పరిధి, పరిమితి ఉండేది కాదు. ఎక్కడో మొదలై మరెక్కడో ముగిసేవి. ఇప్పుడనిపిస్తూ ఉంటుంది. రాంభట్ల, రాచమల్లువంటి హేమాహేమీల పరిచయం దొరకటమే విశేషం కదా. వారి దగ్గర నాలుగు విషయాలు నేర్చుకోగలగటం ఎంతటి అదృష్టమోనని.

శిక్షణ ముగిశాక డెస్క్‌లో పనిచేస్తున్న రోజుల్లో రాంభట్ల మా మధ్య కూర్చుని 'ఏంటి మిత్రమా! కొత్తలు' అని అడిగేవారు.

న్యూస్‌కు ఆయన ఖాయం చేసుకున్న పదం 'కొత్తలు'. డెస్క్‌లోని వారు ఒకటో రెండో వార్తలు ఆయన దృష్టికి తెస్తే ఆ పరిణామాల వెనక్కి, చరిత్ర లోతుల్లోకి వెళ్లేవారు.

ఈనాడు విజయవాడ ఎడిషన్ మొదలు పెట్టినపుడు రాంభట్ల కూడా కొన్ని రోజులు విజయవాడలోనే విడిది చేశారు. ఫొటోలకు కవితాత్మకంగా రైటప్‌లు రాస్తుండేవారు.

అప్పటి గవర్నర్ శారదా ముఖర్జీ చేతుల మీదుగా ఈనాడు విజయవాడ ఎడిషన్ మొదలైంది. ప్రారంభ సభలో రాంభట్ల కూడా మాట్లాడారు. మా రామోజీ, అప్పోజి (అప్పారావు) అంటూ ఆయన ప్రసంగం సాగింది.

రాంభట్ల వాక్ ప్రవాహానికి సంబంధించిన జోక్ ఒకటుంది. మనం గడియారాలు వాటి పుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకోవాలనుకోండి. 'రాంభట్ల గారూ! టైమెంత' అని అడిగితే చాలు. ఆయనే అన్ని విషయాలు చెప్పుకొస్తారు. అంకినీడు, అంకబాబు పేర్లు ప్రస్తావనకు వస్తే చాలు, అంకాళమ్మతో తవ్వడం మొదలుపెట్టి గ్రామ దేవతలనందరినీ తలుచుకుని, సుమేరియన్ సంస్కృతి మూలాల దాకా రీవైండ్ చేయగల ఘనాపాఠి ఆయన.

ఇలా మాట్లాడటం వెనక ఎదుటి వారెవరన్న దానితో నిమిత్తం లేకుండా ఇలా చెప్పుకుంటూ వెళ్లడం వెనక రాంభట్లకు ఒక స్వార్థం లేకపోలేదు.

'చదివిన విషయం, తెలుసుకున్న జ్ఞానం మదిలో సుస్థిరం చేసుకోవాలంటే రెండే మార్గాలున్నాయి. ఒకటి కాగితం మీద పెట్టడం, రెండోది వాక్ రూపం ఇవ్వడం. ఈ రెండింట్లో ఏదో ఒక మార్గం ద్వారా తెలుసుకున్న విషయం రిప్రొడ్యూస్ కావాలి. అప్పుడే ఆ విషయం బుర్రలో నిల్వ ఉంటుంది. నేను మాటల ద్వారా రిప్రొడ్యూస్ చేస్తూ విషయాన్ని నిక్షిప్తం చేసుకుంటాను' అని అంటారు రాంభట్ల.

అయిదవ క్లాసుతోనే చదువుకు గుడ్ బై చెప్పిన ఆయన ప్రపంచాన్నే పాఠశాలగా మలుచుకుని ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక విజ్ఞానశాస్త్రాల వరకు ఆపోసన పట్టారు.

ఇంటర్వ్యూ ముచ్చట్లు

ఈనాడులో పనిచేస్తున్న రోజుల్లోనే 1988లో 'మీరూ జర్నలిస్టు కావచ్చు' పేరుతో పుస్తకం రాశాను. ఇందులో అనుబంధంగా రాంభట్ల కృష్ణమూర్తి, రామోజీరావు, ఎ.బి.కె.ప్రసాద్, చలసాని ప్రసాదరావు, చేకూరి రామారావు వంటి ప్రముఖుల ఇంటర్వ్యూలను కూడా చేర్చాను.

ప్రసిద్ధ చిత్రకారుడు తాడి మోహన్ ఈ ప్రముఖుల క్యారికేచర్లను శ్రద్ధగా గీసి ఇచ్చారు. వారి క్యారికేచర్లతోనే టైటిల్ ను కూడా డిజైన్ చేసి ఇచ్చారు.

రాంభట్ల క్యారికేచర్ ఆయన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించింది.

వడివడిగా అడుగులు వేస్తూ మోడ్రన్ డ్రెస్సులో ఉన్న రాంభట్ల ఎడమ చేతిలో పుస్తకాల దొంతర, వాటిపై గ్లోబ్ ను గీశారు. కుడి చేతిలో ఒక వైపు పెన్ను మరో వైపు కుంచెను చిత్రీకరించి దానికే హిందూ పతాకను అందులో కమ్యూనిస్టు చిహ్నాలను ఉంచారు. క్యారికేచర్‌తోపాటు ఆయన వ్యక్తిత్వాన్ని పట్టి చూపుతూ 'కదిలే గ్రంథాలయం రాంభట్ల' అనే శీర్షికను ఉంచాను. ఈ ఇంటర్వ్యూలో రాంభట్ల వ్యక్తిత్వాన్ని క్రోడీకరిస్తూ ఇలా రాశాను :

**'ఆయన జీవితాన్ని విశ్లేషిస్తే చిన్ననాట డబ్బు కోసం కటకట పడ్డారు. స్కూలు చదువంటే గిట్టక పుస్తకాలపై అనురక్తి పెంచుకున్నారు. కనిపించిన ప్రతి పుస్తకాన్నీ చదివారు. చిత్రకళలో కూడా స్వయంకృషితోనే నిలదొక్కుకున్నారు. వృత్తులు అనేక మారిన విజ్ఞాన కాంక్షలోనే మక్కువ నిలుపుకున్నారు. సంప్రదాయ కుటుంబంలో జన్మించినా, ఆ వాసనలు దరి రానీయలేదు. ఛాందసాలను వీడి శాస్త్రీయ, హేతుబద్ధతలకే ప్రాధాన్యం ఇచ్చారు. ధనార్జనకు కాక విద్యార్జనకు ఆయన జీవితాన్ని అంకితం చేశారు. రాంభట్ల పుస్తకాభిలాష యువతకు ఆదర్శం కావాలి.'**

మీరూ జర్నలిస్టు కావచ్చు పుస్తకాన్ని అప్పట్లో చాలామంది ఆసక్తిగా చదివారు. ఇంటర్వ్యూల ద్వారా తెలుగునాట మీడియా స్టడీస్‌కు ఆనాడే నేను శ్రీకారం చుట్టినట్టయింది. ఈ పుస్తకం ప్రేరణతో చాలామంది జర్నలిజంలో ప్రవేశించి ఇప్పుడు సీనియర్ పొజిషన్లలో కొనసాగుతున్నారు.

### సొంతకథ సంగతులు

రాంభట్ల తన ఆత్మ కథను సొంత కథ పేరిట రాశారు. ఈ పుస్తకాన్ని మీడియా హౌజ్ పబ్లికేషన్స్ తరఫున ప్రచురించే మహద్భాగ్యం నాకు కలిగినందుకు ఇప్పటికీ ఆనందంగా ఉంటుంది. మీడియా హౌజ్ తరఫున నేను పరిమితంగానే పుస్తకాలు ప్రచురించినా, చరిత్రలో నిలిచిపోయే వాసిగల పుస్తకాలను ప్రచురించగలిగానన్న ఆత్మ సంతృప్తి నాకు ఉంది. బూదరాజు రాధాకృష్ణ ఆత్మకథ విన్నంత-కన్నంత కూడా నేనే ప్రచురించాను. ఈ ఉత్సాహంతోనే సీనియర్ జర్నలిస్టులు తారసపడినప్పుడు వారి జీవిత విశేషాలను రాయండంటూ చనువు కొద్దీ పోరు పెట్టేవాణ్ని. ఇనగంటి వెంకట్రావు ఫ్లాష్‌బ్యాక్, జి.ఎస్.వరదాచారి జ్ఞాపకాల వరద, పొత్తూరి వెంకటేశ్వర రావు 'విధి నా సారథి' పుస్తకాలను నేను ప్రచురించలేకపోయినా ఆ రచనల వెనక నా పాత్ర, ప్రోద్బలం ఎంతో కొంత ఉంది.

ప్రతి ఒక్కరూ తాము చవిచూసిన అనుభవాలను, తమ కాలపు సంగతులను గ్రంథస్తం చేయాలని గట్టిగా కోరుకునే వారిలో నేనొకణ్ని, సమకాలికులకు ఆ విషయాలు తెలిసినవి అయి ఉండవచ్చు. కానీ కాలం గడిచే కొద్దీ ఆ అనుభవాల కథలకు విలువ పెరుగుతూ వస్తుంది. చరిత్ర నిర్మాణంలో ఇవి దారిదీపాలై నిలుస్తాయి.

### ఫొటో కోసం చొక్కా మార్చారు

సొంతకథ కవర్ పేజీపై రాంభట్ల రంగుల ఫొటోను ముద్రించాను. టైటిల్‌ను మోహన్ రాసిచ్చారు. రాంభట్ల జీవితంలోని విభిన్న పార్శ్వాలకు దర్పణం పడుతూ 'ఇది బ్రాహ్మణ్యం కథ, కమ్యూనిస్టు కథ, కార్మికుడి కథ, కార్టూనిస్టు కథ, సాహితీవేత్త కథ, జర్నలిస్టు కథ, ఎనభై వసంతాల కథ, సొంత కథ అంటూ టైటిల్ పైనే చెప్పే ప్రయత్నం చేశాను.

రాంభట్ల ఫొటో కోసం ఫొటోగ్రాఫర్‌ను వెంటబెట్టుకుని ఆయన ఇంటికి వెళ్లాను. అప్పుడాయన ప్లెయిన్ చొక్కాలో ఉన్నారు. రంగుల చొక్కా అయితే ఫొటో కలర్ ఫుల్‌గా ఉంటుంది అని చెప్పగానే కూతురు పంపిన రెడీమేడ్ చొక్కా పాకెట్ తెరచి వేసుకున్నారు. అదీ ఆయన సహృదయత.

### వ్యంగ్య వైభవం

ప్రతి సందర్భంలోను హాస్యం, వ్యంగ్యం పండించడంలో రాంభట్ల దిట్ట. ఏ సబ్ ఎడిటర్ పెళ్లి చేసుకుంటున్నానంటూ ఆయనకు పెళ్లి పత్రిక తెచ్చి ఇస్తే శుభాకాంక్షలు చెప్పి ఊరుకునే వారు కాదు. అలా ఊరుకుంటే రాంభట్ల ఎందుకవుతారు? 'ఫ్రెండూ! నీకు ఎం.బి.బి.ఎస్. పట్టా ప్రదానం చేసే టైము వచ్చిందన్న మాట' అనే వారు ముఖంలో నవ్వు పులుముకుని. ఆ పట్టా ఏమిటో దాని తబ్సీళ్లేమిటో బోధపడక ఆ కాబోయే పెళ్లి కొడుకు తెల్ల ముఖం వేస్తే- వెంటనే చిక్కుముడి విప్పేవారు. 'అదే నాయనా! ఎం.బి.బి.ఎస్. అంటే మెంబర్ ఆఫ్ భార్యా బాధిత సంఘం అని అర్థం. ఇక నుంచీ నువ్వూ మా సంఘంలో సభ్యుడివి కాబోతున్నందుకు సంతోషం' అంటూ చమత్కరించే వారు.

### రెండు వివాదాలు

సొంత కథలో రెండు అంశాలకు సంబంధించి అభిప్రాయ భేదాలు వ్యక్తమయ్యాయి. మొదటిది – చలసాని ప్రసాదరావుకు సంబంధించిన ప్రస్తావన.

చలసాని గురించి రాంభట్ల ఇలా రాశారు :

'అతడికి నేను ముద్దుగా బద్రుద్దీన్ అని పేరు పెట్టాను. చిన్నతనంలోనే టైఫాయిడ్ జ్వరం వస్తే నాటు వైద్యం చేశారు. దానితో బధిరత్వం వచ్చింది. అది వచ్చే వరకు చదువుకున్నాడు. బధిరత్వం వచ్చిన తరవాత చదువు మానేశాడు. వాళ్ల నాన్న అతడిని విశాలాంధ్రలో పని చేయించండని పెట్టాడు. అతడికి

చెవుడు ఉంది కానీ చురుకైనవాడు. తొలుత విశాలాంధ్ర మేనేజర్ దగ్గర ఆఫీసు బాయిగా పెట్టాడు. కాఫీ, సిగరెట్ల లాంటివి తెచ్చిపెడుతుండేవాడు' చలసాని ప్రసాదరావు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను ఎన్నడూ విశాలాంధ్రలో బాయిగా పని చేయలేదని, రాంభట్ల తన గురించి అసత్యాలు రాశారని లిఖిత పూర్వకంగా నాకు లేఖ అందజేశారు. ఆ లేఖను నేను రాంభట్ల దృష్టికి తీసుకెళ్లాను. 'నాకు గుర్తున్నంత వరకు రాశాను. బాయిగా పని చేయకపోతే మంచిదే'నంటూ రాంభట్ల సమాధానమిచ్చారు. ఆ వివాదం అంతటితో ముగిసింది.

> **'చదివిన విషయం, తెలుసుకున్న జ్ఞానం మదిలో సుస్థిరం చేసుకోవాలంటే రెండే మార్గాలున్నాయి. ఒకటి కాగితం మీద పెట్టడం, రెండోది వాక్ రూపం ఇవ్వడం. ఈ రెండింట్లో ఏదో ఒక మార్గం ద్వారా తెలుసుకున్న విషయం రిప్రొడ్యూస్ కావాలి. అప్పుడే ఆ విషయం బుర్రలో నిల్వ ఉంటుంది. నేను మాటల ద్వారా రిప్రొడ్యూస్ చేస్తూ విషయాన్ని నిక్షిప్తం చేసుకుంటాను' అని అంటారు రాంభట్ల.**

రెండవది – ఈనాడు సమ్మె. ఈ అధ్యాయంలో రాంభట్ల వాస్తవాలను వక్రీకరించారని, సమ్మెలో చురుగ్గా పాల్గొన్న ఒకరిద్దరు అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలుగు ఇండియా టుడేకు వ్యవస్థాపక ఎడిటర్‌గా పని చేసి రిటైరైన ఎం.రాజేంద్ర సొంత కథ విడుదలైన కొత్తలో ఒకానొక సందర్భంలో కలిశారు. ఆయనకు పుస్తకాన్ని అందజేశాను. ఆయన నా ముందే పుస్తకానీ చకచకా తిరగేసి 'ఇందులో కొన్ని వివాదాలున్నాయి' అంటూ ఇండియా టుడే రిపోర్టర్ చేత రాంభట్లను ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేయించి రెండు పేజీల్లో ప్రముఖంగా ప్రచురింప చేశారు.

సొంత కథను రాంభట్ల ఎనభై రెండో పుట్టిన రోజు కానుకగా 2001లో నేను ప్రచురించాను. అప్పుడే గిర్రున ఇరవై ఏళ్లు తిరిగాయా అని ఆశ్చర్యం వేస్తోంది. రాంభట్ల చేతి రాత ఎలా ఉంటుందో భావి తరాలకు తెలియచేయడం కోసం సొంత కథ స్క్రిప్టును కడప వేమన గ్రంథాలయానికి స్వయంగా అందజేశాను. దీంతోపాటు బూదరాజు విన్నంత కన్నంత స్క్రిప్టు కూడా వారికే ఇచ్చాను. కాకుంటే సొంతకథ ప్రచురణ సందర్భంలో నేను చేసిన తప్పు నిర్ణయం ఇప్పటికీ వెంటాడుతూ మనసుకు చివుక్కుమనిపిస్తుంది.

సొంత కథను కంపోజ్ చేశాక 250 పేజీలకు పైగా వచ్చింది. పేజీలు పెరిగే కొద్దీ ముద్రణ వ్యయం పెరుగుతుంది. దాంతోపాటే పుస్తకం ధరను నిర్ణయించాల్సి వస్తుంది. అందరికీ అందుబాటు ధరలో పుస్తకం ప్రచురించాలన్న సంకల్పంతో ఫాంటు సైజు తగ్గించాలని టైప్ సెట్టర్‌కు సూచించాను. పేజీల సంఖ్య తగ్గింది. పుస్తకం ఖరీదును 80 రూపాయలుగా నిర్ణయించాను. అయితే పెద్దతరం వారితో సహా పాఠకులందరూ హాయిగా చదువుకునేలా పెద్ద ఫాంట్‌లోనే ముద్రించి ఉంటే బావుండేది కదా అని ఆ తరవాత అనుకున్నాను. ఇప్పటికీ ఈ పుస్తకం చేతిలోకి తీసుకోగానే ఇదే విషయం ముందుగా గుర్తుకొస్తుంటుంది.

రాంభట్ల కన్ను మూశారని తెలిసి మోటూరి వెంకటేశ్వర రావుకు ఫోన్ చేసి చెప్పాను. 'రాంభట్ల ఇల్లు నాకు తెలీదు. నేను మీ జర్నలిజం కాలేజీకి వస్తాను. ఇద్దరం కలిసి వెళ్దాం' అన్నారు మోటూరి. అలాగే ఇద్దరమూ కలిసి రాంభట్లను చూసేందుకు బర్కత్ పురాలోని శివశక్తి అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లాం. రాంభట్ల భౌతిక కాయాన్ని చూసి మోటూరి దుఃఖం ఆపుకోలేకపోయారు. సొంతకథ పుస్తకం చివరలో ప్రచురించిన ఫొటో సెక్షన్ కాపీలు కొన్ని మిగిలి ఉంటే వాటిని తీసుకెళ్లి రాంభట్ల అభిమానులకు అందుబాటులో ఉంచాను.

## మనసుకు పట్టిన అధ్యాయం

సొంత కథలో నా మనసుకు బాగా పట్టిన అధ్యాయం తృణ జలుకా న్యాయం. "**తృణ జలూకమంటే గడ్డి మీద గెంతే జలగ. ఇది ఒక గడ్డి పరక మీద నుంచి మరొక గడ్డి పరక మీదకు సాగుతూ ముందుకు పోతుంది. నా విద్యార్జన కూడా ఆ తృణ జలూకా న్యాయాన జరిగింది**" అంటారు రాంభట్ల. తృణ జలూకం గమనంలో గొప్ప జీవిత సత్యమేదో ఉందనిపిస్తుంది నాకు. ఒకదాన్ని విడిచి మరొకదాన్ని అందుకుంటూ నిరంతరం ముందుకు సాగటంలోనే జీవిత పరమార్థం ఉందనిపిస్తుంది. దీన్ని ఎన్ని రకాల సందర్భాలకైనా అన్వయించుకోవచ్చు. ఒక దాన్నే పట్టుకు వేళ్లాడితే మరో అవకాశం అందుకోలేమని చెప్పవచ్చు. గతంలోనే గడపకుండా ముందుకు దృష్టి సారించాలనీ అనుకోవచ్చు. జీవితం నిత్య పరిణామ శీలమైనదిగానూ భావించవచ్చు. జీవితంలో అనుక్షణం వచ్చే మార్పులు ఆస్వాదిస్తూ ముందడుగు వేయాలని చెప్పుకోవచ్చు.

రాంభట్ల గడ్డి, జలగ నాలో పరిపరి ఆలోచనలకు కేంద్ర బిందువు అయి బోల్డన్ని జీవిత సత్యాలను బోధపరిచిందనిపిస్తుంది. సాహిత్య పరమార్థం – ఆలోచనలను తట్టి లేపడమే కదా! తరచి చూస్తే రాంభట్ల కృష్ణమూర్తి జీవితం నుంచి ప్రతి వారూ నేర్చుకోవలసిన విషయాలు చాలానే ఉన్నాయి. అవునూ! ఇంతకీ ముసు ముందు తరాల్లో రాంభట్ల కృష్ణమూర్తి లాంటి వారిని చూడగలమా? ఏమో, సందేహమే. ❑

# నడిచే జర్నలిజం స్కూలు

## ఆచార్యునికి నీరాజనాలు

- మంగు రాజగోపాల్



రాంభట్ల కృష్ణమూర్తి గారి గురించి చెప్పాలంటే నాకు సంబంధించి ఒక అదృష్టం, మరో దురదృష్టం గురించి చెప్పాలి. ముందుగా అదృష్టం గురించి మనవి చేస్తాను.

1975లో హైదరాబాద్‌లో నా పాత్రికేయ జీవితం ప్రారంభంలో, సినిమా జర్నలిజంలో ఉన్న నేను మెయిన్ స్ట్రీమ్ జర్నలిజంలోకి రావడానికి కారణమైన - ఈనాడు జర్నలిజం స్కూలుకి రాంభట్ల గారు ప్రిన్సిపాల్ కావడం నా అదృష్టం. (సార్, రాంభట్ల గారూ.. క్షమించండి.. వాక్యాన్ని అంకెలతో ప్రారంభించకూడదనీ, ఒకే వాక్యంలో అన్ని లోలు ఉండకూడదనీ మీరు చెప్పిన పాఠాన్ని మొదట్లోనే తుంగలో తొక్కాను. చూసీ చూడనట్టు వదిలేయండి.)

ఇక దురదృష్టం సంగతి చివరిలో విన్నవిస్తాను.

విశాఖపట్నంలో 1974 ఆగస్టు 10న కళ్ళు తెరిచిన ఈనాడు పత్రిక తన నడక (పరుగు అనాలేమో) ప్రారంభించింది మాత్రం 1975 డిసెంబర్‌లో హైదరాబాద్ ఎడిషన్‌తోనే. సీనియర్లని బయట నుంచి తెచ్చుకున్నా సబ్ ఎడిటర్లని మాత్రం మనకి కావలసినట్టు మనమే తయారు చేసుకోవాలి అన్నది రామోజీరావు గారి సిద్ధాంతం. దానికి అనుగుణంగానే ఈనాడు జర్నలిజం స్కూలు అవతరించింది. ఆ స్కూలు మొదటి ప్రిన్సిపాల్ రాంభట్ల కృష్ణమూర్తి గారు. ఆ స్కూలు మొదటి బ్యాచ్ సబ్ ఎడిటర్ల శిక్షణ తరగతులు 1976 మార్చి 9న ప్రారంభమయ్యాయి. ఆ మొదటి బ్యాచ్‌లో నేను ట్రయినీ సబ్ ఎడిటర్‌ను. నాతోపాటు ఇంకో పాతిక మంది ట్రయినీలు ఉండేవారు. (అంతకు ముందు నేను సినీ హెరాల్డ్ అనే సినీ వారపత్రికలో 250 రూపాయల జీతానికి పనిచేసేవాణ్ణి. ఈనాడులో 150 రూపాయలు మాత్రమే స్టయిపెండ్‌గా ఇస్తారని తెలిసి కూడా డెయిలీ జర్నలిజం మీద మోజు కొద్దీ ఈనాడుకు అప్లయ్ చేశాను. అది వేరే కథ.) ఆ పాతిక మంది ఎవరంటే...

**1.అల్లూరి ప్రభాకర్, 2.బుర్రా సుబ్రహ్మణ్యం, 3.దండమూడి సుషమ, 4.పీవీఆర్ గోపీనాథ్, 5.జీవీఎస్ మూర్తి, 6.వైఎస్ మూర్తి, 7. సూరి శ్యామసుందర్, 8. వంగరి శ్యామసుందర్, 9. ఏ.లక్ష్మీకాంతరెడ్డి, 10.ఏ.విశ్వేశ్వరరెడ్డి, 11.ఎస్.బాలిరెడ్డి, 12.ఏవీ సత్యసుధాకర్, 13.ఎస్‌టీజీ శ్రీధర్, 14.ఎం.రామ చంద్రాచారి, 15.ఇంగువ వేంకటేశ్వరరావు, 16. కె.లక్ష్మారెడ్డి, 17.రేనుమాను బాషా, 18.అంబటి మహేంద్రరాజు, 19.నిడమర్తి రాజశేఖర్, 20.పి.విలాసినీదేవి, 21. కె.సరస్వతి 22.సూరంపూడి రామశేషు, 23.దేవులపల్లి అమర్, 24.ఎం.ఉమాకాంత్, 25. జీడిగుంట నాగేశ్వరరావు.**

అప్పటికి సోమాజిగూడలోనే ఈనాడు కార్యాలయం ఉండేది. పై అంతస్తులు నిర్మాణంలో ఉన్నాయి. అక్కడ స్థలాభావం వల్ల మా శిక్షణ తరగతులు అబిడ్స్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయంలో జరిగేవి. వాళ్ళ కాన్ఫరెన్స్ హాలుని మాకు పూర్తిగా ధారాదత్తం చేసేశారు. మా స్కూలుకి ప్రిన్సిపాల్‌గా రాంభట్ల గారు మాకు అక్కడే పరిచయమయ్యారు. నిజానికి రాంభట్ల గారిని అంతకుముందే నేనోసారి చూశాను. అంతకు ముందెప్పుడో అరసం వాళ్ళు ఆంధ్ర సారస్వత పరిషత్ హాలులో సాహితీ చౌరస్తా పేరుతో ఒక వినూత్న సాహితీ సమ్మేళనాన్ని నిర్వహించారు. అందులో రాంభట్ల గారు పాల్గొని తన కవితని వినిపించారు. మా ట్రయినింగ్ క్లాసు మొదటి రోజున ఆయన అక్కడ ప్రత్యక్షం కాగానే వెంటనే గుర్తు పట్టేశాను. తెలుగులో తొలి పొలిటికల్ కార్టూనిస్టు రాంభట్ల గారేనని కూడా అక్కడ చేరాక నాకు తెలిసింది.

మిత్రుడు ఆర్వీ రామారావు చమత్కరించినట్టు మాది ఒక ఏకోపాధ్యాయ పాఠశాల. రాంభట్ల గారు ఒక్కరే ఫుల్ టైం ఉద్యోగి. అంటే ప్రిన్సిపాల్ అన్నమాట. ఆకాశవాణిలో పనిచేసే కృష్ణారావు గారు పార్ట్ టైం లెక్చరర్‌గా రోజూ మధ్యాహ్నం వచ్చేవారు. ఇంకా గెస్ట్ లెక్చరర్లుగా నిలయ విద్వాంసులైన సీనియర్ ఎడిటర్లు టీవీ కృష్ణ గారు, పొత్తూరి వెంకటేశ్వరరావు గారు, ఏబీకే ప్రసాద్ గారు, వి.హనుమంతరావు గారు, పన్యాల రంగనాథరావు గారు రోజుకొకరు వంతున వచ్చి ఓ గంటసేపు ఏదో ఒక సబ్జెక్టు మీద పాఠం చెప్పేవారు. రాంభట్ల గారు అప్పుడప్పుడు బయట నుంచి యూఎన్ఐ సీతారాం వంటి సీనియర్ జర్నలిస్టులను కూడా తీసుకువచ్చి మాకు క్లాసులు చెప్పించే వారు. ప్రిన్సిపాల్‌గా రాంభట్ల గారు గంట కొట్టినట్టు టంచన్‌గా పొద్దున్న పది గంటలకల్లా క్లాసుకు వచ్చేవారు. మాలో ఎవరు ఆలస్యంగా వచ్చినా వారికి ముందు క్లాసు పీకి, ఆ తర్వాత క్లాసు

తీసుకునేవారు. రాంభట్ల గారికి ఫలానా సబ్జెక్టు అంటూ ప్రత్యేకంగా ఏదీ ఉండేది కాదు. ప్రిన్సిపాల్‌గా ఆయనకి స్కై ఈజ్ ది లిమిట్ ఏ సబ్జెక్టయినా ఆయనకు కొట్టిన పిండి. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల గురించీ, నిజాం కాలం గురించి, హైదరాబాద్ గురించి, ముఖ్యంగా తెలుగు భాషా సాహిత్యాల గురించీ, కవిత్వం గురించి అనర్గళంగా చెప్పుకుపోయేవారు. 'అయ్యబాబోయ్.. అసలు ఈయనకి తెలియని సబ్జెక్టు ప్రపంచంలో ఉందా' అని ఆశ్చర్యపోతూ మేం నోరు వెళ్లబట్టి వినేవాళ్లం.

మాకు తెలుగులో అనువాదం కోసం రకరకాల ఇంగ్లీషు వార్తలు ఇచ్చేవారు. మేం చేసే అనువాదాల్ని రాంభట్ల గారు, కృష్ణారావు గారు ఓపిగ్గా, నిశితంగా పరిశీలించి వాటిలో తప్పొప్పుల్ని వివరించి చెప్పేవారు. అసలు మొదటిరోజే రాంభట్ల గారు మాకు ఈనాడు భాష గురించి పెద్ద ఉపన్యాసం ఇచ్చారు. 'మిగతా తెలుగు పేపర్ల గురించి మర్చిపోండి నాయనా. మన ఈనాడుకి ఒక స్టయిల్ ఉంది. 'బడు' అన్నమాట ఇక్కడ నిషేధం. బడుద్ధాయిలు మాత్రమే 'బడు' ధాతువుని వాడతారు" అని కుండబద్దలు కొట్టి చెప్పారు. (ఆ దెబ్బకి నేను ఇప్పటిదాకా బడు జోలికి పోలేదు.)

> **"విలేఖరి అని రాయకండి నాయనా.. విలేకరి అని రాయండి. మీరు ఏనుగు(కరి) అవుతారో, గాడిద(ఖరి) అవుతారో మీరే తేల్చుకోండి". (ఆయన అంత మర్యాదగా చెప్పాక ఇంకేం తేల్చుకుంటాం.. మా పిండాకూడు).**
>
> **"గంభీరంగా ఉండాలని నొక్కి వక్కాణించారు, ఉద్ఘాటించారు అని రాయకండర్రా.. అవన్నీ అరిగిపోయిన పదాలు.. సింపిల్ గా అన్నారు, చెప్పారు, తెలిపారు అంటే సరిపోతుంది."**
>
> **"అమాత్యులు ఏమిటి నా బొంద.. మంత్రి అనండి చాలు. మాటిమాటికీ కామాలు పెడుతూ వాక్యాలు పొడుగ్గా రాయకండి. ఎక్కడికక్కడ కత్తిరిస్తూ పొట్టి పొట్టి వాక్యాలు రాయండి." "అనువదించండి నాయనా.. అను-వధించకండి"**
>
> **"తప్పులు చెయ్యడం మానవ సహజం. మీరు తప్పులు చెయ్యండి. కాదనను. కాని పాత తప్పు మళ్లీ చెయ్యకండి. రోజూ ఒక కొత్త తప్పు చెయ్యండి."**

ఇలా రాంభట్ల గారు చెప్పిన ఎన్నెన్నో పాఠాలు ఇప్పటికీ నేను పాటిస్తూనే ఉన్నాను. నేను పని చేసిన ప్రతిచోటా జూనియర్లకు చెబుతూనే ఉన్నాను. రాంభట్ల గారు మా బ్యాచ్‌లో ప్రతి ఒక్కరితో ఎంతో చనువుగా, స్నేహంగా ఉండేవారు. ఒకళ్లిద్దరు తప్ప అందరం నిండా పాతికేళ్లు కూడా నిండని వాళ్లం. నాబోటివాడు మితిమీరిన చనువు తీసుకుని జోకులేసినా రాంభట్ల గారు "హ,హ,హ" అంటూ గట్టిగా నవ్వేసేవారు. అసలాయన మా మీద కోపగించుకున్న సందర్భం నాకు ఒక్కటి కూడా గుర్తు లేదు. 'బడు' అని రాయొద్దని ఆయన హెచ్చరించినప్పుడు నేను అతి తెలివిని ప్రదర్శిస్తూ, "సార్, కనబడు, వినబడు అని రాయొచ్చా" అని అంటే ఆయన నవ్వుతూ నాకో సుతారపు టెంకిజెల్ల ప్రసాదించారు. "సార్, మనది స్కూలు కదా.. మిమ్మల్ని హెడ్మాస్టారు అనకుండా ప్రిన్సిపాల్ అంటారేమిటి?" అని అమాయకత్వాన్ని నటిస్తూ అడిగినప్పుడు ఆయన కసురుకోకుండా ఓ మురిపాల మొట్టికాయ అనుగ్రహించారు. ఒకసారి ఒక ఔత్సాహికుడు "సార్, మీరు కమ్యూనిస్టు అట కదా, సీపీఐలో మెంబరట కదా" అని అడిగేశాడు. రాంభట్ల గారు తడుముకోకుండా "అవును బాబూ, నేను కమ్యూనిస్టునే.. కానీ సీపీఐ సభ్యుణ్ణి మాత్రం కాదు" అని చెప్పి సదరు ఔత్సాహికుడి కడుపుబ్బరాన్ని శాశ్వతంగా తగ్గించారు.

మార్గదర్శి హౌస్‌లో మూడు నెలల క్లాసుల తర్వాత ప్రాక్టికల్ ట్రయినింగ్ కోసం మమ్మల్ని సోమాజిగూడా ఆఫీసులో డెస్కులోకి దఫదఫాలుగా పంపించారు. రాంభట్ల గారు కూడా సోమాజిగూడాకు షిఫ్ట్ అయ్యారు. అప్పటి వరకు మాకు ప్రిన్సిపాల్‌గా ఉన్న రాంభట్ల గారికి ఎడిటర్ (అడ్మినిస్ట్రేషన్) అనే హోదా ఇచ్చారు. డెస్క్‌లో ఉన్న మాకు ఆయనే షిఫ్టులు వేసి చార్టు తయారు చేసేవారు. అప్పట్లో టీవీ కృష్ణ గారు దగ్గరుండి పేజీలు పెట్టించేవారు. ఆ పేజీలు పెట్టే ఇనప బల్లని స్టోన్ అనేవారు. అక్కడ కృష్ణ గారికి సహకారంగా ఉండడానికి రోజుకొక ట్రయినీ సబ్ ఎడిటర్‌ను రాంభట్ల గారు పంపేవారు.

అతన్ని స్టోన్ సబ్ ఎడిటర్‌గా షిఫ్ట్‌లో రాసేవారు. సబ్ ఎడిటర్లకు నిజంగానే ఇలాంటి హోదా కూడా ఉంటుందని మేం నమ్మేశాం. కానీ ఇది రాంభట్ల గారు కాయిన్ చేసిన కొత్త డిజిగ్నేషన్ అని పొత్తూరి గారు ఆ తర్వాత చెబితే తెలిసింది. ఆ స్టోన్ అనుభవం తర్వాతి కాలంలో నాకెంతగానో పనికొచ్చింది.

కొంతకాలానికి నేను ఆంధ్రప్రభలో చేరబోతూ ఈనాడుకి రాజీనామా చేసినప్పుడు నన్ను వెంటనే రిలీవ్ చెయ్యకుండా అల్లరి పెడతారేమోనని భయపడ్డాను. రాంభట్ల గారు నన్ను ఆశీర్వదించి, నా రిలీవింగ్ లెటర్ మీద అయనే సంతకం చేసి ఇచ్చారు. రాంభట్ల గారి విషయంలో నా దురదృష్టం గురించీ చివరిలో చెబుతానన్నాను కదూ.. నేను ఈనాడుని వదిలి వచ్చాక రాంభట్ల గారిని మళ్లీ కలిసే అవకాశం నాకు దక్కలేదు. అదే నాకు పెద్ద దురదృష్టం. ఎందుకంటే, అసలు రాంభట్ల గారితో మాట్లాడడమే ఓ ఎడ్యుకేషన్ కదా! ❑

## ఆచార్యునికి నీరాజనాలు

# విజ్ఞానపు గని



- ఎ.విశ్వేశ్వర్‌రెడ్డి

పూర్తి పేరు రాంభట్ల కృష్ణమూర్తే అయినా ఇంటి పేరుతోనే సాహితీ లోకంలో ప్రసిద్ధి చెందిన మహా సాహితీవేత్త ఆయన. చక్కటి హావభావాలు, నల్లటి వెంట్రుకల్లో అక్కడక్కడా కనిపించే తెల్లటి వెంట్రుకలు, అప్పుడప్పుడు జారిపోతుంటే సవరించుకో వడం, నిరాటంకంగా, అనర్గళంగా మాట్లాడే స్వభావం ఆయన సొంతం. 'ఈనాడు ' జర్నలిజం పాఠశాలలో మాది రెండో బ్యాచ్. నాకు బాగా జ్ఞాపకం, 1976 మార్చి 9వ తేదీన తరగతులు మొదలయ్యాయి. మా బ్యాచ్ నుంచే రాంభట్ల గారు ప్రిన్సిపాల్ గా నియమితులయ్యారు. ప్రిన్సిపాల్‌గా రావడం మా అదృష్టం. అదృష్టం అని నేను ఎందుకు చెబుతున్నానంటే.. కొందరు అధ్యాపకులు కొన్ని అంశాలలో మాత్రమే దిట్టలుగా ఉంటారు. ప్రతి అంశంపై మాట్లాడటం అందరికీ సాధ్యం కాదు. అది ఒక్క రాంభట్ల గారికే సాధ్యమైంది. ఒక్క మాటలో చెప్పాలంటే విజ్ఞాన సర్వస్వానికి మారు పేరాయన.

అందుకే ఆయనను 'విజ్ఞానపు గని' అని అంటాను. ఈ గని నుంచే మేలిమి రత్నాలను మేమందుకున్నాం. అందుచేతనే మా బ్యాచ్ వారందరూ జర్నలిజం రత్నాలుగా రూపొందారు.

మా తరగతులు జరుగుతున్నంతసేపు రాంభట్ల గారెప్పుడూ ప్రిన్సిపాల్‌గా ప్రవర్తించలేదు. మాలో ఒకడిగా, ఒక స్నేహితుడిగా మెలిగారు. అందువల్లనే మేము కూడా మా అభిప్రాయాలను నిస్సంకోచంగా ఆయనతో పంచుకునేవాళ్లం. ఆయనను విజ్ఞాన గని అని ఎందుకు వర్ణించానంటే మేము ఏ అంశాన్ని లేవనెత్తినా గంటల తరబడి మాట్లాడేవారు. ఉదాహరణకు నక్సలిజం గురించి మాలో ఒకరు ప్రస్తావిస్తే తొలినాటి నక్సలైట్ల పేర్లను ఉదహరిస్తూ నక్సలిజం పుట్టు పూర్వోత్తరాలు, తదనంతర పరిణామాలు.. పరిణామాలను వివరిస్తూ రెండు గంటలపాటు సుదీర్ఘంగా, ఏకధాటిగా మాట్లాడేవారు. నాకు ఆశ్చర్యం వేసేది ఇంతటి మేధస్సు ఆయనకే ఎందుకు సొంతమైందని.

వందలాది అంశాలు గంటల తరబడి వివరించేవారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర పరిణామాలే కాకుండా సాహిత్య, లలిత కళలు.. ఇలా ఆయనకు తెలియని అంశమే లేదు. వార్తలు ఎలా రాయాలి ? ఇంగ్లీషు నుంచి తెలుగులోకి ఎలా అనువదించాలి అని, వ్యాసాలు రాసే పద్ధతి ఎలా ఉండాలి, ఇలాంటి అనేక విషయాలను మాకు బోధించారు. బోధించారు అనడంకంటే మమ్మల్ని ఉత్తమ జర్నలిస్టుగా తీర్చిదిద్దారంటే సబబుగా ఉంటుందేమో.

రాంభట్లగారు ఆ రోజుల్లో 'ఈనాడు'కి అనేక వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాలన్నీ చదువరులకు ఎంతో విజ్ఞానాన్ని ప్రసాదించాయి. అయితే ఆయనను ఒక రచయితగా కాకుండా ఒక బోధకుడుగానే గుర్తిస్తాను. ఎందువల్లనంటే వ్యాసాలలో ఆయన చెప్పిన దానికంటే ప్రత్యక్షంగా అనేక విషయాలు ప్రస్తావిస్తూ ఉంటే ఎంతో వివరణాత్మకంగా ఉండేవి. అలాంటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం జర్నలిజం రంగానికే కాకుండా, సాహిత్య లోకానికి కూడా తీరని లోటు. ❑

## తుమ్మెద పదం

పాండవులు పాండవులు తుమ్మెదా,
పంచపాండవులోయి తుమ్మెదా //

పంచపాండవుల్లల్లె తుమ్మెదా, తెలుగు
మంత్రులేర్పడ్డారు తుమ్మెదా //

పట్నాలు ఒల్లమని తుమ్మెదా, వారు
పట్టారు అడవులను తుమ్మెదా //

పాకలను పీకించి తుమ్మెదా, వారు
పందిళ్ళు వేశారు తుమ్మెదా //

రాణువను తెప్పించి తుమ్మెదా, ఎండ
వానలకు వదిలారు తుమ్మెదా //

పందిట్లొ సిబ్బంది తుమ్మెదా, ఎంతొ
పడుతోంది ఇబ్బంది తుమ్మెదా //

పండవులకిద్దరు తుమ్మెదా, కొత్త
భాయిలు వచ్చారు తుమ్మెదా //

వేదవ్యాసుని లాగ తుమ్మెదా, అత్రి
వేదవ్యాసుని ఆన తుమ్మెదా //

ఏదుగురు రాజులూ తుమ్మెదా, అడివి
ఏలుబడి చేశారు తుమ్మెదా //

# రాంభట్ల గారే నాకు స్ఫూర్తి

## ఆచార్యునికి నీరాజనాలు



- నిడమర్తి రాజశేఖర్

నేను తెలుగు సహజంగా బాగా రాయగలను. కవిత్వం గట్రా కాదు. చిన్నప్పటి నుంచి తెలుగు మీడియం కావడం, అప్పట్లో పత్రికలు నిత్యం చదవడం, రేడియోలో తెలుగు వార్తలతో అన్ని తెలుగు కార్యక్రమాలని వినడం నాకు పత్రికా ఉద్యోగానికి పనికి వచ్చాయి. నేను బి.ఎస్.సి. పాస్ అయి ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా "ఈనాడు"కు ఒక అప్లికేషన్ పంపించాను. రేడియోలో నాటకాలు రాశాను. అందువల్ల ధైర్యం. పత్రికల్లో కథలు రాశాను. అనుకున్నట్టు 'ఈనాడు' నుంచి రమ్మని కబురు వచ్చింది. శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు గారి సంతకంతో ఆ లేఖ వచ్చింది. మార్గదర్శి హౌస్‌లో 1976లో ఈనాడు చీఫ్ ఎడిటర్ చాంబర్‌లో ఇంటర్వ్యూకు వెళ్లాను. అక్కడ ఉద్దండులు ఐదుగురు కూర్చున్నారు. చీఫ్ ఎడిటర్ రామోజీరావు గారు, పొత్తూరు వెంకటేశ్వరరావు గారు, శ్రీ ఎ.బి.కె. ప్రసాద్ గారు, శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి గారు, శ్రీ వి.హనుమంతరావు గారు అక్కడ కొలువు తీరారు. వారిని రాంభట్లే పరిచయం చేశారు. సహజంగా స్పోర్ట్స్ మాన్‌ను కాబట్టి రకా రకా సమాధానాలు చెప్పేశాను. ఎవరూ ఇబ్బంది పెట్టే ప్రశ్నలు అడగలేదు. ఆసక్తి, అభిరుచి, కుటుంబం వగైరాలు అడిగారు. అందరూ ప్రశ్నలు అడిగారు కానీ లోపల ఒక్కమాట కూడా మాట్లాడని శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి గారు నేను రూం నుంచి బయటకు వచ్చాక ఆయన బయటకు వచ్చి ఇదుగో "రాజశేఖర్"! ఇలారా అని పిలిచారు. మధ్యపాపిడి, చేతిలో సిగరెట్టు, ఇన్ షర్ట్, షూలో టిప్ టాప్‌గా కనబడ్డారు. "నన్ను రాంభట్ల కృష్ణమూర్తి అంటారు. మీ జర్నలిస్టులు ట్రైనింగ్ విభాగాన్ని నేనే చూస్తుంటాను" అని ఇలా కూర్చో అన్నారు. ఎదురుగా ఓ కుర్చీ ఖాళీగా ఉంది. కూర్చున్నాను. విశాఖ వాసుల్లో రచన చాలా సహజంగా అబ్బుతుంది. దానికి కొంచెం సానబెడితే చాలు, ఏ రచనా వ్యాసంగంలోనైనా ఇట్టే ఒదిగిపోతారు అని మెచ్చుకోలుగా అన్నారు. "నువ్వు నియోగుల్లో ఆరాధ్యుల శాఖ కదూ, గుడ్" అన్నారు. అన్నట్టు మీకు మెడలో లింగకాయ ఉంటుంది కదూ అయితే నువ్వు 'లింగడివ'న్నమాట అని నవ్వుతూ అనేశారు. ఆ తరువాత వీలున్నప్పుడు లింగడు అనే పిలిచేవారు. నీ రచన ఫ్లో బాగుంది. నీ నాటకాలు విన్నాను. హాస్యం బాగుంది. కథలు చదివాను. అందులోనూ హాస్యమే... బాగుంది. పోతే నీ అభిరుచి స్పోర్ట్స్ కదా? అందులో కృషి ఎక్కువగా చెయ్యి. న్యూస్, ఆర్టికల్స్ నేర్చుకుంటే అందరికీ అబ్బేవే. స్పెషలైజేషన్ ఒక ఫీల్డ్‌లో చెయ్యి. స్పోర్ట్స్ మీద ఇంట్రెస్ట్ ఉంది కాబట్టి అన్ని రూల్స్ ఉంటుంది కొని చదువు అన్నారు. నా దగ్గర ఉన్నాయి సార్ అన్నాను. అందుకాయన మెచ్చుకొని వెరీ గుడ్ అని, అన్ని రకాల అనువాదాలనీ ప్రాక్టీస్ చెయ్యి అన్నారు. మేం ట్రైనింగ్‌లో ఉండగానే ఎడిటర్ గారికి చెప్పి ఒక పెద్ద సిగరెట్ల కంపెనీ అడ్వర్టైజ్మెంట్ అనువాదం చేసే పనిని అప్పజెప్పారు. బాగా రాశాను. అది అచ్చయింది. ఛైర్మన్ కూడా మెచ్చుకున్నారు. తరువాత 1976లోనే మాంట్రియల్ లో జరిగిన ఒలింపిక్స్‌ను డెస్క్‌లో కవర్ చేయడంలో ఒక సబ్ ఎడిటర్‌గా అవకాశం ఆయనే ఇప్పించారు. తెలుగులో బహుశా ఒలింపిక్స్‌ని పూర్తిగా కవర్ చేయడం అదే ప్రథమం అనుకుంటాను. మేము 4 నెలల అనుభవం మాత్రమే ఉన్నవాళ్లం. నేను స్పోర్ట్స్ రాసిన తీరు ఆయనకు నచ్చింది. మెచ్చుకున్నారు. చిన్న మంచి పనినైనా ఆకాశానికెత్తేసి ఎంకరేజ్ చేసేతత్వం ఆయనది. ట్రైనీలను ఎవరిని ఎప్పుడూ పల్లెత్తు మాట అనలేదు. ప్రతి ఒక్కరిలో వున్న ప్రత్యేకతని గుర్తించడంలో ఆయన దిట్ట. కొంత మంది చాలా వెనకబడినా వారిని వెన్ను తట్టి నిలబడేట్టు చేశారు. ఆయన అందరినీ సొంత పిల్లల్లా చూసుకునేవారు.

ఆయనకు తెలియని సబ్జెక్ట్ లేదు. తెలియని విషయం లేదు. ఏ విషయం పైన అయినా అనర్గళంగా చెప్పగలిగేవారు. ఆయన మామధ్య ఉంటే ఎన్నో సందేహాలను అడిగి నివృత్తి చేసుకునే వాళ్లం. ట్రైనింగ్ అయ్యాక సోమాజిగూడలోని ప్రధాన కార్యాలయంలో మా పని సీనియర్ల మధ్య ప్రారంభించాం. రాత్రికి రాత్రే తయారై ఉన్న వివిధ జిల్లాల పేజీలను చదివేసి పారేయమనేవారు. ఏ విభాగం పని ఏమిటి? ఎవరెవరు ఏం పని చేస్తున్నారు? ఎలా చేస్తున్నారు? ఎంత స్పీడ్‌లో చేస్తున్నారు? టైంకి అన్ని పనులు ఎలా అవుతున్నాయి వంటి విషయాలను ప్రత్యేకించి గమనించమనేవారు. ప్రతి ఒక్క సబ్ ఎడిటర్, సబ్ ఎడిటర్ స్థాయి నుంచే న్యూస్ ఎడిటర్‌లా పనితనం నేర్చుకోవాలని ఆయన అనేవారు. ఆ మాటల ప్రభావం నాపై బాగా పనిచేసింది. ఆయన సూచన మేరకు నేను సైన్స్ అంశాలపై మంచి పట్టు సాధించాను. ఉదాహరణకు నేను ట్రైనింగ్ 8వ నెలలో ఉండగా చీఫ్ రిపోర్టర్ వై.శేఖర్ గారికి చెప్పి

నేషనల్ జియోగ్రాఫిక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో జరిగిన ఒక పెద్ద సమావేశానికి ఒక్కడినే రిపోర్టింగ్‌కి పంపించారు. నీకు వచ్చినట్టు రాయి పేర్లు, ప్రసంగాలు వాటిలో అంశాల ముఖ్యం జాగ్రత్త అని ప్రత్యేకంగా చెప్పారు. రాత్రి టైంకి రిపోర్ట్ ఇచ్చాను. మర్నాడు పబ్లిష్ అయిన వార్త చూసి నన్ను ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. నాకు ఆయన దగ్గర చనువు బాగా పెరిగి విసిగించినంతగా ఆయనతో మాట్లాడేవాడిని. అది ఆయనకు నచ్చేది. తిరుపతిలో 'ఈనాడు' ఎడిషన్ ప్రారంభమైనప్పుడు కాదనకుండా అక్కడకు వెళ్లమన్నారు.

1984లో నేను హైదరాబాద్‌లో డెస్క్ ఇంఛార్జిగా ఉన్నప్పుడు నాకన్నా రెట్టింపు వయసు, అనుభవం ఉన్న ప్రతాపరావుగారనే ఒక వ్యక్తిని, అప్పటికే మంచి పేరు ప్రఖ్యాతలున్న రచయిత, అనుభవశీలి 'సహవాసి' గారిని సబ్ ఎడిటర్లుగా మా కింద పని చేసేట్టు నియమించడం జరిగింది. వాళ్లిద్దరూ చేయి తిరిగిన రచయితలు, అయితే న్యూస్ వరకూ టెక్నికాలిటీస్ మాత్రమే తెలియవు. అయినా నేను రాంభట్ల గారి దగ్గరకు వెళ్లి "సార్ వారిద్దరికీ నేనయితే మాత్రం న్యూస్ ట్రాన్సులేషన్ కోసం ఐటంలను ఇవ్వలేను సార్. పైగా వాళ్లిద్దరూ సెంట్రల్ ఎడిటోరియల్ బోర్డ్‌లో ఉండవలసిన వారు అని నా అభిప్రాయాన్ని చెప్పగా కొద్ది రోజుల్లోనే వారిద్దరినీ మంచి గౌరవప్రదమైన స్థానాల్లో నియమించారు. వారిద్దరూ డెస్క్‌లో ఉండగా మేము అనుభవం విషయంలో, విషయ పరిజ్ఞానం విషయంలో పొందిన ప్రయోజనం అయితే చాలా ఉంది.

రాంభట్ల గారి మనస్తత్వం చిన్నపిల్లల మనస్తత్వం, అయితే ఎవరిపైనా ఎప్పుడూ కోపగించుకోలేదు. అప్పట్లో సెల్ ఫోన్‌లు లేవు. లేకపోతే ఆయనను ఫోన్‌లో కూడా విసిగించే వ్యక్తుల్లో నేనే మొదటి వాడిని అయి ఉండేవాడిని. ఎప్పుడు ఎక్కడ కనబడినా 'ఏం లింగడూ' ఎలా ఉన్నావు అని ఆప్యాయంగా పలకరించే వారు. మా నాన్నగారి తరువాత అంత సన్నిహితంగా నేను ఎవరితోనూ లేను. నేనీ రోజు ఆ విషయాన్ని గర్వంగా చెప్తాను. రాంభట్లగారే పరిచయం కాకపోతే నేను జర్నలిజం ఎప్పుడో వదిలేసేవాడిని. నేను ఈ రోజు ఏ సబ్జెక్టులోనైనా రాయగలనంటే ఆయన ప్రోత్సాహమే. నేనీ రోజు నిలబడ్డానికి కారణం. నేను ఇప్పుడు ప్రత్యక్షంగా ఏ డైలీలోగాని, టీవీ మీడియాలో కానీ లేను. కానీ ఆయన ఆలోచనల్ని వేరే విధంగా ఆచరణలో పెడుతున్నాను. ❑

## ఏడు చేపల కథ

(రాంభట్ల కృష్ణమూర్తి
శత విషాణం నుంచి)

అనగనగ ఒక రాజుకెందరో కొడుకులు
అందులో ముగ్గురు అతి సాహసికులు
మనిషి పేరెత్తితే మహచెడ్డ భయము
అందుకని చేశారిలాగ నిర్ణయము

జనం లేని చోట కడదాం మనం కోట
ఏలుదాం ఏడు రోజుల ఒక్క పూట
వస్తావ పెద్దన్న వస్తావ పోదాం?
కొయ్యగుర్రాలెక్కి ఆడుదాం వేట!

ఏడు చేపలు తెచ్చి ఏండలో వేద్దాం
ఏలాగ ఒక చేప ఎండదో చూద్దాం!
చీమకుట్టిన పాప నోరుమూసేదాక
చింతబరికెతొ వీపు చిట్లగొట్టిద్దాం

పశుల కుర్రని పైకి పంపించు వరకును
అవ్వ కొప్పుచ్చుకుని హడలకొట్టేద్దాం
ఆవు దూడను విప్పి పోవునందాకను
కుర్రవాడిని చావగొట్టించి వేద్దాం

గడ్డిదుబ్బును మేసి నెమరు వేసేదాక
ఆవుదూడను పట్టి హతము చేసేద్దాం
నేలపై ఎండలే లేకుండ తుడిచేస్తె
ఏలాగ ఒక చేప ఎండదో చూద్దాం

ఏమిటనుకున్నారొ ఏడుచేపల కథ
అడ్డుతిరిగే రోజు అవతరిస్తోంది
కథచెప్పు పెద్దమ్మ కనలేని సత్యాలు
కాంగ్రేసు దొరతనము తవ్వితీస్తోంది

పవలు రేయిని చేసి రేయి పవలును చేసి
కథను అడ్డం తిప్పి కనబరుద్దాము
కళ్ళగంతలు కట్టి తలకు చెప్పులు చుట్టి
కాలచక్రాన్ని తలక్రిందు చేద్దాము

భేషు భేష్ తమ్ముడా భేషుగ్గ వుంది
జనం లేని చోట మనం కోటను కడితె
కథ నడవడాని కాస్కార మెక్కడిది?
అన్నాడు అన్నయ్య ఆతురత తోడ

(3 జూన్ 1953

# ఒక బెల్జియం అద్దం

## ఆచార్యునికి నీరాజనాలు

- తాడి ప్రకాష్



శా పాలతోటి కాళ తమోరాశి తూలదు
ఏపాటిదైన వెల్గు ప్రసారించుతూ పద..
అని వెలుతురు దారుల్లోకి నడిపించి, కొవ్వొత్తిలాగ కాలి ప్రదీపించు వారికీ చెయ్యెత్తి లాల్ సలాం సమర్పించుతూ పద.. అంటూ ఉత్తేజ పరిచినవాడు రాంభట్ల.

సనాతనాల బూజుపై కులం మతం రివాజుపై పురాణ నమ్మకాలపై తుఫాను రేగుతోందిరా.. అని గొప్ప ఆశావహ దృక్పథాన్ని ఇచ్చినవాడు. రాంభట్ల గారి నెపంతో.. కొన్ని జ్ఞాపకాలూ.. కొంత నా సొంత సొద.

1960వ దశకం.. హైదరాబాద్. హిమయత్‌నగర్ కావచ్చు. ఒక సాయంకాలం. మఖ్దూం మొహియుద్దీన్, రాంభట్ల కృష్ణమూర్తి మరికొందరు స్నేహితులతో కూర్చుని ఉన్నారు.

'నేనొక కొత్త పద్యం రాశాను, చదువుతాను వినండి' అన్నారు మఖ్దూం. అది ఉర్దూ కవిత. అందరూ శ్రద్ధగా విన్నారు. మంచి కవిత్వం. గొప్ప రిథమ్. బాగా నచ్చింది. వహ్వా అన్నారంతా. "దాన్ని నేను తెలుగులోకి అనువాదం చేస్తాను" అన్నారు రాంభట్ల. మఖ్దూం సందేహించారు. "ఆ కవిత ఉర్దూ సంప్రదాయానికి సంబంధించినది. తెలుగులోకి ఒదగదేమో" అన్నారు మఖ్దూం. దాన్ని తెలుగు చేయడం అసాధ్యం అనుకున్నారాయన.

"నేను చేస్తాను. దానికి తగిన ఛందస్సు తెలుగులో ఉంది" అన్నారు రాంభట్ల పట్టుదలగా. రెండు, మూడు రోజుల్లోనే రాంభట్ల ఆ కవితను తర్జుమా చేశారు. మఖ్దూంకి వినిపించారు. ఆయన ఆశ్చర్యపోయారు. చాలా బాగా వచ్చిందని మెచ్చుకున్నారు. ఆ ఉర్దూ కవిత.. ఒక పురాతన పర్షియన్ ప్రేమ కథ. దేవదాసు, లైలా మజ్నూల్లా ఒక లెజండరీ ట్రాజెడీ. ప్రపంచ ప్రఖ్యాతి చెందింది.

షిరీన్ ప్రియురాలు.. ఫర్హాద్ ప్రియుడు.

ఈ ప్రేమ కథ వెనుక కొంత చారిత్రక వాస్తవం ఉందంటారు. కొన్ని నిజాలు, కొంత కల్పన కలగలిపి కవిత్వంగా మలిచారు నాటి మహాకవి ఒకరు.

నాకు రాంభట్ల గారు చెప్పిన కథ :

షిరీన్ ఫర్హాద్‌లు ప్రేమికులు. ఆమె రాజకుమారి. అతను పేదవాడు. స్వయంవరంలో నిరుపేదనే కోరుకుంటుంది షిరీన్. రాజుకు నచ్చదు. కూతురి ఇష్టాన్నీ కాదనలేడు. పెళ్లికి సరేనంటూ ఒక షరతు పెడతాడు రాజు.

దేశ సరిహద్దులో వున్న పెద్ద కొండను తొలిచి అవతల ఉన్న నదిలోని నీళ్లు ఇక్కడి పొలాల్లోకి మళ్లించగలిగితే పంటలు పండి ప్రజలు సుఖశాంతులతో ఉంటారని అలా చేయగలిగితే షిరీన్‌ని పెళ్లి చేసుకోవచ్చని అంటాడు. యువకుడూ, ఆవేశపరుడూ అయిన ఫర్హాద్ పలుగూ పారా భుజాన వేసుకుని కొండవైపు నడుస్తాడు. తవ్వడం మొదలుపెడతాడు.

ఒక పున్నమి వెన్నెల రాత్రి.. రాజు, కూతుర్ని కోటపైకి తీసుకువెళతాడు. ఒకసారి కిందికి చూడమ్మా అంటాడు. చూస్తుంది. ఆశ్చర్యపోతుంది. కింద కోట చుట్టూ నీళ్లు ప్రవహిస్తుంటాయి. పొరుగు దేశపు రాజు కొండను తవ్వి నీళ్లు ఇటు రప్పించాడని చెబుతాడు. తండ్రి మాట విని ఆ రాజునే పెళ్లి చేసుకుంటుంది షిరీన్.

పగిలి కొండ మీద నుంచి రాలిపడుతున్న రాళ్లలాగే యాభయ్ సంవత్సరాలు దొర్లిపోతాయి. చివికి, అలసి డస్సిపోయిన ఫర్హాద్ చివరికి సాధిస్తాడు. నది నీళ్లను దేశంలోని ఎండిన పొలాల మీదికి మళ్లిస్తాడు. అప్పుడు అతని వయసు 70 ఏళ్లు.

తిప్పలు పడి రాజుని కలుస్తాడు. విజయగాథని వివరిస్తాడు.

రాజు నవ్వుతాడు.

కూతురు షిరీన్‌కి ఏనాడో పెళ్లయిపోయిందని చెబుతాడు.

తట్టుకోలేకపోతాడు ఫర్హాద్. గుండె పగిలి చనిపోతాడు.

కోట చుట్టూ తెల్లని ఉల్లిపొరల్లాంటి శాటిన్ తెరలు పరిపించి, గాలికి అవి కెరటాల్లా కదులుతుంటే అవిగో నీళ్లు అంటూ కూతురిని మభ్యపెడతాడు రాజు. అదీ విషాదం.

మఖ్దూం పద్యానికి రాంభట్ల అనువాదం ఇలా.. శీర్షిక 'నృత్తం'

సురూప రంగ రాగ సంచయాల వార్త తెచ్చెనూ
సుమాయుధేక్షు ధన్వసీధు పాత్రగొంచు వచ్చెనూ
నిశాతపాల లేత లేత కాకతో తపించుతూ.. ఇదీ మకుటం.
మహేశనృత్తమంటపం దిశాప్తమై రహించనీ
ప్రసిద్ధశిల్ప శీర్ణమద్దిగంతముల్ రణించనీ
జయించనీ శిలోచ్చయ ప్రభేదన శ్రమాప్తినీ
జయించనీ విశుద్ధ స్నిగ్ధ ముగ్ధ ప్రేమ ప్రాప్తినీ

అని పంచచామరంలో అందంగా, లయబద్ధంగా నడిపించారు.

"ఏక్ చమేలీకీ మండువే తలే... దోబదన్ ప్యార్ కీ ఆగ్ మే జల్ గయే..." అనే మఖ్దూం ప్రసిద్ధ గీతాన్ని కూడా రాంభట్ల అనువదించారు. 'మఖ్దూం కవిత' అనే సంకలనంలో నృత్యం, చమేలీకీ మండువే తలే రెండూ ఉన్నాయి. ఆ పుస్తకానికి రాజ్ బహదూర్ గౌర్ రాసిన ముందు మాట చదివి తీరాలి.

### 1973 -74 విజయవాడ విశాలాంధ్ర చుట్టుగుంట

అప్పట్లో విశాలాంధ్ర దినపత్రిక ఆఫీసంటే ఒకటి కాదు, వంద.. లిటరల్‌గా. దిన, వార, మాస పత్రికలూ, కొన్ని టాబ్లాయిడ్లూ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ (వీపీహెచ్) పుస్తకాలూ, నవలలు, కథా, కవితా సంకలనాలూ, సువినీయర్లు, పోస్టర్లు, ఇన్విటేషన్లు, కరపత్రాలూ వందలు వేలల్లో ప్రింటవుతుండేవి. చంద్ర రాజేశ్వరరావు, నీలం రాజశేఖరరెడ్డి, వేములపల్లి శ్రీకృష్ణ, రాజ్ బహదూర్ గౌర్, విజయకుమార్, కె.ఎల్.మహేంద్ర, సురవరం సుధాకరరెడ్డి వంటి నాయకులు తరచూ వచ్చిపోతుండే వారు. ఇటు విశాలాంధ్రలో... ఎడిటర్ రాఘవాచారి, తుమ్మల వెంకట్రామయ్య, నిడమర్తి ఉమారాజేశ్వరావు, ఏటుకూరి బలరామ్మూర్తి, కంభంపాటి సత్యనారాయణ సీనియర్, వీపీహెచ్ బాస్, పీసీ జోషి, సొదుం రామ్మోహన్, కె.రాజేశ్వ రరావు ఇలా ఎంతో మంది ప్రసిద్ధులు. ఇక రచయితలు మహీధర రామ్మోహనరావు, పెద్దిభొట్ల సుబ్బ రామయ్య, కవి రవి(రామలింగ శాస్త్రి), బొల్లిముంత శివరామకృష్ణ, చందు సుబ్బారావు, పెనుగొండ లక్ష్మీనారాయణ, అదృష్టదీపక్ ఇంకా అనేకులు వచ్చి వెళుతుండేవారు. విశాలాంధ్ర పైఅంతస్తులో పెద్ద మీటింగ్ హాలు, గెస్టుల కోసం గదులు ఉండేవి. రాంభట్ల మల్లారెడ్డి గార్లను అక్కడే కలిసేవాళ్లం. నేనెప్పుడూ మోహన్ వెంటే. మోహన్ వెనుక ఉండటమే పెద్ద ఎడ్యుకేషన్ అని చాలా ఏళ్ల తర్వాత నాకు తెలిసొచ్చింది.

ఏలూరు రోడ్డులోని విశాలాంధ్ర బుక్ హౌజ్ మేడ మీద చిన్న గదిలో అరసం సమావేశాలు జరిగేవి. గుంటూరు శేషేంద్రశర్మ, ఇందిరాదేవి, ధన్‌రాజ్, గిరి లాంటి ఎందరో కవుల్నీ రచయితల్నీ కలిసింది అక్కడే. సమావేశాల్లో రాంభట్ల, మల్లారెడ్డి మాట్లాడేవారు.

వాళ్లిద్దరూ ఇద్దరే. ప్రవాహంలా మాట్లాడతారు. సరదాగా.. ఈజీగా.. హాయిగా.. హాస్యంతో జోకులతో నవ్విస్తూ.. రెడీ విట్టూ, క్విక్ రిపార్టీ.. చటుక్కున ఒక గొప్ప పొయెం కోట్ చేయడం...

ఒక్క మాటలో చెప్పాలంటే... చంపేస్తారంతే!!

**రాంభట్ల గారికి గురజాడ కన్యాశుల్కం ఒక అబ్సెషన్. గిరీశాన్నో, మధురవాణినో కోట్ చేయకుండా ఆయనకి రోజు గడవదు."నేషనల్ కాంగ్రెస్ అనగా దివాన్ గిరీ చెలాయించడం" అని బుచ్చమ్మకు వెంకటేశం చేత చెప్పించిన మాట ఎంత సత్యం. గురజాడ తర్వాత నా దృష్టిలో ఇంత వరకూ సవిమర్శక వాస్తవికత మన సాహిత్యంలో వెలువడలేదు అని ఒక వ్యాసంలో రాశారు రాంభట్ల. గురజాడ మోకాలును తాకగల రచయితలు కన్పించడం లేదు అంటారాయన.**

1973లోనే అనుకుంటా... నర్సరావుపేటలో జరిగిన ఆఫ్రో ఆసియన్ రచయితల సమావేశానికి వెళ్లాను. సాయంత్రం అందరూ ఊరేగింపుగా బయల్దేరారు. పులుపుల శివయ్యగారు లీడ్ చేస్తూ ముందు నడుస్తుంటే, వెనుక రాంభట్ల కృష్ణమూర్తి, గజ్జెల మల్లారెడ్డి, గంగినేని వెంకటేశ్వరరావు... వాళ్లతో కుర్రకుంకని నేనూ... ఇంకా ఎంతో మంది.

ఎంత చక్కని రోజులవి! రాంభట్లని కలిస్తే చాలు..

సోల్జినిత్సిన్ కాన్సన్ ట్రేషన్ క్యాంపు నుంచి సోమర్ సెట్ మామ్ శృంగారం దాకా మైకలేంజిలో 'దేవిడ్' నుంచి విన్సెంట్ వాంగో 'సన్ ఫ్లవర్స్' దాకా మిరుమిట్లు గొలిపే కొమురం భీం సాహసం నుంచి తలవంచని దొడ్డి కొమరయ్య త్యాగం దాకా మయకోవస్కీ 'లెనిన్' కావ్యం నుంచి పాబ్లో నెరూడా అరుణారుణ కవితా చరణాల దాకా బాబిలోనియా మెసపుటేమి యా నాగరికతల నుంచి మొఘల్ సామ్రాజ్యపు అంతిమ ఘడియల దాకా... ఆయన చిటికెన వేలు పట్టుకుని నడిస్తే చాలు.. Around the world with only chai ఎందుకంటే రాంభట్ల కవి, రచయిత, విమర్శకుడు, ఆర్టిస్టు, కార్టూనిస్టు, హిస్టోరియన్.. ఇంకా ఎన్నో..

కళా సౌందర్య తత్వ జ్ఞాన నిధి తాళం చెవిని జేబులో వేసుకు తిరిగే మాంత్రికుడు.. తాంత్రికుడు రాంభట్ల. ఒక రోజు విజయవాడలో ఆయన కనిపించగానే– "హా.. హు... హీ.. రాం భీం క్రీం భట్ ల.." అన్నాడు అదృష్టదీపక్. అంటే సాహితీ సంజీవిని సిద్ధం శాయరా డింగరీ అని అర్థం. రాంభట్ల ఎంత ఆనందంగా నవ్వారో చెప్పలేను. వేగుంట మోహన ప్రసాద్ బతికిన క్షణాలు అన్నది ఇలాంటి రోజుల గురించే.

### 1977 జులై 19 హైదరాబాద్, ఖైరతాబాద్

విజయవాడ విశాలాంధ్రలో పనిచేస్తున్న మోహన్‌కి హైదరాబాద్ నుంచి ఫోనొచ్చింది. సీనియర్ జర్నలిస్టు మోటూరి వెంకటేశ్వరరావు నుంచి. "ఇక్కడ ఈనాడులో పని

చేయడానికి రాయడం వచ్చిన కుర్రాడినెవరినైనా పంపగలవా?" అని. తప్పకుండా అన్నాడు మోహన్. "నాకు ఇంగ్లీషు రాదు. అనువాదం అంతకంటే రాదు" అని చెప్పాను. "అదే వస్తుంది.. వెళ్లరా" అని హైదరాబాద్ బస్సెక్కించాడు మోహన్.

జూలై 19 ఉదయం 11 గంటలకు ఈనాడు ఆఫీసుకు వెళితే.. చాలా ఏళ్ల నుంచి తెలిసినట్టు మోటూరి పలకరింపు. మొదటి అంతస్తులో ఈనాడు ఎడిటోరియల్ సెక్షన్. పరిచయాలు అయ్యాక రెండో అంతస్తుకి తీసుకెళ్లారాయన. అక్కడ రాంభట్ల కృష్ణమూర్తిగారు ఉన్నారు. అరె.. నాకు తెలిసినాయనే కదా అనుకున్నా. ఇటు చూస్తే గజ్జెల మల్లారెడ్డి. ప్లజంట్ సర్ ప్రైజ్. ఈయనా తెలుసు కదా. మరో టేబుల్ దగ్గర ఒక పెద్దాయన తెల్లని దుస్తులతో బట్టతలతో హుందాగా పేపరు చదువుకుంటున్నారు. ఈయన రాచమల్లు రామచంద్రారెడ్డి అని పరిచయం చేశారు. ఓ నమస్కారం పెట్టి మామూలుగా ఉండటానికి తెగతిప్పలు పడ్డాను. రారా సారస్వత వివేచన చదివి ఉన్నాను. చలం, తిలక్, అద్దేపల్లిని రారా తిట్టిన తిట్లు... "ఇలాంటి కవిత్వం రాసిన చేత్తో అన్నం ఎలా తింటారో" అని దిగంబర కవుల్ని కొరడాతో కొట్టడం లాంటివన్నీ గుర్తొచ్చి ఆనందంతో కాళ్లు వణికాయి.

రాంభట్ల గారు చాలా లిబరల్. వెరీ ఫ్రెండ్లీ. సాహిత్య రాజకీయ కబుర్లు, జర్నలిజం ఎనక్ డోట్స్ అలా చెబుతూనే ఉండేవారు. వీళ్లంతా పెద్దవాళ్లు. ఎస్టాబ్లిష్డ్ సూపర్ స్టార్లు.

నాకు అప్పుడు 19 ఏళ్లు.

వీళ్లతో ఉండటం, చదవడం, రాయడం, నేర్చుకోవడం... అదో గొప్ప అదృష్టం అనీ, దేవతలు దోసిట్లో నింపిన అమృతమనీ కొంచెం లేటుగా అర్థమైంది.

రాంభట్ల గారికి గురజాడ కన్యాశుల్కం ఒక అబ్సెషన్. గిరీశాన్నో, మధురవాణినో కోట్ చేయకుండా ఆయనకి రోజు గడవదు. "నేషనల్ కాంగ్రెస్ అనగా దివాన్ గిరీ చెలాయించడం" అని బుచ్చమ్మకు వెంకటేశం చేత చెప్పించిన మాట ఎంత సత్యం. గురజాడ తర్వాత నా దృష్టిలో ఇంత వరకూ సవిమర్శక వాస్తవికత మన సాహిత్యంలో వెలువడలేదు అని ఒక వ్యాసంలో రాశారు రాంభట్ల. గురజాడ మోకాలును తాకగల రచయితలు కన్పించడం లేదు అంటారాయన. కొంత స్వీపింగ్‌గా అనిపించినా అలా నిక్కచ్చిగా మాట్లాడటం ఆయన స్టైల్.

మెరిసే కళ్లజోడూ, జీన్ ప్యాంటూ గళ్ల చొక్కా టక్ చేసుకుని, నుదిటి మీద పడుతున్న పెప్పర్ అండ్ సాల్ట్ హెయిర్‌ని సవరించుకుంటూ హుషారుగా మాట్లాడేవారు రాంభట్ల. భుజ మ్మీద చెయ్యేసి ఏం ఫ్రెండూ అంటూ ఆత్మీయమైన పలకరింపు. గురువూ, తండ్రీ, స్నేహితుడూ, మందలించేవాడూ, ప్రేమించే వాడూ జ్ఞానాన్ని దోసిళ్లతో పంచి ఇచ్చేవాడు ఆ ఒక్కడే.. రాంభట్ల కృష్ణమూర్తి.

వేడి వేడి చాయ్ తాగి, ఒక సిగరెట్టు వెలిగించాడా.. అప్పుడే మరో లోకంలో అమృతం తాగి మబ్బుల మీద నుంచీ వచ్చినట్లు మాటల మాలికలు అల్లుతాడు రాంభట్ల. నవ్వుతూ జర్నలిజం మెళకువలు నేర్పిస్తూ ఏ మాట అడిగినా ఇట్టే అర్థం చెప్పేస్తూ చీకూ చింతా లేనట్లు ఆనందంగా గలగల్లాడుతూ... ఎంత కష్టం అలా ఉండటం!

రాంభట్ల కృష్ణమూర్తి అంటే ఒక పెద్ద బెల్జియం అద్దం.

ఆ flawless అద్దంలో మనల్ని మనం నిండుగా చూసుకోగలం. తెలుసుకోగలం. నేర్చుకోగలం. మురిసిపోగలం కూడా.

"ఓయ్ ఫ్రెండూ, మాతో జాగ్రత్త. మేం కోబ్రాలం" అన్నారాయన ఒకసారి. అంటే.. ? కోనసీమ బ్రాహ్మలం అని ! మేం డేంజరస్ అనీ!

రాజకీయాలూ, సాహిత్యం అయినా, శ్రీశ్రీ, మావో అయినా అనుకున్నదాన్ని సూటిగా నిర్మొహమాటంగా చెప్పేవారాయన.. ఒక మెరుపులాంటి విరుపుతో.

అందులో జోకూ పేలుతుంది.. లాగి లెంపకాయ కొట్టినట్టు ఓ చేదు నిజమూ ఉంటుంది.

ఒక రోజు రాంభట్లను అడిగాను, "మోహన్ ఎవరు?" అని. "మోహన్ ఒక డ్రీమర్" అన్నారాయన. "మరి నేనో..?" అని అడిగా. "ఇంచుమించుగా నువ్వూ అంతే. Half dreamer అన్నాడాయన. అది తిట్టో పొగడ్తో ఏమో..?

> **రాంభట్ల గారు స్వచ్ఛంగా స్వేచ్ఛగా నిర్భీతిగా అలా ఎలా బతగ్గలిగారు అనుకుంటే.. పూల దండలూ, సన్మానాలూ, సాహిత్య అకాడమీల లౌల్యం లేదు. ప్రభుత్వ పద్మశ్రీలు, పరమ వీర సాహితీ చక్ర బిరుదుల మోజూ లేదు. చదువుకోవడమే, తెలుసుకోవడమే, జ్ఞాన సముపార్జనే మానవు నికర్తవ్యం అని మనసా వాచా నమ్మిన వాడిలా కనిపించేవాడు.**


అందరు పాత తరం కమ్యూనిస్టుల్లాగే ఆకలి కన్నీళ్లూ లేని లోకం కోసం ఆశించాడు. కలలు కన్నాడు. కవిత్వం రాశాడు.

లేవండి వంచితులారా.. పురిటాకలి వరకము నుంచీ ఘోషించె మోచన లావా.. గగనాలన్ ముంచెత్తించీ.. అంటూ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ గీతాన్ని తెలుగులోకి అనువదించింది రాంభట్ల గారే.

రెపరెపలాడే ఎర్ర జెండాల అంగార స్వప్నాల్ని మా గుండెల్లోకి నేరుగా ప్రేమగా బట్వాడా చేసినవాడు రాంభట్ల. ఆయన చాలా మందికి మానవుడూ.. మార్గదర్శకుడూ.. గురుతుల్యుడూ కావొచ్చు. నాకైతే అంతకంటే ఎక్కువే. ❑

# తీర్చి దిద్దిన గురువు

-ఎస్.బాల్ రెడ్డి



తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడులు సృష్టించి ఎన్నో సంచలనాలకు తెరతీస్తూ “ఈనాడు” దినపత్రిక రంగ ప్రవేశం చేసిన రోజులవి. అప్పుడప్పుడే కాలేజీ నుంచి నిజ జీవితంలోకి అడుగుపెట్టి ఇక ముందు ఏం చేయాలనే ఆలోచనలతో సతమతమవుతున్న తరుణంలో ఈనాడు రూపంలో ఒక ఆశా కిరణం కనిపించింది. సబ్ ఎడిటర్/రిపోర్టర్ ఉద్యోగాల కోసం ప్రకటన వెలువడింది. వెంటనే దరఖాస్తు చేయడం, కొద్ది రోజుల్లోనే ఇంటర్వ్యూకు పిలుపు రావడం, ఆ తర్వాత ఉద్యోగానికి ట్రెయినీగా సెలెక్ట్ అయినట్లు లెటర్ అందుకోవడం జరిగింది. ఇదంతా సుమారు నెల రోజులు పట్టింది.

అప్పటికి ఇంకా హైదరాబాద్ సోమాజిగూడాలోని ఈనాడు కార్యాలయ భవన నిర్మాణం పూర్తికాలేదు. అందువల్ల ఆబిడ్స్ సర్కిల్‌లోని మార్గదర్శి ఆఫీసు బిల్డింగులో మాకు ట్రెయినింగ్. శిక్షణ ఆరు నెలలు. శిక్షణా కాలంలో నెలకు 150 రూపాయల స్టయిఫండ్. 1976 మార్చి 9న సుమారు 30 మందితో మా బ్యాచ్ శిక్షణా కార్యక్రమం మొదలైంది. అప్పటికే పత్రికా రంగంలో ఎంతో పేరుపొందిన రాంభట్ల కృష్ణమూర్తి గారు, పొత్తూరి వెంకటేశ్వరరావు గారు, హైదరాబాద్ ఆకాశవాణి వార్తా విభాగం ఇంచార్జి కృష్ణారావు గారు మాకు ట్రెయినింగ్ లెక్చరర్లు. అయితే ఈ శిక్షణా కార్యక్రమాన్నంతా తమ భుజానికెత్తుకుని అన్నీ తానై వ్యవహరించింది మాత్రం రాంభట్లగారే.

ఉత్సాహం ఉరకలేస్తూ ఒక జలపాతంలాగా అనర్గళంగా సాగిన ఆయన ప్రసంగం మమ్మల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది. ఆయన మాట తీరు, వాక్చాతుర్యం, చలోక్తులతో మనసుకు హత్తుకునే రీతిలో నిరంతర ప్రవాహంలాగా ఆకట్టుకున్నాయి.

### మొదటి రోజే ఫిదా

మంచి స్ఫురద్రూపంతో నీట్‌గా టక్ చేసుకుని “దేర్ ఎండ్స్” అంటూ రాంభట్ల మా క్లాసు రూంలోకి అడుగుపెట్టిన మొట్ట మొదటి రోజునే మేమంతా ‘ఫిదా’ అయ్యాం. ఉల్లాసం, ఉత్సాహం ఉరకలేస్తూ ఒక జలపాతంలాగా అనర్గళంగా సాగిన ఆయన ప్రసంగం మమ్మల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది. ఆయన మాట తీరు, వాక్చాతుర్యం, చలోక్తులతో మనసుకు హత్తుకునే రీతిలో నిరంతర ప్రవాహంలాగా ఆయన చెప్పే విషయాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ రోజున క్లాస్ అయిపోగానే కామ్రేడ్స్, మీ గోస్.. వుయ్ విల్ మీట్ టుమారో అంటూ ఆయన బయటికి నడిచిన తీరు ఇప్పటికీ మరిచిపోలేదు. ఆ రోజు నుంచి ఆరు నెలల ట్రెయినింగ్ ముగిసే వరకు అనుదినం ఆయన ప్రసంగం ఇదే రీతిలో సాగింది.

### నడిచే ఎన్సైక్లోపీడియా

జర్నలిజంలో ఓనమాలతో ఆయన మాకు శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. అసలు “వార్త” అంటే ఏమిటి, దాన్ని ఎలా పసిగట్టాలి, ఎలా రాయాలి, దేనికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి, ఆకట్టుకునే రీతిలో వార్తా శీర్షికలు ఎలా ఉండాలి వంటి మౌలిక అంశాలతో శిక్షణ మొదలైంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక, చారిత్రక అంశాలు మొదలుకొని సమకాలీన సమస్యల వరకు - పశ్చిమాసియా సమస్య నుంచి ఫరక్కా బ్యారేజీ వరకు అనేకానేక విషయాలను అరటి పండు ఒలిచి ఇచ్చినట్లు చెప్పేవారు. ఏ విషయం అడిగినా తడుముకోకుండా అప్పటికప్పుడు సోదాహరణంగా ఛలోక్తులతో వివరించేవారు. ఆయనకున్న విషయ పరిజ్ఞానం చూస్తే ఒక విజ్ఞాన సర్వస్వమా, నడిచే ఎన్సైక్లోపీడియానా అని ఆశ్చర్యం కలిగేది.

### స్వయం కృషితో..

రాంభట్ల విద్యాధికుడు కాకపోవచ్చు. కానీ ఆయన విజ్ఞాన గని. యూనివర్సిటీలు ఇచ్చే ఎం.ఎ., పిహెచ్.డి.లు ఆయనకు లేకపోవచ్చు. కానీ, నిరంతర పఠనంతో ఎన్నో గ్రంథాల సారాంశాన్ని ఔపోసన పట్టి అసమాన ప్రజ్ఞా పాటవాలను పుణికి పుచ్చుకున్న వ్యక్తి. జర్నలిజంలోని ప్రతి కోణాన్ని విశ్లేషించగల మేధావి. స్వయంకృషితో అత్యున్నత శిఖరాలకు చేరుకున్న అరుదైన, అసాధారణ వ్యక్తి.

**పుస్తకం హస్త భూషణం అనే నానుడికి నిజమైన అర్థం చెబుతూ ఆయన నిత్య విద్యార్థిగానే కనిపించే వారు. వివిధ రకాల పుస్తకాలు చదవమని మమ్మల్ని ప్రోత్సహించేవారు. చదివిన విషయాలు ఏదో ఒక సందర్భంలో ఉపయోగపడతాయని చెప్పేవారు. పత్రికలు పండితుల కోసం కాదని, పామరుల కోసమని నిరంతరం చెబుతుండేవారు. అందువల్ల ప్రజలు నిత్యం మాట్లాడుకునే**

**వ్యావహారిక భాషలోనే మనం వార్తలు రాయాలని చెప్పేవారు. గ్రామాల్లోని రచ్చబండ దగ్గర ఒక వ్యక్తి పేపర్‌లోని వార్తలను గట్టిగా చదువుతుంటే అక్కడున్న నిరక్షరాస్యులకు కూడా అవి అర్థం కావాలని అంటుండేవారు. ఇవన్నీ మా మనసుల్లో బలంగా నాటుకుపోయాయి.**

### "బడు" రాస్తే బడుద్ధాయే

అప్పట్లో దినపత్రికల్లో "బడు" పదాన్ని ఎక్కువగా ఉపయోగించేవారు. ఉదాహరణకు "ఇవ్వబడును", చేయబడును", నిర్వహించబడును" వంటి ఎన్నో పదాలను విస్తృతంగా రాసేవారు. "ఈనాడు" పత్రికా భాషలో "బడు" నిషిద్ధం. వార్తా కథనాల్లో "బడు" అన్న పదాన్ని ఉపయోగిస్తే బడుద్ధాయిలే అని రాంభట్ల విమర్శనాత్మకంగా చెబుతుండేవారు. జర్నలిస్టుల విధులు, బాధ్యతల గురించి, వృత్తిపరమైన విలువల గురించి సవివరంగా చెప్పేవారు. అనువాదం మెళకువల నుంచి పత్రిక ప్రింటింగ్ వరకు వివిధ దశలను వివరించేవారు.

### వార్తాసురుడు కావాలి

ప్రతి జర్నలిస్టు ఒక "వార్తాసురుడి"గా ఉండాలని ఆయన తరచుగా అనేవారు. దీనివెనక వున్న గ్రీకు పురాణాల్లో నరమాంస భక్షకుడైన ఒక రాక్షసుడు ఉండేవాడట. ఆ రాక్షసుడు ప్రతిరోజూ ఒక మనిషిని ఎత్తుకు వచ్చి తన దగ్గరున్న పొడుగాటి బల్ల మీద పడుకోబెట్టేవాడట. మనిషి పొడవు సరిగ్గా ఆ బల్ల పరిమాణానికి సరిపోతేనే అతన్ని తినాలనేది రాక్షసుని నియమం. అందువల్ల మనిషి బల్లకంటే పొడవుగా ఉంటే అతని కాళ్లు నరికి సరిచేసేవాడట. ఒక వేళ మనిషి పొట్టిగా ఉంటే అతని కాళ్లూ చేతులు లాగి సరిగా బల్ల పొడుగుకు సాగదీసి ఆరగించే వాడట. అలాగే జర్నలిస్టులు కూడా అవసరాన్ని బట్టి వార్తను కుదించడం లేదా సాగదీయడంలో నేర్పరి కావాలని చెప్పిన విషయం ఎలా మరిచిపోగలం?

### తలా తోక ఉండాలి

వార్తలు రాసేటప్పుడు ఆ వార్తల సారాంశాన్ని, ప్రాముఖ్యతను, ప్రాధాన్యతా క్రమంలో విధిగా మొదటి పేరాల్లోనే ఉంచాలని, అప్రధాన అంశాలను వార్త చివర్లో ఉంచాలని అనుదినం చెప్పేవారు. వృత్తిలోకి అడుగిడిన తరవాత దీని ప్రాముఖ్యతను అనుభవ పూర్వకంగా తెలుసుకోగలిగాం. అలాగే వార్తలు చెప్పా పెట్టకుండా అకస్మాత్తుగా వచ్చే చుట్టాలవంటివని, అందువల్ల డ్యూటీలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని చెప్పేవారు. ఇవన్నీ అక్షర సత్యాలని ఆ తర్వాత మా అనుభవంలో తెలుసుకోగలిగాం.

### తప్పు చేయడం తప్పు కాదు కానీ..

శిక్షణలో భాగంగా పి.టి.ఐ., యు.ఎన్.ఐ. వార్తా సంస్థల నుంచి ఇంగ్లీషు వార్తలు తెప్పించి వాటిని మా చేత అనువాదం చేయించేవారు. మేము రాసిన వాటిలో దొర్లిన తప్పులను, భాషా పరమైన దోషాలను సరిదిద్ది మళ్లీ ప్రాక్టీస్ చేయించేవారు. "తప్పు చేయడం మానవ సహజం. ఒకసారి చేసిన తప్పును సరిదిద్దుకొని భవిష్యత్తులో మళ్లీ అలాంటి తప్పులు చేయకండి. ఒక వేళ మళ్లీ అవే తప్పులు చేస్తే మాత్రం నిజంగా తప్పే" అని రాంభట్ల గారు చెప్పిన విషయాలు మాలో బలంగా నాటుకు పోయాయి. విలేకరులు తమ దృష్టికి వచ్చిన అంశాల్లోని నిజానిజాలను నిగ్గు తేల్చుకున్న తర్వాతే వార్తలు రాయాలని ఆయన బోధించేవారు. ఇలాంటి విషయాలు ఎంతో మంది రిపోర్టర్లకు, కరస్పాండెంట్లకు మార్గదర్శకమయ్యాయి.

### సృష్టికి ప్రతి సృష్టి

అప్పట్లో ప్రధాన వార్తలన్నీ పి.టి.ఐ., యు.ఎన్.ఐ. తదితర వార్తా సంస్థల నుంచి ఇంగ్లీషులోనే వచ్చేవి. వాటిని తెలుగులోకి అందరికీ సులువుగా అర్థమయ్యే రీతిలో తర్జుమా చేసి, మంచి శీర్షికలు పెట్టడం రాంభట్ల గారి నుంచే నేర్చుకున్నాం. ఇంగ్లీషులో ఉన్నది ఉన్నట్లుగా "మక్కికి మక్కి" అనే రీతిలో తర్జుమా చేయవద్దని – స్వేచ్ఛగా, సారాంశాన్ని చిన్న చిన్న మాటలతో సులభంగా వాటిలోని మెలకువలన్నీ నూరిపోశారు. ఇంగ్లీషులో వున్న కాపీని యథాతథంగా తర్జుమా కాకుండా సృష్టికి ప్రతి సృష్టి రీతిలో అనువాదం చేయాలానేవారు.

ఇంగ్లీషు కాపీలోని అనవసర విషయాన్నంతా తీసేసి అవసర మైనంత వరకే మనం వాడుకోవాలన్నది ఆయన సిద్ధాంతం. కొరుకుడు పడని కొన్ని విషయాలు ఎదురైనప్పుడు When you are in doubt, cut it out అనేవారు. ఇవన్నీ ఉద్యోగ జీవితంలో మాకెంతో ఉపయోగపడ్డాయి. శిక్షణలోని ఆఖరి రెండు నెలలు సోమాజిగూడ "ఈనాడు" ఆఫీసు ఆవరణలోని రేకుల షెడ్డులో గడిచింది. ట్రెయినింగ్ ముగిసే నాటికి మాలో కొందరు ఇతర ఉద్యోగాలకు వెళ్లిపోయారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన అనంతరం మాలో ఒకరిద్దరికి రిపోర్టర్లుగా – మిగతా వారికి సబ్ ఎడిటర్లుగా ఉద్యోగాలు లభించాయి. అలా మా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది.

### అక్షర నివాళి

నేను జర్నలిస్టును అవునో కాదో తెలియదు. కాని ఏమీ తెలియని నా వంటి వారిని తమ శిక్షణలో తీర్చి దిద్ది ఈ స్థితికి చేరుకోవడానికి దోహదం చేసింది మాత్రం మా గురువుగారు రాంభట్లే. ఆయనకు సదా కృతజ్ఞతాభివందనాలు. ఆయన రుణం ఎలా తీర్చుకోగలం! అక్షరాంజలి అర్పించడం తప్ప! ❑

# జ్ఞాన సాగరం

## ఆచార్యునికి నీరాజనాలు



-చింతపట్ల సుదర్శన్

విడో మ్యారేజీపై, నాకొచ్చిన విషయంపై ఎనిమిది గంటలు ఏకబిగిన లెక్చర్ దంచేస్తే సురేంద్రనాథ్ బెనర్జీ అంతటి వాడు దంగైపోయాడు అని కన్యాశుల్కంలో గిరీశం అంటాడు. అది గిరీశం తన్ను తాను ఎగ్జాగరేట్ చేసుకోవడానికి వాడాడు. కానీ అంతటి వాక్ప్రవాహం ఎక్కడా ఉండదు అనుకుంటాం. అయితే అలాంటి అక్షర ప్రవాహాన్ని తన గళంలో నిక్షేపించుకున్న మహా మహోపన్యాసకుడు రాంభట్ల కృష్ణమూర్తి. ఈ మధ్య సభల్లో చాలా మంది వేదికనలంకరించిన ప్రముఖుల్లో ఒకరిని నడిచే గ్రంథాలయమనో వాకింగ్ డిక్షనరీ అనో అనడం రివాజైపోయింది గనక రాంభట్లను గురించి ఆ మాటలు వాడకుండా చెప్పాల్సి ఉంటుంది. రాంభట్లకు కవీ, కథకుడు, విమర్శకుడు, పత్రికా రచయిత, సంపాదకుడు అనే జాబితాను suffix చేసేకంటే వీళ్లందరినీ తయారు చేయగలిగిన మేధా సంపత్తి కలిగిన వాడని చెప్పాలి. తనకు ఎదురైన ప్రతి మనిషినీ ignite చేయగలిగిన fire brand రాంభట్ల. 1970-72 మధ్య హైదరాబాద్ పాత నగరానికి చెందిన రచయితలను కీ.శే. పుల్లారెడ్డి హిమాయత్ నగర్‌లో ఉన్న అ.ర.సం. కార్యాలయానికి పరిచయం చేశారు. అప్పటికి గ్రంథాలయంలో పుస్తకాల పురుగులమై తిరిగే మాకు ప్రత్యక్షంగా జ్ఞానాన్ని సంపాదించే అవకాశం కలిగింది. రాంభట్లను spell bound అయి వినడం వల్ల. అ.ర.సం. సమావేశానికి ముందూ ఆ తరవాత గడియారాన్నీ గంటలనీ ignore చేస్తూ జరిగే చర్చల్లో మేం కేవలం passive listenersగా కాకుండా active participantsగా ఉండే వాళ్లం. అందుకు ఆయన provocation కారణమయ్యేది. అది ఏ స్థాయి వరకు వెళ్లిందంటే మేం ఆయనను contradict చేసేవాళ్లం. మా చేత ఆ పని చేయించి ఆ తర్వాత ఆ సబ్జెక్ట్‌ని సంపూర్ణంగా scan చేసి కానీ వదిలే వాడు కాదు. ఈ నాటికీ మాకు అబ్బిన critical anaalysis గానీ analytical thinking గానీ probing into facts గానీ ఆయన మాలో induce చేసినవే. ఆయనకు వివిధ విషయాల మీద ఉన్న అపారమైన జ్ఞానం, భాషా పటుత్వం, way of expression నిజానికి ఒక ఉపాధ్యాయుడికి ఉండే లక్షణాలు. అప్పటికి విశ్వ విద్యాలయంలోనూ, కళాశాలల్లోనూ విద్యార్థులుగా ఉండిన మేం చదువుకునే చోట అధ్యాపకుల కారణంగా కాక ఈ అధ్యాపకుడి కారణంగా రాటుదేలాం. వేదాల్లో ఏం వుంది, ప్రాచీన ఆచారాల్లోని భావనలేమిటి, మార్క్సిజం అనగానేమి, మాక్స్‌ముల్లర్, రాహుల్ సాంకృత్యాయన్ ఎవరు ? ఫ్రాయిడ్ సైకో అనాలిసిస్ ఏమిటి ? వంటి అనేక విషయాలు ఆయన ద్వారా తెలుసుకోవడం వల్ల ఈ నాటికీ మా జ్ఞాన పేటికల్లో తాజాగా ఉన్నాయి.

తెలుగులో మొట్టమొదటి పొలిటికల్ కార్టూనిస్టు అయిన రాంభట్లతో interaction కారణంగానే నేను పొలిటికల్ satires రాయడం మొదలుపెట్టాను. తమకు వున్న విజ్ఞాన సర్వస్వాన్ని అందరికీ అందించాలనే తపన ఉన్న వాళ్లు ఈ కాలంలో అరుదు. రాంభట్ల కృష్ణమూర్తి వంటి వ్యక్తులు కొత్త తరాల మేధో వికాసానికి ఎంతో అవసరం. వయసులో పెద్ద వాడైనా 'ఫ్రెండూ' అని సంబోధించే రాంభట్లను, ఆయన రచనలను శత జయంతి సందర్భంగానైనా ఈ తరానికి పరిచయం చేయవలసిన అవసరం ఉంది. ❑

## తొలి దసరా

తెలుగునాడు వెలిసింది సిరిసిరిమువ్వా, మనకు
తొలిదసరా వచ్చింది సిరిసిరిమువ్వా //

గద్దెమీద కాంగిరేసు, సిరిసిరిమువ్వా, ఎక్కి
విద్దెలెన్నొ చూపుతోంది సిరిసిరిమువ్వా //

వద్దన్న దొరతనము, సిరిసిరిమువ్వా, మనకు
రుద్దినారు తలపైన సిరిసిరిమువ్వా //

కంగిరేసు పేరుచెప్తే సిరిసిరిమువ్వా, కరువు
కాటకాలు పలుకుతాయి సిరిసిరిమువ్వా //

ఆ// ముసలి సింగమ్మునకు మూర్ధాభిషేకంబు
తోక తెగిన నక్క మూక కొలువు
ప్రజల పోరులేని పెరవారు చొరరాని
లంకలాంటి పల్లె రాజధాని

– రాంభట్ల కృష్ణమూర్తి శశ విషాణం నుంచి

నివాళి

# Remembering the humble guru who treated every disciple as his friend

24th March 2020
By K Amarnath
Express News Service



Rambhatla Krishna Murthy was a rare and versatile genius, a journalist, political cartoonist, poet, journalism teacher, historian, social anthropologist, Sanskrit scholar, and Marxist thinker, all rolled into one. He was self-taught as he never had the luxury of formal education. He was a good painter and excelled in caricatures and cartoons. He used to jokingly say that he was just a Class V graduate.

He used to address every journalist, including this writer who is little over three decades his junior, as his friend, with a disarming smile, to put them at ease. He used to lecture them for hours on a variety of subjects, from history to anthropology, from Vedas to Marxism, ancient and modern literature, not excluding contemporary politics and journalism in simple language with utmost clarity.

He used to regale them with witty anecdotes. Those who used to be his patient listeners used to go away with some more knowledge and acquired insight into matters hitherto unknown to them.

Rambhatla was born on 24 March 1920 in the East Godavari district. He was orphaned in his infancy and was brought up by his relatives, who tossed him from one place to the other depriving him of the chance to get a formal education. He studied up to Class V in Urdu medium in Hyderabad, then under Nizam rule.

While doing odd jobs as a child labourer he used to spend time in libraries in Hyderabad. He learnt Sanskrit to study ancient texts in their original and English to study great writers, including Karl Marx and Frederic Engels.

Rambhatla joined the Telugu edition of Meezan as a sub-editor in 1944 when Adavi Bapiraju, a poet and painter of repute, was the editor until it was closed down 1948. The Meezan used to be published in three languages, English, Urdu, and Telugu. Each newspaper used to have its own editorial policy. While the English edition, edited by an Englishman, used to be pro-British, the Urdu edition used to be the handmaid of the Nizam, while the Telugu edition used to be liberal and obliquely supported the Andhra Mahasabha, which opposed Nizam rule and yearned for independence.

Rambhatla used to run a column Mirchi Masala in the paper, commenting on day-to-day news, with witty comments and cartoons. He used to say that he inserted information and news about the Telangana armed struggle stealthily in his columns. When the going got tough, the Nizam closed down the newspaper, forcing Rambhatla to migrate to Madras to avoid arrest and earn a living.

Another phase of his career started when joined Visalaandhra daily in 1952 when the Communist Party started it. Here he started a new experiment of writing poetic comments, limericks, accompanied by a cartoon on political developments on a daily basis. Thus Rambhatla became the first political cartoonist in Telugu and became an instant celebrity journalist.

When Ramoji Rao of Eenadu embarked on the idea of starting a journalism school to exclusively cater to his own newspaper, he persuaded Rambhatla to head it. He trained batches of journalists who later became reputed journalists and editors.

He was a poet and writer of high standing in Telugu. He died in 2001 at the age of 81. The present generation of journalists has a lot to learn from the life and writings of Rambhatla Krishna Murthy, a Guru of journalists. ❑

(The writer is a senior journalist based in Hyderabad and former member of Press Council of India).

# A Centenary Tribute to Rambhatla Krishnamurthy: Literally, a 'walking' encyclopaedia!

నివాళి

Mandalaparthy Kishore



He was a Telugu poet of the first order; a reputed literary critic; a journalist for more than half-a-century; the first political cartoonist ever known to Telugu journalism; an unacademic researcher who studied profoundly the culturescape of the Vedic Aryans; the first Principal of the first school of journalism of Telugu States; and above all, Rambhatla Krishnamurthy was a Marxist by conviction.

Though Rambhatla was born in Anatavaram village of the East Godavari district of Andhra Pradesh on 24 March 1920, he spent eight decades in Hyderabad. He had his schooling in Urdu medium schools of the Old City of Hyderabad. A self-taught scholar in Telugu and Sanskrit, Rambhatla could attain good command over English, without which a Telugu journalist could not have survived for five decades and ascend to the post of an editor.

Rambhatla's quest for study of Vedas was triggered by Aryasamaj in his adolescence. He was not content with learning the lexicographical meaning and the connotation of the Vedic text; his concern however was to discern the historical context. He moved further and conferred with the works of German Indologists and furthered towards social anthropologists like Morgan, Frazer and Westermarck.

How much might he had struggled to access those works in those remote years can easily be imagined. He advanced further to peruse thoroughly the works of Jawahar Lal Nehru, S A Dange and Rahul Sankrityayan. Another discipline that attracted Rambhatla was the study of Tantrism as a fertility cult. This trajectory ultimately landed him at the threshold of Marxism.

Rambhatla started to earn his bread as a teenager. He started composing limericks in the wake of the World War II. Kanyaa Sulkam, the classic play of Gurazada Appa Rao, turned out to be an obsession with him. He joined Adivi Bapiraju and Srinivasa Chakravarthy, the Editor and the Assistant Editor of Meezan - also known aficionados of Kanyaa Sulkam- in 1943. Bapiraju, a poet-painter encouraged Rambhatla to try his hand at cartooning. In his acknowledged column "Mirchi-Masaalaa" Rambhatla was placing his witty limericks along with news items about the armed struggle of the peasants of Telangana in Meezan (Telugu) - run by His Exalted Highness the Nizam. As the danger of getting caught was imminent, Rambhatla left Hyderabad for Madras from where he shifted over to Bezawada (present day Vijayawada) in early 1950s.

He was a member of the launching team of Visalaandhra, a daily established in 1952 by the CPI. His cartoon-poetry column Sasavishaanam established him as the foremost political cartoonist of Telugu journalism. Rambhatla was acknowledged as a "Moving Encyclopaedia." In fact, he must be regarded rather as a "walking" encyclopaedia as he used to walk long distances along with a small band of 'friends' (read his disciples) along the roads of Hyderabad. Rambhatla and his team would discuss any 'issue' under the sky - from the intricate sense of a Vedic text to Freudian psychoanalysis. The talkathon used to be very much like the 'Socratic Elenchus'. Most members of Rambhatla's band of friends turned into professional journalists in later years is not just an accident. He also had the credit of leading the foremost experiment of manufacturing Telugu journalists in a school of journalism established by Ramoji Rao of Eenadu. Rambhatla breathed his last in Hyderabad on 7 December 2001. (This year 2020 - marks the centenary of Rambhatla's birth.) ❑




రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి శుభాకాంక్షలతో..



